# శ్రీ వేంకటేశ్వర లీలలు

(భక్తుల అనుభవాలు)



సంకలనం
జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీ వేంకటేశ్వర లీలలు

## (భక్తుల అనుభవాలు)

సంకలనం

జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

ప్రచురణ
కార్యనిర్వహణాధికారి,
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2008

**SRI VENKATESWARA LEELALU**
***(A Collection of Personal Experiences of Devotees)***

*Compiled by*
**JULAKANTI BALASUBRAHMANYAM**

T.T.D. Religious Publications Series No.532


© All Rights Reserved


| | | |
|---|---|---|
| First Edition | : | 1999 |
| Second Edition | : | 2003 |
| Third Edition | : | 2008 |
| Copies | : | 3,000 |

Published by
**Sri K.V. Ramanachary, I.A.S.,**
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati - 517 507.

Printed at
T.T.D. Press, Tirupati.





# ముందు మాట

ఏడుకొండలస్వామివారికి ఎన్నో పేర్లు వున్నాయి. అందులో భక్తులు అత్యంత ప్రీతిగా పిలుచుకునే పేరు ''కోరినవరాలరాయడు'' అని, అనగా భక్తులు ఏది కోరినా దాన్ని వెంటనే ప్రసాదిస్తాడట స్వామి.

కొందరికి సంతానాన్ని, ఇంకొందరికి ఆరోగ్యాన్ని, మరికొందరికి ప్రాణాన్ని, మానాన్ని..........................ఇలా ఎందరో.................... ఎన్నెన్నో వరాలను గుప్పిస్తాడట స్వామి. అందులకే పరమ భక్తుడైన అన్నమాచార్యులవారు..................!

***''కొండలలో నెలకొన్న కోనేటి రాయడెవాడు***
***కొండలంతటి వరములు గుప్పెడివాడు''***

అని తిరుమలేశుని కీర్తిస్తూ, ఇంకోచోట

***''ఏమి వలసిన నిచ్చు నెప్పుడైనను***
***ఏమరక కొలచిన నీతడే దైవము***
***ఘనముగా నిందరికి గన్నులిచ్చు, గాళ్లిచ్చు***
***పనిసేయ జేతులిచ్చు బలియుడై''***

అంటూ శ్రీనివాస భగవానుని వరప్రదానాన్ని భక్తవాత్సల్యాన్ని కొనియాడినాడు.

భక్త వరదుడైన బాలాజీ లీలల్ని, మహిమలను, భక్తులనుంచి సేకరించి ''సప్తగిరి'' పత్రికలో ప్రచురించడం, వాటినన్నింటిలో ముఖ్యమైన వాటిని ఏర్చికూర్చి ''శ్రీ వేంకటేశ్వర లీలలు'' పేర ఒక పుస్తకాన్ని తి.తి. దేవస్థానం ధార్మిక ప్రచురణగా ముద్రించింది.

దేవస్థానం ధర్మప్రచార లక్ష్యంలో భాగంగా ధర్మప్రచార పుస్తక ప్రచురణ వితరణ ప్రధాన కార్యక్రమాలు ప్రధానంగా చోటుచేసుకున్నాయి. భారత, భాగవత, రామాయణ గ్రంథాలు విస్తృతంగా దేవస్థానం ప్రచురిస్తు భక్తులకు, పాఠకులకు అందుబాటులోనికి తెస్తున్నది.

ప్రస్తుతం పునర్ముద్రణమవుతున్న ''శ్రీవేంకటేశ్వర లీలలు'' పుస్తకాన్ని యథాప్రకారంగా పాఠకులు వినియోగించుకొని స్వామివారి అనుగ్రహానికి పాత్రులు కాగలరని ఆకాంక్షిస్తున్నాను.

సదా భక్తుల సేవలో..........

**(భూమన కరుణాకరరెడ్డి)**
**అధ్యక్షులు, ధర్మకర్తలమండలి,**
**తిరుమల తిరుపతి దేవస్థానములు**

# ఒక మాట

భూలోక వైకుంఠమని ప్రసిద్ధి చెందిన దివ్యక్షేత్రం తిరుమల. ఈ పుణ్యస్థలంలో స్వయంభువుగా వెలసి భక్తులందరిచేత అర్చింపబడుతున్న దేవుడు శ్రీ వేంకటేశ్వరస్వామి. ఏడుకొండలవాడని, వేంకటరమణుడని, తిరుమలేశుడని, గోవిందుడని, శ్రీనివాసుడని.......... ఇలా అనేకమైన పేర్లతో పిలువబడుతూ ఆరాధింపబడుతూవున్న తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవం! భక్తుల పాలిటి కొంగుబంగారం! ఆపదల్లో ఆదుకొనే ఆపద్బంధువు! ఆశ్రితవత్సలుడు! అనాథ రక్షకుడు! అందువల్లే అనేక మంది భక్తులచేత........................ ముఖ్యంగా ఈ కలియుగంలో ''కలౌ వేంకటనాయకః'' అని కీర్తింపబడుతూ, సేవింపబడుతూ వున్న స్వామి శ్రీనివాసుడు!

నిత్యం నిరంతరాయంగా తిరుమలకు తరలివస్తున్న భక్తులను ఎవరిని అడిగినా ఆనందనిలయుని సంపూర్ణమైన అనుగ్రహాన్ని గూర్చి, తద్ద్వారా తమకు కలిగిన దివ్యానుభూతులను గూర్చి తృప్తిగా వివరిస్తారు. తిరుమల యాత్రికులను ఏ ఒక్కరిని పరామర్శించినా, తమ యెదలో నిండుగా నింపుకొన్న శ్రీనివాస పరంధాముని దివ్య మంగళరూపాన్ని గూర్చి, ఆయన మహిమల్ని గూర్చి ఆనందంగా వివరిస్తారు. ఇలా శ్రీ వేంకటేశ్వర స్వామివారి అద్భుతమైన లీలలను ఎన్నిటినైనా ప్రశంసించుకోవచ్చును. అవి అనంతమైనవి!

అలాంటివాటిలో భక్తులనుంచి సేకరించి శ్రీనివాసుని మహిమలను కొన్నింటిని, చాలకాలంగా ''శ్రీ వేంకటేశ్వర లీలలు'' శీర్షికన మా (మీ) ''సప్తగిరి'' మాసపత్రికలో ప్రచురిస్తూ వున్నాం. ప్రస్తుతం భక్తులకోసం, వాటిలో కొన్నింటిని సంకలనం చేసి ''శ్రీ వేంకటేశ్వర లీలలు'' అనే చిన్ని పొత్తంగా అందజేస్తున్నాం. పాఠకులు, భక్తులు ఈ గ్రంథాన్ని చదివి, చదివించి ''కోరిన వరాలరాయుడని'' పేరుపొందిన కొండలరాయుని

యందు సడలని విశ్వాసాన్నీ, భక్తి ప్రపత్తులనూ ఇతోఽధికంగా పెంపొందించుకొని, తద్వారా ఇహపర సౌఖ్యాలను ఇబ్బడి ముబ్బడిగా పొందగలరని ఆశిస్తున్నాం. ప్రతులన్నీ చెల్లిపోగా పాఠకుల ఆసక్తి మేరకు ఈ పుస్తకాన్ని పునర్ముద్రిస్తున్నాం.

**కార్యనిర్వహణాధికారి,**
**తిరుమల తిరుపతి దేవస్థానములు**

# పీఠిక

స్మరణాత్ సర్వ పాపఘ్నం
స్తవనా దిష్ట వర్షిణమ్,
దర్శనాన్ముక్తిదం చేశం
శ్రీనివాసం భజే ఽనిశమ్.

స్మరణంతోనే సర్వపాపాలను పోగొట్టేవాడూ, స్తుతితోనే కోరికలన్నీ తీర్చేవాడూ, దర్శనంతోనే మోక్షాన్ని ఇచ్చేవాడూ అయిన శ్రీనివాస ప్రభువును సదా భజింతును.

కలియుగ వైకుంఠమను ప్రసిద్ధనామంతో పిలువబడే శ్రీ వేంకటాచలక్షేత్రంపై వెలసిన శ్రీనివాస ప్రభువు సాటిలేని దేవుడు. మేటియైన దేవుడు. అందువల్లే-

శేషాచలే యన్మాహాత్మ్య
మన్య క్షేత్రే నతత్ క్వచిత్,
తద్గత శ్రీనివాసస్య
మహిమా నాన్యగః శుభః.

అన్న ప్రసిద్ధి ఏర్పడింది. శేషాచలం వంటి మహిమగల క్షేత్రం ఇతరత్ర కానరాదు. దయాంతరంగుడైన శ్రీనివాసుని వంటి మహిమగల దేవుడు ఇంకెక్కడా కానరాడు. కనుకనే భక్తకోటి ప్రతినిత్యం భక్తుల పాలిటి కొంగుబంగారమైన తిరుమల స్వామివారిని దర్శించి మొక్కులు చెల్లించుకుంటారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారు, తన భక్తుల ఆచారవ్యవహారాలు వేర్వేరు అయినా, వారి భాషలు ఒక్కటి కాక పోయినా, వారు మొక్కులను వింత వింతలుగా చెల్లించినా వాటి నన్నింటిని స్వీకరించి వారు కోరిన కోరికలను తీరుస్తుంటాడు.

కనుకనే ఘనవేంకటగిరినాథుడు కొందరికి ప్రాణదాతగా..... మరికొందరికి సంతానప్రదాతగా...... ఇంకొందరికి ఆరోగ్యప్రదాతగా......... ఉద్యోగ ప్రదాతగా...... గృహప్రదాతగా....... ధన ప్రదాతగా......... ఇలా ఎందరెందరికో......... ఎన్నో విధాలుగా దర్శనమిస్తున్నారు. తన లీలలను లోకానికి చాటుతున్నారు.

అందుకు కృతజ్ఞతగా, కోరిన వరాలరాయడైన కొండలయ్యను దర్శించి మొక్కులు చెల్లించడానికి ప్రతినిత్యం భక్తులు తండోపతండాలుగా నేల నాలుగుచెరగులనుండి తిరుమల యాత్ర చేస్తారు. బ్రహ్మచారులు, గృహస్థులు, వానప్రస్థులు, యతీశ్వరులు, బాలబాలికలు, కన్యలు, పుణ్యాంగనలు వితంతువులు, విధురులు, కుంటి, గుడ్డి, వికలాంగులు, దేశాధి నేతలు, ప్రభువులు, సామంతులు, అధికారులు, అనధికారులు పండితులు, పామరులు, ధనికులు, పేదవారు, ఉద్యోగులు, ఉద్యోగార్థులు ఇలా కార్యార్థులూ, శరణార్థులు, అర్థార్థులు, వారూ వీరూ అనకుండా ఎందరెందరో, మరెందరో...... కుల,మత,భాషా,వర్గ, వర్ణభేదరహితంగా దేవతా సార్వభౌముడైన కలియుగ వైకుంఠనాథుని దర్శించడానికి తిరుమలకు పరుగులు పెడ్తారు. పాదయాత్రల్ని చేస్తారు. జోగి ఎత్తుకుంటూ వస్తారు. నిలువు దోపిళ్లిస్తారు. ముడుపులు సమర్పిస్తారు. పొర్లుదండాలు పెడ్తారు. తలనీలాలిస్తారు. మూడు కత్తెర లిస్తారు. ఆలయప్రదక్షిణల్ని చేస్తారు. అంగ ప్రదక్షిణలు చేస్తారు. అఖండ దీపాలను వెలిగిస్తారు. కొబ్బరికాయలను కొడ్తారు. చలిపిండ్ల నైవేద్యమిస్తారు. అర్చనలు చేస్తారు. కల్యాణం చేయిస్తారు. ఉత్సవాలూ, ఊరేగింపులు చేస్తారు. వాహన సేవల్ని చేసుకుంటారు. తులాభారాల్ని ఇస్తారు. పులిహోరలు, పొంగళ్ల నైవేద్యం పెడతారు. ఆరోగ్యం బాగైనవారు వెండి మనిషి బొమ్మల్ని సమర్పిస్తారు. వెండి కన్నులను, కాళ్లను, చేతులను, వెండి ఇంటినమూనాలను, వెండి ఊయళ్లను మొక్కులుగా చెల్లించుకుంటారు.

ఇలా తిరుమలయాత్ర చేస్తున్న భక్తులనుండి వారి వారికి అనుభవమైన శ్రీ వేంకటేశ్వర స్వామివారి లీలలను, మహిమలను తిరుమల తిరుపతి దేవస్థాన సచిత్ర మాస పత్రిక "సప్తగిరి" లో "శ్రీ వేంకటేశ్వర లీలలు" అనే శీర్షిక క్రింద ప్రచురించడం జరుగుతున్నది. 1984 నుండి 1990 వరకు ఆ యా 'సప్తగిరి' పత్రికలలో ప్రచురితమైన వానిని "శ్రీ వేంకటేశ్వర లీలలు" అను సంకలన గ్రంథంగా రూపొందించాలనే ఉద్దేశంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆ పనిని నాకు అప్పగించింది. ఆ యా భక్తుల అనుభవాలను వారి వారి రచనా శైలిలోనే ప్రచురించడం జరిగింది. కాకపోతే అర్థ సమన్వయంకొరకు భావాన్ని మార్చకుండా వాక్యాలను కొద్దిగా మాత్రం సవరించడం జరిగింది.

ఇందులో 69 శీర్షికల క్రింద స్వామివారి లీలలు వర్ణింపబడ్డాయి. ఇవి అన్నీ యథార్థ గాథలు. ఈ భక్తుల అనుభవాలన్నీ శ్రీ స్వామివారి లీలలను చాటి చెప్పే పతాకలు! ఈ సంఘటనలన్నీ భక్తుల భక్తిప్రపత్తులకు ప్రతీకలు ! ఇవి శ్రీకళ్యాణ లక్ష్మీవేంకటేశ్వరస్వామివారి అనంత కరుణా కటాక్షములకు దర్పణాలు !

అత్యంత భక్తి ప్రపత్తులతో ఈ సద్గ్రంథాన్ని చదవండి. చదివించండి. పారాయణం చెయ్యండి. శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహాన్ని సంపూర్ణంగా పొందండి!

శ్రీ వేంకటేశం లక్ష్మీశం
అనిష్టఘ్న మభీష్ట దమ్,
చతుర్ముఖేర తనయం
శ్రీనివాసం భజే ఽ నిశమ్.

తిరుపతి
17-10-91

ఇట్లు
జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
తి.తి.దేవస్థానములు. తిరుపతి.

# ఇందులో.......

1. నిరతాన్నదాత ఎల్లమరాజు.......6
2. పిలిచిన పలికే స్వామి ............12
3. పెళ్లి జరిపించిన దేవుడు ........15
4. ఆపద మొక్కులవాడు ...........19
5. దయామయుడు ..................22
6. నక్షత్రమాల ..........................24
7. ఇష్టదైవం ..............................26
8. భక్త వత్సలుడు ......................27
9. శ్రీనివాసుని మహిమ ............30
10. కలియుగ దైవం ...................32
11. ఆపద్బాంధవుడు ....................34
12. బాలాజీ లీలలు .....................36
13. నిలువుదోపిడి .......................38
14. ఆశ్రిత వత్సలుడు .................40
15. తోడు ..................................43
16. వరప్రదాత ...........................45
17. దొరకునా ఇటువంటి సేవ....47
18. సర్వరక్షకుడు ........................49
19. రథ సారథి ..........................51
20. ఆపదుద్ధారకుడు ..................55
21. నేత్ర దాత ............................57
22. దొడ్డమందు ..........................59
23. ఆపద మొక్కులవాడు...........61
24. సన్మార్గ దర్శి ........................62
25. ఉద్యోగ ప్రదాత ....................63
26. విద్యా ప్రదాత .......................67
27. ఆరోగ్య ప్రదాత .....................70
28. కళ్యాణ చక్రవర్తి .....................71
29. పుత్ర దాత ............................73
30. ప్రాణ దాత ...........................75
31. నడక నిచ్చిన దేవుడు ............77
32. ప్రాణం పోసిన దేవుడు .........79
33. వడ్డికాసులవాడు ...................81
34. సంరక్షకుడు ..........................82
35. ప్రసాదం పెట్టిన దేవుడు .......84
36. మొక్కు చెల్లించుకున్నదేవుడు 86
37. వడ్డికాసులవాడు...................88
38. రోగనివారకుడు ....................90
39. నామ మహిమ .....................92
40. ప్రసాద మహిమ ..................94
41. అమృతహస్తం .......................95
42. బిడ్డ నిచ్చిన దేవుడు .............98
43. సంకట హరణుడు .............100
44. ఆరోగ్య ప్రదాత ....................101
45. పుత్రదాత ............................103
46. ప్రాణం పోసిన దేవుడు ........106

47. ఆపద్రక్షకుడు ...................... 108
48. చూపునిచ్చిన దేవుడు... ........ 110
49. సర్వదేవతా స్వరూపుడు ........ 112
50. పుష్కరిణీ మహిమ .............. 116
51. సంతాన ప్రదాత .................. 117
52. అద్భుత వైద్యుడు ............... 119
53. సంకట హరణుడు ............... 121
54. దర్శనమిచ్చిన దేవుడు ......... 122
55. జరిమాన వేసిన దేవుడు ....... 124
56. ఆదుకొన్న దేవుడు ............... 125
57. మొరవిన్న దేవుడు ............... 129
58. కవిత్వమిచ్చిన దేవుడు ......... 130
59. నామలిఖిత ఫలం ............... 132
60. కల్యాణ చక్రవర్తి ................ 133
61. వైద్య చక్రవర్తి ..................... 136
62. ఆపన్నివారకుడు .................. 137
63. సంకట హరణుడు .............. 139
64. స్వప్న చికిత్సకుడు ................ 141
65. తప్పును దిద్దిన దేవుడు ........ 142
66. ప్రాణ రక్షకుడు ................... 143
67. గృహ రక్షకుడు .................... 145
68. అ ఆలు దిద్దించిన దేవుడు .. 146
69. సంకట హరణుడు ............. 148

# నిరతాన్నదాత ఎల్లమరాజు

*జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, తిరుపతి*

అనాదిగా ఎందరెందరో తిరుమల శ్రీవేంకటేశ్వరుని పరమభక్తులు. ఆ భక్తులందరికీ శ్రీ వేంకటేశ్వరుని మహిమలూ, లీలలూ నిత్యమూ తమ అనుభవంలో ఉన్నవే. శ్రీ వేంకటేశ్వరుని లీలలను తెలిపే అలాంటి అద్భుత గాథలలో ఇదొక్కటి.

పదిహేడవ శతాబ్దం చివరి రోజులవి. కర్నూలుమండలంలో భానుముక్కల అనేగ్రామం వుంది. అది శ్రీ భ్రమరాంబా మల్లికార్జునుల దివ్యక్షేత్రమైన శ్రీ శైలమునకు దగ్గరలో వుంది. ఆళ్లగడ్డ ఎల్లమరాజు ఆ గ్రామకరణం. ఆ గ్రామమొక్కటే కాదు. ఆచుట్టుప్రక్కల రామాపురం పాములపాడు మున్నగు ఊళ్లన్నీ ఆయన అధికారంలోనే వుండేవి.

ఎల్లమరాజు ఎంత సంపన్నుడో అంతత్యాగి, నిరతాన్న దాత. ఎవరు ఏవేళ ఏది అడిగినను ఇవ్వగల సమర్థుడు. అతడు ఎంతటిదాతో అంతటి పరమ భక్తుడుకూడ.

అతని ధర్మపత్ని లక్ష్మమ్మ. సాక్షాత్తు లక్ష్మీదేవి. భర్తతలలో నాలుక. అతిథులు ఎవరు ఏవేళవచ్చినను వండి వడ్డింపగల అపర అన్నపూర్ణ. వారి ఇల్లు ఎల్లప్పుడు అతిథి అభ్యాగతులతో సందడిగా ఉండేది.

వారి ఇలువేలుపు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు. వారుభయులు నిత్యమూ శ్రీ వేంకటేశ్వరస్వామివారిని భక్తియుక్తులతో కొలిచేవారు. శ్రీ స్వామివారికిష్టమైన శనివారాల్లో ఆ దంపతులిరువురు తెల్లవారుజాముననే లేచి తలస్నానం చేసేవారు. ధూపదీప నారికేళ నైవేద్యాదులతో స్వామివారిని భక్తితో పూజచేసేవారు. ఇక శ్రావణ శనివారాల్లో సరేసరి.

ఇంటికి ఏ అతిథి వచ్చినా, అభ్యాగతి వచ్చినా ఆ ఎల్లమరాజు దంపతుల దృష్టికి వారిలో శ్రీ వేంకటేశ్వరుడే దర్శనమిచ్చేవాడు. ఆ దంపతులకు తిరుమల వేంకటేశ్వరుని మొక్కుతో కల్గిన గారాలబిడ్డ వెంకటప్ప. ఆ ఏడుకొండలవాని అనుగ్రహమే ఆబిడ్డ అని వారు నమ్మేవారు.

అది మండువేసవి. ఒకానొకరోజు. కొందరు యాత్రికులు శ్రీ శైల భ్రమరాంబా మల్లికార్జునులను దర్శించి, వేంకటాచలపతి దర్శనార్థమై తిరుపతి క్షేత్రానికి పోతూ, దారిలో భానుముక్కల గ్రామం చేరుకున్నారు. సుమారు ఉదయం పదకొండు గంటలవేళ. అప్పటికే ఎండతీవ్రత హెచ్చింది. క్రింద కాళ్లు కాలుతున్నాయి. పైన తలమాడుతున్నది. ఆకలి దప్పుల బాధ ఎక్కువైంది. ఇక ప్రయాణం సాగింపలేక ఆ భక్తబృందం గ్రామస్తులను విచారించారు.

“ఇది ఏ ఊరు నాయనా? ఈ ఊళ్లో అన్నంపెట్టి ఆకలితీర్చే పుణ్యాత్ములెవరైనా ఉన్నారా?” అని

“అయ్యో! నిరతాన్నదాత ఎల్లమరాజు గారిపేరు మీరు వినలేదా! ఆ మహానుభావునిది ఈ ఊరే. మీకు షడ్రసోపేతమైన ఆతిథ్యం లభింపగలదు” అని నేరుగా ఎల్లమరాజు గారింటికి దారిచూపించారు, ఆ ఊరి కాపులు.

అతిథులకోసం ఎదురుచూస్తున్న ఆ దంపతులకు మహదానందం కల్గింది. తమ భాగ్యం పండిందని వారిని ఆహ్వానించారు. కాళ్లకు నీళ్లిచ్చి అందరికి చల్లని మజ్జిగ నిచ్చి సేదదీర్చుకొమ్మని ప్రార్థించారు. ఆ యాత్రికులకు వారి ఆదరణచూచి ప్రాణంలేచి వచ్చినట్టయింది. అమ్మయ్య! అని అలసట తీర్చుకొన్నారు.

అంతలో ఇల్లాలు లచ్చమ్మ అతిథులకై మంచి రుచికరములైన వంటలు సిద్ధం చేస్తూ వుండినది. అతిథులు స్నానాదికములు ముగించుకొని ముంగిట ఎల్లమరాజుతో ముచ్చటిస్తూ వుండినారు.

ఇంతలో వంటఇంటిని అనుకొనియున్న పెరడులో ఆడుకొంటున్న కొడుకును సర్పము కాటువేసింది. ఈదుర్ఘటన కంటపడిన లక్ష్మమ్మ వెంటనే ఏమీ పాలుపోక ఆందోళనగా భర్తను లోపలికి పిలిచింది. ఆయన వచ్చి నోటినుండి నురగలు గ్రక్కుతూ క్షణాల్లో విగతజీవుడైన కుమారునిచూచి దుఃఖించినాడు. గుండెను రాయిచేసుకొని భార్యను ఓదార్చినాడు. ఈ విషయం బయటికి పొక్కినచో ఆకలితోనున్న అతిథులు భోజనం చేయకుండ వెళ్లిపోతారు. వారు ఆకలితో వెళ్లినచో ఆపాపం తమకు చుట్టుకొనును. ఏమిచేసినా పోయిన బిడ్డ మళ్లీరాడు. ఆకలితో అన్నం కొరకు ఎదురుచూస్తున్న ఈ అతిథులను సంతృప్తిపరచుటయే మనధ్యేయమని, ఈ కార్యక్రమంలో ఎలాంటి విఘ్నం రాకుండా, ఈవిషయం బయటికి పొక్కకుండా వుండుటకై తిరుమల వేంకటేశునికి వేయి మొక్కులు మొక్కుకున్నారు. దుఃఖాన్ని దిగమింగినారు. బాలుని శవాన్ని పెరటిలో ఒక పెద్దగంపక్రింద మూసిపెట్టి 'నీవేదిక్కు' అని ఆపన్నుల పాలిదైవమైన ఏడుకొండలవానిని శరణువేడినారు. ఆ ఆలుమగలు ఏమియు జరగనట్లే నిర్వికారంగా అతిథులకు విస్తళ్లు వేసినారు.

వీరి ఆక్రందన తిరుమల ఆనందనిలయంలో ప్రతిధ్వనించింది. వేంకటేశుడు భక్తసులభుడుకదా. క్షణం నిలువలేకపోయాడు. ఆజానుబాహుడు, నేరేడు పండుచాయగలవాడు, ఊర్ధ్వ పుండ్రములతో, పట్టుపంచతో సుమారు డెబ్బది సంవత్సరముల "నామాలతాత"గా వేషం మార్చుకున్నాడు. చేతిలో వెండిపొన్నుకఱ్ఱతో ఏడుకొండలు దిగినాడు. అంతే భానుముక్కల గ్రామంలో ఎల్లమరాజు గారింటి అతిథి అభ్యాగతులలో కలిసి పోయినాడు.

విస్తళ్లు వడ్డించారు. ఎల్లమరాజు అందరిని అడిగి అడిగి వారికి కావలసిన పదార్థములను తనభార్య చేత వడ్డింపజేస్తూ, తానూ ఒక్కొక్కసారి

వడ్డన చేయసాగాడు. ఆకలితోనున్న అతిథులు తృప్తిదీర భోజనం చేశారు. వారి ఆదరణకు సంతృప్తి చెందారు. భోజనాలు ముగిశాయి.

ఆ వచ్చిన అభ్యాగతులలో 'నామాలతాత' ఆ దంపతులను పిలిచాడు. " మీ ఇద్దరి వదనంలో ఆందోళన, దుఃఖం కొట్టవస్తున్నట్లు కన్పడుతున్నది. కారణమేమి? దానికి మేమేమైన ఉపశమనం కలిగించవచ్చుగదా. అంతేకాదు దుఃఖమును దిగ్రమింగిన అది దహించివేయును తప్ప, మేలు జరుగదుగదా! కనుక మీపుణ్యదంపతులకు వాటిల్లిన ముప్పు, అది ఎట్టిదైనాకాని సందేహంలేక వక్కాణించుడు" అని ఓదార్పువచనములను ఆప్యాయంగా పలికినాడు.

అంతవరకు బలవంతముగా అణచుకొన్న దుఃఖం కట్టలు తెంచుకొనగా, ఆ భార్యాభర్తలు గొల్లుమని ఆ బాలుని శవాన్ని తెచ్చి ఆయన పాదములపై పెట్టారు. జరిగిన ఘోరాన్ని విని అతిథులు గ్రామస్థులు ఆశ్చర్యపడ్డారు. ఆందోళనతో చింతించారు.

ఆ నామాలతాత వెంటనే, ఆ ఊళ్లోనే ఆ పుణ్యదంపతులు ప్రతిష్ఠించిన శివాలయం ఎదురుగా, వారే త్రవ్వించిన బావినుండి ఒక పాత్రతో నీటిని, అందులోని మట్టిని తెప్పించినాడు. ఆ నీటిని, మట్టిని కలిపి 'ఓం శ్రీ వేంకటేశాయనమః' అను అష్టాక్షరితో మంత్రించి ఆ పిల్లవానినోటిలో పోసెను. వెంటనే తిరుమల శ్రీనివాసుని వరప్రసాది అయిన ఆ వెంకటప్ప నిదురనుండి మేల్కొన్నట్లు లేచినాడు. ఎల్లమరాజు దంపతులతో సహా అచట చేరిన జనసమూహం ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఆ నామాల తాతయ్యకు భక్తితో నమస్కరించారు.

ఆ నామాలతాత మిగిలిన నీటిని మట్టిని కలిపి మంత్రించి, మరల అదేబావిలో పోయించి "మున్ముందు ఎవరికైనా పాముకరచిన ఎడల, ఆ బావిలో నీరు, బురదకలిపి త్రావించినచో, పాము కరచిన వ్యక్తికి స్వస్థత చేకూరగల"దని చెప్పి, ఆ భార్యాభర్తలను కుమారునితోకూడ తిరుమల



2

యాత్ర చేయవలసిందని ఆజ్ఞాపించినాడు. తదుపరి నామాలతాత అనుజ్ఞమేరకు వారిరువురు కొడుకుతో కూడా భోజనమునకు కూర్చుండిరి. వారు భోజనం చేసి వచ్చి చూడగా భుక్తాయాసంతో కునుకుతీస్తున్న అతిథులలో నామాలతాత కన్పడలేదు. మిగిలిన అతిథుల నడుగగా వారును ఆశ్చర్యపడిరి. ఆవచ్చిన నామాలతాత తమకొరకై వేంచేసిన శ్రీ వేంకటేశ్వరుడే అని భక్తితో స్వామిని ప్రార్థించారు. ఆయన ఆజ్ఞానుసారం, తమ ఇంట ఆతిథ్యం తీసుకొన్న యాత్రికులతో కలిసి ఎల్లమరాజు దంపతులు తిరుమలయాత్రచేసి, వేంకటేశ్వరస్వామి వారికి అనేక విధముల మ్రొక్కులు చెల్లించారు.

ఇందుకు నిదర్శనంగా కర్నూలుజిల్లా భానుముక్కల గ్రామంలో ఎల్లమరాజు త్రవ్వించిన బావిలోని నీటిని, మట్టిని, పాము కరచినవారు స్వీకరిస్తూ, నేటికీ స్వస్థత పొందుతున్నారు.

## నేత్ర దాత

ఒకమారు ఒక అంధబ్రాహ్మణుడు తిరుమల యాత్రకు తోటివారితో బయలుదేరివెళ్ళినాడు. తిరుపతి చేరుకొని కాలిబాటన కొండెక్కుతూ, ఏడుకొండలను గూర్చి, చెట్ల చేమలను గూర్చి తనతోవచ్చినవారు, తాము చూచుకొంటూ చెప్పుకొంటూ ఆనందిస్తుండగా ఈ అంధుడు తానూ చూడలేకపోతినే అని కుమిలిపోయినాడు. తిరుమల చేరిన తర్వాత శ్రీ వేంకటేశ్వరుని వైభవమును, దివ్యమంగళ విగ్రహమును గూర్చి విని కన్నులారా దర్శింపలేకపోతినే అని పరిపరి విధముల పరితపించినాడు. పూలంగిసేవలో వున్న స్వామివారి రూపాన్ని దర్శించి పులకించలేకపోతినే అని అనేక విధముల దుఃఖించినాడు. "అసలు నీరూపమెలాగ వుంటుందో ఊహించుకోలేక పోతున్న పుట్టుగుడ్డివాణ్ణి ప్రభూ! పాపిష్టి వాణ్ణి. ఏజన్మలో ఏ పాపం చేశానో, వెంకటరమణా, సంకటహరణా రక్షించవలసింది.

నాకు కన్నులు దయచేయవలసింది". అని అనేక విధముల దీనంగా ప్రార్థించినాడు. అలసి అలసి నిద్రించినాడు.

వేంకటేశుడు నమ్మినవారిని మోసం చేస్తాడా! ఆ గుడ్డివాని మొరను ఆలకించాడు. స్వప్నంలో సాక్షాత్కరించాడు. "భక్తా కర్నూలు మండలంలో భానుముక్కల అనుగ్రామంకలదు. ఆగ్రామాధికారి ఆళ్లగడ్డ ఎల్లమరాజు. ఆయన మహాదాత. ఎవరు ఏవేళ ఏది యాచించినను సంకోచంలేక ఇవ్వగల మహాత్యాగి, మీదుమిక్కిలి నాప్రియభక్తుడు. నేను ఆదేశించినట్లుగా నీవు ఆయన దగ్గరికి వెళ్లి అర్థించు. ఆయన ఇంతవరకు సంపాదించిన దానఫలాన్ని ధారపోసినచో నీ పాపఫలం నిర్మూలింపబడి నీకు ఒక కన్ను మాత్రమే వచ్చును. ఆ తర్వాత నీవు మళ్లీ వేంకటాచల యాత్ర చేసి నన్ను దర్శించవలసింది. అప్పుడు ఆ రెండవకన్ను నేను అను గ్రహింపగలను. నీ అభీష్టము నెరవేరగల"దని ఆదేశించెను.

పుట్టుగుడ్డియైన బ్రాహ్మణుడు మేల్కాంచి ఆశ్చర్యముతో స్వప్న వృత్తాంతమును తనవారితో విన్నవించినాడు. వారును ఆనందపడినారు. పిదప అతి ప్రయాసల కోర్చి వారు అంధవిప్రునితో కూడ భానుముక్కలగ్రామం చేరుకొన్నారు.

అతిథులకై ఎదురుచూస్తున్న ఎల్లమరాజువీరిని భక్తిపూర్వకంగా ఆహ్వానించాడు. తనకు స్వప్నములో శ్రీ వేంకటేశ్వరుడు కన్పించి, ఆదేశించిన విషయాన్ని ఎల్లమరాజుతో విన్నవించి, అంతవరకు ఆయన సంపాదించిన దాన ఫలమును తనకు దానముగా ఇమ్మని అంధుడు యాచించినాడు.

ఆ అంధునికి చూపు వచ్చినచో తనజన్మ ధన్యమగునని తలచినాడు ఎల్లమరాజు. తానొసంగునట్టి ఈదానముతో అంధుని మనోరథము ఈడేరునటుల కోటివిధముల శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించినాడు. తన దానఫలమును అతనికి ధారపోసినాడు.

ఆశ్చర్యము! అత్యద్భుతము! ఆ విప్రునికి ఒక కన్ను వచ్చినది. వెంటనే చూపు సఫలమైనది. ప్రథమ దర్శనంతోనే మహాదాత ఎల్లమరాజును, ఆ ఎల్లమరాజులో ఛాయగా శ్రీ వేంకటేశుని దర్శించినాడు విప్రుడు. తనకు చూపు ప్రసాదించిన దాత ఎల్లమరాజును వేయివిధముల స్తుతించి, దండప్రణామము లాచరించినాడు.

తదుపరి ఆయన అనుజ్ఞగైకొని వేంకటాచలము చేరి దేవదేవుడైన శ్రీ వేంకటేశ్వరస్వామివారిని దర్శించినాడు. స్వామివారి అనుగ్రహముతో రెండవ కన్నునుకూడా పొంది, ఆ విప్రుడు కన్నులారా స్వామివారిని, దర్శించి, సేవించి, సఫలీకృతుడై వెడలినాడు.

## పిలిచిన పలికే స్వామి

*శ్రీ బి.సూర్యనారాయణరావు.*

"కలౌ వేంకటనాయకః"! ధర్మదేవత ఒంటిపాదంతో సంచరిస్తున్న ఈకలియుగంలో తనను నమ్మినవారికి నేనున్నానంటూ అభయమిస్తూ తన భక్తులను ఆపత్సమయములలో కాపాడు ప్రియతమ దేవుడు శ్రీ వేంకటరమణుడు.

శ్రీ వేంకటేశుని నమ్మినవారికి ఆపదలు సంభవించవు. సంభవించినను అగ్నిని తగిలి పత్తి మాడినటుల ఆపదలు నిర్మూలనమగును.

ఆ కళ్యాణ చక్రవర్తి మహిమలను గురించి ఎంతో రాయాలనిపిస్తున్నా, ప్రధానముగా నామనస్సును కదిలించిన - ఆనందపరచిన, పులకరింపచేసిన ఈ రెండు సంఘటనలను ఇక్కడ రాస్తున్నాను.

1. మా పెద్దమ్మాయి బి.ఎ. పాసైన తర్వాత వైశ్యాబ్యాంకు పరీక్ష రాసింది. బాగానే రాసానన్నది. రెండు నెలలు గడిచాయి. ఎటువంటి సమాచారము అందలేదు. అందుచేత తను పరీక్షలో పాస్‌కాలేదేమో ! రాలేదు అనుకున్నాము. తర్వాత తను ఎం.ఎ.లో చేరింది.

మా పెద్ద అమ్మాయి నాస్తికవాది. నాకేమో చాలాభక్తి. శ్రీ వేంకటరమణస్వామి నాయిష్టదైవం. నన్నాయన ఎన్నోమార్లు ఆదుకున్నాడు. నేను తప్పని సరిగా సంవత్సరానికొక్కసారైనా (వీలైతే 3,4 సార్లు కూడా) తిరుపతికి వచ్చి అచట దేవుడికి తలనీలాలర్పించు కుంటాను. నిత్యం ఇంటిదగ్గర ఆయనపూజ మాత్రం మరచిపోకుండా చేస్తుంటాను. నాపూజలు నా అభిప్రాయాలు అన్నింటినీ - అదోపిచ్చి! అంటూ కొట్టిపారేస్తూ నాతో వాదనకు దిగేది మా అమ్మాయి.

అలా వాదిస్తూ ఒకసారి ఇలా అన్నది. "నేను బ్యాంకు పరీక్షరాసాను. ఇంతవరకు ఏవిషయం తెలియలేదు కాబట్టి నాకు దాదాపు ఆ ఉద్యోగం రానట్లే. ఏదో అద్భుతం జరిగితే తప్ప రాదు. మరి మీదేవుడు మహిమగలవాడంటారు కదా! నాకిప్పుడు ఉద్యోగం వస్తే నిజంగా దేవుడున్నాడనీ, పిలిస్తే పలుకుతాడనీ, నమ్ముతాను."

నేను దేవునిపై పూర్తి భారం వేశాను. కాని అమ్మాయి కోరినట్లుగానే జరిగితే బావుండునని మనసులో స్వామిని ప్రార్థించాను.

పదిరోజులు గడిచాయి. ఆరోజు మా అమ్మాయిపేరిట కవరు వచ్చింది. తను,బ్యాంకు టెష్టు పాసు అయిందట! ఇంటర్వ్యూకి ఫలానా రోజున హాజరు కావలసింది!! ఇవి ఆ ఉత్తర సారాంశాలు.

మేము ఇంటిల్లిపాదీ ఎంతో ఆశ్చర్యపోయాము. మా అమ్మాయి ఇంటర్వ్యూలో సెలెక్టయి ప్రస్తుతం వైశ్యాబ్యాంకులో ఉద్యోగం చేస్తున్నది. అన్నట్టు ఇప్పుడు ఆ అమ్మాయి అపరదైవ భక్తురాలు సుమండీ!

2. మా స్నేహితుడి కొడుకు దాదాపు 8 ఏండ్లవయస్సు కలవాడికి తిరుపతి చూడాలని కోరిక కలిగింది. రైలు ఎక్కేసాడు.

మా మిత్రుడు ఆఫీసునుండి వచ్చేసరికి యింట్లో లేడు. ఆడుకోవడానికి వెళ్లాడేమో అనుకున్నాడు. సమయం గడచి రాత్రయింది. ఆ అబ్బాయి ఇంకా రాలేదు, వాళ్ల ఇంట్లో వాళ్లకు భయంవేసింది. ఊరంతా వెదికారు. కాని ఆ అబ్బాయి ఆచూకి తెలలేదు. అబ్బాయిలిద్దరు

తిరుపతి వెళ్లాలని మాట్లాడుకుంటుండగా విన్నామని తెలిసిన వాళ్లెవరో చెప్పారు. మా మిత్రుడు వున్నపళాన బస్‌లో తిరుపతికి బయలుదేరాడు.

తిరుపతికి చేరిన వెంటనే ఎన్నోచోట్ల వెదికాడు. నిరాశే మిగిలింది. కొండపైన కూడ వెతికాడు కొడుకు. కన్పించ లేదు.

చివరికి మా స్నేహితుడు దేవుణ్ణి శరణు వేడినాడు. "నేను వెళ్లేసరికి మాకుమారుడు క్షేమంగా ఇంటివద్ద ఉండునట్లు చేయి తండ్రీ! అలా జరిగిన ఎడల ఇరువురం మళ్లీ కొండకు వచ్చి నీ దర్శనం చేసుకొంటాము".

అతని ప్రార్థన విన్నాడు ఆపదమొక్కులవాడు. అతడు ఇంటికి చేరుకొనేసరికి క్షేమముగా ఇంట్లో కన్పించాడు కొడుకు. అతనికెంతో ఆనందము కలిగింది. జరిగిన విషయం అడిగి తెలుసుకున్నాడు.

రైలులో ఆ అబ్బాయిలు మాట్లాడుకుంటుండగా ఓ డాక్టరుగారు (మంగళంపల్లె) వీరింట్లో చెప్పకుండా వచ్చారన్న విషయాన్ని గ్రహించాడు. వారిని తనతో పాటు తమ ఊళ్లోనే దింపుకున్నాడు. ఆ రాత్రి వారికి తన ఇంటనే భోజనంపెట్టి పడుకోబెట్టాడు. మరురోజు రైల్వే అధికారులకా పిల్లలవిషయం చెప్పి భద్రముగా వారిని అనంతపురంలో దింపవలసిందిగా కోరాడు. అలా పిల్లలు క్షేమముగా ఇంటికి చేరుకున్నారు.

నేను సరిగా 11గంటల సమయంలో దేవుణ్ణి ప్రార్థించాను. అదే సమయంలో ఆ డాక్టరుగారు మా పిల్లవాణ్ణి (11గం॥ల ప్రాంతంలోనే) రైలెక్కించాడట! మా మిత్రుడు చెపుతుంటే "నిజంగా ఆపద్బాంధవుడు, భక్తజనవత్సలుడు శ్రీ వేంకటరమణస్వామి" అనిపించింది.

మరీమరీ చూడాలనిపించే ఇలవైకుంఠమైన తిరుపతి, ఇంకా ఇంకా మొక్కాలనిపించే ఆదేవుడు-ఆయన వైభవాన్ని మహిమలను వర్ణించడానికి భాష చాలదేమో! నిజంగా ఆయన పిలిస్తే పలికే దేవుడు !!

# పెళ్లి జరిపించిన దేవుడు

జి.ఉమా ప్రియదర్శిని

కలియుగంలో భక్తులపాలిట కరుణాసముద్రుడయిన శ్రీవేంకటేశ్వరుని మహిమలనంతములని నిరూపించే సంఘటనలు కొకొల్లలు. అటువంటిదే ఒకటి మాకు అనుభవమయినది.

అది 1972వ సంవత్సరం జూన్ నెల మా అక్కయ్య వివాహం జరిపించాలని మానాన్నగారు ఎంతో ప్రయత్నించి, సంబంధం కుదుర్చుకొని ముహూర్తం పెట్టించారు. జూన్ 26వతేదీ ఉదయం పదిగంటలకు ముహూర్తం. అదృష్టవశాత్తూ మాకు అన్ని విధాలా అనుకూలమయిన సంబంధమే కుదిరిందని అందరూ ఎంతోసంతోషించారు. మా ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకున్నా అందివచ్చిన అవకాశం జారిపోతుందన్న భయంతో, మానాన్నగారు మాకున్న భూమిలో కొంతభాగం అమ్మివేసి అక్కయ్య వివాహానికి సిద్ధమయ్యారు.

పెళ్లి పనులు జోరుగా సాగుతున్నై. మా ఇంట్లో జరుగుతున్న మొట్టమొదటి శుభకార్యం కాబట్టి అంతో ఇంతో మాస్థాయికి తగ్గట్టు ముచ్చటగానే అక్కయ్య పెళ్లి జరిపించాలని నాన్నగారు ఏర్పాట్లు బాగానే చేయిస్తున్నారు.

వివాహమింకా నాలుగురోజులుండనగా ఆసాయంత్రం మంచిరోజని పందిరివేయిస్తున్నారు. వాకిట్లో పందిరి దాదాపు అయిపోవచ్చేసరికి, వర్షం మొదలయి క్రమంగా పెరిగిపోయి కుంభవృష్టిగా మారింది. ఆవర్షం చివరికి ముసురుగా మారింది.

ఆ ముసురు పెళ్లి రేపనగాకూడా వదలలేదు. ముసురులోనే ఎలాగోలా పనులు జరిగిపోతున్నై. దూరప్రదేశాలనుండి రావలసిన బంధువులంతా దిగుతున్నారు వరుసగా.

నాలుగైదు రోజులుగా తెంపులేని వర్షం మూలంగా, మాఇంటిచుట్టూ నీళ్లు నిలబడి జలాశయం మధ్యన కుటీరంలా కనిపిస్తుంది మా ఇల్లు.

మరునాడు తెల్లవారితే వివాహంఅనగా ఆ సాయంత్రం కూడా వర్షం తగ్గలేదు. ఆ ముసురులో ఆ జలాశయంమధ్యన ఎలావివాహం జరపాలో తోచక సతమతమయిపోతున్నారు నాన్నగారు. వచ్చిన బంధువులంతా మా అవస్థ చూచి బాధపడుతున్నారు. గ్రామస్థులు కూడా "పాపం ! ఎలాగోలా తంటాలు పడి పిల్లపెళ్లి పెట్టుకున్నాడాయన ఎలా గట్టెక్కుతాడో ఏమో?" అనిజాలి పడుతున్నారు.

మానాన్నగారికి ఎటూ దిక్కుతోచడంలేదు మాసమీపంలో తెనాలి పట్టణంలో గల ధర్మసత్రాలు కళ్యాణమండపాలు అన్నీ తిరిగేశారు. కాని ఎక్కడా ఖాళీలేవు. అదే ఆఏటికి అఖరిలగ్నం కావటం వలన అన్నిచోట్ల ముందే బిగిసిపోయినై.

నిరాశతో సాయంత్రం ఏడుగంటలకు తిరిగి తిరిగి ఇల్లు చేరారు నాన్నగారు. రావలసిన బంధువులంతా చాలావరకు వచ్చేశారు. వంటవాళ్లు వగైరా కూడా హాజరయ్యారు. వరుణదేవుడు మాత్రం మమ్మల్ని వదలి పెట్టి వెళ్లనని తిష్ఠవేశాడు.

ఎంతో ముచ్చటగా అక్కయ్య పెళ్లి జరిపించాలని ఆశించిన అమ్మ, అత్తయ్యలంతా దిగాలుపడిపోయారు. ఆ మధురక్షణాలకోసం - జీవితంలో ఒకే ఒకసారి లభించే ఆ అమృతఘడియలకోసం కలలు కంటూ అందరిలాగే ఎదురుచూస్తున్న అక్కయ్య క్రుంగిపోయి ఓమూల కూలబడిపోయింది.

ఎవ్వరికీ మనసులో మనసులేదు. అందరూ బరువెక్కిన హృదయాలతో, నోటి మాటరాక కూర్చుండిపోయారు. అర్ధరాత్రి వరకు.

మానాన్నగారు మండుతున్న అగ్నిపర్వతంలా కనిపిస్తున్నారు. కుర్చీలో కూర్చుని గంభీరంగా శూన్యంలోనికి చూస్తున్నారాయన ఆయన్ని సమీపించటానికి, పలకరించటానికి ధైర్యం చాలటం లేదెవ్వరికి.

పొద్దుపోయింతర్వాత, మా ఇంటికి సమీపంలోనే వున్న మా శ్రేయోభిలాషి ఒకాయన వచ్చాడు నాన్నదగ్గరకు. ఆయన గారిది చాలా విశాలమయిన వరండాగల పెద్దడాబాఇల్లు. అకాంపౌండులో పెద్ద

బావికూడా వుంది. పరిస్థితి అంతా తెలిసిన ఆయన నాన్నగారికి ఒక సలహాఇచ్చాడు. "ఎంత వర్షంవచ్చినా ఏ ఆటంకం లేకుండా పనులన్నీ జరిగిపోతై. మాఇంట్లో వివాహం జరిపించవయ్యా" అని, ఏర్పాట్లన్నీ తనే చేయిస్తానని కూడా చెప్పాడు.

నాన్న రెండు క్షణాలు ఆలోచిస్తూ కూర్చున్నాడలాగే. ఆయనగారి సలహా మావాళ్లందరికీ బాగానే వుంది. అలా చెయ్యడమే మంచిదని అంతా భావించారు.

రెండుక్షణాల తర్వాత నాన్న గట్టిగా శ్వాసలాగి వదిలారు. "ఏది ఏమైనా నా బిడ్డపెళ్లి ఈ పందిట్లోనే జరిగితీరాలి" అంటూ లోనికి వెళ్లిపోయారు. వచ్చినాయన సణుక్కుంటూ వెళ్లిపోయాడు. నాన్నకు ఒకళ్ల సలహాలివ్వడం అలవాటులేదని మా బంధువులంతా గొణుక్కోవటం గుసగుసలాడటం తప్ప, ఆయనతో వాదించి ఒప్పించే ధైర్యం ఎవ్వరికీ లేకపోయింది.

నాన్న కాస్సేపయింతర్వాత అక్కయ్య వున్న గదిలోనికి వచ్చి, ఆమె తలనిమిరి ధైర్యంగా వుండమన్నట్లు వీపుచరిచి తిరిగి లోనికి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత తెల్లవారేవరకు, ఆయన అర్ధనిమీలిత నేత్రాలతో శ్రీ వేంకటేశ్వరస్వామివారిపై తదేకంగా దృష్టినిలిపి పీటమీదనే కూర్చుండిపోయారు.

ఇంట్లో అందరూ క్రమక్రమంగా నిద్రలోనికి జారుకున్నారు. భళ్లున తెల్లవారింది.

వర్షం తగ్గుముఖం పట్టింది. సన్నగా తుంపరలు మాత్రం పడుతున్నాయి. ఇంకా సరిగ్గా ఆరున్నరకు నాన్నగారు రాత్రి కూర్చున్నచోటు నుండి లేచారు. ఎదురుగా కిటికీ నుండి మబ్బుతునకలను ఛేదించుకుంటూ వస్తున్న సూర్యభగవానుడు కనిపిస్తున్నాడు. నాన్నగారి కళ్లలో వెలుగు కనిపించింది, ఆయనకు సమీపంలో నిలబడి పరిశీలిస్తున్న నాకు.

నాన్నగారు తన ఎదురుగా పూజామంటపం మీదున్న తన ఇష్టదైవమయిన శ్రీ వేంకటేశ్వరుని ముందు సాష్టాంగపడి లేచారు. బయటకు వచ్చి కార్యరంగంలోనికి దిగారు.

ఆ తర్వాత అంతా సినిమారీలులా చకచక జరిగిపోయింది.

సరిగ్గా ఏడున్నరకు పెళ్లివారు బస్సులో తరలివచ్చారు. గ్రామంలోని అభిమానులు ఆత్మీయులు అంతా పిలువకుండానే పోగయి తలోపని చెప్పకుండానే చేసుకపోసాగారు. పందిరి అలంకరణ-వియ్యాలవారి మర్యాదలు - వంటల వార్పులు, బాజా భజంత్రీలు, అన్నీ క్షణాల మీద చకచక జరిగిపోతుంటే, ఏనాడూ మా ఇంటికి రాని గ్రామస్థులంతా, యువకులు, పెద్దమనుష్యులు నిలబడి తమ స్వంతకార్యంలా జరుపుక పోతూంటే ఈ గ్రామంలో ఈయన కింతపలుకుబడి, అండదండలున్నాయా! అని వియ్యాలవారితో పాటు, మేము సైతం ఆశ్చర్యపోయాము.

అనుకున్నప్రకారం అన్ని ముచ్చట్లతో సెకండు తేడా లేకుండా సూత్రధారణ జరిపించారు నాన్నగారు. మిగిలిన ఏర్పాట్లుకూడ అందరూ మెచ్చుకునేలా జరిగిపోయినై. ఆ పెళ్లిపీటలమీద కూర్చున్న అక్కయ్య కళ్లలో వెలుగు, సంతృప్తి మాటల్లో చెప్పలేను.

భోజనాలయింతర్వాత అంపకాలతంతు వగయిరా ముగిసేసరికి మధ్యాహ్నం కాఫీల వేళయింది. టిఫిను, కాఫీలు పూర్తిచేసుకొని అక్కయ్యను వెంట పెట్టుకొని, వియ్యాలవారు వెళ్లిపోయారు.

నాన్న వంటరిగా గదిలో నిలబడివుంటే దగ్గరగా వెళ్లాను. ఆయన శ్రీవేంకటేశ్వర స్వామివారి ముందు నిలబడి చేతులు జోడించి, స్వామితో ఏదో అంటూ ఆనందబాష్పాలు రాలుస్తున్నారు.

విచిత్రమేమంటే ఆరాత్రి ఏడున్నర ఎనిమిదిగంటలకు మళ్లీ వర్షం మొదలయింది. ఆ ముసురు తిరిగి నాలుగురోజులవరకు వదలలేదు.

శ్రీ స్వామివారి దయవల్ల అక్కయ్య పెళ్లి అటూ, ఇటూ ముసురు మధ్య వదిఘండియలవ్యవధిలో నిర్విఘ్నంగా జరిగిపోయింది ఏలోటులేకుండా.

ఆ రాత్రంతా నాన్నపెట్టుకున్న మొర ఆలకించిన శ్రీనివాసుడు తనమహిమను ప్రదర్శించాడు. తన భక్తుని ఇంట నిర్విఘ్నంగా పెళ్లి జరిపించిన దేవుడు ఆ తిరుమల వేంకటేశ్వరుడు.

# ఆపద మొక్కులవాడు

*శ్రీమతి గొంగాళ ప్రభావతి జోగారావు*

ఒకసారి మా అత్తగారికి చాలాచికాకు వేసింది. ఒక బాధకు మందిస్తే మరోకొత్తబాధ తోడయ్యేది. అసలు అనారోగ్యం ఏమిటో అంతుబట్టక మందులు మార్చిమార్చి విసిగిపోయారు మావూరి డాక్టరు గారు. మా అత్తగారు మంచం దిగలేని పరిస్థితి ఏర్పడడంతో పెద్ద ఆసుపత్రికి తీసుకెళ్లమని డాక్టరుగారే సలహా ఇచ్చారు. మా అత్తగారు మాత్రం మరెక్కడికీ వద్దంటూ మొండికేశారు. ఆరోగ్యం బాగయితే తిరుపతి వేంకటేశ్వరస్వామికి నిలువుదోపిడి ఇస్తానని మొక్కుకున్నారు. అప్పట్నుంచీ మందులూ, మాకులూ తీసుకోలేదు కూడా. ఎంత చెప్పినా ఆవిడ పట్టుదల విడవక పోవడంతో మేం చేసేదేంలేక టైము ప్రకారం ఆహారపానీయాల్నిచ్చేవాళ్లం. అలా పదిరోజులు గడిచేసరికి విచిత్రంగా తిరుగగలిగారంటే అతిశయోక్తికాదు. నెలరోజులుపైగా మందులు వాడుతూ మంచం మీదున్నామె మొక్కుకున్న పదిరోజుల్లో లేచి తిరిగారంటే అదంతా ఆ శ్రీవేంకటేశ్వరస్వామి వారి లీలావిలాసమే.

మా అత్తగారు మొక్కుకున్నట్లుగా ఆవిడ వంటిమీదున్న నగల్ని వేంకటేశ్వర స్వామి హుండీలో వేసేసినా, ఆవిడ చెవిదుద్దులు మాత్రం ఉంచేయాలన్న అభిప్రాయం కలిగిందినాకు. ఏమంటే ఆదుద్దులు ఏభైఏళ్లనాటివి. వజ్రాలదుద్దుల్లా మెరుస్తున్న ఏడుపాళ్లదుద్దులు. పైగా వాటి పనితనం కూడాచాలా బాగుంది. అంతకుముందే అలాంటి వోజత కొనుక్కోవాలని బంగారం షాపులలో ప్రయత్నిస్తే అసలా రకంపాళ్లు, పనితనం వున్నవే కనబడలేదు. పోనీ కంసాలికి చెప్పి చేయించాలనుకుంటే అలాంటి మంచిరాళ్లు ఇప్పుడు దొరకవంటూ ఆపనితనం కూడా ఇప్పుడెవ్వరికీ పట్టుపడదంటూ చెప్పేశాడు. అందువల్లే ఆదుద్దులమీద ఆశపోలేదు. మరలా ఇప్పుడు ఆదుద్దులు ఇంట్లో లేకుండా హుండీలో వేసెయ్యాలంటే మన సొప్పలేదు. అదే మాటన్నాను మా వారితో.

అందుకాయన ససేమిరా వీల్లేదంటూ, వెంకటేశ్వరస్వామితో వేళాకోళం కాదు. ఎలా మొక్కుకుంటే తూచాతప్పక అలా చెయ్యాల్సిందే. లేకపోతే వడ్డీతో సహా వసూలు చేస్తాడన్నారు. కాని పట్టువిడవని విక్రమార్కునిలా నామనసుని మాత్రం ఆ దుద్దులనుంచి మళ్లించలేకపోయాను.

"నేనేం వజ్రాలూ, వైడూర్యాలు అడగలేదుగా! అయినా నేనేం అడిగినా మీరౌనన్నదెప్పుడులెండి. అనుకున్నట్టుగా అన్నీ వేసేస్తున్నాం. ఒక్క దుద్దులేగా! అంతగా అయితే వాటిధరకట్టి హుండీలో వెయ్యకూడదా ఏం?" ఓ ప్రక్క అంతరంగంలో భయం అన్నది కలుగుతున్నా వస్తువు మీద ఆపేక్ష పోక అన్నాను. మరింకేమీ మాట్లాడక మౌనం అంగీకారంగా తెలిపారు మా ఆయన. ఆ మర్నాడే దుద్దులకు ధర కట్టించాలని ఇద్దరం అనుకున్నాం.

ఈ విషయాలు ఏమీ తెలియని మా అత్తగారు కొంచం ఆరోగ్యం చేకూరడంతో ఆదమరచి నిద్రపోయారు. ఉన్నట్టుండి మా అత్తగారు నిద్రపోతూన్న గదిలోంచి అరుపులు వినరావడంతో అదురుతున్న మనసుల్తో అత్తగారి గదిలోని కెళ్లాం. మంచంమీద కూర్చున్నారు బాసింపట్టువేసుకొని. ఆమె మొహంలో ఏదో ఆరాటం ప్రస్ఫుటమవుతుంది. అర్థంకాకుండా ఉన్నాయి ఆవిడ అరుపులు. అందులో అస్పష్టంగా వినిపించింది 'పట్టుకో! పట్టుకో!, అన్న పదం ఒక్కటే!

మా ఉనికి కూడ ఆమె గ్రహించలేదు. రెండు చెవుల్ని గట్టిగా పట్టుకుని, కిటికీ వంక భయంగా చూస్తూ అరుస్తున్నారు. అయోమయంగా ఓ రెండు నిమిషాలు అలాగే నిలబడ్డాం. తెప్పరిల్లి కూజాలో నీళ్లు తెచ్చి ఆవిడ ముఖం తుడిచాను. అత్తగారిని భుజం మీద తడుతూ "ఏమయిందమ్మా ! ఎందుకలా అరుస్తున్నావు" అడిగారాయన.

కొంచం తెప్పరిల్లిన మా అత్తయ్య ఓక్షణం మావంక తేరిపారచూసి ఏదో చెప్పాలని తెరచి నోటమాటరాక, గొంతుక సవరించుకుని మాట్లాడాలని శతవిధాల ప్రయత్నించారు. నోట శబ్దం అన్నది రాలేదు. మొదట వింతనిపించినా, తరువాత భయంవేసింది. ఏంచెయ్యాలో

పాలుపోలేదు. అంతలో అత్తయ్య నుదుట నామాల్ని, ఎత్తు లావుల్ని సంజ్ఞలు అభినయంగా తెలియజేసి చెవిదుద్దులు పట్టుక పోయాడన్నట్టు కిటికీ వైపు చేతులు చూపిస్తూ కళ్లు తుడుచుకున్నారు. అనుమానంగా కిటికీవంక చూస్తే తలుపులు వేసే వున్నాయి. దుద్దులు ఆమె చెవుల్ని మెరుస్తున్నాయి. పోనీ మంచం కిందెవరన్నా ఉన్నారేమోనని చూశాం. ఎవ్వరూ లేరు.

ఒక్కసారిగా నా ఆలోచనలు చురుగ్గా పనిచేశాయి. అంతేకాదు. వళ్లంతా ముచ్చెమటలూ పోశాయి. పిచ్చి పిచ్చిగా చూస్తూ సంజ్ఞలు చేస్తున్న అత్తగారిని చూస్తూ! "ఏమండీ! అత్తగారి దుద్దులు ధరకట్టించొద్దు. తిరుపతి హుండీలో వేసేద్దాం" అన్నాను వణుకుతన్న కంఠంతో. ఆ సమయంలో అంతకన్నా అధికంగా మాట్లాడ్డానిక్కూడా గొంతు పెగల్లేదు. నా మూర్ఖత్వపు ఆలోచనకు క్షమించమని స్వామిని వేడుకుంటూ దుద్దులతో సహా వడ్డీగా ఐదురూపాయలు వేస్తామని మనసారా మొక్కుకున్నాను.

మరోపావుగంటకల్లా మగతనుంచి తేరుకున్నట్లుగా అయింది మాఅత్తగారి పరిస్థితి. అప్పుడు చెప్పారు! నల్లగా, పొడవుగా, లావుగా వున్నాడని, నామాలు పెట్టుకొని శరీరం అంతా వింతకాంతితో మెరుస్తున్నాడని. వద్దంటున్నా వినకుండా చెవుల దుద్దులు పట్టుకు కిటికీలోంచి పారిపోతున్నాడని, పట్టుకుందామంటే చేతులూ, కాళ్లు పనిచెయ్యలేదంటూ ఆమెకు కలవచ్చిందని చెప్పింది. నాకుమాత్రం ఆ సంఘటన యథార్థంగా జరిగిందన్న భావనే కలిగింది. ఇప్పటికీ ఆవిషయం తల్చుకుంటే అనిర్వచనీయమైన భయం, భక్తి, పారవశ్యానుభూతులకు లోనవుతుంటాను.

చూశారా! ఆపదమొక్కులవాడి మహిమలు అంతేకాదు ఆయన మహిమలు అనంతాలు. అనిర్వచనీయాలు. ఆపదల్లో ఏడుకొండలవాడా! అని ఎలుగెత్తి పిలిస్తే 'ఓ' యని పలుకుతూ అభయమిచ్చి ఆదుకుంటాడు. అయితే ఆపదమొక్కుల్ని అలక్ష్యం చేసినా, అపహాస్యం చేసినా దండించి మరీ వడ్డీతో వసూలు చేస్తాడన్నది నిజం. అందుకే వడ్డికాసుల వాడయ్యాడు.

ఆదేవునికి కావలసింది సంకుచితంలేని, సందేహంలేని పరిపూర్ణమైన భక్తిభావం. మనసారా నమ్మినమస్కరించినా ఆనందంగా అందుకుంటాడు. కొబ్బరికాయ అయినా కొండంత సంపద అయినా అతడి దృష్టిలో సమానమే.

## దయామయుడు

*శ్రీమద్దాల వెంకటసుబ్రహ్మణ్యం.*

లీలామానుష విగ్రహస్వరూపుడు అఘటన ఘటనా సమర్థుడు అయిన తిరుమలేశుని కరుణా సముద్రంలో మునిగి తరించనివారు చాలా అరుదు.

ఎందరికో ఇలువేల్పు, మరెందరికో నమ్మిన బంటు అయిన శ్రీ స్వామివారు, మాకుటుంబంలో చేసిన లీలలు తెలియజేస్తే, ఆశ్చర్యం కలుగుతుంది. వీటిద్వారా నాస్తికులు ఆస్తికులుగా మారినా, మారకపోయినా, నాకుమాత్రం ఆదివ్యమంగళ స్వరూపుడు ముందు ముందుకూడా నా కార్యక్రమాలలో ఆదుకుంటాడని నమ్మి ఈ సంఘటనలు మీ ముందు ఉంచుతున్నాను.

ఒకసారి మానాన్నగారికి మానసిక ఆందోళన కలిగింది. అలాంటి ఉన్మాద పరిస్థితిలో ఆయన ఎవరికీ లొంగక పోగా ఒకసారి నిండైన బావిలోకి కూడా దూకారు. కాని తిరుమల కొండలపై వేంచేసియున్న ఆ తిరుమలేశుని కరుణవల్ల రక్షింపబడ్డారు. ఆదేస్థితిలో వైద్యం చేయించాము కాని ఏవిధంగాను ఫలించలేదు. తిరుమలేశుని దర్శనంచేస్తే ఈ పరిస్థితి చక్కబడుతుందేమోనని భావించి కొండకు వెళ్దామని మానాన్నగారిని అడిగాను. ప్రతిమాటకు అడ్డంచెప్పేఆయన తిరుపతి ఏడుకొండలవాని దర్శనానికి వెళ్లడానికి మాత్రం ఏవిధమైన అడ్డంకులు చెప్పకుండా ఒప్పుకున్నారు.

నేను, మానాన్న రాత్రి 7గంటల ప్రాంతంలో తిరుమలేశుని దర్శనం చేసుకున్నాం. తిరుమల శ్రీనివాసుని దర్శనం అత్యంత శోభావహంగా,

ఆనందంగా జరిగింది. తిరుగు ప్రయాణంలో మానాన్న నడిచి తప్ప, బస్సులో క్రిందకు రానన్నారు. చేసేది లేక ఆయనవెంట నేనూ, క్రిందకు దిగటం ప్రారంభించాను ఎంతో మానసిక ఉద్రేకంతో వున్న మానాన్నగారికి కొండదిగేటప్పటికి ఆ ఉద్రేకం తొలగటమేకాక, పూర్ణమైన ఆరోగ్యంతో అలసట తీర్చుకుంటూ కనపడ్డారు. పూర్వపు అర్థంలేని మాటల స్థానంలో ఆయన స్పష్టమైన సంభాషణ మొదలుపెట్టి, తనపరిస్థితి చక్కబడినట్లు ఆయన చెప్పి నన్ను ఆశ్చర్యపరిచారు.

ఇలాంటి సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో... నేను వ్యక్తిగతంగా ఆకళ్యాణ గుణధాముని కరుణకు ఎలా పాత్రుడనైనానో ఈ క్రింది సంఘటన తెలియజెరుస్తుంది.

నేను ఒకసారి డైరక్టరు ఆఫ్స్కూలు ఎడ్యుకేషన్ అనుమతితో రీజనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీషు బెంగుళూరుకు నాలుగునెలల ఇంగ్లీషు బోధనారీతుల అధ్యయన కేంద్రానికి వెళ్లాను. దురదృష్టవశాత్తు నాయాజమాన్యమువారు, వారి అనుమతి పొందలేదనే సాకుతో నాజీతం ఆపి నన్ను సంజాయిషీ అడిగి ఇబ్బందులలో ముంచారు. కుటుంబం ఒకచోట, నేను బెంగుళూరులో జీతంలేకుండా ఎలా గడపాలి? ఎన్ని సంజాయిషీలు ఇచ్చినా నెలలు గడిచినా నాకు జీతం రాలేదు సరిగదా, పరిస్థితి జటిలమయింది. గజేంద్రుని వలె నేను ఆతిరుమలేశునిపై భారం మోపి ఆయన దర్శనానికి బయలుదేరాను. అప్పటికి 3 నెలలు గడిచాయి. నాకు తిరిగి నాకార్యక్రమ నిర్వహణకు మేనేజిమెంటువారి అనుమతి వస్తుందా! రాదా! అనే పరిస్థితి కూడా ఏర్పడింది.

అయితే విచిత్రమేమంటే నేను ఆ సప్తగిరి వాసుని దర్శనం చేసుకుని బెంగుళూరు చేరేటప్పటికి నాకు ఎంతో ఆశ్చర్యకరమైన విషయం స్పష్టం అయింది. అదేమంటే యాజమాన్యం వారు నాకు రావలసిన జీతం ఇచ్చుటకు నిర్ణయించటమే కాక, నాకు శిక్షణపూర్తి అయినపిమ్మట పూర్వపుస్థలంలో నేను నాబాధ్యతలు నిర్వహింపవచ్చని అనుమతిపత్రాన్ని కూడా ఇచ్చారు.

ఇంతకీ విషయం ఏమంటే నమ్మినవారికి ఆ మహానుభావుని కరుణతప్పక లభించి తీరుతుంది. అయన దర్శనం చేసుకున్నవారికి బాధలు, ఏవైనా ఎలాంటివైనా సరే అవెంతకు అవే తొలగుతాయి. ఇలాంటి సంఘటనలు ఎన్నో ఎన్నెన్నో!

## నక్షత్రమాల

*శ్రీయామిజాల పద్మనాభస్వామి, మద్రాసు.*

1937 జనవరి-నా జీవితంలో మరువలేని నెల అది. విజయనగర మహారాజా సంస్కృత కళాశాలలో విద్యార్థిగా ఉంటున్న రోజులవి సెలవుల్లో కళాశాల విద్యార్థులు పదునైదురోజులు ఎక్కడికైనా వెళ్లి రావడానికి తక్కువరేటు రైలు టికెట్టు మీద ప్రయాణం చెయ్యవచ్చు. ఆపద్ధతిన నేను విజయనగరం నుంచి మద్రాసుకు టికెట్టుతీసుకొని బయల్దేరాను. నాతో మా చిన్నక్క మరిది దారాముక్కల చిన్నయజ్ఞేశ్వర శర్మ (చిన్న అని పిల్చేవారు సాలూరు ప్రాంతం అంతా) వచ్చాడు. నాకు చిన్నప్పుడు మా తల్లిదండ్రులు చేసిన మ్రొక్కుబడి తీర్చుకోవాలని గూడూరు వద్ద దిగి తిరుపతి వెళ్లాము. అప్పుడు కొండమీదికి నడిచిగానీ, డోలీలమీదగాని వెళ్లాలి. బస్సులు లేవు. మేము నడిచి వెళ్లాము.

చుక్కల పర్వతం వద్దకు వెళ్ళేసరికి నాకు చుక్కలు కనిపించాయి. గాలిగోపురం వద్ద కూర్చుని వేంకటేశ్వరస్వామిని హేళనచేస్తూ ఒక పద్యంచెప్పాను. (అప్పుడు ఆశువుగా చెప్పేవాణ్ణి. శతావధాన్లుగారి తరిఫీదు ప్రభావం అది!) ఎవరు చెప్పిన పద్యమది బావా! అని మా చిన్న బావ అడిగాడు. ఎవడో చెప్పినది చదవడం నా ప్రారబ్ధమా? చెళ్ళపిళ్ళవారి శిష్యుడవు, నీకు తెలియదా? అని ధీమాగ అన్నాను. ఏవైనా చెప్పుదువుగాని, వేంకటేశ్వరుడి మీద అలాటి హేళన పద్యాలు చెప్పితే చెంపవాయ గొడతాడు? సుమా! అన్నాడు మాబావ. అదేదో చూస్తాను అని మరొక పద్యం చెప్పాను. నీకేదో పట్టింది. అని ముందడుగువేశాడు. నేనూ లేచాను. ఈడుపు కాళ్ళతో ఏడుపు మొగంతో పైకి వెళ్ళాను. స్వామిదర్శనం చేసుకొని తిరుగుముఖం పట్టాము.

మాకన్నముందు బయల్దేరిన దోలీవాని కన్నా వడివడిగా అడుగులు వేస్తూ, నేను ముందుదిగాను, అరగంట ఆలస్యంగా వచ్చాడు మాబావ. నిజంగానే పెనుగాలి త్రోసి వేసినట్టు ఏదో ఆవేశముతోవచ్చాను. నాస్థితి మాబావ కనిపెట్టుతూనే వున్నాడు.

తిరుపతిలో మేము బసచేసిన ఇంటి యజమాని 'రండి కులాసగ వెళ్లివచ్చారా!,' అని అడిగాడు. వచ్చామన్నాను నేను. నామాట ఆయనకి తెలియలేదు. మళ్లీఅడిగాడు జవాబుచెప్పాను. ఆయన మాబావతో అన్నాడు. 'ఈయన నోరు ఆడిస్తాడుగాని ఆమాట ఏదో పైకి రాలేదేమిటయ్యా' అని. నేను ఆయన మాట వింటూనే వున్నాను. జవాబు చెప్తూనే వున్నాను. కాని ఆయనకు విన్పించదది.

ఒక గడియ అయేసరకి నాబుగ్గలు పెదవులూ పొంగిపోయాయి (వాపువచ్చాయి). ఏదో బాధ! ఆయనా మాబావ కలిసి నన్నొక వైద్యుడి వద్దకు తీసుకువెళ్లి పరీక్షచేయించారు. ఆయన నోరుతెరచి బాటరీలైటు వేసిచూచాడు. ఏమీలేదు! లోపల అంతా బాగానే ఉంది. అని అన్నాడు.

ముగ్గురం ఇంటికి వచ్చాము. మాబావ చెప్పాడు. వీడు స్వామివారిని హేళనచేస్తూ పద్యాలు చెప్పాడు. స్వామివారు కొట్టారు దెబ్బ ! అని. అలాగా? అని ఇంటి యజమాని కాగితం కలం ఇచ్చి ప్రార్థిస్తూ పద్యాలు వ్రాయండి! అన్నాడు

వెంటనే 'నక్షత్రమాల' పేరుతో ఇరవై ఏడు పద్యాలు వ్రాశాను. ఇరవై ఆరోపద్యం వ్రాసేసరికి నోటివాపూ, బాధా పూర్తిగా పోయాయి. నామాట ఎదుటి వారికి వినిపించింది. ఆపద్యం ఇది.

"ఏమి తలంచితో పెదవులేమియు నాడవు దౌడసాగ దిం
కేమి గతిన్ నుతించు నను నీతడు తిట్టెడి వాడెయంచు,. ఓ
స్వామి! భయంబు లేదరయ, జంకదుగా కల మూరు భావముల్
వేమరు, దాచ సన్నికలు, పెండిలి యాగునె వేంకటేశ్వరా"!

# ఇష్ట దైవం

*శ్రీమతి పి.సరోజిని వర్మ.*

శ్రీవేంకటేశ్వర స్వామి పిలిచిన పలికేదేవుడు. వరాల నిచ్చే వడ్డీకాసులవాడు. ఆపదలయందు ఆదుకొనే ఆపద్బాంధవుడు. కన్ను తెరచినా, మూసినా ప్రత్యక్షమయ్యే ఆ శ్రీనివాసుని ఇంకా ఇంకా తనివితీరా చూడాలని ఆతురత కలుగుతుంది.

ఆస్వామిని గూర్చి మా అనుభవాల్లో ఒక సంఘటన గూర్చి, వ్రాయాలని నా కొక కోరిక కలిగినది.

మా వూరులో అమితమైన దొంగలబాధ. మేము ప్రతి సంవత్సరము వేసవి సెలవుల్లో మాస్వగ్రామమునకు వెళ్లెడి వారము. అదేవిధముగ ఈ సంవత్సరము గూడ వేసవి సెలవుల్లో, కొన్ని వేల రూపాయల ఖరీదు చేసే సామాగ్రిని వదలి మా స్వగ్రామమునకు ఆస్వామిమీద నమ్మకముతో వెళ్లినాము. వెళ్ళిన ఒక నెలరోజులకు "మీ ఇంట్లో దొంగలుపడ్డారు. వెంటనే రండి" అని టెలిగ్రాము వచ్చినది. దానిని చూచిన వెంటనే గుండె ఆగినంతపని అయింది. నోటమాట రాలేదు. అయ్యో! ఆస్వామినే నమ్మినాముగదా! ఆ స్వామి ఇంతపని చేస్తాడా? ఆయన ప్రతినిత్యము కొన్నివేలమంది భక్తులను దేశములోని నలుమూలలనుంచి, వారిని అనుగ్రహించి రప్పించుకుంటున్నాడు. స్టేషనులోను సత్రములలోను, హోటళ్ళల్లోను, రోడ్లమీదను, జనము క్రిక్కిరిసి ఆయన దర్శనమునకు తండోపతండాలుగా వస్తున్నారు గదా! "నీవే గనుక నిజమైన భక్త సంరక్షకుడవయితే మా వస్తువులు మాకు దక్కాలి అలా జరిగినట్లయితేనే నీదర్శనమునకు వెంటనే వస్తా"మని మొక్కుకొని బస్సు ఎక్కాము. దిగులు విచారముతో వస్తూవుండగా మార్గమధ్యములోనే మాకు పరిచయమైన ఒక వ్యక్తి కనబడి "భయపడకండి మీ వస్తువులు ఏమీపోలేదు' అని చెప్పారు.

నిజముగా మా ఆనందానికి అవధులు లేవు. మాసంతోషానికి ఆనకట్టలు కట్టలేకపోయాము. ఆ శ్రీనివాసుని మహిమ ఎంత గొప్పదో చెప్పడానికిగాని, వ్రాయడానికిగాని మాటలు చాలవు. భాషకూడా చాలదేమో అనిపించింది.

మేము మావూరు చేరి ఇంటితాళాలు తెరచి చూచేటప్పటికి, నిన్నటిరాత్రి వంటగదికిటికి పగులగొట్టి, లోనికి ప్రవేశించి ముఖ్యమైనగది తాళాలు బద్దలు కొట్టుచుండగా మాపక్కింటివారు మేల్కొని "దొంగ, దొంగ" అని కేకలు వేయుసరికి, ఆదొంగ ఆయుధములను గూడ వదలి పారిపోయినట్లు తెలిసినది. ఆ ఇంట్లో దొంగ అడుగుజాడలు స్పష్టముగ కనబడుచున్నవి. చూడండి! కొన్నివేలరూపాయల ఖరీదుచేసే వస్తుసామాగ్రిని రెప్పపాటుకాలములో దక్కించిన ఆదేవుని మహిమ ఎంతని పొగడగలము.

మేము పరమానందముతో మరునటి రోజుననే తిరుపతికి బయలుదేరినాము, భక్తజనవత్సలుడైన ఏడుకొండలవానిని కన్నులారా దర్శించుకొని తిరిగివచ్చినాము. ఇంటిదగ్గర "శనివారము" నాడు పండుగచేసి బంధుమిత్రులతో కూడా భోజన ప్రసాదములు ఆనందముగా ఆరగించితిమి. నిజముగా మా ఇష్టదైవం ఆయనే! ఆయనే!! ఆయనే!!!.

## భక్తవత్సలుడు

*శ్రీమతి నళిని జగదీష్*

ఈ సంఘటన జరిగి దాదాపు ఇరువది అయిదు సంవత్సరాలయినా, నిన్న మొన్న జరిగినట్లు ఉంది.

మారెండోవాడికి ఒకసారి వాంతులు విరేచనాలు, జ్వరం. వారం రోజులయింది. డాక్టరు రకరకాల మందులేస్తున్నారు. కాని ప్రయోజనం లేకపోయింది. అపుడు మావారి స్నేహితుడు బాబును చూడటానికి వచ్చారు. ఆయనకు ఏడుకొండలవానిపై భక్తివిశ్వాసాలు ఎక్కువ. బాబును చూడగానే కళ్లుమూసుకొని "ఏడుకొండలవాడా వేంకటేశ్వరా! బాబుకు

తగ్గితే, నీకొండకు వచ్చి తలనీలాలిస్తానని" దణ్ణం పెడుతూ, గట్టిగానే అన్నారు.

"ఎందుకు అన్నగారూ, వారికి నమ్మకం లేనప్పుడు ఇలా చేశారు ఏదేవునికి మొక్కినా, జరిగేది జరుగక మానదనే ఆయన సిద్ధాంతం. మీకూ తెలుసుకదా! అలా ఎందుకు మొక్కారు". అన్నాను నేను.

" ఆ వడ్డికాసులవాడే దృష్టాంతం చూపించి తీసికెళ్తాడమ్మా" అన్నారాయన.

విచిత్రంగా మరురోజుకే అన్నీ తగ్గుముఖం పట్టాయి. తిరుమల శ్రీనివాసుని దయవలన బాబు తేరుకున్నాడు.

కాని మొక్కెలా? అని మనస్సులో ఆందోళన. ఉన్నట్టుండి కార్తీకమాసంలో "టికెట్టు తెచ్చాను. అందరూ బయల్దేరండిరా!" అన్నారు అన్నగారు మా వారితో. "ఎందుకురా అనవసరం ఖర్చు. వాడికి తగ్గాల్సి తగ్గింది అంతే" అన్నారు మావారు.

"ఊరుకోవోయ్! నేను మొక్కుకున్నాను. నేనే తీరుస్తాను. ఈ ఒక్కసారీ కాదనకు" అన్నారాయన. అందరం బయల్దేరాం. తిరుపతిలో దిగాం. బెడ్డింగ్, పెద్దజిప్‌బ్యాగ్‌లో నగలు, దైవసన్నిధానం కాబట్టి పట్టుచీరలు, చలికి శాలువలు, ఉన్నికోట్లు, డబ్బు అన్నీ తీసికెళ్ళాం. కొండపైకి బస్సులో వెళ్ళాం. కాటేజీలో అందరం స్నానాలుచేసి టిఫిన్లు అయినాక సాయంత్రం ధర్మదర్శనం చేసుకున్నాం. చలికాలం కదా. ఎక్కువజనం లేరు అప్పుడు. మరురోజు తలనీలాలు ఇచ్చి వచ్చాం. హుండీలో డబ్బువేసి, వేంకటేశ్వరస్వామి దర్శనం చేసికొని వస్తుంటే, మావారిని, ఆయన స్నేహితుణ్ణి హుండీలోని డబ్బు లెక్కపెట్టేటప్పుడు సాక్షులుగా కూడా పిల్చారు. మేం కటకటాలవతల వున్నాం. అందరం కలిసి వస్తుంటే ఇదంతా కలా! అనిపించింది. దీనితో కొంచం మనసుమారింది మావారికి.

ఆమరురోజు మధ్యాహ్నం 3 గంటలకు బస్సుకు తిరుగు ప్రయాణమయ్యాము. టిక్కెట్లు తీసుకొని బస్సుఎక్కాం. మావారు జిప్‌బాగ్ పెట్టి ఇప్పుడేవస్తాను చూస్తుండమన్నారు. జనం ఒక్కసారి ఎక్కటంలో

సంచిగమనించలేదు. బాబు ఒక్కటే ఏడుపు. ఇంతలో అందరూ ఎక్కారు. బస్సు బయల్దేరింది. కొండ సగందిగింది కూడాను. 'బ్యాగ్ అక్కడుందా' అన్నారు మావారు. టికెట్లు, డబ్బుతోసహా అన్నీ అందులోనే వున్నాయి. 'ఏబాగ్' అన్నాను గాబరాగా -

మలుపులు తిరిగేటప్పుడు ప్రక్కలకు జరిగివుంటుంది గాబరా పడకండి- అన్నారు కొందరు ప్రయాణికులు. కొండ క్రిందకు వచ్చేశాం. బాగ్‌లేదు. బస్సులో అందరిదగ్గర చూశాం. ఎంత వెదికినా బాగ్ దొరకలేదు.

మావారు "వద్దంటే విన్నారా? దేవుడన్నారు. మొక్కులన్నారు. ఆతిరుపతి దేవుడు తిరుక్షవరం చేశాడు తిరిపమెత్తుకోమన్నాడు. తలాకజోలె కట్టండి" అని నానా గందరగోళం చేశాడు.

పాపం ఆయన స్నేహితుడు "స్వామికి ఏదైన అపచారం జరిగిందేమో! లేక ఇదంతా పరీక్షా" ఏమైంది అర్థంగాక అవాక్కయి పోయాడు మానవుడు!. ఆయనేం చేస్తారు? పైకి తిరిగి వెళ్దామన్నా డబ్బుల్లేవు అన్నారుమావారు. అంతాచూస్తుండగానే బస్సులో పెట్టానుకదా! అక్కడెందుకుంటుంది? అన్నారు మావారు. ఆఖరి ప్రయత్నంగా మావారి స్నేహితుడు బస్టాండులోని హోటల్‌నుండి, కొండపైకి దేవస్థానం వారికి ఫోన్‌చేశారు. వెంటనే బస్‌స్టాండులో జిప్‌బాగ్ దొరికినట్టు సమాచారంఅందింది. దానిరంగు, దానిలో వున్న వస్తువులవివరాలు. చెప్తే పంపిస్తామన్నారు. మావారిని తీస్కెళ్ళి ఫోనులో చెప్పమన్నారు. అన్నింటివివరాలు చెప్పారు. టిక్కెట్ల నంబర్లు, వందలనోట్ల కట్టలు-2. 5రూ.నోట్ల కట్టలున్నాయి. వాటి సీరియల్ నంబర్లు కూడా చెప్పమన్నారట. అదృష్టంకొద్దీ ఆకాగితం జేబులోనే దొరికింది. అదికూడ చెప్పినాక బ్యాగ్ పంపుతామన్నారు ఫోనులో. బ్యాగ్‌రాలేదు. ఇంతలో రైలు వెళ్లిపోయిందన్నారు. ఆఖరి బస్సుకూడా వెళ్ళిపోయిందన్నారు. "ఇస్తామన్నారు కాని మనసొప్పద్దూ" అన్నారు మావారు.

"అలా అనకోయ్. నీవింకా ఆభక్తజన వత్సలుణ్ణి పూర్తిగా నమ్మలేదు. నీకు నమ్మకం కలిగించటానికే, ఆయన సత్యం నిరూపించటానికే

వస్తాడయ్యా! నీ సొమ్ము పూచిక పుల్లపోదు. కుబేరుడికిచ్చి పంపిస్తా" డన్నారాయన. 10-30 గం॥కు ఒకాయన బస్సులో వచ్చి మాబ్యాగ్ మాకు ఇచ్చారు. ఆబ్యాగ్ బస్టాండులో ఉందట. ఎవరోనామాలాయన తెచ్చి దేవస్థానం వారికిచ్చారట. ఇన్ని పట్టుబట్టలు బంగారం, డబ్బు ఒకరిని నమ్మిపంపించలేక, చీఫ్‌కాషియర్ చేతికిచ్చి పంపారట. స్పెషల్ బస్సులో. ఆయన చీఫ్‌కాషియర్ అని తెలిసి, మావారు ఒక వందివ్వబోయారు మా సంతోషంకోసం అంటూ. వద్దండీ ఇది మాదేవస్థాన కర్తవ్యం, మా కనీసధర్మంకూడాను, ఇలా ఎప్పుడు చెయ్యకండి అంటూ అని ఆయన వెళ్ళిపోయాడు. దానితో మావారు పూర్తిగా మారిపోయారు సుమండీ! అప్పటినుండి ప్రతిసంవత్సరం తిరుపతి వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటున్నాం. నిజంగా ఆయన మా ఇలువేల్పు!.

## శ్రీనివాసుని మహిమ

*కుమారి బి.సరళ*

శ్రీ వేంకటేశ్వరస్వామివారు నాకు ఇష్టదైవం. ఆదేవుని కోసం ఒక హుండీని పెట్టుకొని చిల్లర వున్నప్పుడు లేదా ఏదైనా ఆపదకలిగినప్పుడు లేదా ఏమైనా అపరాధం చేసినప్పుడు తోచినంత ఆ హుండీలో వేసుకొని హుండీనిండిన తర్వాత తిరుపతి వెళ్ళినప్పుడు దీనిని శ్రీవారి హుండీలో వేయడం అలవాటు.

అలాగే సంవత్సరం క్రితం ఓ ఆపిల్ పండు ఆకారంలో వుండే హుండీని కొనుక్కున్నాను. అది మార్చి నెలకి నిండిపోయింది. తిరుపతి వెళదాంకదా. అప్పుడు వేద్దాం అనుకున్నాను. మేనెల వరకు తిరుపతిరావడం కుదరలేదు. రోజూ హుండీని చూస్తూనే తిరుపతిని గుర్తు చేసుకునేదాన్ని. ఎందుకో ఓరోజు హుండీ కనిపించకపోయినా, దాని సంగతే గుర్తురాలేదు. మనసులో ఆందోళనగా వుంటోంది కాని కారణం అంతుపట్టలేదు. హుండీ సంగతే గుర్తురాలేదు. కనీసం అది కనపడలేదే అన్నధ్యాసకూడా నాలో కలుగలేదు. మూడవరోజు పక్కింటి పిల్లవాడు దేనికో వచ్చి,

ఎవరిదో హుండీని, కోతి రెండురోజుల క్రిందట గోడమీద పెట్టి వెళ్ళింది అని అంటుంటే విని వూరుకున్నాను, కానీ అప్పటికీ అది నాదే అని నాకు తట్టలేదు. కాస్సేపటికి అరదగ్గరికి వెళ్లగానే ఎవరో తట్టిగుర్తు చేసినట్లనిపించి హుండీకోసం చూశాను. కనపడలేదు. వెంటనే హుండీకోసం అడిగి పంపిస్తే, వాళ్ళు పాపం ఇది దేవుడి హుండీలాగ వుంది అని జాగ్రత్తగా తీసివుంచిన హుండీని, వెంటనే ఇచ్చి పంపారు. కోతి పండు అనుకొని తీసికెళ్ళింది. అది పండుకాదని తెలియగానే పారేయకుండా గోడమీద పెట్టివెళ్లింది. అందరికీ కనబడేలా ఒంటిరాయి గోడమీద ఆహుండే 12 గంటలు అలాగే వుందంటే అది శ్రీనివాసునిలీల కాక మరేమవుతుంది? ఏది దొరికినా పాడుచేసి పారేసే కోతి దాన్ని పగులగొట్టక క్రిందపడేయక అంతజాగ్రత్తగా పెట్టి వెళ్ళిందంటే అది స్వామిలీలేకదా. అందులో సుమారు 75రూ.ల చిల్లర వుంది. ఏ పిల్లలకోదొరికి వాళ్ళు జల్సాగా ఖర్చు పెట్టక పెద్దల కంటికే కనబడి, వాళ్ళుదాన్ని భద్రపరచి ఇచ్చిపంపారంటే నిజంగా ఆ ఏడుకొండలవాడే దాన్ని కాపాడి మళ్లీ నాకు చేర్చి తన మహిమను ఈవిధంగా చూపించాడు. వెంటనే హుండీని జాగ్రత్తచేసి అపరాధకానుక వేసి మరుసటి వారమే తిరుపతికి వెళ్ళి ఆ స్వామివారి హుండీలో వేసివచ్చినాము.

శ్రీ స్వామివారి లీలలు తెలిపే మరొక సంఘటన. ఇది జరిగి సుమారు నాలుగేండ్లు అయింది. నాకు వేంకటేశ్వరస్వామి ఇష్టదైవం. ఆయనకు తలనీలాలు అంటే చాలాప్రీతికదా. అని తిరుపతికి వెళ్ళినప్పుడల్లా మూడుకత్తెరలు ఇచ్చిరావడం నాకు అలవాటు. ఓసారి ఇలాగే మాపిన్నితో తిరుపతి వెళ్లడం జరిగింది. అలవాటు ప్రకారం నేను మూడుకత్తెరలిచ్చి స్నానంచేసి దేవుడి దర్శనంచేసుకొని వచ్చేశాను. మేము తిరుపతినుండి తిరిగి వస్తుంటే మాపిన్నిగారు అన్నారుకదా. "మన మధ్వ బ్రాహ్మణులలో ఆడవారు జుట్టుఇచ్చే పద్ధతి లేదు. ఆడవాళ్ళతలలో కత్తెరపెట్టడం మంచి శకునంకాదు. కాబట్టి ఈసారినుండి జుట్టుఇవ్వక, దానిబదులు మరేదైనా కానుక ఇచ్చుకో" అన్నారు. నా నమ్మకం నాది. కానీ ఎదురుచెప్పడం దేనికి? 'సరేలే పిన్నీ' అని చెప్పాను.

వెంటనే పదిరోజులకల్లా ఆవిడకి తల వెనుకవైపు చామంతిబిళ్ల పెట్టినట్టు అరచేతి వెడల్పున జుట్టు రాలిపోయి బట్టతల ఏర్పడింది. రోజూ తలదువ్వుతున్నా ఆవిడ గమనించలేదు. ఓరోజు మా చిన్నాన్న చూసి ఇదేమిటి నీకు ఇంత బట్టతల వచ్చేసింది. అనేసరికి ఆవిడమనోవేదన పడి ఎన్నెన్నో మందులు వాడింది. ఎందరో డాక్టర్లకి చూపించి ఏమేమో చేశారు. కాని ఏమి మార్పు రాలేదు.

చివరికి ఎందుకో ఓరోజు తాను అన్నమాటలు గుర్తొచ్చి, "ఓహో నేను తనని జుట్టు ఇవ్వవద్దన్నాను కాబట్టి నాకిలా జరిగిందేమో!" అనుకొని వెంటనే తన అపరాధం క్షమించమని స్వామికి ముడుపు కట్టి "నాకు జుట్టు మొలిస్తే నేను నీకు మూడు కత్తెరలిస్తా"నని మొక్కుకున్నదట.

మొక్కుకున్న మరుక్షణంనుంచి జుట్టు పెరగడం ఆరంభించి మళ్ళీ కొన్నిరోజులలోపే మామూలుగా జుట్టుపెరిగి జడలో కలిసి పోయింది.

వెంటనే వాళ్లు తిరుపతికి వెళ్ళి మొక్కుతీర్చుకొని వచ్చారు. ఆవిడ ఇది నాకు చెప్పి "నీవు తప్పక జుట్టు ఇస్తుండు. మానకు" అని చెప్పింది.

ఇలా చెప్పుకుంటూపోతుంటే ఆ దేవుడిలీలలు ఎన్నో వుంటాయి. ఎందరో భక్తులకు నిత్యజీవితంలో ఇలా ఎన్నో ప్రత్యక్ష సంఘటనలు జరిగి తద్వారా ఆ శ్రీనివాసుని మహిమలు నిత్యమూ వ్యక్తమవుతూనే వుంటాయి.

## కలియుగదైవం

*-- శ్రీమతి బి.ఎస్. లక్ష్మి*

అసంఖ్యాకములు, అనంతములు అయిన ఆ శ్రీనివాసుని లీలలలో మరొక్కటి.

మా పెళ్ళిప్పటికి మా ఆయనకింకా ఉద్యోగం లేదు. మా మామగారు బాగా వున్నవాళ్ళే. అందుకే మొదట మా వారికి ఉద్యోగం చేసే అభిప్రాయం లేదు. కాని మా మామగారికి కొడుకు ఉద్యోగం చెయ్యడం ఇష్టం.

ఆయన కోరిక కాదనలేక, పెరుగుతున్న సంసారం దృష్ట్యా మా వారు ఉద్యోగప్రయత్నాలు మొదలుపెట్టారు. కాని ఒక్క ప్రయత్నమూ కూడా ఫలించలేదు. "ఊరికి వెళ్లి ఆర్డర్స్ పంపించే ఏర్పాటు చేస్తాము" అని ఎందరో తెలిసినవాళ్ళు మాట ఇవ్వడం చివరికి ఎదురుచూచిన మాకు మామూలు నిరాశే మిగిలేది.

ఉద్యోగ వయఃపరిమితి మించిపోయేముందు ఒకే ఒక్క అవకాశము ఆఖరుసారిగా సర్వీస్ కమీషన్ పరీక్షరాశారు ఆయన. పరీక్ష బాగానే రాశానన్నారు. కాని వస్తుందో? రాదో? నిరాశ, ఓటములవల్ల అవిశ్వాసం ఆయనలో చోటుచేసుకుంది.

మా ఇంటిదేవుడు వేంకటరమణుడు కాడు. తిరుపతికి వెళ్ళి మొక్కులు తీర్చుకొనే అలవాటు, ఆచారం అప్పట్లో మా ఇంట లేవు. కాని అందుకు విరుద్ధంగా మా అత్తగారు "తన కొడుకు ఉద్యోగస్థుడైతే తిరుపతికి వచ్చి నీ హుండీలో 25 రూ.లు వేస్తా" నని శ్రీవేంకటాచలపతికి మొక్కుకుంది. "సత్ఫలితాలకు దైవానుగ్రహం అవసరము" అన్న విధంగా మానవ యత్నానికి దైవబలం తోడైంది. అప్పుడు వచ్చిందొక ఉత్తరం. "మీరు సర్వీస్ కమీషన్ పరీక్షలో నెగ్గారు. త్వరలో ఉద్యోగం వస్తుంది". ఎవరో అపరిచితవ్యక్తి వ్యక్తిగతంగా పరిచయమున్నవాడిలా రాసిన ఉత్తరం. వానకు బాగా తడిసిపోయిన ఆ కార్డులో స్పష్టంగా కనిపిస్తున్న పై అక్షరాలు. త్వరలోనే మా వారికి ఉద్యోగం రావటం, ఇద్దరమ్మాయిల తర్వాత అబ్బాయి పేరు ఆ శ్రీనివాసుడిదే పెట్టడం, అప్పుడు మా ఇంట జరిగిన శుభములు. అప్పటినుండి మా దేవుడు శ్రీ వేంకటరమణుడే. మేము దాదాపు ప్రతి సంవత్సరం తిరుపతికి వచ్చి ఆ స్వామిపట్ల మా భక్తిని, కృతజ్ఞతను యథాశక్తి ప్రకటించు కొంటుంటాము.

మొన్నటికి మొన్న మా మూడవ అమ్మాయికి బాగా జబ్బు చేసింది. చక్కగా ఆరోగ్యంగా తిరుగుతున్న ఆ అమ్మాయికి హఠాత్తుగా జబ్బుచేసి కాళ్లు చచ్చుబడి నడవలేని స్థితి వచ్చింది. మందు, ఆహారము ఏమీ ఇమడక అన్నీ బయటకు వచ్చేవి. అప్పుడు మేము ఆ అలిమేలుమంగాపతి

శరణు జొచ్చాము. "మా అమ్మాయికి బాగైతే సకుటుంబముగా నీ కొండకు వస్తాము. అమ్మాయి తలనీలాలు సమర్పిస్తాము" అని మొక్కుకున్నాము. ఆ తిరుమలేశుని అమృతమయమైన వీక్షణము మాపై ప్రసరించింది. మరుసటి క్షణం నుంచి అమ్మాయి ఆరోగ్యస్థితిలో మార్పువచ్చింది. నెలలోపల లేచి చక్కగా తిరుగ గల్గింది. అనుకున్న ప్రకారం ఆ ఏడుకొండలవాడి మొక్కు తీర్చాము.

ఆపద్బాంధవుడు, దయామయుడు, భక్తుల ప్రియాతి ప్రియమైన దేవుడు శ్రీ వేంకటేశ్వరస్వామి మహిమలను నిరూపించుటకు ఇంతకంటే ప్రత్యక్ష నిదర్శనలు ఇంకేమి కావాలి.

నిండు మనసుతో కొలిచేవారికి ఆ సప్తగిరీశుని అనుగ్రహం తప్పక వుంటుంది.

## ఆపద్బాంధవుడు

*-- కుమారి జి. శ్రీమతి, తిరుపతి*

అవి నాకు బి.ఏ. రెండవ సంవత్సరం పరీక్ష జరిగే రోజులు. నాకు బి.ఏ. లో చేరినది మొదలు అమీబియాసిస్, గుండెనొప్పి మున్నగు వ్యాధులతో తీవ్రంగా బాధపడేదాన్ని. తరచు కాలేజీ కూడా మానేసేదాన్ని. నా అనారోగ్యం మూలంగా డిగ్రీ పూర్తి చేయగలనా? అనిపించింది. కాని నాకుగల పట్టుదల చదువు మీదగల శ్రద్ధ వెనుకంజవేయనీయలేదు. అప్పటి సిలబస్ ప్రకారం మాకు రెండవ సంవత్సరంలో లాంగ్వేజస్, మూడవ సంవత్సరంలో గ్రూప్‌కు చెందిన పరీక్షలు జరుపబడేవి. తెలుగు మాతృభాష కనుక ఒకసారి చదివినా రాయగలననే ధైర్యముండేది. ఇంగ్లీషు మాతృభాష కానందు వల్ల దిగులంతా ఆ పరీక్షమీదే వుండేది. కష్టపడి చదివే వీలులేనిస్థితి నాది. పరీక్షలనే భయంతో నాలోని అనారోగ్యం తీవ్రమైపోయినందువల్ల కనీసం ఒక్కసారైనా చదివే ఓపిక లేకపోయింది. చిన్న క్లాసుల నుంచీ తరగతికంతా ప్రథమ ద్వితీయ స్థానాల్లో నిలిచే నాకు ఒక గండంగా ఈ పరీక్ష గోచరించింది. ఈ బి.ఏ. పరీక్ష ముంచేస్తుందేమో

అని మథనపడసాగాను. చదువే ధ్యేయమనే దృష్టిలో వున్న నాకు అపజయం కలిగితే ఇంతకన్న అవమానం ఇంకోటుందా అని దిగులుపడి పోయాను. అలా అని ఆ సంవత్సరం పరీక్ష మానేయడానికి మనసొప్పలేదు. మధ్యలో బ్రేక్ అన్నది వుండకూడదని నా సిద్ధాంతము.

అప్పుడు తిరుమల శ్రీనివాసుడు జ్ఞాపకం వచ్చాడు. " నీవే శరణు ఈ గండంనుంచి కాపాడ" మని ఏడుకొండలవాని మీద భారంవేసి నీరసంతోనే పరీక్షలు పూర్తయినవనిపించాను. క్లాసులో చెప్పింది లీలగా గుర్తుంచుకొని ఏదోరాశానని పించాను. కనీసం పరీక్షముందురోజైనా ఒకసారి చదువుకొనే వీలులేని అనారోగ్యం. ఫలితాలు వచ్చేంత వరకు గుండెలు అరచేతిలో పెట్టుకొని తిరిగాను.

ఆరోజు నేను క్లాసుకు కాస్త ఆలస్యంగా వచ్చాను. క్లాసులో చాలామంది అమ్మాయిల మొహాలు దిగాలుగా వుండటం గమనించి ఆ తర్వాత ఖాళీ పీరియడ్‌లో ఫలితాల ప్రభావముందని తెలుసుకున్నాను. అదిరే గుండెల్ని అదిమి పట్టుకొని ఆత్రంగా ఆఫీసురూం ముందుండే నోటీసుబోర్డు దగ్గరకు పరుగు తీశాను. నోటీసుబోర్డులో నా నెంబరు చూసుకొని తెగ మురిసిపోయాను. అమ్మయ్య ! సప్తగిరి వాసుడు నా మొరాలకించాడని అనుకున్నా. ఆ తర్వాత కొన్నిరోజులకు మార్కుల జాబితా అందింది. కళ్ళు ఆత్రంగా మార్కులవైపు పరిగెత్తాయి. ఇంగ్లీషులో పాస్ మార్కులు 105 కు గాను 111 వచ్చాయి. శ్రీనివాసుడు తన గుర్తుగా మూడునామాలిచ్చాడు కదాని ఇప్పటికీ గుర్తొచ్చినప్పుడు భక్తితో నవ్వు కుంటాను.

దైవం మీద భక్తి శ్రద్ధలు తక్కువైన నాకు ఈ సంఘటనతో ముఖ్యంగా తిరుమల వెంకన్నపై బాగా గురి కుదిరింది. ఆ తర్వాత స్వామివారి దయార్ద్ర వీక్షణాలవల్ల ఆరోగ్యం సైతం మెరుగు పడింది. డబుల్ పోష్టుగ్రాడ్యుయేట్ డిగ్రీలు డిప్లొమాలు సంపాదించినప్పటికీ అసలు సమస్య ఉద్యోగవిషయంలో అంకురించింది. నేను సామాన్య కుటుంబానికి చెందినదాన్ని. ఉద్యోగం అవసరమైనస్థితి. డబ్బు, పరపతి

దూరమైతే ఆఫీసుల్లో కాగితాలే కదలని రోజులివి. అవి రెండూ దూరమైన నాలాంటి వారికి డిగ్రీలు, ప్రతిభ వున్నా ఉద్యోగం ఇచ్చే వారెవరుంటారని వేదన చెందేదాన్ని. అప్పటికీ ఐదారు లెక్చరర్ల ఉద్యోగాలకు దూర, దగ్గర ప్రాంతాలకు వెళ్ళిరావడం ప్రతిచోట అభ్యర్థులు ముందుగానే ఎన్నుకోబడి ఇంటర్వ్యూలకు నామమాత్రం పిలుస్తున్నారని తెలుసుకోవడం జరిగింది. అప్పటికే నా తల్లిదండ్రులు నామీద తిరిగిరాని పెట్టుబడి పెట్టారు కదా ! ఇంకా ఎంతకని కష్టపెట్టగలమనే ఆలోచన బుర్రను తొలిచేసేది. తల్లిదండ్రులచేత డబ్బులు ఖర్చు పెట్టించకూడదిక ఏమైతే అయిందిలేనని ఏ ఒక్కదానికి దరఖాస్తు చెయ్యడం మానుకున్నాను. భగవంతుని మీద భారంవేసి నిర్లిప్తంగా కాలం గడిపాను.

సాక్షాత్తు ఏడుకొండలవాడే మళ్ళీ నన్ను ఆదుకొని ఆయన ఆస్థానంలో చిన్న ఉద్యోగం ఇచ్చాడు. ఈ కాలం పరపతి లేకుండా అర్హతకు తగిన ఉద్యోగం రాదుకదా. భగవత్ప్రసాదమని భావించి దానిలోనే కాలం గడిపేదాన్ని. మరికొంతకాలానికి తన ఆస్థానంలోనే ఇంకో ఉద్యోగానికి కూడా ఆహ్వానించాడు. ఒక మనిషి రెండు ఉద్యోగాలు చేయలేడు కదా! ఆయన నామీద కనపరచిన ఆదరానికి అనుగ్రహానికి మరోసారి నివాళులర్పించుకున్నాను.

## బాలాజీ లీలలు

*-- శ్రీ తేల్కర్ శంకర్‌రావు*

ఆ యేడే ఏడుకొండలరాయుని పేరిట విశ్వవిద్యాలయం నెలకొల్పారు. అప్పుడే యస్.యస్.యల్.సి. ఇంగ్లీషులో 49% మార్కులు రావాలని యూనివర్శిటీవారు నిర్ణయించారు. నేను 1957 మార్చి నెలలో యస్.యస్.యల్.సి. పరీక్షను అనంతపురం కేంద్రంలో వ్రాసి గృహోన్ముఖుడయ్యాను. పరీక్షా ఫలితాలు ప్రకటన తేదీ పత్రికలలో ప్రచురించేసరికి తిరుపతి వేంకటాచలపతిని మదిలోనే ఇలా వేడుకోసాగాను. "ఏడుకొండలవాడా ! ఈ ఏడైనా స్కూల్ ఫైనల్ పరీక్షలోమంచి మార్కులతో

(అంటే సర్వీస్ కమీషన్ మార్కులతో) ఉత్తీర్ణుడనైతే నీకొండకు వచ్చి తలనీలాలు సమర్పిస్తాను" అని. పరీక్షా ఫలితాలు ప్రకటించారు. పాసయ్యాను. కొన్నాళ్ళకు మార్కుల రిజిష్టరు వచ్చింది. మొత్తం మార్కులు ఎక్కువగా రావటమే కాకుండా అన్ని సబ్జక్టులలోను సర్వీస్ కమీషన్ మార్కులకు పైగానే వచ్చాయి. ఇక దేవుని దర్శనానికి వెళ్ళడమే తరువాయి.

యస్.యస్.యల్.సి. రిజిష్టరు తీసుకున్నలగాయతు తలనీలాలతోపాటు గడ్డము, మీసములు కూడా పెంచసాగాను. కొన్ని వారాలు గడిచాయి. గడ్డం ముఖం నిండుగా పెరిగింది. స్నేహితులు తెలిసినవారు గడ్డం పెంచడం చూచి వేళాకోళం చేయసాగారు. సిక్కులా వున్నావని కొందరంటే, జ్వరమా ! అని మరి కొందరు పరామర్శించారు. గడ్డంతోపాటు వేళాకోళం కూడా పెరుగసాగింది. మా ఇంట్లోమటుకు "మనకు తెలిసిన వారు తొందరలో తిరుపతికి వెళ్తున్నారు. వారితోపాటు నీవు కూడా వెళ్దువుగానీలే" అన్నారు. నేను అందాక తిరుపతి వెళ్ళలేదు. తెలిసివారు ఇంకా జాగేమోనని వెంటనే ఆయుష్కర్మశాలకు వెళ్లి క్రాప్‌కటింగ్ చేసుకున్నాను. క్రాప్ చేసుకున్న వారం రోజులకే మా బంధువులు యకాయకీన తిరుపతి ప్రయాణానికి సన్నద్ధ మయ్యారు. నేను తర్వాత వెళ్తానని చెప్పినా, మాతల్లిదండ్రులు తెలిసినవారితో వెళ్ళాలని తొందరచెయ్యడంతో వెళ్ళక తప్పింది కాదు.

తిరుపతి చేరాము. కేశఖండన మండపంలో పీటమీద కూర్చున్నాను. మంగలిస్వామి ఔదల (నడినెత్తి) మీద కత్తి పెట్టి గీక సాగాడు. ఎలా గీకసాగాడో అలా తలనొప్పి కొద్దిగా ఆరంభమై "ఇంతింతై వటుడింతై" అన్నట్లు స్వామి పుష్కరిణిలో మునిగి లేచే సరికి తలప్రయ్యలు కాజొచ్చింది. రాత్రికి జ్వరం తోడైంది. మామూలు జ్వరం కాదు. ఇన్‌ఫ్లుయంజా ప్రజలను పీడించే కాలమిది. ఆ రాత్రంతా కంటిమీద కునుకులేదు. స్వామి దర్శనం చేసుకున్నా జ్వరం తగ్గలేదు. రాత్రంతా శివరాత్రి అయింది. స్వామికేమి అపచారము చేశానోనని ఆలోచనలతో సతమత మవగా అప్పటికిగాని తెలిసిరాలేదు. తలనీలాలు సమర్పిస్తానన్న మొక్కుబడిని

సగంలోనే విరమించి, ఊళ్లోనే వెంట్రుకలు తియ్యడమేనని.

మరునాటి సుప్రభాతాన స్నానంచేసి వినూత్న కాంతులను వెదజల్లే వేంకటేశ్వరస్వామి దివ్యమంగళ విగ్రహం యెదుట నిలిచి "అపరాధమైంది, మన్నించుస్వామీ! దాసుని తప్పు దండంతో సరి" అన్నట్లు లెంపలు వాయించుకొని, వచ్చేయేటికి నీకు తలనీలాలు తప్పక అప్పగించగలనని మ్రొక్కుకున్నాను. అంతే సూర్యకాంతికి కరిగిన మంచుగడ్డలా జ్వరం మాయమయింది.

మరోసారి తిరుపతికి నేను, మా అమ్మగారు వెళ్ళాము. ఈ సారి ఎటువంటి మొక్కుబడిలేదు. కేశఖండన మండపంలో గుండు చేసుకొని తిరుకొలనులో స్నానమాడి స్వామిని సందర్శించడానికి వెళ్లివచ్చేసరికి జ్వరం ఆరంభమైంది. మొక్కుబడిలేదు కదా అని సమాధానపడ్డాము. కాని జ్వరం మాత్రం తగ్గలేదు. సరే ఇక్కడుండే బదులు దిగువ తిరుపతిలోని మా బావగారి చెల్లింటికి వెళ్దామని కిందికి దిగాము. వారి ఇల్లు చేరామో లేదో జ్వరం పటాపంచలయింది. మమ్మల్ని చూడగానే వారు మా చిన్నాయన చనిపోయినట్లు, నిన్ననే వారికావార్త అందినట్లు తెల్పారు. చూచారా ! బాలాజీ లీలలు. ఆయనలీల యేలీల అర్థంచేసు కోవాలో తెలియదు. అందుకే ఆయనకు ఆపద మొక్కులవాడనీ, ప్రత్యక్ష సత్యదైవమని వూరకే అనలేదు.

## నిలువుదోపిడి

*శ్రీమతి దేవులపల్లి శశిబాల*

మావారు రక్షణశాఖ (పోలీస్ డిపార్టుమెంటు)లో సబ్ ఇన్స్పెక్టరుగా సెలక్టయి, ట్రెనింగు తర్వాత ప్రప్రథమంగా రంగారెడ్డి జిల్లాలోని తాండూరు పోలీస్ స్టేషన్ యస్.ఐ.గా. నియమింపబడ్డారు. పనిలో క్రొత్త, మంచిపేరు తెచ్చుకోవాలని రాత్రి, పగలు డ్యూటీ చేయడంలో నిమగ్నులయ్యారు. తిండి, నిద్ర సమయానికి ఉండేవి కావు. ఎండలో ప్రక్కఊళ్లన్నీ తిరిగి అలసిపోయివచ్చి సగం కడుపుకు తిని నిద్రపోయేవారు. సరైన విశ్రాంతిలేక

ఆరోగ్యం దెబ్బతిన్నది. రోజూ కొద్దిగా టెంపరేచర్ వచ్చేది. ఆకలి నశించింది. అయినా లెక్కచెయ్యకుండా నెలరోజులు గడిపారు. దీపావళి పండుగ ఏదో అయిందనిపించాము. మరుసటిరోజు డ్యూటీకి వెళ్ళి, హై టెంపరేచర్‌తో తిరిగివచ్చారు. డాక్టరుగారికి కబురంపితే, వచ్చిచూచి, అలసట జ్వరమని మందు ఇచ్చి వెళ్ళారు. రెండుమూడురోజులు గడచినవి. ఆరోజు శనివారం, వారికి జ్వరం తగ్గి నార్మల్‌కు వచ్చిందని పథ్యం పెట్టాను. తలస్నానం చేసి, వేంకటేశ్వర సుప్రభాతం చదువుకొని, కొబ్బరికాయ కొట్టి, ప్రసాదం కూడా పెట్టాను. ఆరోజంతా ముచ్చట్లతో హాయిగా గడచింది. అర్ధరాత్రి వారి దగ్గువిని మెలకువ అయింది. చేతితో సైగచేస్తున్నారు. వాంతి అనుకుని బేసిన్ తీసికెళ్ళాను. దగ్గుతోపాటు, శ్లేష్మంతో దోసెడు రక్తం పడింది. కళ్ళు గిర్రున తిరిగాయి. నాకెటూ తోచలేదు. నీళ్ళలో గ్లూకోజ్ కలిపి ఇచ్చాను. పెద్దబ్బాయిని నిద్రలేపి తెలిసిన డాక్టరువద్దకు పంపాను. నవంబర్ నెల, అర్ధరాత్రి చలి ఎముకలు కొరుక్కుతింటుంది. ఎవరొస్తారో? రారో భయంతో గుండె అదురుతుంది. "ఏడుకొండలవాడా, వెంకటరమణా, నీవేదిక్కు తండ్రీ, వారికి ఎలాంటి ఆపద రానీయకు, జబ్బుతగ్గి ఆరోగ్యం చేకూరితే, నీకొండకొచ్చి నిలువుదోపిడి సమర్పించుకుంటాస్వామీ!" అని మొక్కుకుని రూపాయి ముడుపుకట్టాను.

డాక్టరువచ్చి ఇక్కడికి దగ్గర్లోనే అనంతగిరి శానిటోరియం ఉంది, అక్కడ అన్నిపరీక్షలు చేయిద్దామన్నారు. తెల్లవారి కారులో వారిని తీసుకొని 30 కి.మీ. దూరంలో వున్న అనంతగిరికి వెళ్ళాము. శానిటోరియం సూపరింటెండెంటు వారికి బాగా పరిచయమున్నవారే. శ్రద్ధగా పరీక్షలన్నీ జరిపించి క్షయవ్యాధి ప్రారంభంలో వుంది. 3,4 నెలలు ఇక్కడవుండి, ఛికిత్స చేయిస్తే తగ్గిపోతుంది- అన్నారు. క్షయవ్యాధి పేరు వినగానే, కంపించిపోయిననేను, ఆదైవ కృపవల్లనే ఈ శానిటోరియం వచ్చామేమో. ఆదైవమే నాకండగా ఉండగా భయమెందుకని మనసుకుదుట పరచుకున్నాను. పిల్లలను పుట్టింటికి పంపి, వారికి మందులివ్వడం, ఆహారం అందివ్వడంలో నిమగ్నమయి, దైవముపై కాపాడే భారం వదలి వేశాను.

మూడునెలల తర్వాత ఎక్సరే క్లియరుగా వచ్చింది. దేవుని దయవల్ల ఆరోగ్యం చేకూరింది. రెండునెలల ఆ ఆహ్లాదకరమైన వాతావరణంలో విశ్రాంతి తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి డ్యూటీలో జాయినయ్యారు. వారం రోజులు సెలవుతీసుకొని ఆనందంతో తిరుమలకు వెళ్లి శ్రీ వెంకటరమణునికి నిలువుదోపిడి (చెవిరింగులు, పుస్తెలగొలుసు, గాజులు, ఉంగరం) సమర్పించుకున్నాను. వేంకటేశుని దయవలన భయంకరమైన క్షయవ్యాధినుండి వారికి ముక్తి లభించింది. ఇది 1976లో జరిగిన సంగతి. ఇప్పుడు వారు సంపూర్ణారోగ్యంతో ఆనందంగా వున్నారు. పిలిచిన పలికే దేవుడు, ఆపదమొక్కులవాడైన ఆతిరుమలేశుని లీలలు వర్ణనాతీతం. నిలువుదోపిడి తీసుకొని నిండునూరేళ్ల ముత్తైదువ జీవితం ప్రసాదించిన నిర్మలాత్మునికి ఇవే నానమోవాకాలు.

## ఆశ్రితవత్సలుడు

*శ్రీ మిరియపల్లి సత్యం, శ్రీకాకుళం*

శ్రీ వేంకటేశ్వర స్వామి మాకుటుంబ సభ్యులందరికి ఇష్టదైవం. మా స్వస్థలమైన శ్రీకాకుళం నుండి అప్పుడప్పుడు తిరుమలకు వెళ్ళి ఆస్వామి దర్శనం చేసుకొని వస్తూవుంటాము.

ఏదైనా ఒక పనిమీద నేను హైదరాబాదు వెళ్ళినప్పుడల్లా తప్పనిసరిగా నేను అచటనుండి తిరుపతికి వెళ్ళి ఆస్వామిని సేవిస్తూ, ఆయన దర్శనం చేయడం అలవాటు.

ఇట్లుండగా ఒకసారి ఏమిజరిగిందంటే, ఒకనాడు హైదరాబాదు వెళ్ళి తిరుపతికి వెళ్ళకుండా మా శ్రీకాకుళమునకు రైల్వేటికెట్ కొని ఇంటికి ప్రయాణమగుటకు నిర్ణయించుకుంటిని. రాత్రి 10గంటలకు కదా ట్రయినుటైము, అంతవరకు ఒకసారి తిరిగి రావచ్చును. అనుకొని ఎం.ఎల్.ఏ.క్వార్టర్సుకు వెళ్ళితిని. అచట శ్రీకాకుళం నుండి వచ్చిన కొందరు స్నేహితులు కలిసిరి. అందరం సాయంత్రం లాన్సులో కూర్చొని కబుర్లు చెప్పుకొనుచుంటిమి. చీకటి పడినవెంటనే అందరం లేచిపోతిమి.

నేను కూడా టవునులోని నాబసకు బయలుదేరి సగము దూరమునకు వెళ్లేసరికి నాదగ్గర ఎల్లప్పుడూ వుండే జిప్పుబ్యాగు కనపడలేదు. దానిని లాన్సులో కూర్చున్నప్పుడు ప్రక్కనపెట్టి, వచ్చేటప్పుడు మరచిపోతిని. అది జ్ఞాపకమువచ్చిన వెంటనే గాబరాపడి మేము కూర్చున్న లాన్సుదగ్గరకు వెళ్లి అచట వెదకితిని గాని బ్యాగు అచట కనిపించలేదు. ఎవరికైన దొరికినదేమో అని అచటనున్నవారినందరిని అడిగితిని గాని ఎవరూ ఆ బ్యాగును చూడనేలేదని చెప్పిరి.

మా శ్రీకాకుళములోని స్నేహితులుకూడా అప్పటివరకూ క్వార్టర్సులోనే వున్నారు. వారిని అడిగితిని. వారుకూడాతీయలేదని చెప్పిరి. బ్యాగు మళ్లీ దొరికేటట్లు కనబడలేదు. ఆబ్యాగులో సుమారు ఏడువందలరూపాయలు, శ్రీకాకుళమునకు తీసుకొనిన రైల్వేటికెట్టు వున్నవి. సొమ్ము పోయినది. టికెట్‌పోయినది. ఇంటికి వెళ్ళడం ఎట్లా అని మిక్కిలి ఆందోళన కలిగినది.

ఇంతలో మా ఇలువేల్పు శ్రీవేంకటరమణస్వామి జ్ఞాపకమునకు వచ్చినాడు. హైదరాబాదు వచ్చినపుడు ప్రతిసారీ తిరుపతి వెళ్ళేనేను, ఈ సారి వెళ్లకుండా, తిరిగి వెళ్ళిపోతున్నందులకు స్వామివారికి ఆగ్రహము కలిగినదని గ్రహించితిని. "స్వామీ! నేను అపరాధము చేసితిని. తప్పకుండా తిరుపతికి వచ్చి తమదర్శనము చేసుకుంటాను. నాతప్పును మన్నించి నాబ్యాగునాకు వచ్చేటట్లు చేయండి" అని నిశ్చల మనస్సుతో ప్రార్థించితిని. స్వామి తప్పక కరుణించి నాబ్యాగునాకు ఇప్పిస్తారన్న దృఢనమ్మకంతో శాసన సభ్యులక్వార్టర్సు వరండాలో కూర్చొనివుంటిని. అచటనున్నమా స్నేహితులుకూడా నాతో కూర్చొని వున్నారు. కాని వారికి బ్యాగు దొరుకుతుందన్న నమ్మకం లేదు. "పోయిన బ్యాగు ఎట్లాదొరుకుతుంది? ఎవరుతెచ్చిఇస్తారు? ఇలాగ ఇచట ఎన్నాళ్ళు కూర్చుండి మాత్రం ఏమి లాభం? లేవండి పోదాము" అని అన్నారు. కాని నేను లేవలేదు. నాబ్యాగు మాత్రం నాకు వచ్చి తీరుతుంది. నామాట నమ్మండి. మీకు పనులుంటే మీరు వెళ్ళిపోవచ్చును. అని చెప్పాను. నా స్నేహితులలో ఒకాయన

నాస్తికుడు. అతనికి భగవంతునిమీద నమ్మకం లేదు. ప్రయత్నం చెయ్యకుండా నీ బ్యాగు ఎట్లావస్తుందయ్యా? పోలీసు వాళ్ళకైనా రిపోర్టు యిద్దాం లేవండి అని అతనునాతో వాదించాడు. అదేమి అవసరంలేదు. చూస్తూవుండండి. నాబ్యాగు నాకు వస్తుంది. నేను స్వామివారికి చిన్న అపరాధం చేశాను అందువలన అదిపోయింది. ఇప్పుడు ఆస్వామియే దానిని నాదగ్గరకు వచ్చేటట్లు చేస్తారు. కొంతసేపు ఓపిక పట్టండి. అని చెప్పాను.

సుమారు ఒక గంటతర్వాత ఇద్దరు కొత్త మనష్యులు వచ్చి మాప్రక్కన కూర్చొన్నారు. మా సంభాషణ అంతావిన్నారు. ఆబ్యాగులో ఏయేం వస్తువులున్నాయి అని అడిగినారు. అందులో ఏడువందలరూపాయలు, ఒక రైల్వేటికెట్, ఒక కలము వున్నవని చెప్పితిని.

తర్వాత వారిద్దరూ చెప్పినదేమంటే 'అయ్యా ఆబ్యాగు మా ఇద్దరికి దొరికింది. ఇంటికి పోయి బ్యాగు విప్పి చూచితిమి. అందులో మీరు చెప్పిన వన్నీ వున్నాయి. ఆ సొమ్ము ఏడువందలరూపాయలు సమానంగా పంచుకుందాం అని నిర్ణయించుకున్నాం. కాని ఆపని చెయ్యలేకపోయాం. మామనసులో ఒక విధమైన ఆందోళన కలిగింది. మా ఇద్దరిలోను అట్లా ఎందుకు కలిగిందో చెప్పలేము. బ్యాగుగల వ్యక్తికే తిరిగి ఆబ్యాగు ఇచ్చివేయటమే మంచిదని, మా మనస్సులో తోచినది. మీరు మాతోరండి. మాఇంట్లో దాచిన బ్యాగుమీకు ఇచ్చివేస్తాం అనిచెప్పిరి.

మేమంతా వాళ్ళ ఇంటికి వెళ్లాం. ఆ బ్యాగును మాకు అందజేశారు. అందులో రూపాయలన్నీ ఉన్నాయి. వెంటనే నా స్నేహితుడు ఒకాయన శ్రీకాకుళంటికెట్ క్యాన్సిల్‌చేసి, తిరుపతికి టికెట్ తీసితెచ్చిఇచ్చినాడు. ఇది అంతా ఆ శ్రీనివాసుని లీలావిశేషమే. ఆస్వామివారి మహిమావిశేషమునకు మా స్నేహితులంతా ఆశ్చర్యపడ్డారు. నేను వెంటనే తిరుపతికి ప్రయాణమై తలనీలాలు ఇచ్చి, తనివితీర స్వామివారిదర్శనం చేసికొని సుఖంగా ఇల్లు చేరుకున్నాను.

# తోడు

శ్రీ ఎ.వి.సుందరరావు

శ్రీవారి దర్శనం కోసం ప్రయాణం ఎప్పుడు చేసినా నడచిరాకుండా బస్‌మీద జరిగేది. మా ఆవిడ ఏదో విషయంలో పీకలమీదికి వస్తే " తండ్రీ ఈ గండం గడిచేటట్టు చెయ్యి. నడచి నీకొండ ఎక్కుతా" నన్నది. గండం గడచిపోయింది. ఆసమయం రానే వచ్చింది.

సరిగ్గా సాయంత్రం నాలుగున్నరకి దిగువ తిరుపతి చేరాం. దిగుతూనే అందరం కలిసి శ్రీవారికొండ దిశగా పయనం సాగించాం. నేనూ, మా ఆవిడా నడచి ఏడుకొండలూ ఎక్కడానికి. తతిమ్మా బంధువులందరూ బస్‌మీద వెళ్ళడానికి నిశ్చయం.

అప్పటికే మావాళ్ళంతా తెగవిసుక్కుంటున్నారు. "బాగా చీకటి పడిపోతుంది. తోడు ఎవరూ వుండరు. రాత్రిపూట ప్రయాణం మంచిదికాదు. ఏ అర్ధరాత్రో మీరు తిరుమలచేర్తారు. ఏ తెల్లవారు ఝామునో, ప్రయాణం పెట్టుకుంటే బాగుండే" దని.

ససేమిరా వీల్లేదని మొండికేసి మేం ఉభయులం కాలినడకన కొండ ఎక్కడానికే నిశ్చయించాం. అలిపిరిలో తొలిమెట్టువద్ద దేవునికి దీపం వెలిగించి 'గోవిందా' అంటూ ఉత్సాహంగా మెట్లు ఎక్కడం ప్రారంభించాం. పట్టున వందమెట్లు ఎక్కలేదు. మా ఉత్సాహం చల్లబడి పోయింది. ఇరువురికి ఆయాసం ఒగర్పు. టైము ఆరున్నరయింది. చుట్టూ జీమూతం లాంటి నల్లటికొండలు చీకటి. కాలిబాటమీద లైట్ల వెలుగుతప్పించి ఆకాశం, కొండలూ, అరణ్యం అంతా హద్దులు లేకుండా కలిసిపోయింది.

మా ఇద్దరం ఒకరికి ఒకరు తోడు తప్పించి మాకు వేరేతోడు లేదు. కొండమెట్లు ఎక్కుతున్న కొద్దీ శ్రమా, చీకటి. ఒకటితో ఒకటై పోటీ పడుతున్నాయి. కొండదిగే జనం క్రమేపి పల్చబడుతున్నారు. కొంతసేపటికి ఆ అస్కారంకూడా లేక పోయింది.

మొదటి పర్వతం దాటి చాలాదూరం వచ్చేశాం. టైము ఎనిమిది కావస్తోంది. ఆ అరణ్యంలో ఆ కొండలమధ్య నేనూ, మా ఆవిడా తప్పిస్తే మరెవరూ తోడు లేరు. ఆకాశం నిండా కారు మేఘాలు కమ్ముకుని చీకటి మరింతచిక్కనయింది. రివ్వున ఈదురుగాలి వీస్తోంది. అప్పుడనిపించింది. రాత్రికి తిరుపతిలోనే బసచేసి ఉదయాన్నే ఈనడక ప్రయాణం పెట్టుకుంటే బాగుండి పోయేదనుకున్నాం. "ఎన్నిమెట్లెక్కినా, కానరావేమయ్యా.." ఆపాటకర్థం అప్పుడే తెలిసింది. అసలు ఈ రాత్రికి గమ్యం చేరతామో, మధ్యలో దొంగలదోపిడికి గురికావడమో, ఏ జంతువువాత పడటమో జరగడం ఖాయమనిపించింది.

మా భయానికి తగ్గట్టు సన్నగా వానచినుకులు ప్రారంభమయ్యాయి. ఈదురుగాలి మరింత ఎక్కువయింది. దానికి తగ్గట్టు కాలిబాటలో లైట్లుకూడా ఆరిపోవడంతో మా ఆవిడ కెవ్వుమని కేకేసింది. ముందుదారి కనిపించడంలేదు. నింగీ నేలా, కొండలూ-అరణ్యాలు అంతా చీకటిరంగు పులుముకున్నాయి. చినుకులు జడివానగా మారింది. మా ఆవిడ భయంతో "మనం ఏం అపరాధం చేశామండీ మనకీ శిక్షేమిటి" అంటూంది.

ఇహ నాపరిస్థితి. "ప్రాణంబులా ఠావుల్ తప్పెను మూర్ఛవచ్చె, తనువున్ డస్సెన్.. శ్రమంబయ్యోడిన్ నీవే తప్ప ఇతఃపరంబెరుగ" అని చేతులెత్తి శ్రీనివాసునికి మ్రొక్కడం తప్పించి మరోదారి కనిపించలేదు. ఆవిడకూడా అదే ధోరణి. టక్ టక్.. మని శబ్దంమావేపు క్రమేపీ దగ్గరవుతోంది. భయంభయంగా గుడ్లప్పగించి ఆశబ్దం దిశగా చూస్తున్నాం. శబ్దం క్రమేపీ దగ్గరయింది. చీకటిలో లీలగా ఏదో మానవాకారం.. టెక్ టెక్ మని శబ్దం.

"ఎవరు బాబూ" స్త్రీకంఠం. పరికించి చూసాను. నడివయసు దాటిన - కూలీనాలీ చేసుకొనే ఆడది. నెత్తిమీద కర్రలమోపు.

"ఎవరదీ" గొంతును విడదీసి అడిగేను.

"కట్టెలమోపు బాబూ.. ఇయ్యాల ఆలీసం అయిపోనాది.. భయంనేదు.. పదండి బాబూ.. నేను తోడుంటాను. ఈకొండలు-కోనలూ.. అడవులూ అన్నీ మాకు కొట్టినపిండీ" అంది

కరెంటువచ్చింది కాబోలు.. లైట్లన్నీ ఒక్కసారి వెలిగాయి. దీపతోరణాలతో కొండలన్నీ అందాలు దిద్దుకున్నాయి. వాన తగ్గిపోయింది. ఏ కొండల మాటునుండో చంద్రుడు తొంగిచూసి పక్కున నవ్వాడు.

నాడు అన్నమయ్యను ఆదుకున్న ఆఅలిమేలుమంగమ్మేమో ఈ స్త్రీమూర్తి. మనసారా మొక్కాము. మిగతా పయనమంతా నల్లేరుమీద నడక.

స్వామి ఆసమయంలో తోడు వున్నరీతి జీవితంలో మరపురాని అనుభూతి!

## వర ప్రదాత

*శ్రీవై. వీరభద్రరావు, విశాఖపట్టణం.*

అవి నేను నిరుద్యోగిగా వుండలేక ఓ చిరుఉద్యోగిగా వున్న రోజులు. ఎం.కాం.పాస్. అయి మూడుసంవత్సరాలయింది. ఏదో పర్మనెంట్ ఉద్యోగం గురించి కాళ్ళరిగి పోయేలా తిరిగే రోజులు. చిరుద్యోగంలో వున్నా ఎన్నో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నరోజులు. రైల్వే సర్వీసు కమీషన్, స్టాఫ్ సెలక్షన్ కమీషన్, ఇంకా ఇతర సంస్థలు ఉద్యోగాల కొరకు నిర్వహించిన వ్రాత పరీక్షలలో సులభంగా పాసయ్యేవాడిని. తరువాత ఏదో ఒక వంకతో, వస్తుందన్న ఆశవున్న ఉద్యోగానికి కూడ ఏదోఒక ఎసరు వచ్చేది. నాపరిస్థితులు గమనిస్తున్న నా శ్రేయోభిలాషి అయిన మా పెదనాన్న గారి అబ్బాయి పరమేశ్వరరావు ఒకరోజు నాతో ఇలా అన్నాడు. "ఒరేయి ప్రతిరోజు ఉద్యోగానికి అప్లికేషన్ పెడుతున్నావు. వ్రాతపరీక్షలు కూడా పాస్అవుతున్నావు. ఆఖరుకు ఏదోఒక సాకుతో ఉద్యోగం రాకుండాపోతుంది. నీకు తిరుపతి వేంకటేశ్వరస్వామి దగ్గరకు వెళ్తాననే మొక్కుబడి ఏదయినా వుంటే ఒకసారి తిరుపతి వెళ్ళి వచ్చెయ్యకూడదా! కొంత కీడు పోతుందేమో" అని. అయితే ఆయనన్నదాంట్లో నిజం వున్నట్లు నాకనిపించింది. నేను ఇంటర్మీడియట్

చదువుతున్న రోజులనుంచే తిరుపతి వెళ్ళాలనుకున్నాను. అయితే అప్పటినుండి వెళ్ళడం జరగలేదు. అయితే తిరుపతి వెళ్ళాలని మొక్కుకున్నట్లు మా పెద్ద నాన్నగారబ్బాయితో ఎపుడూ చెప్పినట్లు గుర్తులేదు. ఒకవేళ ఆ స్వామే ఆయన చేత ఆ మాటలు పలికించాడేమో అనుకున్నాను.

ఆ తరువాత బ్యాంకు ప్రొబేషనరీ ఆఫీసరుకు వ్రాత పరీక్షకు బెజవాడ రమ్మని హాల్ టికెట్ వచ్చింది. పరీక్ష మే 24, 1980వ తేదీన, ఎలాగూ తిరుపతి వెళ్ళవలెననుకున్నాను కాబట్టి, బెజవాడ నుండి తిరుపతి వెళ్ళడానికి నిర్ణయించుకున్నాను. ఊరికి వెళ్ళడానికి డబ్బులకు కూడ అంత ఇబ్బంది పడలేదు. విజయవాడలో మే 24న పరీక్ష రాసి, సాయంత్రం బస్సులో బయలుదేరి 25వ తేదీ ఉదయానికి తిరుమల జేరుకొని స్వామి దర్శనం, భోజనం మొదలైన కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి 26 ఉదయానికి విజయవాడ వచ్చాను. ఒక గంట తేడాతో విశాఖ వెళ్ళే మెయిలు దొరికింది. నేను తిరుపతి వెళ్ళడం కొత్తయినా ప్రయాణంలో అంత శ్రమ అనిపించలేదు. అతి తక్కువ టైములో ప్రయాణం పూర్తి చేసుకొని విశాఖపట్టణం చేరాను.

విశాఖపట్టణం రాగానే జరిగిన ఆశ్చర్యకర విషయమేమంటే ఆంధ్ర యూనివర్సిటీ వారు పోస్టు ద్వారా పంపిన టెంపరరీ గుమస్తా ఉద్యోగానికి నియామక ఉత్తర్వు వచ్చి ఇంట్లో వుంది. విశేషమేమంటే అన్ని పరీక్షల లాగానే వ్రాత పరీక్ష అయిన వెంటనే ఈ ఉద్యోగం గురించి కూడ మరచిపోయాను. మెరిట్ మీద ఎంపిక చేసిన మొదట పదహారు మంది లిస్టులో నా పేరుండటం, స్వామివారి దయ వుండబట్టే గదా! మే 28, 1980న ఉద్యోగంలో టెంపరరీగా చేరాను. నవంబరు 17, 1981న ఉద్యోగం క్రమబద్ధం చేయబడింది. 1982 జూన్ 30 వరకు ఆంధ్రా యూనివర్సిటీలో పనిచేసి 1982 జూలై 1 నుండి హిందుస్థాన్ షిప్‌యార్డులో పనిచేస్తున్నాను.

నా ఈ అనుభవం ద్వారా చెప్పదలచుకున్నదేమంటే స్వామిమీద ఖచ్చితమైన నమ్మకముండి, ఆ నమ్మకంతోనే స్వామి దర్శనం చేసుకుంటే మన కోర్కెలు తప్పక ఫలిస్తాయి. స్వామి దర్శనమే సర్వశ్రేయస్సులను కలుగజేస్తుంది.

# దొరకునా ఇటువంటి సేవ

*శ్రీ కొండముది వేంకటేశ్వర్లు.*

నేను 1958వ సంవత్సరంలో గుంటూరులో ఉద్యోగరీత్యా వున్నాను. నా పెద్దకుమారునికి ఒక రోజున టైఫాయిడ్ జ్వరం తగిలినది. డాక్టరుగారు మందులు ఇచ్చుచున్నారు. కాని ఏమాత్రం తగ్గటం లేదు. ప్రొద్దునపూట 100 డిగ్రీలు సాయంకాలం 104 డిగ్రీలు వుంటుంది. భయంగా వున్నది. వైద్యలోపం లేదు. కాని పిల్లవాని ఆరోగ్యం నానాటికి క్షీణించుచున్నది. ఒకరోజు సాయంకాలం మా ఇంటి ప్రక్కవున్న ఒక ముత్తైదువ వచ్చి పిల్లవాని పరిస్థితిని చూచి "జ్వరం తగ్గితే శ్రీ స్వామివారి కొండకు వచ్చి గంధదీపం ఎత్తుతాము అని మొక్కు కొనండి" అని చెప్పి వెళ్ళిపోయినారు. ఎందుకైనా మంచిదే అని నేను స్నానం చేసుకొని దీపారాధన చేసి శ్రీస్వామివారికి ఆ తల్లి చెప్పినరీతిగా మొక్కుకొన్నాము. రేపు పొద్దున ముడుపు కట్టుకొంటాము అని దణ్ణము పెట్టుకొని ఆ రాత్రి గడపినాము. మర్నాడు పొద్దున్నే డాక్టరుగారు వచ్చి టెంపరేచరు చూడగా నార్మలుకువచ్చింది. డాక్టరు ఆశ్చర్యపడి ఏమిజరిగినది? అని అడుగగా జరిగిన విషయం చెప్పినాను. వారుకూడ సంతోషించినారు.

ఒక మంచిరోజున మొక్కుబడి తీర్చుకొందాం. అనుకొని నేను, పిల్లవాడు బయలుదేరి తిరుమలకు చేరినాము. చేరునప్పటికి రాత్రి 8గంటలు అయినది. దేవస్థానంలో గదులుఇచ్చే టైము అయిపోయి తాళములు వేసి గుమస్తాలు వెళ్లిపోయినారు. చేయునది లేక భగవంతుడే వున్నాడు అనుకొని శ్రీ స్వామివారి గుడికి వెళ్ళినాము. తెలిసినవారు కనుపించగా వారితో మాట్లాడు చుంటిని. మాటల సందర్భంలో ఎక్కడవుండాలో ఏమో, ఆ స్వామిదయ అని అనుకొన్నాము. ఇంతలో బయటనుంచి ఒక ఆచార్యస్వామివారు వచ్చి ఎప్పుడు వచ్చినారు? రండి అని నా క్షేమసమాచారములు విచారించినారు. ఇపుడే వచ్చినామండీ ఉండుటకు గదిదొరకలేదు. ఈ రాత్రికి ఎక్కవుండవలెనో అర్థం కాలేదు

అని చెప్పినాను. 'ఎందుకండి! నా వెంట రండి! నేను చూపిస్తాను'. అని రామానుజకూటమునకు (అనగా జియ్యంగారు వుండేమఠం) తీసుకొని వెళ్ళి 'యీ అరుగుమీద పడుకోండి. మిమ్మెవ్వరూ ఏమీ అనరు. ఒకవేళ అడిగితే కె.శ్రీనివాసాచార్యులుగారు వుండమన్నారు' అని చెప్పండి అన్నారు. వారువెళ్ళిపోయినారు. ఆరోజు రాత్రి అక్కడవుండి, ప్రాద్దున కాల్యకృత్యములు తీర్చుకొని, గంధదీపం ఎత్తుదాము, అనుకొని పిల్లవానిని గుళ్ళోకి తీసుకొని వెళ్లి ఆమొక్కుబడి తీర్చుకొని శ్రీ స్వామిదర్శనం చేసుకొని వచ్చేసరికి శ్రీ జియ్యంగారు మండపంలో కూర్చొని వుండినారు. నా పూర్వపుణ్యంవల్ల శ్రీ జియ్యంగారి దర్శనం అయింది. వందనం చేసికున్నాను. నాక్షేమములు విచారించినారు. వారికి నామీద అనుగ్రహం గల్గి "నేను 11గంటల.పూజకు వెళ్ళుతాను. నాతోరండి ఎక్కడికి వెళ్ళకండి' ' అని చెప్పి, నన్ను వెంటపెట్టుకొని శ్రీ స్వామివారి అర్చనకు తీసికొని వెళ్ళారు. నా ఆనందం చెప్పడానికి వీలులేదు. నాపుణ్యముగదా. అని సంతోషించినాను. ఒక గంటసేపు శ్రీ స్వామివారి పూజ నేత్రానందంగా అనుభవించినాను. గంధం, తీర్థం ఇప్పించినారు. శ్రీ స్వామివారి పూజాక్రమం అయిన వెంటనే శ్రీ భాష్యకారాచార్యుల దేవళమునకు తీసుకొనివెళ్లి అక్కడ సేవాక్రమము అయిపోయిన తర్వాతమాకు తీర్థము, దధ్యోదనము, ప్రసాదము ఇప్పించి మమ్ములను ఆశీర్వదించి వారి ఆశ్రమమునకు వెళ్లినారు.

నేను, నాకుమారుడు ప్రసాదంతీసుకొని దిగువతిరుపతికి వచ్చి, శ్రీ అలిమేలు మంగాపురం, శ్రీకాళహస్తిలోని స్వామిని దర్శనంచేసికొని క్షేమముగా ఇంటికి చేరినాము. ఆపదలలో ఆదుకొనే దైవం శ్రీవేంకటేశ్వరుడొక్కడే అందుకే "కలౌ వేంకటనాయకః" అన్న సూక్తి.

# సర్వరక్షకుడు

*శ్రీ గోపీనాథం నరసింగరావు.*

మా పూర్వీకుల నుండి శ్రీ వేంకటేశ్వరుడు మాకు ఇలవేల్పు. ఏ శుభకార్యానికయినా వాకిలికి తోరణం కట్టామంటే ముందుగా ఆఏడుకొండల వానికి ఎదురునడిచి ఆయనను పూజించనిదే ఏపనీ మొదలుపెట్టేవారముగాము. మా హయాము వచ్చిన తరువాత ఆయనసేవలు ఎక్కువగా చేయలేకపోయినా ప్రతి నిత్యం ధ్యానం చేసుకోవడము మాత్రం మరవలేదు.

ఇది ఇరవై సంవత్సరాల నాటి మాట. మాకు వివాహమయి ఏడెనిమిది సంవత్సరాలు దాటినా సంతానములేదు. ఎందుకో ఒకరోజున మాకు సంతానం ప్రసాదించమని స్వామికి మ్రొక్కుకుందా మనిపించింది. అనిపించిందే తడవుగా ఒక శనివారంనాడు ఒక్కపొద్దువుండి "స్వామీ మాకు సంతానం ప్రసాదించావంటే, మాకు కలిగినబిడ్డకు నీపేరు పెట్టుకొని, నీకొండకు వచ్చి దర్శనంచేసుకొని, ఆబిడ్డ పుట్టువెంట్రుకలు సమర్పిస్తాము' ' అని మొక్కుకున్నాము. అంతకుముందు ఎన్నిమందులు వాడినా వెలతప్పని మా ఆవిడ, మేము మొక్కుకున్న నాలుగైదు మాసములకే గర్భవతి అయ్యి ముత్యమువంటి ఆడపిల్లను ప్రసవించింది. మా సంతోషానికి మేరలేదు. పురిటినాడు మాపాపను స్వామివారిపాదముల ముందుంచి, "లక్ష్మీవెంకటరమణకుమారి" అని స్వామివారిపేరు పెట్టుకొని ఐదవసంవత్సరంలో అనుకొన్న ప్రకారం స్వామివారి మొక్కుబడి తీర్చుకున్నాము. శ్రీ స్వామివారి కృపాకటాక్షమువలన మాకుమార్తె దిన దిన ప్రవర్ధమానమై శుభంగా వున్నది. చూశారా స్వామివారి అనుగ్రహం. అడిగినవారికి అడిగన కోర్కెలు తీర్చి కొంగుబంగారమై మానవుల మనసులందు స్థిరపడ్డాడు.

మరియొక సంఘటన. సుమారు ఐదారు సంవత్సరాల క్రితం నాకుడిచేయి నరాలు బలహీనమై బొత్తిగా వ్రాయలేకపోయాను. చేసేది

స్కూలుమాష్టరు వుద్యోగం. వ్రాయలేకపోతే ఎలాగండి మరి? చాలాదిగులుపడిపోయాను. జీవితమే శూన్యం అనిపించింది. చాలామంది ప్రముఖ డాక్టర్లకు చూపించాను. నరాల బలహీనత అని ఏవేవో మందులు వ్రాసి ఇచ్చారు. అవి అన్ని వాడివాడి ప్రాణానికి విసుగు పుట్టింది. రెండు సంవత్సరాలు దాటినా గుణం మాత్రం కన్పించలేదు. ఇక డాక్టర్లవల్ల, మందులవల్ల వుపయోగం లేదనుకున్నాను. ఒకనాడు అదే వేదనతో ఆలోచిస్తూ కూర్చున్నాను.

"ఇన్ని మందులు వాడి యింతడబ్బు ఖర్చుపెట్టుకొని నానా అవస్థలు పాలయినాను గదా! అలాగాక నాచేతిని బాగుచేయమని సర్వరక్షకుడైన ఆ శ్రీనివాసునికి ఎందుకు మ్రొక్కుకోకూడదు?" అని నా అంతకు నేనే ప్రశ్నించుకున్నాను.

అంతే ఆమరుసటి శనివారమే ఒక్కప్రొద్దు వుండి స్వామివారిని మనసారా పూజచేసికొని, "స్వామీ! నాచేతిని బాగుచెయ్యి. నేను బాగా వ్రాయగలిగానంటే నీకొండకు వచ్చి నీదర్శనం చేసికొని తలనీలాలు సమర్పించి శక్త్యనుసారంగా కానుకలు సమర్పించుకుంటాను. అంతేగాదు నాచేతికి ఎల్లప్పుడు నీస్పర్శ తగిలేటట్లుగా నీరూపు కలిగిన వెండి ఉంగరం చేయించి పెట్టుకుంటాను." అని మొక్కుకున్నాను.

అనుకున్నదే తడవుగా మరుసటి వారానికల్లా వెండి ఉంగరం చేయించుకొని, స్వామివారి ముందుంచి ఉపవాసం వుండి మనసారా, కడుభక్తిగా పూజచేసికొని, "తండ్రీ! అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ. నానమ్మకాన్ని వమ్ముచేయకు" అని స్థిర విశ్వాసంతో ఆ ఉంగరాన్ని నాకుడిచేయి వుంగరపు వేలుకు ధరించుకున్నాను.

సుమారు సంవత్సరం తిరక్కముందే, ఏమందులూ మాకులూ లేకుండానేను క్రమేణా చక్కగా వ్రాయగలుగుతున్నాను. నా ఆనందానికి మేరలేదు. అనుకున్నట్లుగా ఏమాత్రం ఆలస్యం చేయకుండ స్వామివారిని దర్శించుకొని మొక్కుబడి తీర్చుకొన్నాను.

ఆ స్వామివారి మహిమకు ఇంతకంటే నిదర్శనం వేరే ఏముంది గనక?

ఓం వేంకటేశాయనమ:

# రథ సారథి

*శ్రీ శిష్టా వెంకటసుబ్బారావు, నెల్లూరు*

సుమారు 25సం॥ల క్రితం జరిగిన సంఘటన. మేము ఎనిమిది మందిమి-తిరుపతికి స్వామిదర్శనార్థమై బయలుదేరాం. నేను శ్రీమతి, మాపిల్లలు యిద్దరు, మాతమ్ముడు మేజర్ దక్షిణామూర్తి, మాబావ మల్లాది కృష్ణమూర్తిగారు, మాచెల్లెలు, వారికూతురు నా హిందుస్తాన్ కారులో నెల్లూరునుంచి తిరుపతికి బయలుదేరాము. నేను కారు నడుపుతున్నాను. దారిలోభగవన్నామ సంకీర్తన చేశామో లేదో గుర్తులేదు. కాని చాలా అనవసరపు కబుర్లతో, వినోదపు మాటలతో కాలక్షేపం చేస్తూ తిరుపతికి చేరాము.

పరమ పవిత్రమైన శ్రీవారి గిరిపై ప్రయాణము మొదలుపెట్టాము. అప్పుడుకూడా లోకాభిరామాయణమే సాగుతున్నది కారులో. ఆరోజుల్లో కొండపైకి వెళ్ళటానికి, దిగటానికి ఒకటే రోడ్డు వుండేది. (ఇప్పుడు క్రిందకు రావటానికి ఉపయోగిస్తున్నరోడ్డు). అనేక వంకరమార్గాలతో కూడి, వచ్చే పోయే వాహనాలతో చాలారద్దీగా ఉండేది.

సుమారు రెండుమైళ్ళు పైకి ప్రయాణం చేసిన తరువాత అసలు కథ ప్రారంభమైంది.

ఒక వంపు దగ్గరకు కారు వచ్చింది. సుమారు 20 గజముల దూరములో వున్నది. ఎడమవైపు ప్రథమంగా తిరుగవలసివున్నది. ముందరగా కారును రోడ్డుకు కుడివైపు తీసుకువచ్చి తిప్పుకోవాలి. నేను ఆ ప్రయత్నంలో స్టీరింగును కుడివైపుకు తిప్పాను. వళ్ళు ఝల్లుమన్నది. కారణము స్టీరింగు లూజుగా తిరిగింది. కారు చక్రాలు తిరగలేదు. అంటే స్టీరింగుకూ కారు చక్రాలకూ సంబంధం వూడిపోయింది.

అంతకు ముందు అనేకమార్లు కొండపైకి క్రిందికి కారు నడిపిన అనుభవము నాకువున్నది. అందుచేత క్షణంలో పరిస్థితి అర్థమైంది. వెన్నెముక పొడవునా జలదరించింది. భయము ఆవహించింది. ఊరికే

వాగుతున్నవాడిని అవాక్కయి పోయాను. పైన ఉన్న శ్రీ వేంకటేశ్వరుని సన్నిధికి మనస్సు వెళ్ళి శరణు జొచ్చింది. "స్వామీ! నీ మీద భారము వేసి వస్తున్నాను. అగను. నీయిష్టము వచ్చినట్లు చెయ్యి తండ్రీ!" అనుకున్నాను. మౌనం వహించాను. మనస్సులో "వేంకటేశ పాహిమాం శ్రీనివాస రక్షమాం' ' అని ప్రార్థన ప్రారంభించాను. ఎడతెరిపి లేకుండా ప్రార్థిస్తూ కారు పోనియ్యడం మొదలు పెట్టాను. ఇదంతా కొద్ది క్షణాల్లో జరిగిపోయింది.

నాలుక, మనస్సు, బుద్ధి - భగవన్నామంతో నిండిపోయాయి. కళ్ళు రోడ్డును చూస్తున్నవి. చేతులు స్టీరింగు చక్రమును నెమ్మదిగా తిప్పుతున్నవి. కాళ్ళు స్పీడు కంట్రోల్ చేస్తున్నవి. కారు చాలా నెమ్మదిగా నడుస్తున్నది. నాస్ఫురణమాత్రం శ్రీనివాసుని పాదపద్మములపైన లగ్నమై యున్నది.

అప్పుడు నాకు రెండు విషయములు తెలుస్తున్నవి.

(1) ఆశ్చర్యకరంగా కారు అన్ని వంకరల రోడ్డులో చక్కగానడుస్తున్నది. (2) నాపక్కనా, వెనుకా కూర్చున్నవాళ్ళు నన్ను బుజాలు పట్టుకొని వూపుతూ " ఏమిటి మాట్లాడటము మానేశావు? కారు అంతనెమ్మదిగా పోనిస్తున్నా వెందుకు?" అని ప్రశ్నల వర్షముతో చాలాసేపు విఫల ప్రయత్నంచేశారు.

శ్రీనివాసుని నామమే తోడుగా సుమారు మూడుగంటలు ఆనందంగా కారునడిపి కొండపైకి చేరి కార్లు ఆపేచోట కారు ఆపి, స్వామికి చేతులెత్తి కృతజ్ఞతతో భక్తితో నమస్కారం చేసి, కారుదిగాను. ప్రశ్నల వర్షము కురిపిస్తున్న మా వాళ్ళకు, 'లూజుగా' వున్న స్టీరింగునే సమాధానంగా చూపించి 'స్వామినామం' కారును పైకి ఏవిధంగా తీసుకొచ్చిందీ క్లుప్తంగా చెప్పాను.

నోళ్ళు తెరుచుకొని ఆశ్చర్యంతో వింటున్న మావాళ్ళకు, కృతజ్ఞతతో, భక్తితో నిండిన నాకూ-"ఏమిటండీ మీకారు చెడిపోయిందా?" అని ప్రశ్నిస్తూ వచ్చిన వ్యక్తిని చూడగానే మమ్మల్ని మాయ కప్పినట్లుగా ఈ లోకంలో పడ్డాము. అతడు సుమారు 20 సంవత్సరముల వయసుగల్గిన చక్కని కుర్రవాడు. చిరునవ్వుతో ఇంకా అంటున్నాడు. మీకారు చాలా నెమ్మదిగా చాలాసేపు కొండ ఎక్కడము చూసి ఏమన్నా ట్రబుల్

యిచ్చిందేమోననుకున్నాన్లేండి. ఉత్తరాది యాసతో మాట్లాడుతున్నాడు. అప్పుడు నేను అడిగాను. నీపేరేమిటి ఏమిచేస్తూవుంటావు! - అని.

నాపేరెంకటేశ్వర్లు (నాపేరు వేంకటేశ్వర్లు అనేది కలిపి చెప్పాడు) ఈకొండపైన నాషెడ్డు ఉన్నది. మీకారు రిపేరు చెయ్యమంటారా? అన్నాడు. సరే సంగతి చెప్పి కారుచూడమన్నాను. కారుటెస్టు చెయ్యటం, స్టీరింగు విప్పదియ్యటం పూర్తిగా అరిగిపోయి నున్నగా తయారై నిరుపయోగమైన స్టీరింగురాడును పైకి లాగివేసి నాముందు పెట్టటానికి ఐదునిముషాలు పట్టలేదు. దీని గ్రోవ్స్ పూర్తిగా అరిగిపోయినయ్యి. ఇది పనికిరాదు. ఇవ్వాళ ఆదివారము కొత్తది దొరకదు; ఏమి చెయ్యమంటారు? అన్నాడు. నీయిష్టం అన్నాను. అప్రయత్నంగా. సరే ఒక పాతడబ్బా- వుంటే యివ్వండి అన్నాడు. లేదు నీవే తెచ్చుకోమన్నాను. కొద్ది నిమిషాల్లో ఒక పాతడబ్బా తెచ్చి దానితో రిపేరుచేయటానికి ఉపక్రమించాడు.

అప్పుడు నాకు అతన్ని చూసి ఒక విధమైన భయము పట్టుకున్నది. ఏం చేస్తాడో, ఎంతడబ్బుగుంజుతాడో? అల్లరిపాలు చేస్తే వీని బారినుంచి కాపాడుకోవటం ఎలా? అని నాకు పట్టిన ఆలోచనల్ని మాబావగారికి, తమ్మునికి చెప్పాను. ముగ్గురం వెళ్లి దగ్గరలోవున్న చెట్టుక్రింద (ఇప్పుడు టీమాక్ వున్నదగ్గరికి) కూర్చుని ఆలోచనలో పడ్డాము. మా సమస్య తేలకముందరే మెకానిక్ వేంకటేశ్వర్లు చిరునవ్వుతో వచ్చాడు. కారు రెడి, ట్రయలుకు వెళ్దాము రండి అన్నాడు. అప్పటికి అతనికి కారు వప్పచెప్పి 15 నిముషాలు అయ్యింది. నేను అతను క్రింది తిరుపతి వైపు కొంతదూరం కారులో వెళ్ళాము. అతనే డ్రైవ్‌చేశాడు. చాలా ఫాస్టుగా కారు పోనిస్తూ యీ స్టీరింగుకు ఈ కారు వున్నన్నాళ్ళు ఢోకాలేదు, ధైర్యంగా వాడుకోండి, కావాలంటే నెల్లూరులో మీ మెకానిక్‌కు చూపించుకోండి అన్నాడు.

సరే నీకు డబ్బులు ఎంత యివ్వమంటావు అని అడిగాను. ఏమి వద్దండీ. యీచిన్నదానికి డబ్బులెందుకు? అన్నాడు అంతకు ముందుదాకా ఇతడు ఎంతమోసం చేస్తాడో అని భయపడుతున్ననాకు అది అంతా మరుపువచ్చి(యీకుర్రవాడు చాలా అమాయకుడు. అనుభవం లేనందువల్ల

యిట్లా డబ్బులు వద్దన్నాడు అనిపించింది. బాబూ యిట్లా అయితే ఎట్లా సంపాదిస్తావయ్యా? మాబోటి యాత్రికుల దగ్గరనేకదా బాగా తీసుకోవల్సింది. కొత్తపార్టువేస్తే కనీసం వందరూపాయలు పెట్టాల్సి వచ్చేది కదా. అదీకనీసం రెండురోజులు పట్టేది. నాకు ఏమీ దమ్మిడీ ఖర్చులేకుండా15 నిముషాల్లో బాగుచేసి యిచ్చి డబ్బులు తీసుకోననడం న్యాయంకాదు. అని తీసుకోవల్సిందేనని ఎంతో బ్రతిమాలాను. సరే 15రూపాయలు యివ్వండి అన్నాడు. 30రూపాయలు బలవంతంగా జేబులో పెట్టి కృతజ్ఞతలు చెప్పాను. నన్ను స్టాండులో వదిలిపెట్టి అతడు వెళ్ళిపోయాడు.

మావాళ్లందరికి జరిగింది చెప్పి చాలా మంచి కుర్రవాడు చాలాబాగా కారుబాగుచేశాడు, అని చెప్పాను. అనవసరంగా భయపడ్డాము అని అనుకున్నాము. వెంటనే శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనానికి వెళ్ళాము అద్భుతంగా దర్శనం యిచ్చి ఆనందబాష్పాలు ఊరించాడు పరమాత్మ. ఆలయం బయటికి వచ్చిన తరువాత అందరికి మాయ తొలగింది. అక్కడవున్న టాక్సిల వాళ్ళను, విచారణా కార్యాలయములోను కనుక్కున్నాను, వెంకటేశ్వర్లు అనేకారు మెకానిక్ షెడ్ఎక్కడ అని. కొండపైన ఆపేరుగల కారుమెకానిక్ లేడు అని అందరివద్దనుంచీ ఒకటే ఖచ్చితమైన సమాధానం.

స్వామీ నిన్ను ప్రార్థిస్తే క్షేమంగా పైకి చేర్చావు బాగానే వుంది. మెకానిక్‌గా గూడా వచ్చావా స్వామీ. నిన్ను ఎంత తప్పుగా అంచనా వేశాను. నేను ఎంత దుర్మార్గుణ్ణి. నన్ను క్షమించు స్వామీ అని మనస్సులో ప్రార్థిస్తూ కన్నీళ్ళు ఆపుకోలేకపోయాను.

ఈ ఆపద గట్టెక్కించమని ప్రార్థించాను." 'కాని ఏమి మొక్కుకొనందే. ఇస్తానన్నా ఒద్దన్నావే, బతిమాలించుకొని, బలవంతం చేయించుకొని, నీచేతుల్తో తీసుకోకుండా జేబులో (హుండీలో) వేయించుకొని తీసుకున్నావా స్వామీ ఆ మొక్కుకోని మొక్కుబడి". తరువాత మేము సుఖంగా యిల్లు చేరాము.

ఈసంఘటన జరిగి యిన్ని సంవత్సరాలైనా ఆ వేంకటేశ్వర్లుతో పరిచయం, మాటలు, నిన్నో, మొన్నో జరిగినట్లుగా ఉంటుంది. అందువల్లనే అంతాయథాతథంగా వ్రాయగలిగాను.

*"వేంకటేశ పాహిమాం. - శ్రీనివాస రక్షమాం".*

## ఆపదుద్ధారకుడు

*శ్రీ డి.ఎస్. పెరుమాళ్, విజయనగరం.*

శ్రీ వేంకటేశ్వరస్వామి యొక్కలీలలు అనంతములు. ఈ కలియుగములో మనలను అర్చావతార రూపంలో ఆదుకుంటూ వున్న పురుషోత్తముడు. మనసా, వాచా, కర్మణా ఆ శ్రీనివాసుని సేవించినవారికి ధర్మబద్ధమయిన న్యాయసమ్మతమయిన కోరిన కోర్కెలు తీర్చటానికి కంకణం కట్టుకొన్న పరమాత్మ.

ఇంతవరకూ నా జీవితంలో ఎన్నో సార్లు, స్వామి నన్ను కరుణించినారు. అందులో ముఖ్యమయిన మూడు అనుభవాలు మాత్రం విన్నవించుకుంటున్నాను.

**మొదటిది:**

నేను ఇంపీరియల్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో1945 సం॥లో కాషియర్ ఉద్యోగంలో చేరి 1980 సం॥లో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియాలో మేనేజరుగా ఉద్యోగ విరమణ పొందాను. అది 1957వ సంవత్సరం. నేను కార్యాలయంలో వుంటుండగా, 'కరెన్సీ' నోట్లు లెక్కపెడుతుండగా అకస్మాత్తుగా నాకుడిచేయి యొక్క బొటన వ్రేలు పట్టుతప్పి పోయినది. శతవిధాల ప్రయత్నించినా బొటనవ్రేలు అదుపులోనికి రాలేదు. పెద్దడాక్టర్లను సంప్రదించి, పెద్దమొత్తములో ఖర్చుపెట్టి మందులు వాడినా ఉపయోగం కలుగలేదు. మానసిక బాధమాత్రం మిగిలింది నాకు.

చేసేది ఏమీలేక, ఆసమయంలో కూడ ఆ శ్రీనివాసుని తలవటానికి నా ప్రారబ్ధ కర్మ అడ్డుపడింది కాబోలు. తిరుమల స్వామివారు స్ఫురణకే రాలేదు.

ఎట్లో అతికష్టంమీద బొటన వ్రేలుమడిచి, చూపుడువ్రేలు, మధ్యవ్రేలు సహాయంతో నోట్లు లెక్కపెట్టడం వ్రాయటం కూడ అలవాటు చేసుకున్నాను. లెక్కకు మించి ఎన్నోసార్లు కలంకూడ జారిపడి పోయేది. నాబాధ వ్రాతల్లో తెలియజెప్పలేనిది.

1964 డిశంబరులో నాకు హెడ్ కాషియర్ ప్రమోషన్ సందర్భంగా మద్రాసుకు శిక్షణకు పంపించారు. నాలుగువారాల శిక్షణాకాలంలో కూడ స్వామివారు గుర్తుకు రాలేదు. ఇంకావారం రోజులలో. శిక్షణ పూర్తి అవుతుందనగా నాతోపాటు శిక్షణలో వున్నవారు తిరుపతి స్వామివారి దర్శనానికి వెళుతున్నట్లు చెవిన పడింది.

ఆ స్వామివారి కటాక్షం వలన, స్వామివారిని తలచి "స్వామీ! రేపుకానీ, నాబొటన వ్రేలు మామూలుగా స్వాధీనంలోనికి వస్తే ఊరికి వెళ్లేముందు నేనూ, నీదర్శనం చేసుకొని, మావూరు వెళతానని అనుకొన్నాను.

ఆశ్చర్యం! అద్భుతం! పరమాద్భుతం! ఎంతమాత్రం అబద్ధం వ్రాయలేదు. తప్పకుండా స్వామివారు "నేను వున్నాను! సుమా!" అని చెప్పినట్లుగా సదరు బొటనవ్రేలు స్వాధీనంలోనికి వచ్చి క్రమముగా వారం రోజులకల్లా పూర్తి స్వాధీనంలోనికి వచ్చేసింది. దాదాపు ఏడు సంవత్సరాలు ఆ సప్తగిరీశుని వేడుకోలేదే! అని చాల చింతించి, ఇప్పటికయినా, స్వామివారి కటాక్షం నామీద కల్గిందని మా ఇంటిల్లి పాదీ చాలా ఆనందించాము. నేను అనుకొన్న ప్రకారం స్వామిని దర్శించుకొని తలనీలాలు సమర్పించి మావూరు వచ్చినాను.

**రెండవది :**

మాకు విశాఖపట్నంలో ఒక ఇల్లు వున్నది. దానికి నీటి సదుపాయం లేకపోవటం వలన 1978లో నూయి తవ్వించి, మోటారు అమర్చినాను. మంచి పనివాళ్ల చేత చేయించినా, మోటారు పనిచేస్తున్నా, నీరుపైకి వెళ్లక మూడురోజులు ఇబ్బంది పడిన తర్వాత, స్వామివారి కటాక్షంవల్ల శ్రీ స్వామివారిని జ్ఞప్తికి తెచ్చుకొని, "స్వామీ! నూతినీరు పైతొట్టిలోనికి వెళ్లినట్లయితే నీకొండకు వచ్చి తలనీలాలు సమర్పించి నీదర్శనం

చేసుకుంటా"నని మొక్కుకున్నాను. వింతగా తోచవచ్చును. కానీ, ఆస్వామియే కరుణించినాడు. వెంటనే తొట్టికి నీరు వెళ్లటం మొదలయింది. స్వామికి మొక్కుకున్న విధంగానే తిరుమలకు కుటుంబ సహితంగా వెళ్లి స్వామి అనుగ్రహంతోనే మొక్కుబడులు స్వామివారికి చెల్లించినాము.

**మూడవది :**

మా మనమడు (2సం॥ వయస్సు) ఒక సంవత్సరం క్రిందట ఎడతెరపిలేని విరేచనములతో బాధపడ్డాడు. విశాఖపట్నం తీసికెళ్లి వైద్యనిపుణులకు చూపించి చాలడబ్బు ఖర్చుచేసినా ప్రయోజనం లేక పోయింది. ఆశలుకూడ వదలుకున్నాము. తిరిగి విజయనగరం వచ్చివేసి స్వామివారి కటాక్షం వల్ల మరలా స్వామివార్ని గుర్తుకు తెచ్చుకొని, పిల్లవాని ఆరోగ్యం బాగుంటే తప్పకుండా నీకొండకు పంపించి, తలనీలాలు సమర్పించుతామని మొక్కుకొని, మావూర్లోనే మావీధిలోనే వున్న కొత్తగా వచ్చిన డాక్టరువద్ద వైద్యము చేయించినాము. స్వామిదయవల్ల జబ్బు పోయి ఇప్పుడు చక్కగా ఆడుకుంటున్నాడు. తర్వాత వాడిని, వాడి అమ్మానాన్న, అన్నలతో శ్రీవారి కొండకు పంపించి మొక్కులు తీర్చుకొన్నాము. ఇలా ఆ శ్రీనివాసునిలీలలు ఎన్నైనా చెప్పగలము.

ఆ శ్రీనివాసుడు మా ఇలవేల్పు. మా మూలధనం. త్రికరణశుద్ధిగా స్వామిని కొలిచేవారికి స్వామివారి కటాక్షం తప్పకుండా వుంటుందని నా స్వానుభవమూ, విశ్వాసమున్నూ.

## నేత్రదాత

*శ్రీ జె.వి.సాంబశివరావు, గుంటూరు.*

కలియుగంలో భక్తులపాలిటి కరుణా సముద్రుడయిన శ్రీ వేంకటేశ్వరుని మహిమలు అనంతములు.

అది 1985 జూన్‌నెల. బంధువుల వివాహానికై దూరప్రాంతానికి వెళ్లి తిరిగి స్వస్థలానికి వచ్చే తిరుగు రైలు ప్రయాణంలో ఎడమకన్ను ఎరుపుచేసి మంట ప్రారంభమయింది.

ఎండాకాలం వేళతప్పి భోజనం చేయుటవల్ల వచ్చిందని అశ్రద్ధచేశాను. బాధ తొలగనందున గుంటూరులో నేత్రవైద్యునకు చూపించాను. వైరస్ ఇన్‌ఫెక్షన్ అని రెండు రోజులు కంటికి ఇంజక్షన్ చేసి మందులు వాడారు. బాధ తొలిగింది. కాని చూపు బాగా సన్నగిల్లింది. మరలా డాక్టరు పరీక్షచేసి "నల్లపాపపై తెల్లని చుక్క వచ్చింది. తగ్గటం కష్టం. చాలా కాలం వైద్యం చెయ్యాలి. నీ అదృష్టం బాగుంటే తగ్గవచ్చు. వెయ్యిమందిలో ఒకరికి తగ్గే అవకాశం మాత్రం వుంది. అన్నారు. ఎందుకైనా మంచిది. హైద్రాబాదు సరోజిని ఆసుపత్రికి వెళ్లి నేత్రపరీక్ష చేయించు. అచ్చట కంటిపాప మార్పిడి చేస్తారు. పెద్ద శస్త్ర చికిత్స అవుతుంది" అన్నారు.

శ్రీ వేంకటేశ్వరుని స్మరిస్తూ హైద్రాబాదు బంధువుల యింటికి చేరి, మర్నాడు ఆసుపత్రి డాక్టరుచే పరీక్ష చేయించినాను. డాక్టరుగారు పరీక్ష చేసి, శస్త్ర చికిత్సతో. పాపమార్పిడి చెయ్యాలి. మూడుమాసములు ఆసుపత్రిలో వుండాలి. అప్పటికయినా చూపు తప్పక వస్తుందని చెప్పలేమన్నారు. నేను నిస్పృహతో ఏమీ తోచక గుంటూరు చేరి శ్రీ వేంకటేశ్వరునిపై భారం వేసి, గుంటూరు వైద్యునకు విషయం వివరించాను. నేను నాకుటుంబ సభ్యులతో దిగులుతో మంచముపట్టాము.

ఈ పరిస్థితులలో శ్రీ వేంకటేశ్వరునిపై భారం వేసి, ఆపరేషన్ లేకుండా స్వస్థత చేకూరే ఎడల స్వామివారిదర్శనం చేసుకుంటానని మ్రొక్కి, గుంటూరు డాక్టరుగారి వద్దకు మరలా వెళ్ళి విషయం వివరించినారు.

డాక్టరుగారు పరీక్షచేసి, "ఆపరేషన్‌కు తొందరలేదు. కొంతకాలం మందులు వాడి చూడండి" అన్నారు. శ్రీ స్వామివారి దయవల్ల డాక్టరుగారి సలహాతో మందులు వాడినాను. నాలుగుమాసములు మందులు వాడిన పిదప వ్యాధి క్రమేపీ తగ్గుముఖం కావచ్చింది.

గత నవంబరు నాటికి 90శాతం వ్యాధినయమయింది. డాక్టరు "తెల్లచుక్క కరిగిపోయింది. ఆపరేషన్ అవసరం లేదన్నారు".

ఆనందమయింది. శ్రీస్వామివారిని నవంబరు నెలలో దర్శించుకొనినాను. ఇప్పటికి పూర్తిగా వ్యాధి తగ్గినది. పోయిన చూపు పూర్తిగా వచ్చింది.

భక్తులు ఆర్తిగా, పిలిచే పిలుపుకు పలికే దైవంగా ఆ ఏడుకొండలవాడు ఎందరిని కాపాడుచున్నాడో!

## దొడ్డ మందు

*శ్రీ పి.అప్పలకొండ*

1979వ సంవత్సరం నవంబరు నెలలో మా ఏకైక కుమారునికి మూర్ఛరోగం వచ్చింది. అప్పుడు వానికి 12 ఏళ్లవయసు. 8వతరగతి చదువుతున్నాడు. నరాల వైద్యనిపుణునికి చూపిస్తే 'గార్డినల్' మత్తు మాత్రలు 3 సంవత్సరాలు వేయాలని చెప్పారు.

ఏడుకొండలవాడా! శ్రీ వేంకటేశ్వరా! మత్తు మాత్రలు వేయుట మంచిదికాదని అనేకమంది అంటున్నారు. వేయక తప్పదని డాక్టరు గారంటున్నారు. కాబట్టి నీమీదనే భారంవేసి మాత్రలు వేస్తున్నాం. అని మాబాబుకి చికిత్స మొదలు పెట్టాం. ఒక ఏడాదికే వాడి ఆరోగ్యం బాగుపడింది. ఆతరువాత రెండేళ్లుకూడ అలాగే వేస్తున్నాం.

యలమంచిలిలో 10వతరగతి ఉపాధ్యాయులు శ్రీ ధవళం దీక్షితులుగారు మావాడిని ప్రత్యేక శ్రద్ధతో చూచిన ఫలితంగా, వాడు 10వతరగతిలో 82 శాతం వరకు మార్కులు 1982 మార్చిపరీక్షల్లో సంపాదించాడు. గవర్నమెంటు పాలిటెక్నిక్‌లోకూడ సీటు దొరికింది.

ఇది ఇలావుండగా 1981నుంచి నేను పూజ్య గురుదేవులు శ్రీ స్వామి చిన్మయానంద మహారాజులవారు తపాలుద్వారా వేదాంతబోధ చేస్తున్నారని వారి శిష్యునిగాచేరాను. "సరియైన మార్గంలో నడచిన వారిని దేవుడు సర్వదా రక్షిస్తాడు" అనేది వారి దివ్యసందేశం. వారి వేదాంతసారము రుచి చూచిన పిదప ఏడుకొండలవానిపై నేను నాభక్తిని ద్విగుణీకృతం చేశాను. తద్వారాభయంకరమైన మూర్ఛరోగంనుండి నాపిల్లవాణ్ణి రక్షించమని ప్రార్థించాను. ఈనాప్రార్థనవల్ల శ్రీ వేంకటేశ్వరస్వామి

"దిక్కులేనివారికి దేవుడే దిక్కు" అనిన నానుడి అక్షరాలా నాయందు నిజంచేసి నాకు అనేక మహిమలు చూపించారు.

1984 సంవత్సరం శివరాత్రి రోజు రాత్రి ఊరంతా తిరగటానికి ఇతరపిల్లలతో మావాడు వెళ్తానంటే అలా తిరగకూడదని బలవంతాన ఆపేశాను. అందుకు వాడికి కోపం వచ్చి ఆరాత్రి నేను గార్డినల్ మాత్రలు వేసుకోను అన్నాడు. 3 సంవత్సరాలపాటు మాత్రలు వెయ్యాలని మొదట చెప్పిన డాక్టరుగారు మరొక్కరెండేళ్ళు వెయ్యండి. మొత్తం 5 ఏళ్లు వేస్తే పూర్తిగా తగ్గిపోతుంది. అని చెప్పుట చేత 1982 నవంబరు నుంచి మరల మాత్రలు మావాడికి వేస్తూనే వున్నాం. మధ్యన చాలిస్తే మంచిది కాదన్నారు. అక్కడ నుంచి మరొక్క ఐదేళ్ళు వెయ్యాలన్నారు. అందుకే స్వామిమీద భారంవేసి మాత్రలు వేసుకోమని మావాడిని పదే పదే బ్రతిమాలాను., కాని వాడు ససేమిరా అవి వేసుకోలేదు.

"ఏడుకొండలవాడా! స్వామీ ఎంతపనిచేశావు. వాడి కింకా ఐదేళ్ళు వెయ్యాలంటే వాని ఆరోగ్యం గతి ఏమవుతుంది? నిన్ను నమ్మినందుకు ఇలాగ బాధపెట్టావు అని చెడ్డపేరు తెచ్చుకొనకు సామీ!" అని దీనంగా ప్రార్థించాను.

ఆ మరునాడు మావాడు ఇంటి ప్రక్కనే అనేకముక్కలుగా చేసి వేసిన గార్డినల్ మాత్రలు చూపించాడు. ఏమిటివి, ఇవి? అంటే "ఈ నిజం ఎలాగ చెప్పాల్నా అని నేనింతవరకు వేచివున్నాను. రాత్రి నాకు ఆ అవకాశం వచ్చింది. నేను మొదటి సంవత్సరం మాత్రమే మాత్రలు వేసికొన్నాను. అక్కడి నుంచి వేసికొంటున్నట్లు నటించాను. ముక్కలు చేసి బయట ఊసేస్తున్నాను". అనివాడు చెప్పాడు.

దీనిని బట్టి మావాడికి మూర్ఛతగ్గినదీ., ఆరోగ్యం బాగుపడినదీ కేవలం మందులవల్ల కాదనీ, నా ప్రార్థనను మన్నించిన శ్రీ వేంకటేశ్వర స్వామివారి కృపవల్లనే ఇదంతా జరిగినదని రూఢీ చేసుకొన్నాను. కనుక నమ్మినవారికి శ్రీ వేంకటేశ్వరస్వామి గురుతైన రోగాలను గుణముచేసే మందు! ఆయనే దొడ్డమందు!! అదే తిరుమలమీది మందు!!.

# ఆపదమొక్కులవాడు

శ్రీ పి.వి.చలపతిరావు.

మేము దంపతులము ప్రతి శనివారము శ్రీ వేంకటేశ్వరునికి పూజలు చేసి, ఒకపూట భోజనము, చేయుచుండెడివారము.

ఇది 1946 సంవత్సరంలోని మాట. నాకు విపరీతమైన జ్వరం వచ్చింది. అయినను తగ్గలేదు. గుణము కనిపించలేదు. పైగా 21వరోజు ఉదయం 8గంటలకు కళ్లు నిలువుగ్రుడ్లు పడినవి. స్పృహలేదు. డాక్టరును తెచ్చారు. చూచి చప్పరిస్తూ "అయినా అధైర్య పడకండి. ఈ కలికం నీళ్లతో అరగదీసి రెండుకళ్లలో పెసర పలుకంత పెట్టండి. 10 నిమిషములలో కళ్లు మూతలు పడాలి. పడకపోతే లాభం లే"దని చెప్పి వెళ్లినాడు.

అట్లాగే కలికంవేశారు. 15 నిమిషములు చూచారు. మూతలు పడలేదు. ఆడవాళ్లంతా వాకిట్లోకి వెళ్లి గొల్లుమన్నారు. నాభార్య 2,3, రోజులనుండి భోజనము చేయనందున, కళ్లు తిరిగి పడిపోయిందట.

అప్పుడు లోపల నావద్ద నాబావమరిది ఆయన కొడుకు, ఇతర మగవాళ్లు మాత్రమే వున్నారు. అప్పుడు నానోటినుండి ఈ విధంగా మాటలు వినపడ్డవి వాళ్లకు. "ఆవిడను స్నానం చేసి దీపారాధన చేసి శ్రీ వేంకటేశ్వరునికి తలనీలాలు ఇస్తామని మ్రొక్కుకోమనండి" అని. కుర్రవాడు బైటికి పరుగెత్తు కెళ్లి "అత్తయ్యా! మామయ్య మాట్లాడుతున్నారు" అని విన్నది చెప్పినాడు.

అప్పుడు అక్కడున్న ఆడవాళ్లు, పెద్దవాళ్లు నాభార్యను లేవదీసి, స్నానం చేయించి, చెప్పినట్లు చేయించారట. అదిపూర్తయ్యేవరకు నాకళ్లు అట్లాగే వున్నవి. అది పూర్తయిన 5 నిమిషాలకు కళ్లు మూతలుపడి "దాహం!దాహం!" అన్నానట. తర్వాత 10 రోజులలో కోలుకున్నాను. ఆ మ్రొక్కు కొద్ది రోజులలోనే తిరుపతికివెళ్ళి తీర్చుకున్నాము.

చూచారా! నమ్మి సేవించినవారిని ఆపదలలో ఎట్లా శ్రీ వేంకటేశ్వరుడు ఆదుకుంటాడో! అందుకే "ఆపద మొక్కులవాడు" అన్న బిరుదు ఆయనకే చెల్లుతున్నది ఈ కలియుగంలో.

# సన్మార్గదర్శి

*శ్రీమతి మంతెన సుజాత*

"కౌసల్యా సుప్రజారామ!" అంటూ శ్రీ స్వామివారి శ్లోకాలను పఠించి ఎంతోనిష్ఠతో పూజచేసే మాఅత్త వారి ఇంటిలో, స్వామికి చాలా ఇష్టమైన శనివారంనాడు, తన భక్తుడు చేసిన అపచారమును, ఇంకోభక్తురాలిని ఆవేశించి కోపముతో తెలియజేసి, తన భక్తుడుచేసిన అపచారమును సరిదిద్దుకొనేలాచేసి శనివారంనాడు తనను నిష్ఠగా పూజచేసుకునే విధంగా, సన్మార్గంలో నడిపించిన స్వామివారిలీల ఇది! ఈ సంఘటన మావారి జీవితంలోనే జరిగింది.

మా అత్తవారి ఊరు తుని. మా అత్తవారింట్లో తరతరాలుగా తిరుమల శ్రీవారి పూజ నిత్యం నిష్ఠగా చేసేవారు. మావారికి ఆసంవత్సరం కొత్తగా, పెద్దాపురం కాలేజీలో సీటు వచ్చింది. ఆ ఊరులో బంధువులు ఎవరూ లేనందున గదితీసుకొని వుండేవారు. శాఖాహారహోటల్ సరైనది లేకపోవుటవలన మాంసాహార హోటల్లో భోజనం రోజూచేసేవారు. ప్రతిరోజూ చేసినట్లే శనివారంనాడుకూడా మాంసాహారం భోంచేసేవారు. ఈతప్పు నాకు తప్ప ఇంటిలో ఎవరికి తెలియదు కదా! అనే భ్రమలో వుండేవారు.

ఒక శనివారం మా అత్తగారు మామూలుగా పూజ చేసుకుంటున్నారు. ఇంతలో పక్కింటి కాసులమ్మ అక్కడికి వచ్చింది ఆవిడకూడ శ్రీ వేంకటేశ్వరస్వామివారికి చాల భక్తురాలు. ఆమె పూజగదిలోనికి గబగబావచ్చి స్వామిపటంకేసి తదేకంగా చూడసాగారు. అప్పటికే ఆవిడకళ్లు ఎర్రగా అయినాయి. కోపంగా చూడసాగారు.

"ఏమైంది కాసులమ్మా!" అని మా అత్తగారు అడుగగా, "నేను కాసులమ్మనికాను. వేంకటరమణస్వామిని" అన్నారంట. మరల "వాడు అక్కడ నియమం, నిష్ఠ, పూజ ఏమీలేదు. శనివారం కూడ మాంసాహారం చేస్తున్నాడు. ఈ తప్పు వాడికి తప్పఇంక ఎవరికి తెలియదు అనుకుంటున్నాడు. వెంటనే వాణ్ణి శనివారం మాంసాహారం మానివేసి పూజ నిష్ఠగా చేయమను" అని అన్నారంట.

"స్వామీ తప్పు అయింది క్షమించుతండ్రీ" అని వేడుకొనగా కాసేపటికి శాంతించి మామూలుగా అయ్యారు. తరువాత మావారు తుని వచ్చినపుడు ఇంట్లోవాళ్ళు పెద్దాపురంలో, శనివారంనాడు మాంసాహారం తింటున్నావా? అని అడుగగా, మావారు ఆశ్చర్యంతో "ఎవరు చెప్పారు? నిజమే నేను తింటున్నాను" అన్నారంట. "స్వామి కాసులమ్మకు పూని చాలకోపంగా చెప్పారు" అని ఇంటిలో వాళ్లు చెప్పారు.

అప్పటినుండి మావారు శనివారంనాడు తలస్నానంజేసి పూజచేస్తేకానీ మంచినీళ్లుకూడ ముట్టుకోరు. ఇది నిజంగా దైవలీల. కాకపోతే ఎక్కడో పెద్దాపురంలో జరిగిన విషయం పక్కింటిఆవిడకు ఎలాతెలుస్తుంది. మావారిని మంచి మార్గంలో పెట్టిన దేవుడు ఆ ఏడుకొండలవాడు!.

## ఉద్యోగప్రదాత

*శ్రీమాన్ దూపాటి వరదాచార్యులు.*

నేను ఇప్పటికి పదకొండు సంవత్సరాల క్రితం ప్రభుత్వోద్యోగంలో ఉపాధ్యాయునిగా పనిచేసి విరమణ పొందాను. అంతకుముందు నాకు కలిగిన కష్టాలు వెంకన్న ఎట్లు నివారించారో వివరిస్తున్నాను.

నేను 1952 జూలైలో ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయునిగా నియమితమైనాను. అదేమి గ్రహచారమో ప్రతిఏడు గండాలతోనే వుండేది ఉద్యోగం. బహుశా 1956లో కాబోలు అత్యవసరపరిస్థితులలో ఒక నెల సెలవు పెట్టాను. అదిమొదలు నాకు చెడ్డరోజులు ప్రారంభమయ్యాయి. ప్రధానోపాధ్యాయులు, నేను సెలవు పెట్టకుండా మానేసినట్లు విద్యాశాఖాధికారికి రిపోర్టు పంపారు. దానిపై విద్యాశాఖాధికారి నన్ను ఉద్యోగం నుండి తీసివేసి అంటే డిస్మిస్ చేసి, సదరు ఉద్యోగంలో ఇంకొకరిని నియమించారు. కాని నాకున్న అనుభవాన్ని బట్టి ఆపని చేయకూడదు. రెండుమూడు సారులు వారిని కలిసినను నీవు తీసివేయబడ్డావు. నీ కాయితాలు డి.పి.ఐ. గారికి పంపామని సాగనంపారు.

అందుపై నేను కొత్తగూడెంలో, నాలాగ ప్రభుత్వోన్నత పాఠశాలాధ్యాపకుడుగా పనిచేసే తమ్ముని వద్దకు చేరి, ఒక ఉన్నతాధికారిగారికి తెలుగు (వారిమాతృభాష ఉరుదు) నేర్పేవాణ్ణి.

ఒకరోజు మా మరదలు నాతో "బావగారు, మీకు ఉద్యోగం తిరిగివస్తే మొదటి జీతం తీసికొని నీ కొండకు వచ్చి తలనీలాలిచ్చి మొక్కు తీర్చుకుంటానని వెంకన్నకు దణ్ణం పెట్టుకోండి" అని చెప్పింది.

అమ్మా నాకెక్కడ ఉద్యోగం వస్తుంది. మరణించిన వాడు లేస్తాడా? అన్నాను నిరుత్సాహంగా. కాని ఆమె పట్టుదలమీద అట్లాగే చేసాను. పదిరోజులు గడవక ముందే అనుకొన్నట్లు జరిగింది. మా తమ్ముడు విద్యాశాఖాధికారిని కలవడానికి పోగా వారు "ఏమండి మీఅన్నగారెక్కడ వున్నారండి" అని అడిగారట. ఆయన నిష్కారణంగా ఉద్యోగం పోయి నావద్ద వుంటున్నారని మా తమ్ముడు జవాబిచ్చాడట. "అయితే ఆయనను రేపే నావద్దకు పంపండి మళ్ళీ ఉద్యోగం యిస్తా" నన్నారట. మా తమ్ముడు వచ్చి ఆవిషయము చెప్పాడు. నమ్మలేక "ఏమిరా తమ్ముడూ ఎగతాళి చేస్తున్నావా?" అన్నాను. "లేదన్నయ్యా నీవు వెళ్లి వారిని కలువు' ' అని అనగానే, మా మరదలందుకొని, "నే చెప్పలే! ఇంకేం బావగారు, మీరు మళ్లీ ఉద్యోగస్థులవుతారు వెళ్ళిరండి. ఇదంతా వెంకన్నదయ" అని జ్ఞాపకం చేసింది.

మర్నాడు వెళ్ళి అధికారిని ఇంటివద్ద కలిశాను. ఆఫీసుకురండి పదిగంటలకని చెప్పారు. వారు చెప్పినట్లు వెళ్ళాను. వారు తనముందు ఒక గంట కూర్చోబెట్టుకొని ఉత్తర్వులు చేతికిచ్చి "జాగ్రత్తగా ఉద్యోగం చేసుకోండి. సెలవులు పెట్టకండి. ఇంతవరకు జీతం నష్టం సెలవుక్రింద కట్టి సర్వీసుకలుపుతా"నని మంచి మాటలు చెప్పారు. మా వాళ్ళందరు, నేను ఇది వెంకన్నమాహాత్మ్యం, దయ అని సంతోషించాం. ఉద్యోగంలో మార్చి 23వతేది చేరాను.

అప్పట్లో సెలవులకు ముందే సెలవుల (ఏప్రిల్,మే) జీతాలిచ్చేవారు. మా ప్రధానోపాధ్యాయులు చాలామంచివారు. ఆ నెలాఖరువరకు ఆ

రెండునెలలజీతాలు బిల్లుచేసి పంపారు. అప్పటికి ఉద్యోగం పోయి అరునెలలయింది. ఆ జీతాలు త్వరగావస్తాయని ఆశలేదు. కాని అవెంకన్న కృపాకటాక్షంతో అందరికన్నాముందే బిల్లులు మంజూరై వచ్చాయి. కొత్తగూడెం వచ్చి మాకుటుంబానికీ విషయంచెప్పి ప్రధానోపాధ్యాయులు తమ బిల్లులు రాగానే బ్యాంకిలో మార్పించి ఇక్కడే నాకు డబ్బు ఇస్తానన్నారని చెప్పాను. "బావగారు మీరన్నమొక్కుబడి మాట మరచిపోకండి" అని జ్ఞాపకం చేసింది మరదలు. తప్పనన్నాను. ఇప్పుడా మరదలు లేదు. కాని మాటమాత్రం మరపు కాలేదు. ఇంకో విషయం చెప్పటం మరచాను. ఉద్యోగము ఊడేముందు ఆరునెలలక్రితమే నాభార్యగతించింది రెండోపెండ్లి ప్రయత్నాలు చేశారు. కాని నేను అంగీకరించలేదు, నిరుద్యోగినన్న. బాధతో.

మర్నాడు శనివారం పదిగంటల కల్లా ప్రధానోపాధ్యాయులు మా ఇంటికి వచ్చి నాజీతం 350 రూ॥లు దాదాపు ఇచ్చారు. మామరదలు ఆరాత్రికే నన్ను ప్రయాణం చేయించి తిరుపతికి పంపింది. తలనీలాలు సమర్పించుకొని వెంకన్న బాబును కన్నులారా దర్శించుకొని ప్రార్థన చేసి ప్రతిసంవత్సరం నీదర్శనానికి వస్తానని మనవి చేసి ఇల్లుచేరాను.

రెండునెలలు తిరగకముందే నాకు ద్వితీయ వివాహం జరిగింది. మా అమ్మగారు మీరుభయులు పసుపు బట్టలతో వెంకన్నను దర్శనము చేసికొని రమ్మని పంపింది. అట్లాగే చేశాము. అప్పటినుండి ఉద్యోగ విరమణ చేసేంతవరకు ఏ ఒడుదుడుకులు లేకుండా చివరకు పదవీవిరమణ చేశాను. ఇది నాకు చిత్రంగా కనిపించింది. ఆ ఏడుకొండలవాని దయ.

ఇంకో విషయం క్లుప్తంగా చెప్పి ముగిస్తా. నాకు హైదరాబాదుకు అతి ప్రయత్నము మీద బదిలీ అయింది. కొన్నాళ్ళు జరిగిన తర్వాత మేముభయులము (భార్యాభర్తలము, అప్పటినుంచి ఎప్పుడు ఇద్దరం కలిసే కొండకు వెళ్ళేవాళ్ళం) తిరుపతికి బయలుదేరాం. కొందరు హుండీలో వేయమని డబ్బులిచ్చారు. అన్ని కాయితముపై వ్రాసి కొన్నాను. తీరా

బయలుదేరేవేళకు నాచేతికున్న అరతులం బంగారు ఉంగరం జారిక్రిందపడి కనిపించలేదు. దాన్ని వెతకడంతో ఆలస్యమయిపోయింది. ఎంతవెతికినా కనిపించక పోవడంతో ప్రయాణం అప్పటికి విరమించుకున్నాం. ఇంతలో ప్యాంట్లు విప్పి మడత వేస్తుండగా వుంగరం క్రిందపడింది. ఇదిగో దొరికింది ఆ ఉంగరం. లక్ష్మీ! పద ఆటోలో వెళదాము. బస్సుకు వ్యవధి లేదన్నాను. అవునండీ నేను వెంకన్నను ప్రార్థించాను. ప్రయాణం ఆపవద్దని. ఆటోలో బస్టాండుకు వెళ్ళాము. ప్యాసింజరు బస్సు వెళ్లిపోయింది. ఒక ఎక్స్ప్రెస్సు బస్సువుంది. కాని అందులో సీట్లు మూడు రోజులక్రితమే రిజర్వేషన్ అయ్యాయి. సంగతి చెప్పాను లక్ష్మికి (నాభార్యపేరులక్ష్మి). అయినా ఏమన్నా వుంటుందేమో అడగండి బుక్కింగులో అంది. ఒసే పిచ్చిదానా సీట్లు లేవని బోర్డు రాసి పెట్టారన్నాను. అయినా వెంకన్న ఆపరండి ప్రయాణం. అబ్బా వెళ్ళివిచారించండి అంది. సరే దాని మాటెందుకు తీసివెయ్యాలని బుక్కింగులో అడిగాను. "ఇందాకనే చెప్పాకదండీ సీట్లు లేవని" అని కొంచెము చీకాకు పడ్డాడు. నేను తిరిగి వస్తూంటే, "చిన్నమాట. మరచాను. రెండు టికెట్లు రద్దయేటట్లువుంది. బస్సు బయలుదేరే ముందు కనిపిస్తే అవకాశం వుంటే తప్పక సాయంచేస్తాను" అన్నాడు. మీరు ఆసాయం చేస్తే నేనేదో ఇచ్చుకుంటాను అన్నాను. దానికి సమాధానం లేదు. ఈసంగతి మాలక్ష్మికి చెప్పాను. 'వెంకన్న తన దర్శనానికి తప్పక రప్పించుకొంటాడండి' అంది.

టికెట్టు నాపేరుతో మార్పుచేశారు. ఏమో ఇవ్వబోతే. వారే ఐదురూపాయలిచ్చి హుండీలో వేయమని ఇచ్చినాకు కాఫీ ఇప్పించి బస్సు ఎక్కించారు. రెండు అడ్డంకులు తీరాయి. సంతోషంగా తిరుపతికొండకు చేరాము. మొక్కులు తీర్చుకొని అందరి డబ్బులు వరుసగా పేరుపేరున హుండీలో వేసాను. సాయంకాలం ఆరయింది. ఆరాత్రికే కొండదిగుదామనుకొన్నాము. బట్టలన్నీ క్రింద సత్రంగదిలోవుండిపోయాయి. ఇంతలోనాభార్యకు కాలు విపరీతంగా

వాచి, జ్వరంతో వళ్ళు తెలియకుండా పడిపోయింది. ఏమీ చేయలేక, తిరుమలలోనే గదితీసికొన్న యాత్రికులను బతిమాలి, వారి గదిలో పండుకోబెట్టాను. రాత్రి, తెల్లవార్లు, స్వామికి నేనేం అపరాధం చేశానని విచారిస్తున్నాను. అంతలో జ్ఞాపకం వచ్చింది. పేరువ్రాసికొన్న రెండు రూపాయలు హుండీలోవేయలేదు. అప్పుడు నాలుగుగంటలు దాటింది. వెంటనే కోనేరుకు పోయి మునకవేసి ఆ రెండురూపాయలు హుండీలో వేసి, మకాముకు తిరిగి వచ్చేసరికి లక్ష్మి లేచి ముఖం కడుక్కొంటూ "ఏమండీ! ఎక్కడికి వెళ్ళారు. మనము క్రిందకు వెళ్ళవద్దా" అంది. ఆశ్చర్యం వేసింది.

ఏం లక్ష్మి నీకేం తెలీదా అన్నా. ఏమిటండి అంది. జరిగిన సంగతంతా చెప్పా. ఆశ్చర్యపోయింది. తనకేమీ బాధలేదని, ఆరోగ్యంగా వున్నానని చెప్పి స్నానం చేసి సామానుతో క్రిందకు దిగి సుఖంగా ఇల్లు చేరాం.

వెంకన్న దయవుంటే ఎంతగడ్డుసమస్యలున్నా యిట్టే తీరిపోతాయి. అప్పటినుండి ప్రతిసంవత్సరం తప్పక కొండకు వెళ్లి తలనీలాలు ఇచ్చి వస్తూవుంటాము. ఆయన మా ఇలువేలుపు!

## విద్యాప్రదాత

*శ్రీ సోమాశి బాలగంగాధర శర్మ, గుంటూరు.*

మధురం మాధవలీలా చరితం
సేవ్యం వేంకటనాయక చరణం
శరణం యామి సురేశ్వర శరణం
వరదం పావన గంగానుసరణం ॥మధురం॥

కోరినవారి కోర్కెలను దీర్చుచు కొంగుబంగారమై కొండలనడుమ కొలువైయున్న కోనేటి రాయని మహిమలను వర్ణించాలంటే ఈ చిన్నజీవితం చాలదు. అయినా ఆ మహాత్ముని కొలువులో అమందానందాన్ని అనుభవిస్తున్న ఒక సామాన్యునిగా స్వామి మహిమను గుర్తుచేసుకోవడం కనీస కృతజ్ఞతగా భావించి వ్రాస్తున్నాను.

అవినేను చీరాలలో పురాణప్రవచనం చేస్తున్న రోజులు. రామాయణ ప్రవచనం చేస్తున్నాను. అందులో అయోధ్యాకాండలోని జాబాలి రామసంవాదం. అయోమయంగా వుంది. ఇంటికి వచ్చి ఆరాత్రి తెల్లవార్లూ తపనపడ్డాను. నిద్రపట్టలేదు. మరునాడు ఉదయం స్నానంచేసి బజారుకు బయల్దేరాను. ఆదారిలో అంతకుపూర్వం కొందరు భక్తులు చీరాల వైకుంఠపురం రైలుగేటుకు సమీపంలో ఒక వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని తెచ్చి అక్కడ వుంచి చిన్నపందిరి వేశారు. ప్రతిరోజు సాయంత్రం దీపారాధన చేస్తుండేవారు. ఆదారివెంట వెడుతూ, స్వామికి నమస్కారం చేసి మనసులో ఇలా తలచుకున్నాను.

"స్వామీ! ఏదారిలోనో వెడుతున్న నన్ను పురాణ ప్రవచనం చెయ్యమని ఈ దారిలో దింపావు. నాకు తెలియని కొన్ని రహస్యాలను తెలుసుకొనే అవకాశాన్ని కల్గించు. ఒక ఉత్తముడైన గురువు వద్ద ఈ పురాణ గ్రంథాలను చదువుకునే అవకాశాన్ని ప్రసాదించు" అని.

విచిత్రమేమంటే నాకు సామాన్యంగా దినపత్రికలు చదివే అలవాటులేదు. కాని నేను స్వామికి నమస్కరించిన తర్వాత సుమారు ఐదారురోజులకు అనుకోకుండా ఒక దినపత్రిక చూచాను. అందులో తిరుమల తిరుపతి దేవస్థానం వారు హిందూధర్మరక్షణ సంస్థ ఆధ్వర్యంలో "పౌరాణిక శిక్షణ పాఠశాల" ఒకటి నిర్వహిస్తున్నట్లు అర్హులైన అభ్యర్థులనుండి దరఖాస్తులు కోరుతూ, శిక్షణాకాలం రెండు సంవత్సరాలు, మొదటిసంవత్సరం రెండువందలు, రెండవ సంవత్సరం మూడవందల చొప్పున ఉపకారవేతనం ఇవ్వబడుతుంది-అనే ప్రకటన నాకంటపడింది.

ఒక్కక్షణం నామనస్సు ఆనందంతో ఊగిసలాడి ఇది నాకోసమే ఏర్పాటు చేయబడిందా? అని ఆశ్చర్యం కలిగింది. కాని ఒక సందేహం. వారిచ్చే ఉపకారవేతనం సంవత్సరానికా? నెలకా? అప్పటికే నాకు పెండ్లిఅయింది. ఒక అమ్మాయికూడ. సంవత్సరానికి రెండువందలతో ఎలా బ్రతకాలి? అంతటితో ఆవిషయానికి స్వస్తి చెప్పాను. ఆరోజు గడచింది. ఆ మరుసటిరోజు సాయంత్రం ప్రసిద్ధ విద్వాంసులు ప్రతాప

సుబ్రహ్మణ్య శాస్త్రిగారు స్వయంగా మీరు దరఖాస్తు చేయండి తప్పక మీకు అవకాశం కలిసివస్తుంది అని చెప్పారు. అదేరోజు నా ప్రియమిత్రులు "స్వస్తి నః స్నేహ వృద్ధయే" అని నేను జాబువ్రాసినా వ్రాయకపోయినా ఇప్పటికి నాక్షేమాన్ని కాంక్షిస్తూ జాబులు వ్రాసే నా నిత్య శ్రేయోభిలాషులు కబురుచేసి అప్లికేషను వారే వ్రాసి నాచేత సంతకం చేయించి వారే పోష్టు చేసిన అఘట్టాన్ని మరువగలనా? మొత్తానికి పూర్వరంగం తయారైంది.

ఇంటర్వ్యూకు ఉత్తర్వువచ్చింది. నాదగ్గర చార్జీలకు డబ్బులు లేవు. పురాణ ప్రవచనం చేస్తున్న శివాలయంలో తిరుపతి వెళుతున్నానని చెప్పగానే నూటా అరవైరూపాయలు గంటలో పోగయినాయని అంటే ఎవరైనా నమ్మగలరా? ఇదీ మరపురాని అనుభవం. తిరుపతి వెళ్ళడం, ఇంటర్వ్యూ జరగడం అన్నీ కలలో జరిగినట్లు జరిగాయి. ఎన్నెన్నో అనుభవాలు మరెన్నెన్నో విశేషాలు.

స్వామి వడ్డికాసులవాడంటారు. స్వామి వడ్డీతీసుకోవడమే కాదు. ఇవ్వడం కూడా అని నా అనుభవం. ఒక గురువు వద్ద చదువుకొనే అవకాశం కల్పించమని నేను కోరితే, అసలుగా కోర్కెతీర్చడమే గాక వడ్డీగా ఉద్యోగం ద్వారా జీవనాన్ని ప్రసాదించిన ఆస్వామి మహిమ ఏమని వర్ణింపగలను. ఎన్నిసార్లు చూచినా తనివితీరని ఆస్వామిరూపు మనస్సులో తలచుకోవడం, స్వామి నాకప్పగించిన బాధ్యతను సక్రమంగా చిత్తశుద్ధితో బాధ్యతాయుతంగా నెరవేర్చడం కంటే నేను స్వామికి కృతజ్ఞత ఏవిధంగా తెలుపుకోగలను.

స్వామి విషయంలో విశ్వాసానికి మించింది లేదు. నమ్మినవారిని దరిజేర్చే స్వామి శ్రీ వేంకటేశ్వరుడు. "నమే భక్తః ప్రణశ్యతి"ఇది స్వామివారి ప్రతిజ్ఞ!.

# ఆరోగ్యప్రదాత

*శ్రీ ఆత్మకూరి వెంకటరత్నం.*

మా ఇంటి అనవాయితీ ప్రకారం, మా స్వగ్రామమైన జగ్గయ్యపేటకు దగ్గరలోనున్న తిరుమలగిరి (నందిగామతాలుకా-కృష్ణాజిల్లా)లో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆనాడు నాపుట్టు వెంట్రుకలతోనే తృప్తిచెంది, ఈనాడు నా ఆర్తిని ఆదుకున్న ఆ తిరుమల కరుణాసముద్రుని దయకు, అందరూ పాత్రులు కావలెనని కోరుతూ దీనిని వ్రాస్తున్నాను.

ఆరు ఏండ్ల క్రిందట నేనిక్కడ సాయం కళాశాలలో ఇంజనీరింగు చదువుతూవుంటే, చివరిపరీక్షల్లో పెన్నుపట్టుకునే శక్తిని క్రమంగా, నాకుడిచేతిబొటనవ్రేలు కోల్పోసాగింది. ఏ వైద్యునికి చూపించినా లాభం లేకపోయింది. నానాటికి పెన్ను పట్టుకొనే శక్తి హీనమైన చేతిని ఇక్కడ (బెంగుళూరులో) నున్న ప్రసిద్ధ నరాల ఆసుపత్రిలో కూడచూపించాను. మూడునెలలు చికిత్సచేశారు. ఆమూడునెలల్లో, నిజానికి చాలావరకు పోయిన శక్తిని, చేయి తిరిగి సంపాదించుకుంది. చికిత్స చాలని మూడునెలల చివరలో డాక్టర్లు చెప్పారు. కానీ, మళ్లీ చెయ్యి బలహీనం కావడంతో పెన్ను పట్టుకొనే స్థితిలో లేని నేను ఇంజనీరింగు చివరిపరీక్షలు వ్రాయలేకపోయాను. ఆతరువాత ఆయుర్వేద మందులు, ఆరునెలలు వాడాను. మధ్యలో గుణం కనిపించినా చివరకు మళ్లీ మామూలే. తుదిగా హోమియో మందులు కూడా పదినెలలు వాడాను. ఫలితం శూన్యం.

శూన్యంలోకి చూచే నాకు దిక్కులేనివారికి దేవుడే దిక్కు అనే దివ్యసూక్తి జ్ఞాపకానికి వచ్చింది. మనో మందిరంలో శ్రీవేంకటేశ్వరుని ప్రతిష్ఠించుకొని అన్నిరూపాలు, అన్ని నామాలు స్వామివే ననే దృఢనమ్మకంతో "ప్రభూ! భక్తవత్సలా!! ధర్మరక్షణకై శ్రీరామచంద్రుడవై అవతరించిన నీకు, నీ భక్తాగ్రగణ్యుల కథాపుష్పాలను ఏరి కూర్చిమాలగా అల్లినీకు సమర్పించాలనే నాకోరిక! ఆ పరమ పావనమైన పని చెయ్యటానికి యీ చేతికి తగిన శక్తిని ప్రసాదించు తండ్రీ! వెంకట రమణా! సంకటహరణా!! "అంటూ మనస్పూర్తిగా అయనను వేడుకున్నాను.

ఆతపస్సులో ఆంధ్రవాల్మీకి విరచితమైన శ్రీ మదాంధ్ర వాల్మీకి రామాయణ మందరమును, స్వామి ఇచ్చిన శక్తితో చదివి, భక్తశబరి, దివ్యచరిత్రను పదునైదు పుటలలో వ్రాసి, వాడని సుపరిమళ సుగంధ పుష్పముగా కూర్చి, మిగిలిన పూలకోసం రామాయణ మందరమును మధించుతూ వున్నాను. ఆ వెదికే శక్తి, ఈ వ్రాసేశక్తి ఆ ఏడుకొండలవాడిదే అంటే అతిశయోక్తి ఏ మాత్రము లేదు.

ఏ డాక్టర్ల మందులకు సాధ్యం కానిది, చివరకు విశ్వవిఖ్యాత వైద్యుడైన శ్రీ వేంకటేశ్వరునివలన నాచేతికి తిరిగి బలం వచ్చింది. అచేతనమైన నాచేతికి చైతన్యాన్ని ప్రసాదించినందుకు నాచేయి నిజానికి ఆయనదే! అందుచేత ఇంజనీరింగు పరీక్షను వదలివేసి, బ్రహ్మ కడిగిన ఆ దివ్యపాదాలకు సతతమూ భక్తాగ్రగణ్యుల కథాపుష్పాలను సమర్పించటానికి సంకల్పించాను. నాలో ఆత్మరూపంలో గల ఆ పరమాత్మ, ఇంకా ఏమి వ్రాయిస్తాడోఆయనకు తెలియాలి.

ఈ చరాచర విశ్వంలో, ఆసర్వశక్తిమంతుడైన సప్తగిరీశుని బంధించకలిగేది పవిత్రమైన భక్తిపాశమే!.

## కల్యాణ చక్రవర్తి

*శ్రీ కింతలి చంద్ర శేఖరరావు.*

శ్రీ వేంకటేశ్వర స్వామి మా అందరికీ ఇష్టమైన దైవం. మేము తరచుగా తిరుపతికి వెళ్లి స్వామి దర్శనం చేసుకుంటుంటాము. మా ఇంట్లో వివాహములు జరిపిస్తే మొట్టమొదటి శుభలేఖ శ్రీ వేంకటేశ్వరుని పేర తిరుపతికి పంపించడం మాకు అలవాటు.

తిరుపతి శ్రీవారి సన్నిధిలో మాతమ్మునికి వివాహము జరిపించడం మా అందరికీ ఇష్టమేగాని మానాన్నగారు సుస్తీఅవటంవల్ల ఆయన ఇష్ట పడటంలేదు.అయినా మేమంతా పట్టుదలబట్టి స్వామి కృపవల్ల సుస్తీ ఏమీ చేయదు అని బలవంతముగా తిరుపతిలో పెళ్ళిజరిపించుటకు ప్రయాణం చేయించినాము. మానాన్నగారి ఆరోగ్యము చక్కబడి, పెళ్ళి

పనులు సక్రమంగా సాగాలని శ్రీ స్వామివారిని ప్రార్థించుకొన్నారు. వెంటనే తిరుపతి బండి ఎక్కేసరికల్లా ఇంటిలో లేవడమే కష్టమైన మా నాన్నగారు మామూలుగా నడచి బండిలో మా అందరికీ ఫలహార, భోజన సదుపాయాల ఏర్పాటుల్లో కూడ పాల్గొన్నారు. బండిలో మా బంధువులంతా మానాన్నగారివైపు చూసి ఆశ్చర్యంతో ఇదంతా స్వామివారి లీల అని దిగ్భ్రాంతులయ్యారు.

మేము ముందురోజు సాయంత్రం 3గంటలకు గూడూరుకు చేరుకున్నాము. ఎవరిని అడిగినా ఈ రోజు తిరుపతికి బస్సులు లేవన్నారు. మేమంతా 40 మంది వున్నాం. ఎలాగ వెళ్తాము అని అందరూ గాబరాపడుచుండగా, స్వామివారే మాకు బస్సు పంపించినట్లుగా ఒక ఖాళీబస్సు మేము వున్న హోటలు దగ్గరికి వచ్చి తిరుపతికి వస్తారా! అని అడిగేసరికి మేమంతా ఇది నిజామా? కలా? అని ఆశ్చర్యపోతిమి. వెంటనే బస్సువాడు మాకు ఈ ఒక్కరోజుకే అనుమతి పత్రం వున్నది. వేగిరం ఎక్కండి అనేసరికల్లా అందరం బస్సుఎక్కి రాత్రి 10 గంటలకు తిరుపతి చేరుకున్నాం. అక్కడ, ఇప్పుడు కొండమీదకు బస్సులు వెళ్ళవని చెప్పారు. మళ్లీ స్వామిని తలచుకొనే సరికి అచట ఆఫీసులో ఒకాయన మమ్ములను పిలిచి, "వుండండి. మీకు ప్రత్యేకంగా బస్సు ఏర్పాటు చేస్తా"మని చెప్పాడు. డ్రైవరుకు చెప్పి కొండపైకి చేర్చాడు. అచ్చటకూడ గదులు ఖాళీలు లేవు అని ఆఫీసులో చెప్పేసరికి స్వామిమీదే భారము అని వేడుకునేసరికి అచ్చటి గుమస్తా లేచి " మీ అందరికీ ఒకేగది ఇస్తాము సర్దుకోండి" అనిచెప్పాడు. వెంటనే గది తీసుకొనేసరికి రాత్రి 2గంటలు అయింది. తెల్లవారితే పెళ్ళికార్యక్రమము. అప్పటికి భజంత్రీలు లేరు.మా పురోహితునితో కలిసి ఈ రాత్రి భజంత్రీల శబ్దము ఎచ్చటైనా వస్తుందేమోనని సత్రాలదగ్గరికి వెళేసరికి శబ్దము వినపడిన వెంటనే అక్కడికి వెళ్ళి భజంత్రీలు మాటలాడుకొంటిమి. స్వామివారి కృపవల్ల కల్యాణము చక్కగా, ప్రశాంతముగా జరిగినది. శ్రీ స్వామివారి దర్శన భాగ్యమును పొంది సుఖముగా తిరిగి ఇల్లు చేరితిమి.

చూశారా! స్వామి కరుణవుంటే ప్రతిపని ఆటంకంలేకుండా ఆయనే జరిపిస్తారు. ఆ తరువాత మా ఇంట జరిగిన రెండు వివాహములుకూడా తిరుమల కల్యాణ చక్రవర్తి సన్నిధిలోనే జరిపించినాము .

శుభం భవతు.

## పుత్రదాత

*శ్రీమతి కె. రుక్కమ్మ*

ఆ దేవదేవుని లీలల్లో ఇది ఒకటి. ఈ సంఘటన జరిగి దాదాపు ముప్పది సంవత్సరములు అయినా, నిన్నమొన్న జరిగినట్లు వున్నది.

నా పెళ్ళప్పటికి నాకు పది సంవత్సరాలు మాత్రమే. మావారిని పొరుగూరునుండి దత్తత తీసుకున్నారు. కొంతకాలానికి నాకు సంతానమయింది, అని అన్నట్టేకాని, సంతానము నిలువలేదు. మావారు నాకు సంతానము నిలువలేదని, వేరేపెళ్లి చేసుకుంటామనేవారు. ఆ క్లిష్టపరిస్థితులలో నాకు ఒక కుమారుడు జన్మించాడు. అది శనివారము దుర్ముహూర్తము. వీడు దుర్ముహూర్తములో జన్మించాడు - అని మావాళ్లందరికీ భయంగా వుండేది. అందరూ అనుకున్నట్లుగానే వానికి ఏదో ఒక జ్వరము వచ్చేది. ఎప్పుడూ అనారోగ్యంగానే వుండేవాడు.

ఒకనాడు ఆ జ్వరము పెద్దదై ఒక గండంగా పరిణమించింది. దానికి అనేకమందులు వాడాము. చాలామంది వైద్యులకు చూపించాము. కాని ఏమాత్రము తగ్గుముఖము పట్టలేదు. ఆ భగవంతుని దయలేనిదే మనం ఎంతచేసినా వృధానే యగును. వైద్యులు పిల్లవానిమీద ఆశ వదలమని చెప్పారు. ఇంతలో సాయంత్రం అయింది. ఎవరిండ్లకు వాళ్ళు వెళ్ళినారు.

నాకు భయము వేసి దేవుని మంటపము వద్దకు రాగానే వేంకటేశ్వరుని విగ్రహము మరియు పటము కనిపించింది. ఆ భగవంతునికి ఐదునేతి వత్తులు ముట్టించి" శ్రీనివాసా! నాకుమారుడు బ్రతికితే నీ కాళ్లవద్దకు వచ్చి నాకుమారుని తలనీలాలు తీసి మరియు నీపేరే

పెట్టుకుంటాను." అని పదే పదే మొక్కిబాబు వద్దకు వచ్చి కూర్చున్నాను. రాత్రి పన్నెండు గంటలయింది. నాకు కన్ను మలిగింది.

ఆ నిద్రలో ఒక స్వప్నం వచ్చింది. దానిలో ఒక శ్రీ వైష్ణవుడు వచ్చి "ఏడీ నీకుమారుడు? ఏమయింది?" అని అడిగాడు. వెంటనే నేను "ఇదిగో నాకుమారుడు శరీరము చల్లబడ్డాది" అని భోరున ఏడ్చాను. అపుడు ఆయన "ఏడవకమ్మా ఏడవకు. నీకుమారునకు ఏమీ కా"దని ఆయన సంచిలోని ఒక ఔషధమును తీసి, కౌచిప్పలో పిండి నాకుమారుణ్ణి తీసుకొని ఆయన కాళ్లమీద పరుండబెట్టుకొని దానిని త్రావించి, "ఇక నేను వస్తాను" అని చెప్పి వెళ్లి పోగా, నేను మళ్లీ "ఎప్పుడు వస్తారు స్వామి' ! అని గట్టిగా అరుచుకుంటూ లేచాను.

మావారు" ఏమిటి? అలా అరుస్తున్నావు" అని అడిగారు. నేను నా స్వప్నవృత్తాంతాన్ని మొత్తం విన్నవించాను. మావారు అది నీ ఆలాపన. అన్నారు. ఆయనకు దేవునిమీద నమ్మకం లేదు. ఏది ఏమైనా తెల్లవారినుండి జ్వరం తగ్గుముఖం పట్టింది. వారం రోజులలోగానే ఎప్పటివలె ఆరోగ్యంగా తయారయినాడు. వానిని చూచి అందరూ ఆశ్చర్యపోయారు. మేము వానికి ముందున్న పేరు తీసివేసి వేంకటేశ్వర్లు అని పేరుపెట్టి, ఒక నెలలోగానే తిరుపతికి వెళ్లి, నాకుమారుని, మరియు మావారి తలనీలాలను సమర్పించి వచ్చాము. అది మొదలు మా ఇంటిదేవుడు తిరుమల శ్రీనివాసుడు. అప్పటి నాకుమారుని భార్య పేరు వెంకటలక్ష్మి, నామనుమల పేర్లుకూడ చి॥శ్రీనివాస్, చి॥విష్ణువర్ధన్. మా ఇంట్లో వంట్లో ఏ కష్టము వచ్చినా ఆ ఆపద్బాంధవుడు ఇట్టే తొలగిస్తాడు.

# ప్రాణదాత

శ్రీ గుదిటి సిద్ధులు, పుంగనూరు.

ఆపదమొక్కులవాని లీలలు అన్నీ ఇన్నీకావు. అవి 1976 ఆగష్టు సెప్టెంబరు నెలలు. మాతల్లికి అస్వస్థత చేసింది. తిరుపతిలో డాక్టరు దగ్గర పరీక్ష చేయిస్తే క్యాన్సరు వ్యాధి అనీ, వెంటనే మద్రాసుకు తీసుకెళ్ళమని సలహాఇచ్చారు.

"ఆపద మొక్కులవాడా! అనాథ రక్షకా! ఇంతగ నన్ను కష్టపెట్టావు. నీ మహిమ చాటి చెప్పాలంటే భయంకరమైన క్యాన్సరువ్యాధి అయినాసరే, ఒక్కగానొక్క సంవత్సరం మా అమ్మను నాకోసరం బ్రతికించుస్వామీ! మరణ మార్గంలో వున్న మా అమ్మ ఏడుకొండలవాని దయవల్లనే బ్రతికింది. తెలియజెప్పడానికి బ్రతికించు స్వామీ!" అని వేడుకొన్నాను. ఇంటిల్లిపాది నీదగ్గరికి వచ్చి తలనీలాలు అర్పించుకుంటామని మొక్కుకున్నాము.

మదరాసులో తెలిసినవాళ్ళు ఎవ్వరూలేరు. నామిత్రులలో ఒకరికి ఈ విషయం తెలుపగా, వాళ్లఅక్క మదరాసులో వుందని, అమ్మను తీసికెళదామని ధైర్యం చెప్పాడు, రెండుమూడు రోజులలో మదరాసుకు వెళ్ళాము. వాళ్ళ అక్కగారింటిలోనే వుండి నాము. ఆమెకు తెలిసిన వాళ్ళద్వారా, మా అమ్మకు అన్ని పరీక్షలు చేయించి స్టాన్లి ఆసుపత్రిలో చేర్పించాం. ఆ అక్క మాస్వంత అక్కలాగా మా తల్లికి సేవలు చేసింది. మా అమ్మకు రేడియం వైద్యం రెండుమూడు పర్యాయాలు చేశారు. తర్వాత ఇంటికి తీసుకొచ్చాము. మా అమ్మ జబ్బు నయమయింది.

ఆ సమయంలోనే నాభార్య గర్భవతి. పుంగనూరులో వున్నది. నేను-ఆపదమొక్కులవాణ్ణి ఆరాధిస్తూ ఆనెలల్లా మదరాసులో అమ్మకోసరం, పుంగనూరులో భార్యకోసరం ఆరాటపడేవాణ్ణి.

అమ్మ జబ్బునయంతో ఇంటికి వచ్చింది. మాకు బాబు పుట్టాడు. ఇది సాక్షాత్తు ఆ వైకుంఠవాసుని పరమాద్భుతమే. ఎందుకంటే మా అమ్మ

ఈనాటికి బ్రతికేవుంది. ఆమె వయసు 70 ఏండ్లు. బాగా తిరుగుతూనే వుంది. అంతేగాక తర్వాత సంవత్సరానికి మా అమ్మకు గుండె జబ్బు కూడ వచ్చింది. నాడి చాలమందకొడిగా ఆడేది. డాక్టర్లు ఆశవదిలేశారు. తిరుపతి రూయా ఆసుపత్రిలో చేర్పించాం. మా అమ్మ ఆశవదిలేశాం. కాని ఏడుకొండలవాడు మా మొఱ ఆలకించడం మానలేదు. మా అమ్మమరల బ్రతికింది. ముందే చెప్పానుగా! ఇప్పుడు మా అమ్మ ఆరోగ్యంగానే వుందని. అది ఆయన మహిమ.

ఇంకో సంఘటన మాకు రెండోసారి కవల పిల్లలు పుట్టారు. ఒకపాప, బాబు. అదీకూడ నెలలు నిండకుండానే పుట్టారు. పాప 13 రోజులుండి చనిపోయింది. బాబుకూడా అదేపరిస్థితికి వచ్చాడు. వాడికి శ్వాస ఆడలేదు. తిరుపతి రూయా ఆసుపత్రిలో చేర్పించాము. చిన్నపిల్లల వైద్యుడు "ప్రయోజనం లేదు. ఇక మీ అదృష్టం. మీబాబు అదృష్టం" అని అన్నారు. వెంటనే ఎదురుగా కన్పడుతున్న ఏడుకొండలవైపు చూసి, మేమిద్దరం భార్యా భర్తలం రక్షించమని, చేతులెత్తి వేడుకొన్నాం.

శ్వాస ఆడని పిల్లవానికి రెండురోజులు కృత్రిమ శ్వాస కలిగించారు. ప్రాణవాయువు వగైరాలతో. మూడోరోజు బాబుకు శ్వాస వచ్చింది. మెలకువ వచ్చింది. డాక్టరు పరీక్షచేసి "అరె! ప్రాణం వచ్చింది. పరవా లేదండి. మీ అదృష్టమే ఇది, మీ బాబు బ్రతికాడు" అన్నాడు. ఆ బాబు ప్రస్తుతం ఆరోగ్యంగా, ఉంటూ రెండవతరగతి చదువుతున్నాడు.

అలాగ ఏడుకొండలవాడు మాఇంట్లో ఇద్దరిని మరణించిన వారిని మరల బ్రతికించాడు. ఇది అక్షరాలా నిజం. ఆ స్వామి నాకు పిలిస్తే పలికేదైవం. నోరారా గోవింద నామస్మరణ చేస్తూ, ఆ వెంకన్నస్వామిని వేడుకొంటూవుంటే ఆ వైకుంఠవాసునిదగ్గరే వున్నంత ఆనందంగా ప్రశాంతంగ వుంటుంది.

# నడక నిచ్చిన దేవుడు

*శ్రీమతి కురుగంటి హైమవతీదేవి, కాకినాడ.*

భగవంతునిదయ వుంటే మనకు అసాధ్యమైన దేదీ వుండదని నానమ్మకం. అందుకాయనయందు మనకు అచంచలమైన భక్తి విశ్వాసాలూ, ఓర్పు మాత్రం తప్పకుండా వుండాలి. ఈ క్రింది ఉదంతం చదివితే ఆ ఏడుకొండలవాడు ఎంత దయామయుడో, తనని నమ్ముకున్న భక్తులను ఎలా రక్షిస్తాడో తెలుస్తుంది.

7వతరగతిలో బాగా చదువుతూ, భరత నాట్యమూ, సైకిల్ తొక్కడమూ, చేతి పనులూ, అన్నీ ఎంతో బాగా చేస్తూ, మంచి చురుకైన, మామనుమరాలు చి॥ కవిత 1983 జనవరి 23వతేదీన ఉన్నట్లుండి నడుస్తూ నడుస్తూ పడిపోవడం మొదలు పెట్టింది. ఏమిటని అడిగితే, నేను నడవలేక పోతున్నాను అంటూ ఏడవడం మొదలుపెట్టింది. అంతే ఆరోజునుండి నడవడమే మానేసింది. 12 ఏండ్ల పిల్లను ఎత్తుకొని కుర్చీలో కూర్చోపెట్టడం, లేపి మంచం మీద పడుకోపెట్టడం చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడింది. ఇదేమిటా ఈపిల్ల మళ్లీ మామూలుగా అవుతుందా? లేక అవిటిగా వుండిపోవాలా? అని ఎంతో భయంవేసింది.

వెంటనే మొదట మేమందరం ఆ ఏడుకొండల వాడిని మనసారా ప్రార్థించుకొని "తండ్రీ! ఈ పిల్ల మళ్ళీ మామూలుగా నడిచేటట్లు చేసేభారం నీదే స్వామీ" అని దణ్ణం పెట్టుకొని పిల్లఆరోగ్యం బాగుపడగానే నీకొండకు నడచివచ్చి నీదివ్యదర్శనం చేసుకొని, హుండీలో 116రూ.లు వేస్తాము తండ్రీ!' ' అని మా అబ్బాయి, కోడలూ, నేనూ మొక్కుకున్నాము.

తదుపరి మన ప్రయత్నాలు చెయ్యాలి. కనుక ఇక్కడ (కాకినాడలో) డాక్టర్లలో పేరుపడ్డవాళ్లందరికీ చూపించాం. హైదరాబాదు తీసుకెళ్ళి అక్కడ పెద్ద డాక్టర్లందరికీ చూపించాం. కొందరు వెన్నెముకనుంచి ద్రవం తీసి పరీక్షచెయ్యాలనీ, కొందరు మెదడులో రక్తం గడ్డకట్టి వుందేమో, దానికేదో శస్త్ర చికిత్స చెయ్యాలనీ అనేకవిధాలుగా చెప్పారు. అప్పటికే

ఎంతో నీరసంగా వున్నపిల్ల ఈ బాధాకరమైన పరీక్షలన్నీ చేయిస్తే తట్టుకోలేదనీ పరిస్థితి ఇంకా విషమిస్తుందేమోనని మాకు అనిపించింది. ఈ జాగ్రత్తకూడా ఆభగవంతుడే మాకు కలిగించాడని మేము నమ్ముకున్నాము. ఇదంతా జరిగేటప్పటికి ఫిబ్రవరి (1983) నెల సగం గడిచింది. ఏవో మందులిస్తున్నాం కాని ఏమీ ఉపయోగం కనిపించలేదు.

అప్పుడొక మామూలు డాక్టరు తనకు దేవుడు మాపట్ల దయతో కలిగించిన ఊహ.. అన్నట్లుగా మాతో "ఈ అమ్మాయికి న్యూరోబియన్ ఇంజక్షన్లు రోజూ ఇచ్చి చూద్దాం. తగ్గక పోతే తర్వాత ఆలోచిద్దాం. అని చికిత్స ప్రారంభించారు. అంతే రోజు రోజుకీ పరిస్థితి మెరుగవడం కనిపించింది. నెలరోజులు ఇంజక్షన్లు ఇచ్చేటప్పటికి కొద్దిగా అదీ ఇదీ పట్టుకొని లేచి నిలబడి అడుగులు వెయ్యడం (చిన్నపాపలాగ అన్నమాట) మొదలు పెట్టింది. పాపం అంతకుముందునుంచే మంచంలో పడుకొనే, త్వరలోనే (మార్చిలో) జరగబోయే 7వక్లాసు కామన్ పరీక్షలకి వెళ్లి వ్రాసి 80శాతం మార్కులతో ఉత్తీర్ణురాలయింది. తర్వాత కూడా మందులూ, ఇంజక్షన్లు, రోజూ తేనె, ఇవన్నీ తీసుకున్నాక సరిగ్గా ఏడాదికి మళ్లీ మామూలు పిల్ల అయింది.

మొక్కుకున్న ప్రకారం 1984 లో మేమందరం తిరుపతికెళ్ళి, కొండమీదికి ఈ పిల్లతో సహా అందరం నడచి (మెట్లెక్కి) వెళ్ళాము. ఇప్పుడే కాస్త కోలుకుంటున్నావు. నువ్వుకొండ ఎక్కలేవు. బస్సులో రమ్మని మేము ఎంతచెప్పినా వినక నేను నడవగలనని మొండికేసి బయలుదేరింది. ఆ పిల్ల నడవలేదని మేము భయపడ్డాం. కాని పెద్దవాళ్లందరికంటె ముందరే తన అక్కలిద్దరితో పరుగులు తీస్తూ, కొండెక్కి, దయామయుడైన శ్రీ వేంకటేశ్వరుని దర్శనం చేసుకుంది మా అందరితో పాటు. దేవుని హుండీలో నూటపదార్లరూపాయలు, రెండు చిన్న వెండికాళ్ళు భక్తితో వేశాము.

1983 లో ఈ పిల్ల ఈజన్మలో మళ్లీ నడవగలదా? అన్నంత జబ్బుచేసి కాళ్లల్లో బలం తగ్గిపోయిన పిల్లను, తన దగ్గరకు రాగలిగేటట్లు

చేసినదా ఏడుకొండల వెంకన్నకాక ఇంకెవరు ! ఆ తండ్రిదయవల్ల ఆ పిల్ల ఇప్పుడు 10వక్లాసులోకి వచ్చింది బాగాఆరోగ్యంగా వున్నది.

## ప్రాణం పోసిన దేవుడు

*శ్రీ జి.వేంకటేశంనాయుడు, గుంతకల్లు.*

అవి నేను అసిస్టెంటు స్టేషన్ మాష్టరుగా పనిచేయుచున్న రోజులు. 29-12-1972 రాత్రి 7గంటలసమయం. నా ఆరోగ్యం చాలా బలహీనంగా తయారయింది. ఆపైన శరీరమంతా ఎక్కువ చెమటతో తడిసి పోయింది. కాసేపు ఫ్యాన్ క్రింద పడుకొని విశ్రాంతి తీసుకొన్నాను అప్పటికి చెమటలు పట్టడం ఆగిపోయింది. కాని తిరిగి లేచేసరికి మరలా చెమట పోయడం ప్రారంభించింది. ఆపరిస్థితులలో ఒంటరిగా అనంతరాజుపేట (రైల్వే కోడూరు ప్రక్కన) రైల్వే క్వార్టర్సులో వున్నాను. నా ఆరోగ్యవిషయంలో నాకు పూర్తిగా అనుమానముగా వుండి ఆస్టేషనులో నాతో పాటు పనిచేయుచుండిన ఉద్యోగి శ్రీపాపయ్య అనునతనిని తోడు తీసుకొని ప్రక్కన వున్న రైల్వే కోడూరులోయున్న డాక్టరు థామస్ దగ్గరికి రాత్రి 10గంటలకు పోతిని. అప్పటికి మొదట ఛాతిలో కుడి ప్రక్కనొప్పి ప్రారంభమై క్రమేణ ఎడమవైపుకు పూర్తిగా ప్రాకినది. డా॥థామస్ గారు నన్నువెంటనే హృద్రోగనిపుణులు వున్న ఆసుపత్రికి పొమ్మని సలహాఇచ్చారు. డాక్టరు స్వయంగా రిక్షా పిలుచుకొనివచ్చి అందులో రైల్వేస్టేషనుకు పంపించారు. నేను నా మిత్రుడు పాపయ్యతో స్టేషనుకు వచ్చి విశ్రాంతి గదిలోయున్నాను. సుమారు 2గంటల సమయంలో నొప్పి విపరీతముగావచ్చి భరింపజాలక నేలపై అటుఇటు పొరలినాను. ఆతరువాత వాంతి చేసుకున్నాను. అప్పటికి నా ఆరోగ్యపరిస్థితి ఆందోళనగా తయారైంది. నేను ముక్కుతోగాలి పీల్చుకోలేక పోతున్నాను. ఇంక బ్రతకనన్న భావం నాలో కలిగింది. ఆవిషయమే నాకు తోడుగాయున్న మిత్రునితో అన్నాను. అతను నాపరిస్థితి చూడలేక ముఖముపైన గుడ్డకప్పుకున్నాడు. మరణించేసమయంలో భగవంతుని స్మరించిన మరుజన్మ వుండదన్న

నమ్మకంతో నా ఇష్టదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామిని ప్రార్థించుచు కూర్చున్నాను.

ఆశ్చర్యం! అలాగ ఐదు నిమిషాలు జరిగిన తరువాత నేను యథాప్రకారం గాలిపీల్చుకోవడం జరిగింది. నొప్పి తగ్గిపోయింది. మరుసటిరోజు నందలూరికి పోయి అక్కడవున్న రైల్వే డాక్టరుకు చూపగా అతను ఏదోమామూలు నొప్పి అని భావించి బి-కాంప్లెక్సు ఇంజక్షన్ ఇచ్చి పంపినాడు. నేను తిరిగి అనంతరాజుపేటకు వచ్చి ఒంటరిగా వుండినాను. బలహీనం అదే విధంగా వుండుటవలన తిరిగి మరుసటిదినం నందలూరు డాక్టరుగారి దగ్గరకు పోయినాను. అప్పటికి అతనికి అనుమానం కలిగి నన్ను గుంతకల్లులోయున్న ముఖ్యరైల్వే ఆసుపత్రికి వెళ్ళమన్నారు. అప్పటికి నేను తిరుపతిలో వున్న మాకుటుంబసభ్యులకు తెలిపి మాతండ్రిగారు మరియు సోదరితో బయలుదేరి గుంతకల్లుకు చేరినాను. ఆరోజు ఆదివారమగుటచే డ్యూటీలో వున్న డాక్టరుగారిని చూడగా, ఆమె వెంటనే నన్ను చేర్చుకొని, డివిజను వైద్యాధికారికి ఫోను చేసినారు. ఆయన మరికొందరు డాక్టర్లు వచ్చి చూచి మామూలుగా నొప్పి వుంటుంది. రేపు ఇ.సి.జి. తీసి చూస్తాము. అని చెప్పి పోయినారు. సోమవారం రోజు ఉదయాన్నే ఇ.సి.జి తీయించి చూడగా పెద్ద గుండె పోటు అని నిర్ధారించి డాక్టర్లు కంగారుపడ నారంభించారు.

నేను గుండెనొప్పి వచ్చి మూడురోజులుగా మందులు లేక అటు ఇటు తిరిగిన విషయం విన్న డాక్టర్లు ఆశ్చర్యపోయినారు. ఆ విధంగా హృద్రోగిగా చేరిన నేను 50 రోజులు వుండి ఆసుపత్రి నుండి బయటపడినాను. ఆ తరువాత వేలూరుకు పోయిడాక్టర్లకు చూపించినాను. అచటనున్న హృద్రోగ నిపుణులు నేను చెప్పినదంతావిని "నీవు భూమి మీదింకా ప్రాణంతో వుండడమే ఆశ్చర్య"మని అన్నారు.

ఇదంతా ఆ ఏడుకొండలవెంకటరమణుని దయగాక మరి ఏమున్నది. అప్పటినుండి ప్రతిసంవత్సరం కుటుంబసమేతంగా శ్రీ స్వామివారి దర్శనం చేసుకొని తలనీలాలు సమర్పించుచున్నాను. నాకు

గుండెనొప్పి వచ్చిన కారణంగా, నా ఉద్యోగంలో మార్పుజరిగి ప్రస్తుతం గుంతకల్లులో యున్నరైల్వే ఆఫీసులో పెద్దగుమస్తాగా పనిచేయుచున్నాను. శ్రీ బాలాజీకి జీవితమంతా ఋణపడియున్నాను. ఇదంతా స్వామివారిపై ఎక్కువ భక్తి విశ్వాసాలు వున్న మా శ్రీమతికి స్వామివారు ఇచ్చిన వరమని అనుకుంటున్నాం.

## వడ్డికాసులవాడు

*శ్రీ తల్లా ప్రగడ సూర్యప్రకాశరావు.*

అది 1976వ సంవత్సరమనుకుంటా! నాకు బాగా గుర్తు. నేను కైకలూరు (కృష్ణాజిల్లా) శ్రీ వీరవెంకట సత్యనారాయణ రైస్ మిల్లులో గుమస్తాగా పనిచేయుచున్న రోజులవి.

ప్రతి సంవత్సరం వెళ్లేమాదిరిగానే, అప్పుడు తిరుమలకు శ్రీ స్వామివారి దర్శనానికి బయలుదేరుతున్నాను. నా స్నేహితుడు ఒక రూపాయి కొత్తనాణెములు ఐదు ఇచ్చి శ్రీ స్వామివారికి నాపేరుతో హుండీలో వేయుము అని పొట్లాం కట్టి ఇచ్చాడు. స్వామివారి దర్శనం అయింతర్వాత నేను వేసే కానుకలు వేసి గుర్తుకు వచ్చినా, నా స్నేహితుని ఐదురూపాయనాణెములు కొత్తవి వేయడానికి మనస్సు వొప్పక వేయకుండానే కైకలూరు చేరాను. నా స్నేహితుడు అడిగితే వేసాను! అని అబద్ధం కూడ చెప్పినాను.

సరిగ్గా తిరుమలనుండి వచ్చిన వారం రోజులకు మాషావుకారు ధాన్యం కొనుగోలు చేయమని రూ. 18000/-లు ఇచ్చి పంపగా, రైతుకు ధాన్యానికి లెక్కచేసి రూ. 14300/- లు ఇవ్వడానికి బదులుగా పొరబాటుగా రూ. 14800/-లు ఇచ్చి, ధాన్యం తీసికొని మిల్లుకు చేరాను. షావుకారు లెక్క చెప్పడానికి చూస్తే రూ. 500/-లు తేడా కనపడుతున్నది. వెంటనే నేను, మా షావుకారు, రైతువద్దకు వెళ్లి అడిగితే రూ. 500/-లు ఎక్కువ ఇవ్వలేదని చెప్పినాడు. మిల్లుకు వచ్చిన తర్వాత నాపై షావుకారు చాలాకోపంగా వున్నాడు. పైగా ఆరోజు శనివారం. భోజనం చెయ్యలేదు

జరిగిన నష్టమునకు పైనబడిన అపవాదుకు బాధపడుతూ, ఉద్యోగం పోకుండా కాపాడవలసిందిగా ఆరాధ్యదైవమైన ఆ వడ్డికాసులవానిని మనస్సులో ధ్యానించుచు అట్లానే నిద్రపోయాను. సరిగ్గా అదేరోజు రాత్రి స్వామికలలో సాక్షాత్కరించి "ఐదురూపాయల కొత్తనాణెములు గుర్తుకు వచ్చినాగూడ వేయనందుకే తగిన శిక్ష" అంటూండగా వెంటనే మెలకువ వచ్చింది. వెంటనే శ్రీ స్వామివారికి క్షమాపణ తెలుపుచూ మరలా సంవత్సరం వచ్చేటప్పుడు వడ్డీతోసహా తీరుస్తానని మొక్కుకున్నాను. నాటికి మూడురోజులు దాటిన తర్వాత ధాన్యం కొనుగోలుచేసిన రైతువచ్చి "అయ్యా! మీగుమస్తా రూ. 500/-లు ఎక్కువ ఇచ్చిన మాట వాస్తవమే అవి నాభార్య నాకు తెలియకుండా తీసుకున్నది." అందువల్ల జరిగిన పొరపాటుకు మన్నించవలసినదిగా కోరినాడు.

నాటి నుండి నేటికి ఆ శ్రీనివాసుడే మా ఇంటిఆరాధ్యదైవమై మనస్సులో అనుకున్న కోరికలు తీర్చుచు, నేను రైల్వేలో ఉద్యోగము చేయుటకు, నాభార్య, ఇద్దరుపిల్లలతో కులాసాగా వుండుటకు కూడ ఆ స్వామివారి అనుగ్రహమే!.

## సంరక్షకుడు

*శ్రీ మజ్జిమారయ్య, విజయనగరం.*

నాకు ఊహ తెలిసిన దగ్గరినుండి (చిన్నవయస్సు) నిత్యం దీపారాధన చేస్తున్నాను. ఎక్కువ జ్వరం ఉన్నా స్నానంచేసి రోజూ దీపారాధన చెయ్యడం అలవాటు. జ్వరంతో స్నానం చేస్తే ఎక్కువ అవుతుంది. అంటారు. కాని నాకు ఎప్పుడూ అలాగ జరగలేదు. సాధారణ వైద్యంతో జ్వరం తగ్గిపోతుంది. ఆ స్వామికి ఒకరోజు దీపారాధన చేయకపోతే ఆనాడు నామనస్సు ప్రశాంతంగా వుండదు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఖర్గపూర్ రైల్వే ఉద్యోగం నాకు చిన్నవయస్సులోనే శ్రీ వేంకటేశ్వర స్వామివలన దొరికింది. నాజన్మస్థలం విజయనగరం దగ్గర అయ్యన్నపేట గ్రామం. ఎన్నో సంవత్సరాలు రైల్వేలో ఉద్యోగం చేసినా ఖర్గపూర్ నుండి ఆంధ్రప్రదేశ్‌కు

ట్రాన్స్‌ఫర్ లేనందున ఆంధ్రాలో ఆ శ్రీనివాసుడే ఉద్యోగం చూపిస్తాడని నమ్మకంతో రైల్వే ఉద్యోగానికి రాజీనామా చేసి విజయనగరం వచ్చేశాను. రెండునెలలు ఖాళీగా వున్న తరువాత విజయనగరం మహారాజా కళాశాలలో ఒక ఉద్యోగం ఖాళీగా వుందని తెలిసి మాబావమరిది నాకోసం ప్రయత్నంచేశాడు. ఈ ఉద్యోగం వచ్చినట్లయితే నీకొండకు వచ్చి తలనీలాలు ఇస్తానని ఆస్వామికి మొక్కుకున్నాను. ప్రయత్నం చేసిన వారం రోజులకు ఉత్తర్వు వచ్చినది. ఆరోజే ఉద్యోగంలో చేరాను. ఆ ఉద్యోగం కోసం కొంతమంది కొన్ని నెలల తరబడి ప్రయత్నం చేసినా వాళ్ళకు రాకుండా నాకే ఆ ఉద్యోగం వచ్చిందీ అంటే శ్రీ వేంకటేశ్వర స్వామి కరుణాకటాక్షమే.

అన్నమాట ప్రకారం తలనీలాలు ఇచ్చి ఆస్వామి దర్శనం చేసుకున్నాను. ఒకమారు దర్శనం చేసుకొని వచ్చేయడానికి నాకు మనసొప్పలేదు. ఎప్పుడు వెళ్లినా కొండపై రెండు మూడుదినములు వుండిమూడుమార్లుగాని ఐదుమార్లుగాని దర్శనం చేసుకొని వచ్చేస్తాము. స్వామి సన్నిధిలో వున్నంతసేపు హాయిగా, ఆనందంగా మనస్సు ప్రశాంతంగా వుంటుంది.

కొన్నాళ్ళతర్వాత మా అయ్యన్నపేట గ్రామం 3-10-82న అగ్నికి ఆహుతయింది. దానికి గాలితోడై సుమారు రెండువందల ఇండ్లు కాలిపోయాయి. ఆ తర్వాత వెంటనే 15-10-82న నుండి తుపాను తాకిడికి గురైంది. 16వ తేదీన రోజంతా వదలకుండా కుంభవృష్టి కురిసింది. ఆవర్షానికి ఎన్నో మిద్దెలు కూలిపోయాయి. చాలామంది మిద్దెలు ఖాళీచేసి వెళ్ళిపోయారు. వెళ్లిపోతున్నారుకూడా.

మా మిద్దె చాలా పురాతనమైనది. కూలిపోవాలి అంటే ముందుగా మామిద్దెనే కూలిపోవాలి. కాని నేను ఖాళీచెయ్యలేదు. శ్రీ వేంకటేశ్వరస్వామిపై భారము వేసి మిద్దెలోపల నేను, నాభార్య నలుగురు పిల్లలతో పడుకున్నాం. మావీధిలో ఆ రాత్రంతా మిద్దెలు కూలే దబ్బుడు దుబ్బుడు శబ్దాలు వింటూ, శ్రీవెంకటేశ్వరస్వామి కాపాడుతాడని నమ్మకంతో ఆ స్వామిని స్మరిస్తూ తెల్లవార్లు స్వామి భజన చేస్తూ జాగారం చేశాము.

17-10-82న ఉదయం వర్షం వెలిసింది. బయటకు వచ్చి చూస్తే, ఆస్వామి మహిమ చెప్పుకోద్దగ్గది ఏమంటే మా ఇంటి ఎడమవైపు మిద్దెకూలిపోయింది. కుడివైపు మిద్దె సగం కూలి, ప్రక్కన మూడుమిద్దెలు కూడా కూలిపోయాయి. మా వీధిలో చాలమిద్దెలు కూలిపోయాయి. మామిద్దెమాత్రం కూలలేదు. బాగానే వుంది. ఆపద మొక్కులవాడు అటువంటి గండాన్ని గట్టెక్కించాడు. ఆస్వామి మహిమే మహిమ. ఆస్వామిని నమ్మినవారు ఎన్నడూ చెడిపోరు. కష్టాలలోవున్న వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తాడు. ఆపదలయందు ఆదుకొనే ఆపద్భాంధవుడు. భక్తుల పాలిటి కల్పతరువు!.

## ప్రసాదం పెట్టిన దేవుడు

*శ్రీ.టి. రవీంద్రనాథ, విశాఖపట్నం.*

ఆరోజు మంగళవారం. నవంబరు 18వ తారీఖు నేపాలు రాజు బీరేంద్ర తన సతీమణి రాణీ ఐశ్వర్యదేవితో శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించిన రోజు. నేను నాభార్య, అత్తమామలతో తిరుమలకు 17వ తారీఖున సాయంత్రం చేరుకున్నాం. ఆరోజు రాత్రినలుగురం స్వామిని దర్శించుకున్నాం. 18వతారీఖు ఉదయం మామగారు (వయసు పెద్దవారగుటవల్ల) తిరిగి దర్శనం చేసుకోడానికి రానన్నాడు. ఉదయమేలేచి నేను ముందుగా స్నానంచేసి, ఆడవాళ్లు ఇద్దరూ తయారయ్యేలోపల ఒకసారి స్వామి వారిని దర్శనం చేసుకొని వచ్చాను. నవంబరులో రద్దీ ఎక్కువ వుండదు. దర్శనం తేలికగా అవుతుంది. అందుచేత ఒక గంటలో దర్శనం తేలికగా అవుతుంది. అందుచేత ఒక గంటలో దర్శనం చేసుకొని గేటుదగ్గర ఇచ్చిన ఉచితభోజన కూపను తీసుకొని తిరిగి కాటేజికి వచ్చాను.

తిరిగి ముగ్గురం కలిసి మరొక్కసారి స్వామిదర్శనం చేసుకుందామని వెళ్ళి క్యూకాంప్లెక్సులో కూర్చున్నాం. ఆసమయంలోనే నేపాల్‌రాజు బీరేంద్ర

స్వామి దర్శనార్థం వస్తున్నారని మధ్యాహ్నం 1 గంటవరకు సర్వదర్శనం ఆపారు అధికారులు. మధ్యాహ్నం 2గంటలకు మాకు దర్శనం అయింది. మాకంటే ఆపూట ముందుగా క్యూలో వెళ్ళిన దాదాపు రెండువేలమందిలో కొద్దిమందికి ఉచిత భోజన కూపన్లు ఇచ్చారు. మేము దర్శనం చేసుకొని బయటకు వచ్చేరికి కూపన్లు ఇవ్వటం లేదు. బహుశా ఆరోజు లెక్కప్రకారం ఇవ్వవలసిన కూపన్లు అయిపోయి వుండవచ్చు. మేము గుడిబయటకు వచ్చేశాము.

క్యాంటీనుకు వెళ్ళి భోజనం చేసి మామగార్కి ఏదైనా టిఫిన్ తీసుకెళ్దామని అనుకొన్నాం.

ఉచిత భోజనం పెట్టేభవనం దగ్గరకు వచ్చేసరికి నాకు గుర్తుకువచ్చింది. ఉదయం నేను ఒక్కణ్ణే దర్శనం చేసుకున్నపుడు నాకు ఇచ్చిన భోజనం కూపను. అప్పుడు అనిపించింది. ఇంకొక రెండు కూపన్లు ఎవరైనా ఇస్తే ముగ్గురం కలిసి ఉచితభోజన ప్రసాదం తినవచ్చుకదా అని. చాలా మనఃస్ఫూర్తిగా ఆభోజన ప్రసాదం తినాలనిపించింది. ఆవిషయమే మాట్లాడుకుంటూ ముగ్గురం ఆభవనం ఎదురుగా రోడ్డుమీద ఒక్కనిమిషం నిలబడ్డాము. "ఇలాగ సంతృప్తిగా దర్శన మిచ్చిన దేవుడు, కొదువ లేకుండా ప్రసాదంకూడా పెట్టితే బాగుండు"నని స్వామిని మనసులోనే వేడుకున్నాం. ఇంతలో అకస్మాత్తుగా మా ఎదుటికి ఒక 8 సంవత్సరాల అబ్బాయి వచ్చాడు. నిక్కరు వేసుకున్నాడు. నుదుట సన్నని నామం, పెట్టుకున్నాడు. మా దగ్గరకు వచ్చి వెంటనే "రెండు ఉచిత భోజనం టికెట్లు వున్నాయి కావాలా అండీ!" నా నోటివెంట మాటరాలేదు. ఆశ్చర్యం నుంచి తేరుకోలేదు. మనస్సులో ఒక దురాలోచనకూడా వచ్చింది. ఇలా కొంతమంది కూపన్లు బయట అమ్ముకుంటున్నారేమో! అని. ఇంతలో ఆ అబ్బాయి ఏమి మాట్లాడకుండా నాచేతిలో రెండు టికెట్లు పెట్టి పరుగెత్తుకొని వెళ్లి పోయాడు. నామనస్సు ఒక్కక్షణం విపరీతమైన వత్తిడికి లోనయింది. ఏమీ ఆ దైవలీల. మేము ముగ్గురం వున్నాం. మాదగ్గర ఒకే ఒక కూపను వుంది. రెండు మాత్రమే కావాలి. ఆకూపనుకూడ

జేబులోంచి తియ్యలేదు. సరిగ్గా రెండు కూపన్లనే అడక్కుండా చేతిలో పెట్టి వెళ్లాడు. ఆ అబ్బాయి రూపంలో ఆ తిరుమలేశుడు వచ్చి మాకోరిక తీర్చాడనిపించింది. గుడివైపు తిరిగి మనఃస్ఫూర్తిగా నమస్కారం చేసి, ఆసప్తగిరివాసుని విచిత్రలీలల్లో ఇదొక్కటి అనుకుంటూ లోపలికి వెళ్ళి సంతృప్తిగా ఆభోజన ప్రసాదాన్ని కడుపారా స్వీకరించి ప్రక్కక్యాంటీనులో మా మామగార్కి టిఫిను తీసుకుని కాటేజికి వెళ్లిపోయాము. నిజంగా ఆయన మాకు ప్రసాదంపెట్టిన దేవుడు!.

## మొక్కు చెల్లించుకున్న దేవుడు

*-- శ్రీమతి వి.సరోజానరసింహన్, కోటపల్లి, రంగారెడ్డిజిల్లా.*

నేను మా అత్తగారి ఊరినుండి మాపుట్టింటికి వెళ్లాను. మాఇంట్లో అందరికీ స్వామివారంటే భక్తి చాలాఎక్కువ. కాని వివాహమయ్యేంతవరకు తిరుపతి వెళ్ళలేక పోయాను. వెంకన్నను చూడాలని అనుకోవడం తప్ప వీలుకాలేదు. చాలకాలము తర్వాత స్వామి కరుణించారు. పుట్టినింటికి వెళ్ళినాక మా బంధువులలో ఒకరిది పెళ్ళి పత్రిక వచ్చింది. పెళ్ళి జరిగేస్థలం తిరుపతికి దగ్గర. మా నాన్నగారు మా అక్కను, అక్కకూతురును సిద్ధం కమ్మన్నారు. అక్కకూతురుకు మొక్కుబడి యున్నది. ఆమాట విన్న నాకు మనసులో "మానాన్న నన్ను పిలిచితే బాగుండుకదా. స్వామి వారి దర్శన భాగ్యం నాకెప్పుడో" అని చింతిస్తూ ఆలోచించుకొనుచున్నాను. కాలము కలిసి రాలేదేమో ఎప్పుడనుకొన్నా రాలేకపోతున్నాను. ఎవరు నన్ను పిలుచుక పోతారో, అని భగవంతుని మనసారా వేడుకొన్నాను. ఇంతలో స్వామివారి లీలనా అన్నట్లు బట్టలు సర్దుకున్న మా అక్క, మనసు మార్చుకొని నేను రాను, చెల్లెలును, అంటే నన్ను పిలుచుక వెళ్ళమని మా నాన్నతో చెప్పింది.

నా సంతోషం అంతా ఇంతాకాదు. చెప్పలేనంత కోరినకోరిక వెంటనే నెరవేరింది.

నేను, మా అక్కకూతురు, నాన్నగారితో ప్రయాణమయ్యాం. పెళ్ళి బంధువులతో రెండురోజులుండి తిరుపతికి వచ్చినాము. మా అక్కకూతురికి చిన్నప్పుడు ఏదో అనారోగ్యమై ప్రాణం పోయేస్థితికి వస్తే స్వామికి తలనీలాలిస్తామని మొక్కుకున్నారు. తిరుపతికి వెళ్లేనాటికి మా అక్కకూతురి వయసు 15 ఏళ్లు. ఇపుడు పూర్తి వెంట్రుకలిస్తే ఏమీ బాగుండదు. మూడుకత్తెరలు కొంచం కొంచం కత్తిరించుకొనమని మా అక్కకూతురిని వెంట్రుకలిచ్చి రమ్మన్నారు. మానాన్న.

కాని నేను మానాన్నతో అన్నాను. "తల వెంట్రుకలు మొత్తం ఇవ్వాలి. చిన్నప్పుడు మొక్కినాము కదా. కనుక మూడు కత్తెరలు బాగుండవన్నాను. అందుకు మా నాన్న "ఏం కాదమ్మా! ఎట్లైనా ఇవ్వవచ్చు. ఏమీ కాదు". అని అన్నారు. సరే అన్నాను. కల్యాణ కట్టలోనికి మా అక్కకూతురు వెళ్లింది. కొంచం సేపైనాక కల్యాణ కట్టనుండి మా అక్కకూతురు బయటకు వచ్చింది. మేము ఆమెను చూచి చాల ఆశ్చర్యపోయి. గుర్తే పట్టలేదు. కారణమేమంటే మొత్తం గుండు చేయించుకొని వచ్చింది.

ఆమెతో మేం అన్నాం. "ఏమమ్మా మూడుకత్తెరలు ఇచ్చి రమ్మన్నాంగదా. ఇలా ఎలా జరిగింది" అని. అపుడామె ఇలా చెప్పింది. మంగలివద్ద కెళ్ళి" మూడుకత్తెరలు అంటే మూడు స్థలాలలో కొంచం వెంట్రుకలు తీసికొనమని చెప్పాను సరేనని అర్థమైందికదా అని కూర్చున్నాను. కత్తితో నున్నగా వెడల్పుగా నడినెత్తిమీద గీరినాడు నేను అద్దంలో చూచుకొని ఆశ్చర్యపోయి, ఏమి ఇట్లా చేసినావనిఅడిగితే తమిళంలోనో మళయాళంలోనో ఏదో భాషలో వాడేదో జవాబు చెప్పినాడు. అయ్యో ఇతనికి నాభాష అర్థంకానట్లుందని, వచ్చిన కోపం తగ్గించుకొని సరే మొత్తం గుండు చేయమని సైగచేసి, ప్రక్కలో నున్నగుండు చేసికొన్నవారిని చూపితిని. సరేనన్నట్లు తలవూపి ఆ మంగలి నాకు మొత్తం గుండుచేసినాడు." అని మాతో మా అక్కకూతురు చెప్పింది.

స్వామికి మూడుకత్తెరలు తీసుకొనుట ఇష్టంలేక గుండు

చేయించాడని అన్పించింది. తర్వాత కోనేరుకు వెళ్ళి స్నానంచేసి స్వామివారి దర్శనం తృప్తిదీర చేసికొన్నాం.

మా అక్కకూతురి విషయంలో మేము తీసుకున్న నిర్ణయం తప్పని, ముక్కు చెంపలేసుకొని తప్పు క్షమించమని కడుపారా కటాక్షించమని కోరుకుంటూ దర్శించుకొని వచ్చాం.

అనుకొని రాలేకపోయిన నన్ను, కోరిన వెంటనే దరికి రప్పించుకొని దర్శనమిచ్చిన స్వామివారిని మనసారా ప్రార్థించుకున్నాను. ఇలాగా స్వామిమహిమలు ఎన్నో! ఎన్నెన్నో!!

## వడ్డికాసులవాడు

*-- శ్రీమతి వై. ఇందిరా రావు, అడయారు, మద్రాసు.*

మేము కలకత్తాలో వుండగా నేను సీనియర్ కేంబ్రిడ్జి చదివే రోజుల్లో మాకు జరిగిన ఒక నిదర్శనం గూర్చి రాస్తున్నాను.

మా ఇంట్లో తిరుపతి హుండీ వుండేది. ప్రతినెల తోచినంత డబ్బు హుండీలో వేసి దేవుని దగ్గర వుంచేవాళ్ళం. రెండుమూడు సంవత్సరాల కొకసారి వచ్చేటప్పుడు మాతో కూడా హుండీని తెచ్చుకొని తిరుపతికి వెళ్ళినపుడు మా మొక్కులన్నీ తీర్చివేసి, ఆ మిగిలిన డబ్బు మా హుండీతో కూడ అక్కడవుండే తిరుమల శ్రీవారి హుండీలో వేసే వాళ్ళం.

ఈసారి కూడ మళ్ళీ కొత్తహుండీ మొదలు పెట్టాం. డబ్బు వేస్తూ వుండే వాళ్ళం. మేము అప్పుడు కలకత్తాలో వుండేవాళ్ళం అని చెప్పాగదా. అప్పుడు ఈ హుండీ సంగతి అక్కడ ఒక క్రైస్తవ స్త్రీకి తప్ప మిగతా చాలామందికి తెలీదు. ఆమె మాకు మంచి స్నేహితురాలు.

ఒకరోజు ఆవిడకి డబ్బుచాలా అవసరమయ్యి మాఅమ్మను డబ్బు ఇవ్వమని అడిగింది. నెలాఖరు. అయ్యాక ఏం చేయ్యడానికి తోచలేదు. అప్పుడు ఆవిడే అమ్మకి హుండీ జ్ఞాపకం చేయించి అందులోది ఇవ్వండి. నేను తప్పక వడ్డీతో సహా ఇస్తానండి. అమ్మ బాధపడుతూ హుండీలో డబ్బు ఎత్తలేక, ఎత్తలేక, ఒక. 20 రూపాయలు మాత్రం అందులోంచి

విధిలేక ఇచ్చింది. ఈ సంగతి అందరూ ఆ తర్వాత మర్చిపోయారు. ఆమెకూడాను, ఎన్నోనెలలు గడచిపోయాయి. మానాన్న.గారికైతే ఈ విషయం తెలియనే తెలియదు.

ఒకరోజు నిద్రపోతుండగా అర్థరాత్రి మానాన్నగారికి కలలో ఇద్దరు బ్రాహ్మణవృద్ధ దంపతులు కనపడి "ఏం అయ్యా! ఇచ్చిన బాకీ చెల్లించవా? ఇంక ఎన్నాళ్లు వుంచుకొంటావు" అని అడిగారట. మానాన్న గారు "మీ కేమిటండి నేను బాకీ? నేను ఎప్పుడూ ఎవ్వరివద్ద అప్పుచేయను. నేనేమీ మీకు బాకీలేదు పొండి" అన్నారట. అప్పుడువారు 20 రూ. హుండీనుండి తీసారని జ్ఞాపకం చెయ్యగా, మానాన్నగారు నవ్వుతూ, ఇది తీసుకుంటారా అని వారికి తన ఉంగరాన్ని తీసి ఇచ్చినట్లుగ ఇచ్చి మళ్లీ తనవేలికే తగిలించుకున్నారట. ఇదంతా కలలోనే జరిగింది. తెల్లవారి నిద్ర లేచినప్పటికల్లా ఉంగరం వేలు బాగా వాచిపోయింది. ఉంగరం మధ్య తగులుకొంది. ఇటూ అటూ వేలు వాచిపోయింది. మానాన్న గారు అమ్మని పిల్చి హుండీలో డబ్బు ఏదైనా తీశారా అని అడిగారు. మా అమ్మకి జ్ఞాపకం వచ్చి 20రూ.లు తీశానని చెప్పింది. నాన్నగారు తనవేలు చూపుతూ కల సంగతి అంతా వివరించారు. వెంటనే మేము హుండీలో వేయవలసిన డబ్బు వడ్డీతో సహా వేసేశాం. నాన్నగారు కంసాలివాడి దగ్గరికెళ్లి ఉంగరం కత్తిరించుకొని వచ్చారు. ఆబంగారం ముక్కలు రెండు హుండీలో వేసేశాము. దీనితో ఆ స్వామివారిమీద మాకు భక్తి మరీ జాస్తి అయింది. క్రైస్తవ స్త్రీకి 20రూ. సంగతి తెలియజేశాం. ఆమెకూడా ఆశ్చర్యంతో 20 రూ.లతో పాటు వడ్డీకూడా హుండీకి సమర్పించింది. ఆమెకు కూడా స్వామివారంటే భక్తి ఏర్పడింది. ఇంక ఇలాంటి నిదర్శనాలు లీలలు ఎన్నో ఎన్నెన్నో !

# రోగ నివారకుడు

-- *శ్రీ టి. సత్యనారాయణమూర్తి, ఏ. వేమవరం (తూ.గో.జి)*

అది డిశంబరు 1985వ సంవత్సరం. మా తమ్మునికి ఆరోగ్యం బాగుండటంలేదు. రెండుమూడు నెలలు బాధపడి కాకినాడలో పెద్దడాక్టరుగారిచే పరీక్ష చేయించుకున్నాడు. ఆ డాక్టరు పరీక్షలు జరిపి, గుండెవద్ద ఒక గొట్టం (వాల్వు) మూసుకున్నదనీ, తక్షణం హైద్రాబాదు వెళ్ళి శస్త్ర చికిత్స చేయించుకోమనీ, ఇప్పటికే ఆలస్యమైందనీ, ఇంక ఆలస్యం చేస్తే ప్రాణాపాయమనీ చెప్పారు.

మా తమ్ముడు ఇంటికి వచ్చి ఈ సంగతి నాతో చెప్పాడు. ఆవార్త విన్నంతనే నాకు నవనాడులు క్రుంగి పోయాయి. ఏమి చెయ్యాలో తోచలేదు కారణం వేలమీద డబ్బు ఖర్చు. నేను తట్టుకోలేను. ఈ ఆపదనుండి నన్ను రక్షించేవారెవరు? నన్ను ఆదుకునేవారెవ్వరు. నాతమ్ముణ్ణి రక్షించేదెవ్వరు? ఇలా అనేక ఆలోచనలతో మనస్సు మొద్దుబారి పోయింది. నన్ను మానవమాత్రులెవ్వరు రక్షించలేరు. ఒక్క భగవంతుడు తప్ప. అని ఆలోచించి స్వామివారిని ఇట్లా కోరుకున్నాను. "స్వామీ! ఏడుకొండలవాడా! వేంకటరమణా! మాతమ్మునికి శస్త్ర చికిత్స లేకుండా మందులతో జబ్బును నయంచేసి, వాణ్ణి కాపాడుస్వామీ! నేను తిరుపతినుండి తిరుమలకు కాలినడకన వచ్చి నీదర్శనం చేసికుంటాను. మమ్ములను కాపాడు తండ్రీ!" అని.

1986 జనవరిలో మాతమ్మునికి తోడిచ్చి హైదరాబాదు పంపినాను. అచట అవసరమైన పరీక్షలు జరిపి మరల ఫిబ్రవరిలో రమ్మనమనీ, అప్పుడు శస్త్రచికిత్స అవసరమా, లేదా అనేది తెలియజేస్తామని చెప్పారు. ఫిబ్రవరిలో మా తమ్మునితో కలిసి నేనుకూడా హైదరాబాదు వెళ్ళినాను. డాక్టరుగారిని కలువగా "నేను సెలవులో వున్నాను. మా అమ్మగారికి వంట్లో బాగులేదు. నాభార్యకు కాలు విరిగింది. కనుక మీరు మార్చిలో రండి" అని చెప్పారు.

మేము మళ్లీ మార్చిలో వెళ్ళినాము. నాకు ఏదో తెలియని ఆందోళన, ఆత్రుత, స్వామిని నమ్ముకొని డాక్టరును కలిశాము. "మాఆసుపత్రిలో వున్న యంత్రం మరో ఆసుపత్రికి తీసుకెళ్ళారు. దానిని తిరిగి ఎప్పుడు పంపిస్తారో తెలియదు. కావున ఏప్రిల్ నెలలో నాకు ఉత్తరం వ్రాయండి. నేను యంత్రం వచ్చినదీ, లేనిదీ జాబువ్రాసి మీకు తెలుపుతాను" అన్నారు.

నాకు వెర్రి కోపం వచ్చింది. ఏమిటి సార్ మీరు తిరిగి పొమ్మంటున్నారు. అనవసరంగా రెండుమూడు మార్లు తిరిగాం. ఖర్చులు అవుతున్నాయి. మాతమ్ముడు నీరసంగా వుంటున్నాడు. ఇప్పటికి వైద్యం మొదలుపెట్టలేదు. ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు" అన్నాను. అందులకు ఆ డాక్టరు "నాపద్ధతి అంతే. ఏప్రిల్‌లో కలవండి నన్ను. వెళ్ళి రండి" అన్నారు. నేనేం చెయ్యను భగవంతుడా? ఇలాంటి డాక్టరును నమ్మినందుకు బాగా చేశారు. అనుకొని మరునాడు. స్వామివారిని వేడుకుంటూ, మరో ప్రముఖడాక్టరును కలిసి నా ఆవేదన విన్నవించుకున్నాను.

ఆ కొత్తడాక్టరుకూడా అన్ని పరీక్షలు జరిపించినారు. ఫలితం "శస్త్రచికిత్స అవసరం లేదు. మందులతో నయమవుతుంది. భయంలేదు' అని వారుచెప్పారు. నా ఆనందానికి హద్దులులేవు. స్వామివారు ఎంత దయా సముద్రులు నా ఆపదను తీర్చినాడు. మందులు తీసుకొని ఇంటికి తిరిగి వచ్చాము. మరల మే నెలలో వచ్చి నట్లయితే పరీక్షించి చూస్తాను అన్నారు డాక్టరుగారు. మేము ధైర్యంగా వున్నాము. మేనెలలో మరలా మాతమ్ముడు డాక్టరును కలిశాడు బాగుంది మరోరెండు నెలలు మందు వాడమన్నారు" డాక్టరుగారు.

స్వామివారి దయ మామీద నిండుగావున్నది. ఇక మావాని రోగం పూర్తిగాపోతుంది. ప్రాణగండం గడిచింది. మేనెల 12వ తేదీన బయలుదేరి 13వతేదీ ఉదయం దిగువ తిరుపతి చేరాను. కాలినడకన తిరుమల చేరుకున్నాను. స్వామివారిని దర్శించుకొని, చూపిన దయకు మనఃపూర్వకంగా నమస్కరించాను.

ప్రస్తుతం మాతమ్ముడు సంపూర్ణారోగ్యంతో వున్నాడు. అంతా ఆ స్వామివారి దయ.

## నామ మహిమ

*-- శ్రీమతి ఎం. కోటేశ్వరమ్మ, లేబూరు, నెల్లూరుజిల్లా*

నెల్లూరుజిల్లాలో మాదొక మధ్యతరగతి వ్యవసాయకుటుంబం. మాతాతగారు స్వర్గస్థులుకాగా, మాబామ్మ తిరుమల కొండపై శ్రీ వారి సన్నిధిన గడుపుతుండినది. ఆమె శ్రీ వేంకటేశ్వర స్వామి భక్తురాలు. మరి కొన్నాళ్లకు ఆమె అస్వస్థురాలు కాగా ఆచరమదశలో మా స్వగ్రామానికి తీసుకవచ్చాము. ఆదశలో ఆమె మరణశయ్యలోనుండగా నేను తొలి గర్భంతో నిండుచూలాలుగా ప్రసూతి మంచంపై వుండినాను. అపుడు మా బామ్మ నన్ను ఉద్దేశించి పలికినది. మన ఇష్టదైవం శ్రీనివాసుడు. కలియుగ అవతార పురుషుడు. ఆయనపేరే నాకు పెట్టారు. నీవు బిడ్డకు ఆ స్వామి పేరేపెట్టు. నామాటమీద నీకు ఆమాత్రం అభిమానం, ప్రేమవుంటే చాలు! "తప్పకుండా నీ ఇష్టప్రకారమే చేస్తాం. నీకోరిక తీరుస్తాం" అని మేమంతా కళ్ళనీళ్ళతో ఆమె చేతులు పట్టుకొని భరోసా ఇచ్చాము. ఆ మరురోజు ఆమె స్వర్గస్థురాలయింది. ఆమె అంత్యక్రియల రోజున నాకు ఆడపిల్ల పుట్టింది.

హుషారుగా చలాకిగా కళ్ళముందే ఎదిగిపోయింది ఆపాప. దగ్గరిపట్టణంలోని కాన్వెంటులో చేర్చాము. వరదలాపొంగుతున్న నాగరిక కాలప్రవాహానికి నేను సైతం లోనయి నాబిడ్డకు కాన్వెంటులో హాజరు రిజిష్టరులో పేరు 'వైశాలి"గా నమోదు చేయించాను.

కొన్నేళ్ళు సునాయాసంగా గడచిపోయాయి. 6వతరగతి ప్రవేశపరీక్షకు పిల్లలందరూ సిద్ధమవుతున్నారు. ఆనాలుగవరోజు దరఖాస్తు ఫారం ఉన్నత పాఠశాలలో ఇచ్చి పరీక్షకు కూర్చోవాలి. అది జిల్లా స్థాయి ప్రవేశ పరీక్ష. ఆపత్రంలో పేరు, వయస్సు ఒకసారి నమోదు చేస్తే ఇక జీవితమంతా, వాటితోనే వ్యవహరించబడుతారు. ఎంతో కుశాగ్రబుద్ధిగా, తెలివితేటలతో రాణిస్తున్న మాపాపకూడ ఉత్సాహంగా ప్రవేశపరీక్షకు తయారయింది. కానీ ఆ తెల్లవారి వున్నట్టుండి 'వైశాలి' అకస్మాత్తుగా జ్వరానపడింది.

చూడని వైద్యుడు లేడు. చేయని చికిత్సలేదు. చివరకు మంత్రాలు తంత్రాలు కూడ చేయించాం. మూసినకన్ను తెరవలేదు. పరీక్షలు ఆమూడవరోజునే.

వైద్యులకు అంతుపట్టని ఆపాప స్థితి మాకు బెంబేలెత్తించింది. నోటి వద్దకు వచ్చిన పరీక్ష. ఇంతకాలంగా ఎదురుచూసిన సువర్ణావకాశం అందినట్టే అంది అందకుండా పోతుందని ఒక బాధ. చివరకు బిడ్డయినా మాకు దక్కుతుందా? అన్న బాధ కడుపును కోయసాగింది. ఇంతలో రేపు పరీక్ష అనగా నాకు ఠక్కున మదిలో మెరుపు మెరిసింది. వెంటనే దరఖాస్తుఫారం తీసుకుని శ్రీ వెంకటేశ్వర స్వామివారి పటం, ఆపక్కనే బామ్మగారి ఫోటోలముందుంచి నాపిల్లపేరు "వెంకటరమణమ్మ" గా వ్రాసి, జరిగిన తప్పిదానికి చెంపలేసుకుని మన్నించవలసిందని స్వామివారిని వేడుకొన్నాం.

మామూలుగా డాక్టరు వాడమన్న మందులు వాడినాము. మమ్మల్నందర్నీ ఆశ్చర్యచకితులను చేస్తూ ఆమరుసటిరోజు ఉదయం నాబిడ్డ నిద్రనుండిలేచింది. హాలుటికెట్టుతో పరీక్షహాలులో ప్రవేశించింది. మూడు రోజులు జరిగిన పరీక్షల్లో క్షుణ్ణంగా జవాబులు రాసి జిల్లా స్థాయిలో ప్రథమురాలిగా కృతర్థురాలయింది. దాదాపు అపస్మారక స్థితిలో వుండి చదివిన చదువంతా మరచి వుంటుందన్న మాఊహలను త్రోసి రాజని గౌరవనీయమైన స్థానంతో ఉత్తీర్ణురాలయింది. ఆ దేవదేవుడే నా బిడ్డయందు ప్రవేశించి నడిపివుంటాడని ఈ నాటికీ మా విశ్వాసం. ఆతర్వాత మాకుటుంబీకులంతా తిరుమలకు ఏడుకొండలు నడచి ఎక్కి మా బామ్మగారు బస చేస్తుండిన వసతిగృహంలోనే మకాంచేసి అందరం తలనీలాలు సమర్పించి, కొండపైని తీర్థాలన్నీ దర్శించాము.

'పేరులో ఏముందిలే' అన్న నిర్లక్ష్యం ఉదాసీనత నాజీవితంలో ఒక అగ్నిపరీక్ష పెట్టి ఒక సవాల్‌గా నిలిచి నన్ను నిలదీసింది. నా జీవన పర్యంతం మరువలేని మరపురాని వాస్తవ సంఘటన ఇది!.

# ప్రసాద మహిమ

*-- శ్రీ గుడిపల్లి నాగేంద్రబాబు, కాకినాడ.*

ఆపదమొక్కులవాని ప్రసాద మహిమవలన మానాన్నగారు ఏవిధంగా రక్షింపబడిందీ తెలుపుతాను.

ఆ సంఘటన జరిగింది 1969వ సంవత్సరంలో. ఆరోజుల్లో మానాన్నగారు ఒక శేఠ్‌గారి కొట్టులో గుమాస్తాగా పనిచేసేవారు. శేఠ్‌గారు 40రూ॥లు మాత్రమే ఇచ్చేవారు. మాకు కొంత వ్యవసాయమున్నది. దానిమీద వచ్చే ఆదాయంతోను ఈ 40రూ॥ల జీతంతోను జాగ్రత్తగా కుటుంబాన్ని నెట్టుకొచ్చేవారు.

ఇట్టి పరిస్థితుల్లో మానాన్నగారికి అకస్మాత్తుగా మాటలు నత్తిగా రావడం మొదలయింది. నత్తి క్రమక్రమంగా పెరిగి మరీ ఎక్కువయ్యింది. మానాన్న నత్తిగా మాట్లాడటం చూసి బంధువులు, స్నేహితులు, శేఠ్‌గారు ఆశ్చర్యపడి "అయ్యోపాపం ఇలా వచ్చిందేమిటా" అని బాధపడ్డారు. ఇక మా పరిస్థితి సరేసరి. మానాన్నగారు 'నా పరిస్థితి ఏమిటి ఇలా అయ్యింది. కుటుంబ భారం ఎలా!' అని ఆందోళన చెందేవారు. మానాన్నగారు తాను పనిచేసే కొట్టులో ప్రతినిత్యం వచ్చిన వారితో మీకెంత డబ్బుకావాలి? మీపేరు ఏమిటి? మీ చిరునామా....." ఇలాంటి వివరాలు అడుగవలసి వుంటుంది. కాని ఉద్యోగ ధర్మానికి నత్తి ఒక తీరని అడ్డంకి అయ్యింది.

ఇట్టి పరిస్థితిలో శేఠ్ "గుమస్తాగారు! ఏమిటి మీకు మాటలు నత్తిగా వస్తున్నాయి" అని అన్నారట. ఇట్టి సందర్భంలో వున్న చిరుద్యోగంకూడా ఎక్కడ పోతుందో అని భయపడేవారు. ఏడాక్టరుకు చూపించుకోవాలన్నా ఆర్థికంగా శక్తిలేని రోజులవి.

ప్రతిరోజు మానాన్నగారు శ్రీ వేంకటేశ్వరస్వామివారి పూజ చేసేవారు. ఎవరైన భూతవైద్యమునకు సంబంధించిన ప్రయోగం చేసారేమోనని మా అమ్మగారు నానమ్మగారు చూపించుకోమన్నారు. కాని మానాన్న "కొండంత దేముడు వుండగ ఎవరికి చూపించుకోనవసరములేదు. ఆయనే చక్క జేస్తాడు" అనేవారు. అది ఆయన గట్టివిశ్వాసం.

మానాన్న నత్తిగా మాట్లాడటం మొదలయిన కొద్దిరోజులకు ఆయన చిన్నాయన, పిన్నమ్మగారు తిరుమలేశుని దర్శనార్థం తిరుపతికి వెళ్ళినారు. వారు వెళ్ళిన ఒక వారం రోజులకు మానానమ్మగారిమీద వేంకటేశ్వర స్వామివారు ఆవహించి "దయానందం (దయానందం మానాన్నగారి పేరు) మీ పిన్నిగారు, చిన్నాయనగారు నా దర్శనార్థం వచ్చారు. వారు తీసుకవచ్చే ప్రసాదాన్ని ఏరోజైతే నీవు భక్తితో స్వీకరిస్తావో, ఆరోజునే నీ నత్తిపోతుంది" అని అభయమిచ్చాడు.

తిరుపతి వెళ్ళిన బంధువులు, ఆ తిరుమలేశుని దర్శించి, మిగతా క్షేత్రాలు దర్శించి ఒకనెలరోజులకు స్వస్థలము చేరినారు. మానాన్నగారు, వారు తిరుపతి నుండి వచ్చిన తరువాత వారింటికి వెళ్ళి, స్వామివారి ప్రసాదాన్ని అడిగి భక్తితో ఇంటికి తీసుకవచ్చారు. వారిచ్చిన ప్రసాదాన్ని, ఇంటివద్ద మరల భక్తిప్రపత్తులతో పూజించినాము.

పూజించిన తర్వాత మేమంతా మానాన్నగారితోపాటు తిరుమల స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించాము. ఆశ్చర్యంగా ఆ ప్రసాదం స్వీకరించిన వెంటనే మానాన్నగారికి నత్తిగా మాట్లాడటం పూర్తిగా తగ్గింది. స్పష్టంగా, చక్కగా మాటలు వచ్చినవి.

తిరుమలేశుని ప్రసాదం మానాన్నగారికి దివ్యౌషధంగా పనిచేసింది. భగవంతుని కృపవలన మేమంతా సుఖంగా వుంటూ ,స్వామివారిని నిత్యమూ పూజిస్తూ స్మరిస్తున్నాము.

## అమృత హస్తం

--శ్రీ డి. ఆర్. సుమనశ్రీ

'నీవు ఎన్నో సన్మానాలు, బిరుదులు, పొందుతున్నావంటే, ఆ ఘనత నీది కాదు. ఏడుకొండలవాడిదే' ఓ ప్రముఖ జ్యోతిష్కుడు నాతో అన్నమాటలివి.

'బాబూ! సంవత్సరానికి ఎన్నోసార్లు నీవు తిరుమలకు వెళ్ళివస్తున్నావంటే నాకు ఆశ్చర్యం కలుగుతుంది. ఆభాగ్యం కొందరికే

కలుగుతుంది. నీవు నిజంగా అదృష్టవంతుడివి.' ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, భూగర్భశాస్త్రవేత్త, ప్రముఖ పత్రికారచయిత శ్రీ పింగళి పరశురామయ్యగారు నాతో అన్నమాటలివి.

ఇది స్తవం కాదు. వాస్తవం. కారణం ఆ వేంకటేశ్వరుని అమృతహస్తం నన్ను సర్వదా కాపాడుచున్నది. ఎలా!!

ఓరోజు హైదరాబాదు వెళ్ళటానికని బయలుదేరి విజయవాడలో పనిచేసుకొని అక్కడనుండి హైదరాబాదు వెల్దామనుకొన్నాను. విజయవాడలో పనిచేసుకొని హైదరాబాదు వెళ్ళు బస్సు ఎక్కడంకోసం టికెట్టు కొరకు క్యూలో నిలబడ్డాను. ఆర్.టి.సి.లో పనిచేస్తున్న, నటుడు, గాయకుడు అయిన ఓమిత్రుడు కలిసి తర్వాతి బస్సుకు వెళ్దాం, నేనూ వస్తున్నాను అన్నాడు. ఇద్దరం కలిసి తర్వాతి బస్సుకు వెళ్ళాం. ముందు నేను వెళ్ళదలచుకొన్న బస్సు దోవలో ప్రమాదానికి గురి అయింది. ఆ బస్సులో నేనే వుంటే?

ఒక సారి మా కుటుంబమంతా కారులో భద్రాచలానికి వెళ్ళి వస్తున్నాం. విజయవాడ నుండి గుంటూరు వచ్చేదారిలో మాకారును ఓ జీపు గుద్దుకోబోయింది. మాకారు డ్రైవరు చాకచక్యంవలన ఘోరప్రమాదం తప్పింది.

సరిగ్గా రెండు సంవత్సరాల క్రితం తీవ్రసుస్తీ చేసింది. డాక్టర్లు కూడా లాభంలేదని చెప్పారు. ఇంటికి తీసుకొని వచ్చాం. తిరుపతికి వెళ్ళి వచ్చేటప్పుడు నెల్లూరులో పని పూర్తిచేసుకొని వస్తానని ఇంటిలో చెప్పి వెళ్ళాను. స్వామిదర్శనం అయింది. తెల్లవారు జామున జపంచేసి కొంటున్న నాకు, మా తల్లి చివరి శ్వాసలో వున్నట్లు కళ్ళకు కట్టినట్లు కనిపించింది. వెంటనే కొండదిగి మావూరు వచ్చేశాను. ఇంటికి వచ్చేసరికి అమ్మను చీరాల ఆస్పత్రికి తీసికెళ్ళినట్లు చెప్పారు. నేను వెళ్ళిన కొద్ది గంటలకే మా తల్లి పరమపదించింది. అదేనేను, నెల్లూరులో రెండురోజులు వుండి వుంటే?

పోయిన సంవత్సరం నాకు సుస్తీ చేసింది. నాకు ఆస్వామే డాక్టరుకనుక తిరుపతి వెళ్ళాను. స్వామిదర్శనం చేసుకున్నాను. రాత్రి

కలలో ఓనగరం, ఓ ఆసుపత్రి ఓలేడీడాక్టరు నాకు వైద్యం చేస్తున్నట్లు కల వచ్చింది. ఇంటికి వచ్చి, ఆఫీసుకు వెళ్ళి ఓ 10 రోజులు సెలవు పెట్టి హైదరాబాదుకు వెళ్లాను. అక్కడ చదువుకొంటున్న మా కుమార్తెలనిద్దరిని చూసినట్లుంటుందని, ట్రీటుమెంటు తీసుకొంటున్నట్లుంటుందని, మా అత్తగారింటి వద్దనుండి సుమారు ఓ నాలుగు కిలోమీటర్లు నడచాను. ఇక నడవలేక పోయాను. ఆయాసం ఎక్కువైంది. దగ్గరలోనే ఓ నర్సింగ్ హోం కనపడింది. విజిటింగు కార్డు ఇచ్చాను నర్సుకి. డాక్టరు నుండి పిలుపు వచ్చింది. ఆశ్చర్యం నాకు కలలో కనపడిన డాక్టరుగారే. నన్ను నేనే పరిచయం చేసుకున్నాను. పరీక్షలు మొదలయ్యాయి. ఓ పదిరోజులు రోజూ రమ్మన్నారు ఆ లేడీడాక్టరుగారు. మందులు రాసిచ్చారు. ఆరునెలలు రెష్టు అవసరమని అన్నారు. రోగం మటుమాయమయ్యింది.

ఇటీవల మీటింగులు ఎక్కువయినాయి. మా శ్రీమతి ఈ మధ్య అడిగింది. 'మరల తిరుపతి వెళ్ళలేదే' అని. తీరికలేక వున్నాను. వీలు చూచుకొని వెళ్తాలే అని మోటారు సైకిలుపై బాపట్ల బయలుదేరాను మీటింగుహాజరు కావటానికిని సగం దూరం వెళ్ళిన నాకు శరీరమంతా అదోలా అనిపించింది. ఎందుకో బండికి తగిలించబడిన అద్దంలో చూశాను. స్వామి కనిపించాడు. అంతే అపరాధం జరిగింది. అనుకొన్నాను. గడ్డం పెంచాను. వారం రోజులలో సెలవుపెట్టి తిరుపతి వెళ్లాను. స్వామి దర్శనం చేసుకున్నాను. ఆ రాత్రి కాటేజిలోనే నిద్రపోయాను. తెల్లవారుజామున ఓ అందమైన కల, నేను ఉద్యోగంతోపాటు వ్యాపారంచేస్తున్నట్లు. అదీ ఓ ఫ్యాన్సీషాపు. దంపతులు నాకు సహాయపడినట్లు,

ఇటీవల మా సహోద్యోగి ద్వారా ఓ పుస్తకాలషాపు నిర్వహిస్తున్న ఓ దంపతులతో పరిచయం కలిగింది. కొద్ది రోజులలోనే వారు నాకు ఆత్మీయులయ్యారు. నాకూ ఓషాపు పెట్టాలనే ఆలోచన వచ్చింది. మా సహోద్యోగి, నేను కలిసి మా అర్ధాంగులపేర ఓ షాపు పెట్టాలనుకున్నాం. శ్రీ వేంకటేశ్వరునిపై భారం వేశాం. పనులు ప్రారంభించాలి. మాకు

ఆషాపు నిర్వాహకులు అనేక సలహాలిస్తున్నారు. మాకోసం శ్రమిస్తున్నారు. ఆ పద్మావతి వేంకటేశ్వరులే వీరిలో ప్రవేశించారని నేను తలుస్తుంటాను. మేము ప్రారంభింపబోయే ఫ్యాన్సీషాపుకు ఆ స్వామి కరుణాకటాక్షం అన్నివేళలా లభిస్తుందని ఆశిస్తున్నాం.

అన్నట్లు ఓ విషయం చెప్పడం మరచాను. రోజూ నేను చేసే జపం శ్రీ వేంకటేశ్వరునిదే. సుమారు ఐదు సంవత్సరాల క్రితం మద్రాసులో వేంకటేశ్వరస్వామి గుడిని కట్టించిన ఓ ప్రముఖడాక్టరు డా॥టి.యస్.కనకగారు నాకు ఓకార్డు ఇచ్చారు. ఆకార్డులో శ్రీ వేంకటేశ్వరుని మంత్రజపం వుంది. రోజు 108 సార్లు జపించమన్నారు. అలాగే చేస్తున్నాను. అప్పటినుండే నా జాతకం మారింది. ఉద్యోగంలో ప్రమోషన్, నాట్యకళాకారిణిగా నాకుమార్తెకు ప్రశంసలు, నటునిగా, రచయితగా నాకు ఎన్నో బిరుదులు, సన్మానాలు ఇదంతా నాప్రతిభ కాదు. ఆ ఆనందనిలయుని అమృతహస్తం దీవన ఆశీర్వాదబలమే. ఇది పరమసత్యం.

## బిడ్డ నిచ్చిన దేవుడు

*-- శ్రీమతి సి.హెచ్. నిర్మలారెడ్డి, విజయవాడ.*

1982వ సంవత్సరంలో నాకు వివాహం జరిగింది. శ్రీ వేంకటేశ్వరస్వామి అనుగ్రహం వలన కొంతకాలానికి నేను గర్భవతినైతిని. మూడవనెల గర్భముతో వుండగా ఒకరోజు వున్నట్లుండి విపరీతముగా కడుపునొప్పి వచ్చినది.

వెంటనే ఆసుపత్రికి వెళ్లి డాక్టరమ్మతో పరీక్ష చేసికొంటిని. ఆమె నన్నుబాగా పరిశీలించి, విశ్రాంతి చాల అవసరమని, ఏమాత్రం పొరపాటు అయినా గర్భం పోగలదని చెప్పారు. మందులు రాసిచ్చారు.

ఆ మందులతో కొద్ది రోజులు మా అమ్మగారి దగ్గర విశ్రాంతిగా వుండాలనే ఉద్దేశంతో పుట్టినింటికి వెళ్లాను.

అక్కడ ఎంత జాగ్రత్తగా వున్నా ఒకరోజు నాకు రక్తస్రావమయినది. మళ్లీ డాక్టరు దగ్గరకు వెళ్లగా రక్త స్రావము కాకుండా రెండు సూదులు ఇచ్చారు. అయినను ఫలితము లేదు. ఆరాత్రి విపరీతమైన కడుపునొప్పితో ఒకటే రక్తస్రావము జరిగినది.

ఇంకా ఇలాంటి సమయంలో ఆదుకొనే బంధువు శ్రీ వేంకటేశ్వరుడు ఒక్కడే అని చేతులెత్తి కన్నీళ్లతో కరుణామయుడైన శ్రీనివాస ప్రభువును వేడికొంటిని. నాయీ గర్భమును నిలుపుమని నిండు హృదయముతో ప్రార్థించాను.

మరునాడు ఉదయం మళ్లీ ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకొనగా, డాక్టరమ్మగారు గర్భము స్రావమయినది గర్భము నిలువలేదు" అని చెప్పారు.

అంతే నాగుండె భగ్గున పగిలినది. ఎంతగా వేడుకొన్నా ఆ ఏడుకొండలవాడు నన్ను కరుణించలేకపోయినాడే అని ఎంతో బాధ పడినాను. విచారించినాను.

ఒక నెల గడచినది. నాకు ఏదో అనుమానముగా వుండి మరల ఇంకో పెద్ద డాక్టరమ్మ దగ్గరికి వెళ్లి చూపించుకున్నాను.

ఆమె నన్ను బాగా పరీక్షచేసి సంతోషమును వ్యక్తముచేస్తూ, నీవు నాలుగు మాసాల గర్భవతివి' అని చెప్పారు.

నేను ఆశ్చర్యముతో ఒక నెలక్రిందట నాకు అధికరక్త స్రావమయినది' అని తెలిపాను.

ఆ డాక్టరు "నీకు రక్తస్రావము జరిగి గర్భము నిలుచుటచాల ఆశ్చర్యము. పైగా నీలాంటి బలహీనురాలికి గర్భము నిలుచుట మరీ మరీ ఆశ్చర్యము. కేవలం దైవానుగ్రహం మాత్రమే." అని చెప్పి బలమునకు మందులు వాడుమని చెప్పారు. తరువాత కొద్దికాలమునకు నాకు పండంటి ఆడబిడ్డ పుట్టింది. రక్త స్రావం జరిగిన సమయంలో ఆపదమొక్కులవాడిని ఆ శ్రీనివాసుని ప్రార్థించుటవల్లనే పోయిందనుకున్న గర్భం నిలిచి పండంటిపాప పుట్టింది. ఆ ఏడుకొండలవాని లీలను

ఏవిధముగా వర్ణింపగలను. ఆపదలో మనసారా వేడుకొన్నచో, నమ్మకముగా ఆదుకొనే స్వామి వేంకటేశ్వరస్వామి. నా జీవితాంతము ఆస్వామి పాదాలసన్నిధే నాకు పెన్నిధిగా భావిస్తాను. శరణు కోరినవారికి అభయమిచ్చి కరుణించే ఆస్వామి కివే నా శత సహస్ర నమస్సుమాంజలులు.

## సంకట హరణుడు

*-- శ్రీ. పి.కె.ఆర్. ఆచార్యులు. ఖాలరి(పో) రాంచి(జిల్లా) బీహారు(రా)*

నేను 70 సంవత్సరముల వయస్సు వాడిని. మూడు సంవత్సరముల క్రితం కుడికన్ను శుక్లము నాకు ఆపరేషను రాంచీలో చేయించగా ఆపరేషను లోపమువలన ఆరునెలల్లో కొంత బాధతో ఆకన్ను దృష్టి పూర్తిగా పోయినది. తర్వాత రెండవ కంటికి కూడా శుక్లము ప్రారంభమై ఏప్రిల్ 1987 నాటికి చూపు పూర్తిగా తగ్గినది. నాకుమారుని వివాహము21-5-87న జరుపుటకు రెండునెలలక్రితమే నిశ్చయించుకొంటిని. అనివార్యకారణములచే ఇది మార్చుటకు వీలు కాలేదు. నేను విధురుడ నగుటచే ఇతరులపై ఆధారపడి ఈ వివాహం నెరవేర్చవలసి వచ్చినది. అప్పటి నాపరిస్థితి :

1. రెండుకన్నులు చూపు పూర్తిగా పోయినది.
2. నాకు రావలసిన రూ. 10,000/-ల పైకము అవతల వ్యక్తి దివాలా ఎత్తుటచే నిరాశమిగిలినది.
3. వివాహము మే 87లో చేయుట తప్పనిసరి.

ఇట్టి ఆందోళన పరిస్థితులలో తిరుమలేశుడైన శ్రీనివాసుని ఈ సంకటములనుండి ఈ వృద్ధుని విముక్తుని చేయుమని మనసారా ప్రార్థించితిని.

విచిత్రమేమోగాని, ప్రణతార్తి హరుడు, ఆపద్బాంధవుడు అయిన శ్రీనివాసుని కృపచే మరొక కంటివైద్యుని సంప్రదించగా ఏప్రిల్ 87లో (రెండవకంటికి) ఆపరేషను చేసివివాహమునకు వెళ్లునట్లుగా చేసెదనని మాట ఇచ్చెను.

ఆ ప్రకారం ఏప్రిల్‌లో ఆపరేషను చేయించుటచే కంటిచూపు తిరిగి వచ్చుట సంభవించినది.

ఆ తిరుమల ప్రభువు కృపావిశేషముచే రావలసిన బాకీ పూర్తిగా వసూలైనది.

వివాహము నిర్విఘ్నముగా, విజయవంతముగా నెరవేరినది.

నామనస్సులోని ఆందోళన ఉపశమించినది. శ్రీనివాసునిపై నమ్మకము ఇనుమడించినది. వెంటనే తిరుమల వెళ్లి స్వామివారిని సేవించి మొక్కులు తీర్చుకొని క్షేమముగా ఇంటికి జేరుకుంటిని.

త్రికరణ శుద్ధిగా శ్రీనివాసుని నమ్మిన వారికి ఆపదలు తొలగి సుఖింతురని "సప్తగిరి" పత్రికా ముఖమున తెలియజేయుచున్నాను.

## ఆరోగ్య ప్రదాత

*-- శ్రీ బి.నారాయణరెడ్డి, బాబాసాహెబ్ పల్లి, అనంతపురం జిల్లా*

మా తండ్రిగారు మనం తిరుపతికి వెళ్ళకూడదు. మనం దొంగలమని చెప్పినా, నేను చిన్నతనంలో 6వతరగతి చదువుతూ, చెప్పకుండా తిరుమలకు వెళ్ళి స్వామిని దర్శించి, తలనీలాలు ఇచ్చి వచ్చెడి వాడను. అప్పటి నుండి నాకు తిరుపతి ఎన్నోమార్లు వెళ్ళి తనివి తీర ఆ స్వామిని దర్శించాలని ఆశ.

నేను 1947 ప్రాంతంలో నాభార్యతో తిరుపతికి వెళ్ళినపుడు తిరుమలకు బస్సులు లేవు. కాలినడకతోనే కొండకు వెళ్లి స్వామిని దర్శనం చేసుకొని, ఆ రాత్రి తిరుమలలోనే వుండి వచ్చాము. 1948 ఆఖరులో వెళ్లినప్పుడు బస్సులుండినవి. అప్పటి నుండి నాకు తోచినప్పుడెల్లా పోయి స్వామిని దర్శించి వస్తున్నాను.

నేను 1987 ఫిబ్రవరినెల 18వతేదీకూడ శ్రీ స్వామివారిని దర్శించి స్వామివారి నిత్య అన్నదానసత్రంలో స్వామివారి ప్రసాదమును స్వీకరించి వచ్చితిని.

1987మే నెల మొదటివారంలో జ్వరంతో కూడిన వ్యాధి వచ్చినది. కడుపు ఉబ్బరము, కాళ్లు చేతులు వాపులు ఎక్కువయి బయటికి నడవలేకుండా రాత్రుల్లు పగలు నిద్రలేకుండా ఆహారము, నీళ్లు కూడా లేకుండా బాధపడే వ్యాధి వచ్చినది.

మేనెల ఆఖరున కదిరిలో డాక్టరు దగ్గర చూపించి అన్నిపరీక్షలు చేయించుకొని కొన్నిమందులు వాడమని చెప్పినందున మందులు వాడుతుంటిని. ఇట్లాగే మే,జూన్ నెలంతా బాధపడితిని.

బాధకు తట్టుకోలేక "స్వామీ ఏడుకొండలవాడా నన్ను తొందరగా నీలోకి తీసుకెళ్లు;లేదా నా ఆరోగ్యము బాగుపడేలాగు చెయ్యి. నీసన్నిధికి వచ్చినేను జనవరిలో తలనీలాలు ఇచ్చి, నీకు ముడుపుగా రూ. 116/-లు చెల్లించుకుంటానని" మొక్కుకున్నాను. ఎప్పుడు ధ్యానించుకుంటూనే ఉండినాను.

నేను చనిపోతానని నన్ను చూచుటకు బంధువులు, స్నేహితులు, ఊరిలోనివారు గుంపులు గుంపులుగా రోజూ వచ్చి చూచి పోవుచుండిరి. బ్రతుకు తానని ఎవరికి కూడ ఆశలేదు. డాక్టరు, నా ఊపిరి తిత్తులు చాలా దెబ్బతిన్నవని చెప్పినందువలన, నేను ఎక్కడ మరణిస్తానో అనే భయంతో నాకుమారులు నన్ను ఎక్కడకు తీసికొని వెళ్లలేదు.

నాకు శ్రీ వేంకటేశ్వర స్వామివారు, మాతండ్రి రూపుదాల్చి జూలై 8వ తేదీ రాత్రి స్వప్నంలో కనిపించి, "ఆసుపత్రికి,పో, భయంలేదు" అని నిద్రనుండి లేపినట్లు అయింది. మెలకువ వచ్చి చూస్తే ఎవరుకూడా లేరు. అపుడు స్వామివారే నన్ను ఆవిధంగా హెచ్చరించినారని భావించి ఆ ఉదయం నాకుమారులను పిలిపించి నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లండి అనిచెప్పినారు. 10వ తేదీ ఉదయం 6గం॥కే బయలుదేరి చిన్నబల్లాపురం మిషను ఆసుపత్రికి వెళ్ళి మధ్యాహ్నం 12గం॥కు చేరినాను.

ఆరోజు నాకు అన్ని పరీక్షలు చేసి ఒకసూది వేసి, మాత్రలు ఇచ్చినారు. రోజూ మాత్రలు మాత్రమే వాడమని చెప్పినారు. నేను 64 కిలోల బరువుగల మనిషిని నాలుగుదినములలో 14 కిలోల బరువుతగ్గాను.

రక్తపుపోటు తగ్గింది. చూచితిరా శ్రీ వేంకటేశ్వరుని లీలలు. 3 నెలలనుండి బాధపడేనాకు, 3 రోజుల్లో ఆరోగ్యము బాగు పడినది.

జూలై 25న డాక్టరు గారు నన్ను ఇంటికి వెళ్ళమని చెప్పి, మందులు మాత్రలు వ్రాసి ఇచ్చి, మళ్ళీ నెలకు వచ్చి పరీక్ష చేయించుకొమ్మని, పంపారు

ఊరికి వస్తూనే నన్ను చూచిన వారంతా ఆశ్చర్యపడ్డారు. ఇదంతా ఆ వేంకటేశ్వరస్వామివారి ప్రభావమే అని అందరికీ చాటాను. ఆస్వామివారిని నమ్ముకుంటే మనం ఆపదలనుండి తప్పక రక్షింపబడెదమని రూఢిగా చెప్పగలను.

## పుత్ర దాత

*--శ్రీ నల్లవెల్లి అంజయ్య, ఇరుకోడు.*

కలియుగంలో తిరుపతి శ్రీవేంకటేశుడు భక్తుల పాలిటి కొంగుబంగారం. హృదయ పూర్వకంగా నమ్ముకొని ఆశ్రయించిన భక్తులకోరికలు, అవి ఎట్టివైనా తీర్చే ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీనివాసుడు.

నాపేరు నల్లవెల్లి అంజయ్య. మెదకు జిల్లా సిద్ధిపేట మండలంలోని ఇరుకోడు మా స్వగ్రామం. మా తల్లి దండ్రులకు నేనొక్కణ్ణే ఏకైక సంతానం. ఉన్నంతలో తిండికి, గుడ్డకు కొదువలేని కుటుంబము మాది. నాకు 18సం॥ల వయస్సులోనే వివాహం జరిగింది. నా వివాహానంతరం మాసంసారం ఎన్నో కష్టనష్టములకు గురి అయినది. ముఖ్యముగా నాకు సంతానం కలుగుట, పోవుట జరిగి ఎంతోమానసిక వ్యధకు లోనైతిని. చివరకు జీవిత భాగస్వామినియగు నా భార్యకూడ మరణించెను.

ఆ తర్వాత కొద్దికాలమునకు మా తల్లిదండ్రులు బంధువులు, మిత్రులు ఒత్తిడి చేయుటచే రెండవ పెండ్లి చేసికొంటిని. నారెండవ భార్యకు కూడ పుత్ర సంతానం కలుగుట నెలరోజులు తిరుగకుండగనే గతించుట సంభవించినది. నేను నాదురదృష్టమునకెంతో నాలోనేను కుమిలిపోతూ, ఇదంతా నాపూర్వ జన్మ పాప ఫలితమని నిర్వేదమునకు గురి అయితిని

ఇట్టి దీనావస్థలో నాబాధలను పోగొట్టి నాకు శాంతిసౌఖ్యములు ప్రసాదించగల దేవుడెవ్వరు? అని తీవ్రముగా ఆలోచించితిని. కలౌ వేంకటనాయకః కలియుగంలో వేంకటాచలపతి ఒక్కడే నాబాధలను తొలగించగల దేవుడని నిర్ణయించుకొంటిని, అంతే ఆక్షణంలోనే నామనసు ఊరట చెంది తేలికపడినది. ప్రశాంతత కలిగినది.

ఒక నాడు ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుండి ఆభక్తవత్సలుని "ఓం నమోనారాయణా! వాసుదేవా! పరాత్పరా! జగద్రక్షకా! ఆపద్బాంధవా! అనాథరక్షకా! పద్మనాభా! పురుషోత్తమా! వైకుంఠా! మాధవా! ఆర్తత్రాణ పరాయణా! వేంకటేశా! గోవిందా! గోవిందా! గోవిందా! నాపై జాలి దలచలేవా? నా పాపములను హరించలేవా? నాదుఃఖమును తీర్చలేవా? నామనస్సున నిలువలేవా! నన్ను, నాకుటుంబమును రక్షించలేవా? నాకు సంతానమును నిలపలేవా? నీభక్తుడను! నీదాసుడను. నాకు సంతానమిచ్చి కాపాడితివేని నీదర్శనమునకు వచ్చి ముడుపుచెల్లింతును.' ' అని పైవిధంగా ప్రార్థిస్తూ, రెండు నిమిషములు ఉచ్ఛ్వాస నిశ్వాసములను బిగబట్టి, సాష్టాంగముగా పడుకొని ముక్కుతో "శ్రీ వేంకటేశ" అను నామమును వేలపై వ్రాసితిని. ఆ సమయంలో నాకు మైమరపు కలిగినది. కరుణామూర్తియైన శ్రీ వేంకటేశ్వరస్వామి నిండుగా నన్ను అనుగ్రహించి దీవించినట్లు దివ్యభావన కలిగినది.

ఈ సంఘటన జరిగిన కొద్దికాలానికే నాభార్య గర్భవతి అయింది. 19-12-1979 వతేది మార్గశిర బహుళ పంచమి ఆశ్లేషానక్షత్రంలో పుత్రోదయమయింది. పిల్లవానికి శ్రీధరుడని నామకరణం చేసితిని.

కోరిన కొర్కెను నెరవేర్చి నన్ను కృతార్థుని చేసిన ఆదయామయుని దర్శించి మొక్కు చెల్లించుటకై 6-3-1980 నాడు సకుటుంబముగా ప్రయాణమై, కలియుగవైకుంఠమగు తిరుమల చేరితిని.

పుష్కరిణిలో స్నానమాడి, శ్రీ వరాహ స్వామిని తొలిగా దర్శించుకొని, పుత్రదాతయైన ఆఘనవేంకటేశుని దర్శనార్థం క్యూలో వేచియుంటిని. ఆనాడు భక్తులు వేలసంఖ్యలో నుండిరి. అది చూచి ఒకక్షణమైనా శ్రీ

స్వామివారి దర్శన భాగ్యము కలుగునో? లేదో? అని ఆందోళనతో స్వామిని ప్రార్థించితిని.

ఏమీ పూర్వజన్మసుకృతము ! నామొర వెంటనే ఆలకించినాడు. శ్రీ స్వామివారు సంపూర్ణకటాక్షముతో అనుగ్రహించినాడు.

మేము స్వామిదగ్గరికి వెళ్లనంతలో ఎవరో పెద్దయధికారులు నలుగురు దర్శనమునకు రాగా వారికొరకు ప్రత్యేకదర్శనము, హారతి, చేయబడెను. భగవదనుగ్రహముచే నేను వారిని అనుసరించగా మాకు స్వామివారి దర్శనమేకాక, హారతి తీర్థప్రసాదములు లభించినవి. అందుకు నాజన్మ చరితార్థమయినది. వేనోళ్ల శ్రీనివాసుని స్తుతిస్తూ, రూ. 516/-లతో పాటు నేను స్వామివారికి వ్రాసుకొనిన విజ్ఞాపన పత్రమును హుండీలో మొక్కుచెల్లించుకుంటిని.

దిగువ తిరుపతిలో శ్రీ గోవిందరాజు స్వామి, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి దర్శనాదులు చేసికొని ఎట్టి ఆటంకములు లేకుండా స్వగ్రామం చేరితిని.

నేనొక గొప్పభక్తుడననీ, స్వామివారి అనురాగము పొందినవాడననీ, అహంకారముతో ఈ నాకథను వ్రాసుకొనలేదు. అపరమాత్ముని ముంగిట నేనొక అల్పుడను. విద్యాగంధము లేనివాడను. భక్తి శూన్యుడను. అయినను ఆ లీలా మానుషవిగ్రహుడు, ఆకరుణా సముద్రుడు ఆ ఆర్తత్రాణపరాయణుడు నాయట్టివానినే కరుణించిన, ఇక నిత్యమూ తమ మదిలో శ్రీ స్వామివారి పాదములను నిలుపుకొని, శ్రీనామము జిహ్వాపై తాండవింప, మనో నేత్రములతో శ్రీ రూపమును చూస్తూ తన్మయులయ్యే మహాభక్తుల కోరికలను తీర్చుట, ఆస్వామికి నిత్యకృత్యము కదా అను నమ్మకముతో తోటి సోదరీసోదరులకు ఆ కలియుగ వైకుంఠుని లీలను తెలుపుటకు మాత్రమే వ్రాసినాను. అందరును ఇష్టార్థ ప్రదాతయగు ఆ స్వామిని శరణువేడి తమతమ కోరికలను నెరవేర్చు కొందురని ప్రార్థన.

# ప్రాణం పోసిన దేవుడు

--శ్రీ కె.వి ఎల్ నరసింహాచార్యులు, విశాఖపట్నం

ఇది కథకాదు: నిజంగా జరిగింది. ఆనాడు ప్రభవ నామసంవత్సర చైత్ర శుద్ధ విదియా మంగళవారం 31-3 87 ఉదయం 5 గంటలకు మామూలుగా లేచి, స్నానానంతరము తిరువారాధన (సాలగ్రామపూజ వగైరా) క్రమము ముగించేసరికి 6-15 గంటలు అయినది. బయల్దేరి బస్టాండు చేరేసిరికి 6-30 గం॥ అయింది. అప్పటికి ఇంకా విశాఖ-పాడేరు బస్సు రాలేదు. అప్పటికే బుర్రలో ఆలోచనలు. బస్సు ఇంకా రాలేదు ఎప్పుడు వస్తుందో ఆఫీసుకు ఆలస్యం అవుతానేమో అనుకుంటూ మనస్సులో ఆ ఏడుకొండలవానిని స్మరిస్తూ వుండగా, ఇంతలో బస్సు రానేవచ్చింది. బస్సు ఆగిన వెంటనే ఎవరి తొందరలో వారు ఎక్కేవారు దిగేవారు. నేను కూడ ఎలాగో ఎక్కి నిలబడి నాచేతిలో వున్న ప్లాస్టిక్ బుట్ట అందులో నా తిరువారాధన పెట్టె వగైరా వున్నవి. బస్సులో షెల్పుమీద పెట్టి, భుజమునకున్న సంచిని సరిచేసుకునేసరికి కండక్టరువస్తే టికెట్టు తీసుకున్నాను. అది చేతితో పట్టుకొని కిటికీలోంచి బయటకు చూస్తున్నాను. ఈలోగా బయటనుండి ఒకతను కిటీకీ ప్రక్కసీటుపైనున్న సంచి తీసుకుంటూ, నన్ను కూర్చోమని చెప్పగా వెంటనే సర్దుకుని కూచున్నాను అప్పటికి 6-50గం॥అయినది. డ్రైవరు బహుశా టీ త్రాగి వచ్చి తన సీటుమీద కూర్చున్నాడు. వెంటనే బస్సు నిండు గర్భిణిలా సుమారు 90 మందితో బయలుదేరినది. పాపం కండక్టరు అలాగే జనంలో టికెట్లు ఇస్తూ తోవలో జనంతో బాటు పాలబిందెలను కూడ తప్పించు కొని తనసీటుకు చేరుకున్నాడు.

నేను సీటులో కూర్చొని పైన చేతితో నా తిరువారాధన పెట్టె వున్నదోలేదో అని తడుముకుంటూ వాచీ చూస్తున్నాను. 7-10గంటలు అయినది. బస్సు గేటు దగ్గిర ఆగితే, కండక్టరు దిగి సంతకం చేసి వచ్చిన తర్వాత 7-15 గం॥లకు బయల్దేరినది.

అప్పుడు మరల ఆలోచిస్తూ, ఏడుకొండల వానిని స్మరిస్తూ, 8గం॥లకు ఆఫీసుకు చేరాలి. బస్సు 40ని॥లకు చేరుతుంది. డ్యూటీకి సరిగా వెళతానా అని అనుకుంటున్నాను ఈలోగా మా బస్సు వంకర తిరుగుతుండగా ఎదురుగా మరొక బస్సు (బహుశా అరకు-విజయనగరం) రావడంతో మా బస్సు ఎదుటివానికి దారి ఇచ్చుటకు ఎడమకు త్రిప్పి వెంటనే కుడి ప్రక్కకు తిప్పినాడు డ్రైవరు. ఎడమవైపునకు తిప్పినపుడు వెనుక చక్రం రోడ్డు దిగినది. అప్పుడే నాలో భయం, ఏదో ప్రమాదం జరిగే సూచనలావున్నట్లు తోచినది. వెంటనే కళ్ళు మూసి "ఏడు కొండలవాడా, వెంకటరమణా, కాపాడుతండ్రీ" అని బిగ్గరగా అరిచాను. బస్సు అదుపు తప్పి, నేరుగా వెళ్ళి సుమారు 90 అడుగుల లోతు లోయలో మూడు పల్టీలు కొట్టి పడిపోయింది 7-30 గంటలనుకుంటా. బస్సులో మేమంతా చనిపోయామా అనుకున్నాము కాని, నామొర ఆలకించి ఆ ఏడుకొండలవాడు, ఆ శ్రీనివాసుడు మమ్ముల నందరినీ ప్రాణాపాయంలేకుండా కాపాడినాడు. నేను కళ్ళుతెరచే సరికి అంతా గోల. నాతలనిండి రక్తం. ఇవన్నీ లెక్కచెయ్యలేదు. నా తిరువారాధన పెట్టె గురించి చూస్తున్నాను-చిత్రం ఏమిటంటే నా ప్రక్కనే ఆపెట్టె జాగ్రత్తగా పడివుంది. మూత కూడ విడలేదు. లోపలి విగ్రహాలు చెక్కు చెదరలేదు. చాలామందికి దెబ్బలు తగిలాయి. కాని ప్రాణనష్టము లేదు. తర్వాత అంతా ఆసుపత్రిలో చేర్చబడ్డాము. విశేషమేమిటంటే అంతలోతు లోయలో పడ్డ బస్సులోని మేమంతా జీవించి వున్నామంటే నిజంగా మాకు పునర్జన్మ ఇచ్చిన ఆ శ్రీనివాసుని ఎలా మరువగలము. విన్నవారు, చూచినవారు చాలా ఆశ్చర్యపోతున్నారు. కాని నాకు మాత్రం ఆశ్చర్యం లేదు. నాకు ఏడుకొండలవాని మీద నమ్మకముంది. ఆ శ్రీనివాసుడే నామొరవిని, అందరి ప్రాణాలు కాపాడి నాడు. నిజంగా ప్రాణంపోసిన దేవుడు ఆయనే.

# ఆపద్రక్షకుడు

-- *శ్రీయం.కోటీశ్వరరావు, గుంటూరు.*

నేను గుంటూరులో బ్యాంకు సూపరువైజరుగా ఉద్యోగములో నున్నాను. మాసంసార బాధ్యతలన్నింటిని మానాన్నగారే చూచుకొనేవారు. 1960 అక్టోబరు 24తేదీన మానాన్నగారు స్వల్ప అనారోగ్యముతో స్వర్గస్థులైనారు. సంసార బాధ్యతలు నాపై బడినవి. అనుభవలేమిచే సంసారము నడుపుట కడు దుర్భరమైనది. అందుకు తోడుగా మా అత్తగారు పక్షవాతము వచ్చి మా ఇల్లు చేరినారు., వారిని ఆదరించుటకు, నాభార్యతప్ప వారికి ఇతర సంతానములేదు. ఆమె వైద్యము నిమిత్తము, గుంటూరు కొత్తపేటలో నున్న సుప్రసిద్ధ ఆయుర్వేదవైద్యులు శ్రీ చలపతిరావుగారిని కలుసుకొనుటకు అవకాశము కలిగినది. వారి వద్దకు మా అత్తగారి చికిత్సకు వెళ్లుట వల్ల వారితో బాగా పరిచయమైనది. వారు గొప్ప ఆధ్యాత్మిక చింతనాపరులు. ఆవిషయములో బాగుగా పరిణతి చెందినవారు. నేను, మానాన్నగారు స్వర్గస్థులైనప్పటినుండి డిశంబరు ఆఖరువరకు సెలవు పెట్టితిని. అప్పుడు మా ఇంటి పరిస్థితులు చాలా దారుణముగా నుండినవి. వచ్చిపోయే చుట్టాల తాకిడి. ఇంటిలో పక్షవాతము వచ్చిన అత్తగారు, ఆర్థిక ఇబ్బందులు కొత్తగా సంసార బాధ్యతలు, మనస్సు చాలా చీకాకుగాను ఆందోళనగాను యున్నది. అట్టి పరిస్థితిలోనే మాబ్యాంకు ఆఫీసరు దారిలో తటస్థపడి, వెంటనే డ్యూటీలో చేరవలెనని కోరినారు. నా పరిస్థితిని వివరించి, నేను ఇంటివద్ద వుండవలసిన అవసరమున్నదనియు, 61 జనవరి 1వతేదీన తప్పక చేరతాను అని చెప్పినను, వినక వెంటనే చేరకపోతే మాచర్లకు బదిలీ చేస్తాను అని బెదరించి వెళ్ళినారు.

నేను ఆందోళనతో పరధ్యానముగా మాడాక్టరు గారివద్దకు వెళ్లితిని. వారు నన్ను చూచి అలా వున్నావేమని ప్రశ్నించినారు మాఇంటివిషయములు-మా ఆఫీసరన్నమాటలు నా పరిస్థితులు అన్ని

వివరముగా చెప్పితిని. వారు అంత విని నవ్వినారు. మీకు నవ్వులాటగా వున్నదా అన్నాను. వారుమరల నవ్వి నీకేమియు భయము లేదు. అటుచూడు అచట ఎవరున్నారు? అని అడిగినారు.

ఎదరుగా పెద్దదైన నిలువెత్తు వేంకటేశ్వర స్వామి ఫొటో గోడకు అమర్చి వున్నది.

"నీ కష్టాలన్నీ తొలగిపోతే తిరుపతికి వెళ్ళి స్వామివారిని దర్శనముచేస్తావా? అని" డాక్టరుగారడిగినారు. చేస్తానన్నాను. అలా అని స్వామివారికి నమస్కారము చేయమన్నాను. అలాగే చేశాను.

నేను 1-1-61న డ్యూటీలో చేరవలసి వున్నది. సెలవు అనంతరము ఎచటకు బదిలీ చేస్తారో యని భయముగనే యున్నది.

మా ఇంటి పరిస్థితులు కొంత చక్కబడినవి. మా అత్తగారి ఆరోగ్యము కుదుటబడి, మంచమునుండి లేచి ఆమె పనులు ఆమె, ఇతరుల సహాయము లేకుండా స్వయముగా చేసుకొనగల్గుచున్నది. రావలసిన బాకీలు, పొలము ఇళ్ళు తాలూకు పైకము అంది ఆర్థిక ఇబ్బందులు కొంత తగ్గినవి. నాకు 25-12-1960వ తేదీన సూపరు వైజరునుండి ఇన్‌స్పెక్టరుగా ప్రమోషను చేస్తూ, నేనున్న గుంటూరులోనే, గుంటూరు హెడ్ క్వార్టర్సుగా నియమింపబడిన ఉత్తర్వులు ఇంటికి వచ్చినవి.

నేను ఆశ్చర్యముతో, ఆనందముతో వెంటనే డాక్టరుగారి దగ్గరికి వెళ్ళి విషయము చెప్పి, తిరుమల స్వామివారి దర్శనమునకు ఎప్పుడు వెళదామని అడిగితిని. వారు నేను డ్యూటీలో చేరిన తర్వాత చెపుతామన్నారు.

1-1-61వ తేదీన ఇన్స్పెక్టరుగా డ్యూటీలో చేరినాను.

మాడాక్టరు గారిని తదుపరి కలువగా పది దినములవ్యవధిలో మంచి ముహూర్తము నిర్ణయించినారు. డాక్టరుగారు నిర్ణయించిన ప్రకారము మేము తిరుపతికి వెళ్ళి స్వామివారిని తనివితీర దర్శించాము. మేము స్వామివారి అనుగ్రహంతో క్షేమముగా గుంటూరు చేరినాము.

మా బ్యాంకు ఆఫీసరు తర్వాత కనుపించి, నేను నిన్ను మాచర్లకు బదిలీ చేయుటకు నాల్గు పర్యాయములు ప్రయత్నము చేసి పైలు మీద

వ్రాయ ప్రయత్నించగా ప్రతిసారి నా చేతిని ఎవరో త్రోసినట్లు జరిగేది. ప్రక్కన చూస్తే ఎవరు ఉండేవారు కాదు. కారణమేమిటని నన్ను అడిగినారు. ఎచ్చటనో తెనాలి ఆఫీసులో జరిగిన విషయము గురించి నేను ఏమి చెప్పగలనని తెల్పి శ్రీనివాసుని లీలకు మనస్సులోనే కృతజ్ఞతలు తెలుపుకొన్నాను.

హృదయపూర్వకముగా నమ్మికొని ప్రార్థించే వారి కోరికలు తప్పక నెరవేరుస్తూ వారిని ఆపదల నుండి కాపాడే ఆపద్రక్షకుడు శ్రీ వేంకటేశ్వరుడని, నేను అనుభవ పూర్వకముగా తెలుసుకొని మీకు తెలియజేయుచున్నాను.

## చూపు నిచ్చిన దేవుడు

– శ్రీ పి. శంకర్‌రెడ్డి, సోమశిల ప్రాజెక్ట్

దాదాపు 4 సంవత్సరాల క్రితం అనగా 1 9 8 4 సం॥లో నా భార్యకు కంటి చూపు తగ్గిపోయింది. అలాంటి పరిస్థితులలో మేము చాలా కంగారు పడినాము. అప్పటికి ఒక కుమారుడు కలిగినాడు. చేసేది లేక స్నేహితుల సలహాతో ఒంగోలులో మంచి నేత్ర వైద్య నిపుణుడు వున్నాడని అక్కడికి పోయి చూపించినాము. ఆ డాక్టరుగారు కొన్ని రోజులు మందులు వాడిన తర్వాత గాని పూర్తిగా బాగు అవుతుందని చెప్పలేనని చెప్పినాడు. అలాగే మందులు వాడినాము. కాని లాభం లేక పోయింది. మరలా వేరే డాక్టరు వద్దకు పోయి మంచి డాక్టరు అని ఆశతో చూపించినాము. అయిననూ అక్కడ కూడ అలాగానే చెప్పి మందులు వాడమన్నారు. మందులు వాడిన రోజులు మాత్రమే చూపు బాగుంటుంది. తర్వాత మందులు ఆపివేస్తే మరలా కంటిచూపు తగ్గతూ వస్తుంది. అక్కడ లాభం లేదని గూడూరులో తెలిపిన నేత్ర వైద్య నిపుణుని దగ్గరకు వెళ్ళి చూపించినాము. అక్కడ పై విధముగనే జరిగినది. అలా ఎన్నిచోట్లనో తిరిగి తిరిగి విసిగి వేసారినాము.

తరువాత మా కుటుంబమునకు ఒక అత్యంత సన్నిహిత మిత్రుని సలహా మేరకు మద్రాసులో మంచి నేత్ర వైద్యు నిపుణుడి దగ్గర చూపించితే

తప్పకుండా బాగు అవుతుంది అని చెప్పినాడు. ఆ డాక్టరు 6 నెలల పాటు మందులు వాడవలయును, 6 నెలలు అయిన తరువాత ఆపరేషన్ చేసి పూర్తిగా జబ్బును నివారించేటట్లు చేస్తానని చెప్పినాడు. ఆ డాక్టరు చెప్పినట్లుగా నెలకు ఒకసారి పోయి చూపించుకుని మందులు తీసుకొని వాడుతూనే వున్నాము. కొంచెము మెరుగైనది. ఆఖరు సారి పోయినప్పుడు మరలా వచ్చినప్పుడు ఆపరేషన్ చేస్తానని చెప్పినాడు. మేము తిరిగి ఉద్యోగం చేసే ఊరికి వచ్చినాము.

అలా వచ్చిన మరుసటి రోజునే అకస్మాత్తుగా కంటి చూపు పోయింది. తిరిగి మద్రాసుకు వెళ్లాము. అక్కడ డాక్టరుగారు "లాభంలేదు ఈ జబ్బుకు మందులు లేవని, కంటి చూపురాదని" నిక్కచ్చిగా చెప్పినాడు. అప్పటికి మాకు ఒక పాప పుట్టింది. వయస్సు ఏడు మాసములు, చేసేదిలేక కడు దుఃఖముతో తిరిగి స్వస్థలానికి వచ్చినాము.

మా కుమారునికి 5 సంవత్సరములు వచ్చినవి. పుట్టు వెంట్రుకలు తిరుమలలో తీయించుటకు నేను, నా భార్య, పిల్లలు, అన్నయ్య, వదిన, అమ్మ అందరము కలిసి తిరుపతికి వెళ్లినాము. అప్పుడు తిరుమలలో నేను, నా భార్య ఆ కరుణామయుడైన శ్రీ వేంకటేశ్వరుణ్ణి ఇలా ప్రార్థించినాము:

"స్వామీ నీ దయ వలన కంటి చూపు మెరుగైతే 5 సంవత్సరములు వరుసగా మా కుటుంబము అందరము కలిసి తిరుమలకు వచ్చి తలనీలాలు సమర్పించుకుంటాము. ఆఖరు సంవత్సరములో వెండి కండ్లు చేయించి హుండీలో వేస్తాము" అని మొక్కుకున్నాము.

అలా తిరుపతి యాత్రను ముగించుకుని తిరిగి వచ్చినాము. వచ్చిన వెంటనే హోమియో వైద్యంలో నిపుణుడైన మా ఇంజనీరుగారు చూపులేని నా భార్యకు మందులిచ్చుటకు సంకల్పించినట్లు చెప్పినారు. ఆయన మనస్సులోనికి శ్రీ వేంకటేశ్వరస్వామి పోయి అలా చేయించినాడు. ఆయనే హోమియో మందులిచ్చినారు. దానితో విచిత్రంగా చూపు దినదినాభివృద్ధి చెందుతూ పూర్తిగా, కంటి చూపు వచ్చినది. మందులు కూడ వాడడము నిలిపివేశాము.

ఆ కలియుగ కల్పతరువు శ్రీనివాసుని దయవలన ఇప్పటికి వరుసగా నాల్గుసార్లు తిరుపతికి పోయి తలనీలాలు సమర్పించుకుంటూ వున్నాము. వచ్చే సంవత్సరము ఆఖరుగా వెండి కండ్లు చేయించి హుండీలో వేయవలయును. తరువాత మాకు ఒక ఆడపిల్లకూడా పుట్టినది. పాపకు స్వామిపేరు కలిసేటట్లు పేరు పెట్టుకున్నాము.

ఆ భగవంతుడే మా ఇంజనీరు రూపంలో మాకు కంటిచూపును ప్రసాదించినాడు.

కాబట్టి ఆ భగవంతుని నమ్మిన వారిని తప్పక రక్షిస్తాడు. భగవన్మహిమచాలా గొప్పది.

## సర్వదేవతా స్వరూపుడు

-- *శ్రీ వై. సుబ్రహ్మణ్యశాస్త్రి, దెందులూరు.*

దివ్యగోదావరీ తీరాన గన్నవరం సమీపంలో ఏనుగుపల్లి అనే కుగ్రామం ఒకటి వుంది. యనమండ్రు సుబ్బారాయుడు, వారి ధర్మపత్ని సూరమ్మగారు ఇరువురు కుమారులతో సిరిసంపదలతో సుఖ జీవితాన్ని గడిపేవారు. అందులో ఏ కుమారునికి కూడ సంతానము కల్గకున్నందునపాపం సూరమ్మ వంశాంకురం కోసం పరితపించింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారి చరణారవిందములను మనసార స్మరించి తనకు మనుమడు పుట్టినచో శ్రీ స్వామివారి పేరు పెట్టుకుంటానని మ్రొక్కుకుంది. ఆరీతిగా మ్రొక్కిన నెలరోజులకే సూరమ్మగారి పెద్దకోడలు నెలతప్పి గర్భవతిఅయి, నవమాసములు మోసి మగశిశువును కన్నది. స్వామివారికి మ్రొక్కు పెట్టిన ప్రకారం ఆ శిశువుకు స్వామివారి పేరు పెట్టాలి కనుక బారసాల జరిపించి నామకరణ మహోత్సవము చేయుటకు ముహూర్తము నిర్ణయించినారు. అనాటికి ఏవో ఇబ్బందులు వచ్చి అముహూర్తము వాయిదా వేసి, మరియొకనాడు నిర్ణ యించినారు. మరల అనాడుకూడ అడ్డంకి వచ్చి, నామకరణము చేయుట ఆపినారు. తర్వాత ఎప్పుడు వీలుంటే అప్పుడు చేద్దామని సరిపెట్టుకున్నారు. ఇంటిలోని వారందరు

మధ్యాహ్నపు భోజనాలు చేసిన తరువాత సూరమ్మగారు కూడ భుజించుటకు విస్తరివద్ద కూర్చున్నది. అన్నంముద్ద నోటిలో పెట్టుకొన బోవుచుండగా వీపు బ్రద్దలయ్యేటంత దెబ్బ ఆమె నడ్డిమీద ఎవరో చరచారు. ఆకొట్టిన వారెవరా? అని భయంతో నలుదిశలా పరికించగా, ఎవరును కన్పించలేదు. మరుక్షణంలో ఒక దివ్యవాణి "ఏమే నాపేరు పెట్టడానికి ఎన్ని వాయిదాలు వేస్తావు" అన్నట్లుగా ఆమెకు స్పష్టంగా విన్పించింది. వెంటనే సూరమ్మ ఆముద్ద విస్తరిలోవుంచి లేచి, చేతులు కడుగుకొని స్వామివారి ఆగ్రహమునకు గురి యయితిమని, ఆవాక్యము స్వామివారే అన్నారని నమ్మి, ఆరోజు ఉపవాస ముండి స్వామిని ప్రగాఢ భక్తితో అర్చించి, క్షమాభిక్ష వేడుకొని, మర్నాడు శుభంబని తలంచి ఆశిశువునకు "వేంకట శాస్త్రి" అని నామకరణము చేయించినది. అది మొదలు ఆకుటుంబములో జన్మించిన ప్రతివారు తమ ప్రథమ పుత్రునకు "వేంకట" అను పవిత్రనామమును కలుపుచు నామకరణము చేయుట ఆచారమైనది. స్వామి ఈరకంగా మా ఇలు వేలుపయి మమ్ములను కాపాడ సాగాడు.

నేను ఆ సూరమ్మగారి మునిమనుమణ్ణి. 1957సం॥లో స్కూలుఫైనల్ పరీక్షకు వెళ్లి, పరీక్ష పాసు అయితే, తిరుపతి కొండకు వచ్చి తలనీలాలు తీయించు కుంటానని మ్రొక్కుకున్నాను. కాని నా పరీక్ష తప్పింది. శ్రీ వేంకటేశ్వరస్వామి వారు మా ఇలువేల్పని, మాతాతమ్మ (సూరమ్మ) గారికి జరిగిన ప్రాయశ్చిత్తము, స్వామివారికి కలిగిన ఆగ్రహము గురించి నాకు తెలియదు. నా పరీక్ష తప్పగానే స్వామియందు నాకు భక్తి రక్తి గూడ తగ్గిపోయినవి. నాభక్తి శ్రీరామ చంద్రునివైపునకు మళ్లినది. రాముడనిన అవ్యాజమైన భక్తి. శ్రీ వేంకటేశ్వరస్వామియనిన మిక్కిలి విరోధము, గిట్టనితనము నా మనస్సులో నానాటికీ పెరిగినవి. నాలో ఎంత అజ్ఞానము అనాడు పేరుకున్నదో చూడండి. రాముడెవరు? వేంకటేశ్వరు డెవడు? ఇరువురు ఒక్కటేగదా అన్న భావం నాకు కల్గ లేదు. నాకు కవిత్వమునందు కొంత ప్రవేశముండుటచే శ్రీరామచంద్రుని తలంచి

భక్తరామదాసు ఉపయోగించిన మకుటమునే ఉపయోగించి దాశరథీ శతకము కూడ వ్రాసినాను కాని, రామునిదయ ఏమాత్రము కలుగలేదు. ఏ సహాయము చేసినట్లు కన్పడలేదు. సంసారమందు దరిద్రము, ఈతిబాధలు, అనారోగ్యము, సమాజములో అవమానములు, అధిక వడ్డీకి ఋణములు నాశరీర బలమును, మానసిక బలమును కూడ క్రుంగదీసి, మనోవ్యథతో రాత్రి 12 గంటలు దాటినప్పటికి నిద్రరాక ఆందోళన ఆవేదనలతో బాధపడు చుంటిని. రేపు జీతం (నెలజీతం) ఇస్తారని తెలిస్తే ఆవచ్చేది ఋణదాతలకు చాలదని ఎవరేమని నిందిస్తారోనని మానసికంగా నరక బాధపడుతూ వుండేవాడిని, కాని. శ్రీ వేంకటేశ్వర స్వామిని మాత్రం నమ్మేవాణ్ణి కాదు. నా ఋణాలను గురించి శ్రీరామ చంద్రునితో ఇట్లామనవి చేశాను.

"గుండె గుభిల్లునం బగిలె, కొండలరీతి చెలంగు అప్పు లే
యండయు లేదు నాకు భువియందు గృపామతి నాదరింప నా
నిండు మనంబు నీపదసునీరజపుంజములందు నిల్పితిన్
దండుగ సేయగా దగదు దాశరథీ ! కరుణా పయోనిధీ".

ఈ ఉత్పలమాలికా పద్యం దానంతట అది ఆగక సాగి సాగి నాచేత 108 పద్యాలు వ్రాయించింది. అదంతా రామునిదయ అనుకున్నాను. ఇట్లు శ్రీరామచంద్రుని నమ్ముతూ వేంకటేశ్వరుని ద్వేషిస్తూ వున్న నా విచిత్ర మనః ప్రవృత్తికి స్వామి ఏమనుకొనేవాడోకాని నాకుమాత్రం రాను రాను రోజులు అంధకార బంధురమైపోయి ఆర్థికంగా 5 పైసలు అప్పుకూడా లభించక అష్టకష్టాల పాలైనాను.

ఒకనాడు ఏలూరులో నివసించుచున్న మా అన్నగారింటికి వెళ్లినాను. ఏదో మాటల సందర్భంలో మా అన్నగారు శ్రీ వేంకటేశ్వరుడు మన ఇలువేలుపని మా తాతమ్మగారి వృత్తాంతము చెప్పినాడు. తదుపరి ఇంటికి వచ్చి రాత్రి వీధి అరుగుమీద ప్రశాంతంగా కూర్చొని ఆలోచించగా నేనెంత మూర్ఖుడనో అర్థమయింది. 'కౌసల్యా సుప్రజారామా' అనే శ్లోకం వేంకటేశ్వర సుప్రభాతమునకు మొదలుగదా! అట్టితరి రాముడు

వేంకటేశ్వరుడు వేరు ఎట్లగుదురు? స్వామివారు మా ఇంటి ఇలువేల్పు అయివుండగా నేను వారిని ద్వేషించుట చేతనే ఇంత దారిద్ర్యబాధ ననుభవించు చుంటినని తోచినది. మర్నాటి ఉదయం శుద్ధ మనస్కుడనై తిరుపతినుంచి నేను గతంలో తీసుక వచ్చిన స్వామివారి ఫొటో తీసి, దానికి పట్టిన బూజు, దుమ్ము తుడిచి, శుభ్రపరచి స్నానమాచరించి ఆస్వామివారిని మనసా, వాచా, కర్మణా నమ్మి పూజించి ధూపదీపనైవేద్యాదుల నొసంగి అంతవరకు అజ్ఞానాంధ కారములో పడి స్వామివారికి నేను చేసిన అపచారము మన్నింపుమని ప్రార్థించినాను. ఆనాటినుండి శ్రీరామచంద్రుడన్నను, వేంకటేశ్వరుడన్నను, లేక తదితరదైవములెవరైనను ఒక్కడేనని "సర్వదేవ నమస్కారః కేశవం ప్రతిగచ్ఛతి" అని తెలుసుకున్నాను.

నా అజ్ఞానతమస్సులు పటాపంచలై దివ్య జ్యోతిర్మయుడు, సృష్టిస్థితిలయ కారకుడు, ఆది మధ్యాంతరహితుడు, ఓంకార స్వరూపుండు అగు ఆ చతుర్దశ భువనాధిపతియగు శ్రీ మన్నారాయణుడు కలియగంబున శ్రీ వేంకటేశ్వరునిగా అవతరించి సప్తగిరీశుడైనాడని నమ్మి అనుదినము స్వామివారికి యథోచిత పూజా పురస్కారములాచరించి నాకున్న ఈతిబాధలు, దారిద్ర్యము అశాంతులనుండి బయటపడితిని. ప్రశాంతజీవినై, ఎలాంటిలోటు లేకుండా, ఆ ఏడుకొండలస్వామిని అనుక్షణము చింతన చేయుచు కాలము వెళ్లబుచ్చుచున్నాను. నేను నామనస్సులో ధ్యానించే స్వామివారి స్మరణ ఏమిటంటే "శ్రీ వేంకటేశ చరణౌ శరణం ప్రపద్యే". దీనిని రోజుకు ఎన్నిమార్లు అనుకుంటానో నాకే తెలియదు. ఆచరణాలు నాకు రాబోయే ఆపదలను దూదిపింజలను గాలి ఎగురగొట్టినట్లు పారద్రోలి నాకు సుఖాన్ని ఇస్తున్నాయి. ఏచిన్నపని గాని పెద్దపనిగాని, నేను చేశాను- అని అనను, అనుకోను. శ్రీ స్వామియే నాచేత ఆపని చేయించాడని, అనుకుంటూ వుంటాను. బ్రహ్మరుద్రాది దేవతలకే తెలుసుకొనుటకు సాధ్యముకాని స్వామివారి చరణయుగళపు మహిమ నావంటి సామాన్యమానవునకేమి తెలియును. అది బ్రహ్మ కడిగిన పాదము, బలితల మోపిన పాదము, పాపహరము, భవహరము కూడ!

# పుష్కరిణీ మహిమ

-- శ్రీమజ్జిమారయ్య, విజయనగరం.

నేను విజయనగరం మహారాజా కళాశాలలో ఉద్యోగం చేయుచున్నాను, నాతోపాటే నా స్నేహితుడు ఒకడు ఈ కాలేజీలోనే పనిచేస్తున్నాడు. అతనికి మతి స్తిమితంలేక ఎక్కడెక్కడో తిరుగుతూ బాధపడేవాడు. విశాఖపట్నం కె.జి. ఆసుపత్రిలో కూడా కొన్నాళ్ళు వైద్యం చేయించుకున్నాడు. ఫలితం కనిపించలేదు. ఆ విశాఖపట్నంలోనే అమెరికన్ ఆసుపత్రిలో కూడా ప్రత్యేక వైద్యనిపుణుల చేత తనిఖీ చేయించారు. తదుపరి తలకు (శిరస్సుకు) ముందు, వెనుక, ఎడమ, కుడి ప్రక్కల భాగములు ఎక్సరే తీయించి పరీక్ష చేసినప్పటికిన్నీ వ్యాధి అంతుపట్టలేదు. కొన్ని వేలరూపాయలు నా స్నేహితుని వ్యాధి నిమిత్తం ఖర్చుపెట్టారు. అయినప్పటికీ ఫలితం కనిపించలేదు. అప్పుడు నామనస్సులో ఒక ఆలోచన వచ్చింది.

"ఒకరాజుకుమారుడు తిరుమల పుష్కరిణిలో స్నానంచేసి, మతి స్థిమితం పొందినట్లు" ఎక్కడో చదివాను. నేను చదివిన కథలో మాదిరిగానే నామిత్రుని తిరుపతికి పిలుచుకొని వెళ్ళి, పుష్కరిణిలో స్నానంచేయించి, స్వామివారి దర్శనం చేయిద్దామనిపించింది.

వ్యాధితో బాధపడుతున్న నా స్నేహితుని తిరుపతికి వెళ్దామనీ, నీ ఆరోగ్యం కొంతైనా మెరుగు పడవచ్చనీ చెప్పాను. నేను వారంరోజులు సెలవుపెట్టాను, అతణ్ణి సెలవు పెట్టి సాయంత్రం బండికి వచ్చేయమన్నాను. నామాట ప్రకారం అతను వచ్చినాడు. 19-1-1978వ సంవత్సరం సాయంత్రం 6గంటలకు పూరి-తిరుపతి ఎక్సుప్రెస్సురైలుకు బయలు దేరాము. 21-1-78 తేదీన తిరుమల కొండకు చేరుకొన్నాం. తలనీలాలు ఇచ్చి స్వామిపుష్కరిణిలో స్నానం చేసుకొని శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకొని విజయనగరం వచ్చేశాం.

తిరుపతినుండి వచ్చిన మూడు రోజుల తర్వాత నా స్నేహితునికి

ఆశ్చర్యంగా, ఆరోగ్యం కలిగింది. మతి స్తిమితం ఏర్పడింది. ఉత్సాహంగా, సంతోషంతో వుండినాడు.

చూశారా స్వామివారి మహిమ-తిరుమలపుష్కరిణి మహిమ!

ఇప్పుడు తిరుమలలో తలనీలాలు ఇచ్చిన యాత్రికులకు సదుపాయం కోసం స్నానాలగదులు వేడినీళ్లు ఇవ్వటం ఏర్పాటు చేయబడ్డవి. కాని సంప్రదాయ బద్ధంగా యాత్రకు వెళ్లి ఆ ఒక్కరోజైనా పుష్కరిణిలో స్నానంచెయ్యటం మంచిదని నా అభిప్రాయం.

## సంతాన ప్రదాత

*-- శ్రీకనవరాజు సత్యనారాయణరావు, గుంటూరు.*

శ్రీ వేంకటేశ్వరుడు మా ఇలువేల్పు. పూర్వ జన్మ సుకృతము వలన, మరియు అస్వామివారి అనుగ్రహము వలన గోవిందనామ స్మరణము నిత్య కృత్యమై అన్నివేళలలోను నాకు రక్షయై వున్నది. నేను దివ్యనామ స్మరణము చేయకుండ ఏపనిని ఆరంభించను.

నేను ఊహించని విధంగా 1959లో వ్యవసాయ కళాశాలలో సీటు ప్రసాదించారు. ఆస్వామి ఆదేవుని దివ్యలీలలు తెలుపుటకు నాజీవితములోని ముఖ్యమైన రెండుమూడు సంఘటనలే సాక్ష్యము.

శ్రీ స్వామివారి అనుగ్రహంతో 1967వ సంవత్సరంలో జనవరినెలలో నాకు అన్నివిధముల తగినటువంటి మంచి సాంప్రదాయిక కుటుంబమునకు చెందిన కన్యతో వివాహము జరిగినది.

1968 జనవరి నెలలో నాభార్య చి॥సౌ॥వేంకటపార్వతి కర్నూలు జనరల్ ఆసుపత్రిలో ప్రసవమునకై చేర్చబడినది. కాని డాక్టర్లందరూ, పరీక్షించి, నాభార్య గర్భములో బిడ్డ సరిగాలేనందున ఆపరేషను అత్యవసరమనియు, ఆపరేషను లేకుండా ఎట్టిపరిస్థితులలోను ప్రసవము జరుగదనియు, ఆపరేషను చేసిన తర్వాతగూడ బిడ్డదక్కదనియు చాల భయంకరముగా చెప్పినారు.

డాక్టర్లందరు, అంత ఆందోళనగా చెప్పినప్పటికి మేము దంపతులిద్దరము గుండె రాయిచేసుకొని, ఆఏడుకొండలస్వామి మీద భారంవేసి, నిత్యము స్వామివారిని స్మరిస్తూవుండినాము. ప్రక్కనే వున్న వృద్ధులయిన మా అత్తమామలు గూడ ఇలాంటి విపరీత పరిస్థితికి నిశ్చేష్టులై వారుగూడ "అన్యథా శరణం నాస్తి త్వమేవశరణం మమ"అని ఆ పరమాత్మ మీదనే భారం వేసినారు. ప్రసవం సవ్యంగా జరిగి తల్లీ బిడ్డా క్షేమంగా వుంటే శ్రీ వేంకటేశ్వరుని పేరు బిడ్డకు పెట్టుకొని మొక్కుచెల్లించు కుంటామని అందరం మనసారా వేడికొన్నాము.

దైవ సంకల్పమును మానవ మాత్రులమయిన మనము లేశమయినా ఊహించగలమా? ముమ్మాటికీ ఊహించ లేము.

నాభార్య ప్రసవవేదన ఆరంభం అయ్యేటప్పటికి ఆపరేషను చేయదలచిన పెద్దడాక్టరుగూడ అక్కడలేరు. జూనియర్ డాక్టర్ల సలహామేరకు నేను పెద్ద డాక్టరుగారిని పిలుచుకరావటానికి వెంటనే ఆయనింటికి వెళ్లి సరిగ్గా 15 నిమిషములలో డాక్టరుగారితో కూడ తిరిగి రావడం జరిగింది. కానీ ఎవరు ఊహించనిరీతిగా, నేను, డాక్టరుగారితో వచ్చేలోగానే ఎలాంటి ఆపరేషను లేకుండా సాధారణ పద్ధతిలో, ప్రసవవేదన ఆరంభమయిన 15 నిమిషాలలోనే సుఖప్రసవమయి చక్కని మగబిడ్డ పుట్టడం జరిగింది.

గర్భములోపల సరైన స్థితిలో లేని ఆబిడ్డను సుఖప్రసవం ఎలా జరిగిందన్న సందేహాలతో డాక్టర్లందరు ఆశ్చర్యంతో చర్చించుకొన్నారు.

శ్రీ వేంకటేశ్వర స్వామివారి అనుగ్రహానికి మాకు అవధుల్లేని సంతోషం కలిగింది. అది మరచిపోలేని సంఘటన. వెంటనే ఆపిల్లవానికి స్వామివారి పేర 'వేంకటరమణ' అని నామకరణం చేశాము.

ఇదే విధంగా ప్రతినిత్యము ఎన్నో విషయములలో ఆ స్వామివారు మమ్ములను అనుగ్రహిస్తున్నారు.

1981వ సంవత్సరంలో గుంటూరు పట్టాభిపురంలో ఒక ఇంటిలో అద్దెకున్నాము. ఆ రోజు శనివారము. దేవునికి దీపారాధన చేస్తున్న

నాభార్యకు ఆ ఇల్లు ఖాళీచేసి ఇంకో ఇంటికి వెళ్లవలయునని సంకల్పం కలిగింది. శ్రీ వేంకటేశ్వరుడు కల్గించిన ఆసంకల్పముతో వెంటనే మరొక ఇంటికి మారాము. ఆశ్చర్యమేమంటే మేము ఖాళీచేసిన ఇల్లు నాలుగురోజులకే ఉన్నదున్నట్లుగా ఘోరముగా కూలిపోయినది. మేము అక్కడనే వుంటే అది మేము ఊహించుకోలేని పరిస్థితి.

ఇలాగ మాకు సంతానప్రదాతగా, మాకుటుంబమునకు పునర్జన్మ ప్రదాతగా, మామనసుల్లో చిరస్థాయిగా నిలిచివున్నాడు ఆ తిరుమల శ్రీనివాసుడు. ఆదేవుణ్ణి మనస్ఫూర్తిగా నమ్మినవారికి ఆయన వారి యోగక్షేమములను చూచుచుండునని మా ధృఢ విశ్వాసము.

## అద్భుత వైద్యుడు

*శ్రీ ఎం. సోమశేఖరాచార్యులు, విజయనగరం*

ఒకసారి నేను మాకుటుంబ సభ్యులతో కలసి తిరుపతికి వెళ్లాను. తిరుమల కొండపైకి వెళ్లేసరికి తెల్లవారుజాము నాలుగు గంటలయింది. సత్రంలో దిగాము. రెండుగంటలసేపు పడుకొని దైవదర్శనానికి వెళ్దామని నిర్ణయించుకొని పడుకొన్నాము. ప్రయాణపు బడలికవల్ల అందరం గాఢంగా నిద్రపోయాము.

నాకు తెలివి వచ్చి, మత్తుగా కళ్లు తెరచి చేతి గడియారంకేసి చూశాను. టైము తొమ్మిది దాటింది. నిద్రమత్తు ఒక్కసారిగా వీడిపోయింది.

మా వాళ్లందర్నీ లేపి "త్వరగా స్నానాలు చేయండి దైవదర్శనానికి వెళ్దాం' ' అన్నాను.

"ఏమిటోరా! అలసిపోయివున్నాం కదా. నిద్ర పట్టేసింది. ఇప్పుడే స్నానం చేసి వచ్చేస్తాము" అని అమ్మా, చెల్లీ వెళ్లారు.

నేను బయట కూర్చొని ముఖం కడుక్కుంటున్నాను. కాస్సేపటికి అమ్మ, చెల్లెలు బయటకు వచ్చారు.

"ఒరే నువ్వింకా ముఖం కడుగుతున్నావా? మేము రెడీ అయ్యాము. తొందరగా తెములు" తొందరపెట్టింది మాఅమ్మ.

నేనూ స్నానం చేసి అలా గదిలోనికి వచ్చానో లేదో అలా కడుపునొప్పి మొదలయింది. క్రమంగా అది భరించలేని నొప్పిగా తయారవడంతో మంచం మీద పడుకున్నాను.

ఏమిట్రా బాబూ, ఏమైంది? కంగారుగా అడిగింది అమ్మ. 'కడుపునొప్పి' అంటూ మెలికలు తిరుగుతూ చెప్పాను.

ఈ కడుపునొప్పి ఎలా తగ్గుతుంది? దైవదర్శనం ఈరోజు అవుతుందా? ఇక్కడ ఆదుకొనేవారెవరున్నారు? అని అమ్మా చెల్లీ ఆందోళన చెందుతూకళ్ళనీళ్ళతో స్వామీ! గోవిందా! నీవే దిక్కయ్యా అంటూ గోవిందలు పెట్టారు. అంత బాధలో కూడ వారితోపాటు నేనూ గోవిందలు పెట్టాను. ఇంతలో విచిత్రంగా "మందో! కడుపునొప్పికి మందో", అన్న అరుపు చెవిన బడటంతో మాఅమ్మగారు ఒక్క ఉదుటున బయటకు వెళ్లి ఆవ్యక్తిని లోనికి తీసుకవచ్చారు. కడుపునొప్పికి మందు అమ్మే ఆవ్యక్తి ఓకోయవాడు. ఆ కోయవాడు నన్నుచూచి 'దొర! ఈ మాత్ర వేసికో. నొప్పి తగ్గుతుంది, అని ఓ నల్లటి గుళిక ఇచ్చాడు. 'దీనికి ఎంత ఇమ్మంటావు' అడిగాను. "దొరా ముందు నీకు కడుపునొప్పి తగ్గి మా కొండలస్వామి దర్శనం చేసుకుంటే అంతేచాలు దొరా సాయంతరం వస్తాను. అప్పుడు డబ్బులిద్దురుగాని" అని వెళ్లిపోయాడు.

కోయవాడు ఇచ్చిన మాత్ర వేసుకొన్న ఐదునిమిషాలకే అద్భుతంగా నాకడుపునొప్పి పూర్తిగా పోయింది. ఆనందంతో దైవదర్శనం చేసుకొని వచ్చాము.

ఆ సాయంత్రం కోయదొర వస్తాడేమో అని అందరం ఎదురు చూశాము. కానీ రాలేదు. పోనీ మర్నాడు వస్తాడేమోనని అనుకున్నాము. మర్నాడు పొద్దున సత్రం ఖాళీచేసేంతవరకూ చూశాము. కానీ అతని జాడలేదు. తిరిగి మాఊరు వచ్చేశాము.

కోయదొర రూపంలోవచ్చి నాకు కడుపునొప్పికి మందు ఇచ్చిన అద్భుతవైద్యుడే ఆ వేంకటేశ్వరస్వామి అని ప్రగాఢ విశ్వాసము. ఇది నిజంగా జరిగిన అద్భుతలీల!.

## సంకట హరణుడు

---శ్రీ వి. రామనాథరెడ్డి, తిరుపతి.

నేను చిన్నప్పటి నుండి కమ్యూనిష్టు, నాస్తికవాదములను నమ్మి అందరికీ చెప్పేవాడను. దేవుడు లేడనీ, రాతివిగ్రహముల కెలాంటి మహిమ లేదని వాదించేవాడను.

నేను సుమారు 40 సంవత్సరములు రైల్వేశాఖలో ఉద్యోగము నిర్వహించితిని. చివరలో పదవీ విరమణ సమయములో నిష్కారణముగా "నిఘాశాఖ" వివాదములో చిక్కుబడితిని. ఈ వివాదము నుండి బయట పడుటకు సర్వవిధముల మానవ ప్రయత్నములుజేసి విఫలుడయితిని. దీనివల్ల ఉద్యోగ విరమణ తర్వాత రావలసిన నికరమైన బకాయిలు మొత్తము సుమారు ఒక లక్ష రూపాయలు లభించే అవకాశమునకు దూరమయితిని.

అట్టి పరిస్థితులలో చిన్ననాడు చదివిన గజేంద్రమోక్ష కథ జ్ఞాపకము వచ్చినది. మొసలివాతబడ్డ గజేంద్రుడు సర్వవిధముల ప్రయత్నించి విఫలుడై కడకు ఎలుగెత్తి ఆలపించిన "నీవే తప్ప నితః పరం బెరుగ.........రావే ఈశ్వర, కావవే వరద!", అను పోతనా మాత్యుని పద్యము నామనస్సునకు నూతన ఉత్సాహము రేకెత్తించినది.

ఉద్యోగ విరమణ సమయమున వచ్చిన గండము నుండి తప్పించుకొనుటకు "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" అని శ్రీ వేంకటేశ్వరస్వామి పాదములు తప్ప మరేవీ తోడ్పడవనీ ప్రార్థిస్తూ శరణు వేడితిని. ఇంతవరకు నేను చేసిన నాస్తిక వాదములను క్షమించుమని మనసారా వేడికొంటిని. అనంతరము తిరుమల శ్రీ స్వామివారి ప్రేరణచే, చివరి ప్రయత్నముగా సికిందరాబాదు రైల్వే జనరల్ మేనేజరు వారికి ఈ క్రింది విధముగా విజ్ఞాపన పత్రమును పంపినాను.

"గౌరవనీయులైన దక్షిణ మధ్యరైల్వే జనరల్ మేనేజరు వారికి సమర్పించు విన్నపము. నేను శ్రీ వేంకటేశ్వరుని పాదములచెంత తిరుపతి

పుణ్యక్షేత్రమున జన్మించితిని. చిన్న నాటి నుండి మంచి ప్రవర్తన కలిగి రైల్వేశాఖలో సుమారు 40 ఏండ్లు సేవలు చేసితిని. ఏనాడు కలలోనైనా ప్రభుత్వమునకు హాని తలపెట్టలేదు. నిష్కారణముగ నిఘాశాఖ వారు నన్ను వివాదములో దింపినారు. నాయందు ఏలాంటి దోషము లేదని శ్రీ వేంకటేశ్వరుని పాదముల సాక్షిగా విన్నవించు చున్నాను. 'నిఘాశాఖ' అపవాదును తొలగించి, నా రాజీనామాను అంగీకరించి, నాకు రావలసిన లక్ష రూపాయల నికరపు బకాయి సొమ్మును చెల్లించవలయునని ప్రార్థించు చున్నాను".

విజ్ఞాపన పత్రమును పంపిన తరువాత కేవలము దైవానుగ్రహమునకై ప్రతి దినము తిరుమలప్పని వేడికొనుచుంటిని. అదేమి మహిమో చూడండి. నా విజ్ఞప్తి పంపిన రెండు మాసములకే రైల్వే అధికారులు నారాజీనామాను అంగీకరించినారు. రావలసిన బకాయి మొత్తమును చెక్కుద్వారా పంపినారు.

ఇక నా ఆనందమునకు మేరలేదు. నా స్వామిని దర్శించుటకు తిరుమల కేగితిని. అది బ్రహ్మోత్సవ సమయముకూడ. తిరుమల పురవీధులలో శ్రీ స్వామివారు ఉభయదేవేరులతో ఊరేగుచుండిరి. ఆ తర్వాత స్వామివారి రథోత్సవమును కూడ కన్నులారా తిలకించి వెంకన్నపాదములను దర్శించినాను. ముడుపులు చెల్లించినాను. దీనులపాలిటి దిక్కు వెంకన్న పాదములు అని గాఢముగ విశ్వసించు చున్నాను. సకల దుఃఖములు ఆయన పాదదర్శనముతో నశించును. నిజముగా ఆ దేవ దేవుడు సంకట హరణుడు !.

## దర్శన మిచ్చిన దేవుడు

----శ్రీ ఆదూరి శ్రీనివాసరావు, కావలి.

దాదాపు 8 సంవత్సరముల క్రిందట తిరుపతికి పరీక్షాపేపర్లను దిద్దటానికి స్పాట్‌వాల్యుయేషన్‌కు వెళ్లాను. తిరుమలకు వెళ్లి స్వామివారి దర్శనం చేసుకుందామని ఉదయం బయలుదేరాను. బస్టాండులో పెద్ద

క్యూ చూసేటప్పటికి నాకు ఆశ్చర్యమేసింది. నేను ఆ రాత్రికి మళ్లీ తిరుపతికి తిరిగి రాగలనా? అని అనుకుంటూ తిరుమల చేరాను. దీనిని మించి వున్నది స్వామి దర్శనార్థమై వున్న క్యూ. అక్కడవారి నడిగితే స్వామి దర్శనమయ్యేటప్పటికి రాత్రి 11గం.లు లేదా 12గం.లు అవుతుంది అన్నారు.

మర్నాడు పొద్దున్నే నేను డ్యూటీకి పోవాలి. ఈ తర్జన భర్జనలో వున్నప్పుడు ఎవరో 8 సం॥ల బాలుడు వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు. క్యూలో వున్ననేను ఏమిటని అడిగితే వాళ్ల అమ్మ కనిపించలేదట. హృదయవిదారకంగా వున్నది ఆపసివాని ఏడుపు. ఎవ్వరుకూడ ఆ పసివానిని పట్టించుకోలేదు. అప్పుడు ఏమిచెయ్యాలి. అతనిని పోలీసుస్టేషనుకు తీసుకెళ్ళి మైకులో చెప్పించాలి. క్యూవదలి వెళ్లితినా స్వామిదర్శనం ఆరోజుకు ఇకలేదు. ఇదే నాబాధ. సరే అందరిలోను స్వామి వున్నాడంటారు కదా. ఈ పసివానిలో కూడా వున్నది ఆ నామాలవాడే కదా. పసివానికి సేవచేస్తే పరమేశ్వరునికి సేవచేసినట్లే అనుకొని నేను 'క్యూ' వదిలేసి ఆ పిల్లవానిని పోలీసు స్టేషను వద్దకు తీసుకెళ్లాను. అక్కడ ఎవ్వరూ లేరు. స్టేషనుకు తాళం వేసివుంది.

ప్రక్కన విచారిస్తే మైకు ప్రకటనలు స్వామిగుడి సింహద్వారం లోపల చేస్తున్నారు. అక్కడకు పొమ్మన్నారు. ద్వార పాలకులు అడ్డంగా వున్నారుకదా. అయినా వెళ్లి వారితో చెప్పాను. వారు, నన్నూ పిల్లవాణ్ణి లోపలకు పంపారు. అక్కడ వెళ్ళి అడిగితే గర్భగుడి బంగారు వాకిలి దగ్గర మైకు వుంది. మీరు అక్కడకు వెళ్ళండి అని నాకు దారి చూపించినారు. ఇంకేమి గుంపులో గోవిందా! గోవిందా! అంటూ నేను ఆపిల్లవాడు క్యూలో వెళ్లి స్వామివారి దర్శనాన్ని తనివిదీర చేసుకొని, మైకు దగ్గరకు వస్తే, అక్కడ వారు, పోలీసుస్టేషను తెరచివుంది మీరు అక్కడికే వెళ్లండి అని చెప్పినారు. మళ్లీ దేవాలయం బయటికి వచ్చి పోలీసుస్టేషన్‌కు వెళ్లితిమి. అక్కడ ఆ పిల్లవాని అమ్మ పిల్లవాణ్ణి చూసి ఆనందాశ్రువులు నింపుకొని నాతో "నాయనా నీదయవలన నాబిడ్డ దొరికాడు" అంటూ

ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయింది ఆ తల్లి. కాదమ్మా కాదు. నీ బిడ్డ వల్ల నాకు స్వామివారి దర్శనమయింది. అంటూ వారి పరిస్థితిని చూసి ఆనందంతో కళ్లనీళ్లు తుడుచుకున్నాను. చూచారా! స్వామి దర్శనాన్ని వదలి, పసిబిడ్డను తల్లిని చేర్చిన సేవాఫలానికిగాను, స్వామి తన దర్శనభాగ్యం కలిగించాడు. కనుక మానవసేవే నిజమైన మాధవసేవ!.

## జరిమాన వేసిన దేవుడు

*-- డా॥ కొండవీటివేంకటేశ్వరరావు, వెంకటపాలెం, మంగళగిరి (వయా)*

కలియుగంలో తిరుమల వెంకన్న, కానుకలను హుండీదక్షిణలను స్వీకరించి భక్తుల పాపాల్ని దుఃఖాల్ని పోగొట్టే ప్రత్యక్ష దైవంగా ప్రసిద్ధి కెక్కాడు. అందుకే భక్తులు ఆపదమొక్కులు మొక్కి, తేనేటీగల్లా స్వామికి ఒక్కొక్కపైసా హుండీకి జమ చేసుకొని అలా కొంత పోగైన డబ్బుతో తిరుమల యాత్ర చేస్తారు. ఆహుండీ డబ్బునే తిరుమలలో స్వామివారి హుండీలో వేస్తారు. లేదా సేవలుకూడా చేస్తారు. అలాంటి సేవల్లో దర్శనంలో, హుండీలో వినియోగించే ధనం, అది కేవలం స్వామివారిది. అలా స్వామివారి సేవలో వినియోగమయ్యే డబ్బును గూర్చిగాని, భక్తుల సేవను గూర్చిగాని శంకించి హేళన చేస్తే కలిగే నష్టాలు ఎన్నో! అందులో ఇదొక్కటి.

అది 1980వ సంవత్సరము. నేను మా నాన్నగారి మిత్రులు ఇంకా కొందరు తిరుమల ఎక్స్‌ప్రెస్సులో తిరుపతి చేరాము. బస్సులో తిరుమల కొండకు చేరి కాటేజి తీసుకొని మొక్కుబడులు చెల్లించుకొని, స్వామి దర్శనానికి వెళ్లాము. ఆ రోజులలో తోమాలసేవ దర్శనం అనివుండేది. దానికి 5రూపాయలు వుండేదేమో అనుకుంటాను. 5 రూపాయల టికెట్టు కొంటుంటే "ఇక్కడ జరిమానా ఎంత" అని మామయ్య జమ్ములక్ష్మయ్య అన్నారు. నేను" అలా అనగూడదు. మనం దైవదర్శనము కావాలి అని వచ్చాము" అని అన్నాను. "జరిమానా కాక మరేమిటి? దేవుని దర్శనము చేసికోటానికి గూడా జరిమానా వేసినట్లు డబ్బులు వసూలు

చేయటమా" అని వాదించేవాడు. కొండపైన స్వామిని దర్శనం చేసుకొని, క్రిందకు వచ్చి గోవిందరాజ స్వామి దర్శనం చేసుకోవడానికి వెళ్లాం. "ఇక్కడ దర్శనమునకు, కొబ్బరి కాయ, అర్చనకు ఎంత జరిమానా" అన్నాడు. "మళ్లీ మళ్లీ అట్లా అనవద్దు. దేవుడు మనకు పెద్ద జరిమానా వేస్తాడు" అని నేను అన్నాను.

గోవిందరాజ స్వామి గుడినుండి సత్రమునకు వచ్చి సత్రములో సామానుపెట్టుకొని అలమేలు మంగాపురం వెళదామని ప్రయాణం అవుతున్నాం. మా మామయ్య జమ్మలక్ష్మయ్య "పోయింది పోయింది" అని కంగారుగా బొడ్లో దోపుకున్న పైకము వెతుక్కోసాగాడు. ఇంకెక్కడి పైకం? దైవలీల! దైవాన్ని చులకనగా మాట్లాడితే, చూస్తే దైవము జరిమానా వేస్తాడు. అప్పుడు మేమంతా "నీవు జరిమానా అన్నావు కదా. అందుకే నీకు ఆ దైవము జరిమానా వేశారు" అన్నాము. సుమారు 200 రూపాయలు పోయాయి. తిరుగుప్రయాణం మేమంతా తలాపదిరూపాయలు ఇచ్చాము. అలమేలు మంగను దర్శించుకొని, ఆరాత్రి బండిలో ఊరుచేరాము.

"అప్పుడు నేను దైవాన్ని తేలికగా జరిమానా అన్నందువల్ల నీకు పెద్ద జరిమానా వేశాడు. తగిన శాస్తి జరిగింది" అని. ఆ మరుసటి సంవత్సరంనుండి భక్తితో తిరుపతికి వెళ్ళి శ్రీ వేంకటేశ్వరుని దర్శించుచున్నాడు, మా మామయ్య.

## ఆదుకొన్న దేవుడు.

*--శ్రీమాన్. ఎన్.జె.రాజగోపాల అయ్యంగారు. విశాఖపట్నం.*

ఇది చాలా సంవత్సరాల క్రిందట జరిగిన సంఘటన. కాని ఇప్పటికి మా ఇళ్ళలో తరచూ ఈ ఉదంతం భక్తిసంభ్రమాలతో చెప్పుకుంటూ వుంటాము.

మా పెదతల్లి కీ॥శే॥ గుండాల లక్ష్మీనరసమ్మగారిది విజయనగరం స్వస్థలం. ఆమెకు 40 సం॥ల ప్రాయంలో భర్త, 24సం॥ల వయస్సుగల ఏకైక పుత్రుడు ఇంచుమించు ఒకే సమయంలో మరణించారు. ఈ

అభాగిని వ్యథకు అవధులు లేకపోయాయి. ఆమె దుఃఖోపశమనానికి ఆధ్యాత్మిక చింతన ఒకటే మార్గమని మా తాతగారు నిశ్చయించారు. ఒక మంచి పండితునిచేత భగవద్గీత, వైష్ణవమత ప్రబంధములను నాలాయిరమ్ వగైరా చెప్పించారు. ఆమె క్రమంగా దుఃఖం మరచిపోయి భక్తి భావంలో పడ్డది. ఎల్లప్పుడు భగవన్నామ స్మరణచేస్తూ ఉండేది. కొన్ని సంవత్సరాలు గడిచాయి. ఒకసారి మా మూడవమేనమామ వి.బలరామదాసును "తమ్ముడూ నాకు తిరుపతి వెళ్ళాలని వున్నది. తీసుకవెళ్ళు" అని కోరింది. ఆయన సరే నన్నాడు. ఒక మంచిరోజున బయల్దేరారు.

రేణిగుంటవరకు ఇద్దరు మామూలుగా వచ్చారు. తిరుపతి వెళ్ళాలంటే ఆరోజుల్లో అక్కడ రైలు మారి మీటరుగేజి ట్రెయిను ఎక్కాలి. దీనినే తిరుపతిబండి అనేవారు. అక్క, తమ్ముడు రేణిగుంటలో దిగేసరికి ఎదుటప్లాటుఫారంపై తిరుపతి బండి నిలిచి ఉన్నది. ఆమెను తీసుకవెళ్లి ఖాళీగా వున్న ఒక కంపార్టుమెంటు ఎక్కించి, సామాన్లు సర్దాడు తమ్ముడు. "రైలు బయలు దేరటానికి ఇంకా టయం వున్నదట. నేను కాఫీ త్రాగి, నీకు అరటిపండ్లు తెస్తాను. జాగ్రత్తగా కూర్చో" అని అక్కగారితో చెప్పి స్టేషనువైపు వెళ్ళాడు. కాని అతడు వెళ్ళిన రెండు నిమిషాలలోనే రైలు కదిలిపోయింది.

తన తమ్ముడు రాకుండా రైలు బయల్దేరడంతో మా పెదతల్లి భయపడిపోయింది. ద్వారం వద్దకు వచ్చి తమ్మునికోసం చూడసాగింది. దూరంగా పరిగెత్తుతూ వస్తున్న తమ్ముడు ఆమె కంట పడ్డాడు. కాని రైలువేగం పుంజుకున్నది. అప్పటికే ప్లాటుఫారం దాటిపోతున్నది. అతడు కొంతదూరం పరుగెత్తడం, రైలును అందుకోలేకపోవడం గమనించి హతాశురాలైంది. ఆమెకు దుఃఖం పొంగి వచ్చింది. ద్వారం వద్దనే నిలబడి ఏడ్చేస్తున్నది.

ఇంతలో ఎవరో "ఏమమ్మా అలా ఏడుస్తున్నావు" అని ఆమెను ప్రశ్నించారు. ఆమె తిరిగి చూచింది. ఆజానుబాహువు నల్లని రూపం, నుదుటిపైన తిరుమణి శ్రీ చూర్ణాలతో కళకళలాడుతున్న ముఖం పెదవులపై మందహాసంతో ఒక శ్రీ వైష్ణవస్వామి కనిపించాడు.

తను కూర్చున్నప్పుడు ఈ పెట్టె ఖాళీగా వున్నది. ఈయన ఎలా ప్రవేశించాడు చెప్మాఅని-అంత దుఃఖంలోనూ ఆమెకు కొంత విస్మయం కలిగింది.

"నాతమ్ముడు కాఫీ త్రాగడానికి వెళ్ళాడు. ఈ లోగా బండి కదిలిపోయింది. సొమ్ము టికెట్లు అన్నీ అతడివద్దనే వున్నాయి. నేనేమో తెలియని దానిని. ఈ ప్రదేశం అంతానాకు కొత్త. ఇప్పుడు నాగతి ఏంకావాలి"? అని ఆమె ఆయనతో మొరపెట్టుకున్నది.

"భయపడకమ్మా గంటన్నర పోయాక ఇంకొకరైలు ఉన్నది. అందులో మీ తమ్ముడు వస్తాడు. అంతవరకు మనం తిరుపతి స్టేషనులో కూర్చొందాం. నేను తోడుగా ఉంటాను" అని ఆయన ధైర్యం చెప్పాడు.

తిరుపతి స్టేషనులో ఇద్దరు దిగారు. మా పెద్దతల్లి కొన్ని సామాన్లు పట్టుకొన్నది. ఆవైష్ణవుడు కొన్ని సామాన్లు పట్టుకున్నాడు. వెయిటింగ్‌రూములో ఆమెను కూర్చోబెట్టాడు. రెండవరైలు వచ్చేవరకు ఆమెకు వైష్ణవమత గ్రంథాలలోని పెక్కు అంశాలు సులువుగా అర్థమగునట్లు బోధించాడు. ఆమె తన పరిస్థితిని, పరిసరాలను పూర్తిగా మరచిపోయి వింటూవున్నది. ఏదో దివ్యానుభూతి పొందింది. గంటన్నరకాలం ఇట్టే గడచిపోయింది.

"అదిగో రెండవరైలు వచ్చేసిందమ్మా! వెళ్ళి మీ తమ్ముణ్ణి కలుసుకో. నీ సామానుల వద్దనేను వుంటాను" అని ఆయన అనడంతో ఆమె మళ్ళీ ఈ ప్రపంచములోకి వచ్చింది. ప్లాటుఫారం మీదకు వెళ్ళింది. రైలునుండి. ఎక్కువమంది దిగలేదు. మా మేనమామ అప్పుడే రైలుదిగి అమెకోసం ఆత్రతగా చూస్తున్నాడు. ఆమె కనబడగానే "అక్కా కుశలమా! నీ కోసం నేనెంత భయపడి పోయానో తెలుసా? నీ కోసం స్టేషనుకు ఫోనుకూడా చేయించాను. ఒంటరిగా ఏ స్త్రీ దిగడంగాని, టికెట్టు ఇంకొకరివద్ద వుండి పోయినది అని చెప్పడంగాని జరగలేదన్నారు" అన్నాడు.

"నేను మరీ భయపడి పోయాను తమ్ముడూ ఏడ్చేసానుకూడా. అయితే నా అదృష్టంకొద్దీ నేను కూర్చున్న పెట్టెలో ఒక శ్రీ వైష్ణవుడు కూడా

వున్నాడు. ఆయన నాకు ధైర్యం చెప్పి, ఇక్కడ వెయిటింగురూములో కూర్చోబెట్టాడు. పాపం కొన్ని సామాన్లు కూడా పట్టుకున్నాడు. గంటన్నరలో ఇంకొకరైలు వస్తుందని, అందులో నువ్వుదిగుతావని చెప్పాడు. ఇప్పటివరకు నాతో కూర్చొన్నాడు. ఆయన గొప్ప పండితుడు. నాకు తిరుమంత్రార్థం, ముముక్షుప్పడి మొదలైన ఎన్నో దివ్యవిషయాలు చెప్పాడు. నాసామాన్లకు కాపలాకాస్తూ వెయిటింగురూములో కూర్చున్నాడు. ఆయన చేసిన ఉపకారానికి నువ్వు ఘనంగా కృతజ్ఞతలు చెప్పాలి" అన్నది లక్ష్మీనరసమ్మ.

ఇద్దరూ వెళ్లి చూచారు. వెయిటింగు రూములో ఆ శ్రీవైష్ణవుడు కనిపించలేదు. సామానులు మాత్రం పదిలంగా వున్నాయి. "ఈయన లేడే ఎక్కడకు వెళ్ళివుంటాడు.?" అంటూ ఆమె ద్వారం వద్దకు వచ్చి ప్లాటుఫారం అంతా కలయచూసింది. ఆయన ఎక్కడా కనిపించలేదు. అసలు ప్లాటుఫారం మీద పట్టుమని పదిమందికూడా లేరు.

"ఆశ్చర్యంగా వున్నది. ఈయన ఎక్కడమాయం అయిపోయాడు' ' అన్నది ఆమె.

బలరామదాసుకూడ అటు ఇటు కొంతదూరం వెళ్ళి చూచాడు. ఆవైష్ణవుడు ఎక్కడా కనిపించలేదు. దూరంగా కొండ మెట్లదారి కన్పించింది. అతడి మెదడులో హఠాత్తుగా ఒక మెరుపు మెరిసింది. వెంటనే అక్కవద్దకు వచ్చాడు.

"ఎంత అదృష్ట వంతురాలివి అక్కా! ఆయన నిన్ను ఆదుకోవడానికి వచ్చిన ఆపద్బాంధవుడు ఆ వెంకటరమణ మూర్తే సందేహం లేదు. మానవులు అదృశ్యం కాలేరు" అన్నాడు.

"సరిగ్గా అదే తలంపు నాకూ ఇప్పుడే వచ్చింది తమ్ముడు! తలచుకొంటే గుర్తుకు వస్తున్నాయి. మానవులలో లేని ఎన్నో విశేషలక్షణాలు ఆయనలో నాకు కనిపించాయి. అదే కాక రేణిగుంటలో నన్ను ఆపెట్టెలో కూర్చోపెట్టినప్పుడు అది పూర్తిగా ఖాళీగా వున్నది గుర్తుందా? రైలు కదలగానే నేను, లబోదిబోమంటూ ద్వారం వద్దనే నిలబడ్డాను. మరి ఆయన లోనికి ఎలావచ్చాడని అప్పుడే నాకు కొంత ఆశ్చర్య కలిగింది" అన్నది. ఆమె సంభ్రమాశ్చర్యాలతో.

ఇద్దరూ కొండవైపు తిరిగి చేతులెత్తి నమస్కరించారు.

# మొర విన్న దేవుడు

--*శ్రీగుంటూరు వేంకటేశ్వర్లు, నిడదవోలు.*

ఆరోజు వర్షం కుండపోతగా కురుస్తోంది. నేను సికింద్రాబాద్‌లోని తిరుమలగిరి మిలటరీక్యాంప్‌లో వున్న నా బావమరిదిని కలుసుకొని వాడితో శ్రీ వేంకటేశ్వరాలయం (బిర్లామందిరం) చూడాలని వానలో తడుస్తూ సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చాం. అప్పుడే కదలేందుకు రడీ అవుతున్న మీనార్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కాం. ఆరైలు హైదరాబాదు స్టేషన్‌లో ఆగుతుంది. అక్కడనుండి బిర్లామందిరం దగ్గర కనుక స్వామి వారిని చూసి వస్తాంకదా అనే ధ్యాసతో మీనార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కాం.

ఎక్స్‌ప్రెస్ విపరీతమైన వేగంతో పోతుంది. కంపార్ట్‌మెంటులో వున్నవారిని అడిగాను. 'భాయ్' నాంపల్లి (హైదరాబాద్) స్టేషన్ ఇంకో ఐదు కనిముషాల్లో వస్తుందా' అని. ఏమీ! మీకు తెలియదా! ఈ ఎక్స్‌ప్రెస్ హైద్రాబాదుకు పోదు. ఇంకోరెండు గంటలకు వాడీ స్టేషన్‌లో ఆగుతుందని చెప్పాడు ఆభాయ్. అంతే గుండె బరువెక్కి నీరసం వచ్చింది. మా ఇద్దరి దగ్గర రైలుటికెట్టు లేదు. హైదరాబాదువరకు రైల్వేఫ్రీపాస్ వుంది. కళ్లల్లో నీళ్లు తిరగాయి. శరీరం వణుకుతోంది. ఏమీ తోచని స్థితిలో కంపార్టుమెంటు దోరు దగ్గరకు వచ్చాను. ఎదురుగా ఆ తెల్లని పాలరాతి దేవాలయం కనుల విందుగా కన్పిస్తూవుంది.

"మహాప్రభో! ఏమిటి ఈ పరిస్థితి. నీదర్శనం చేసుకొని ఆనందం అనుభవిస్తామనుకుంటె మమ్మల్నిద్దరినీ ఇంకో రెండు గంటలకు మాకు తెలియని స్టేషన్ లో దింపి, ఈ రాత్రి ఆకలితో చంపుతావా? ఇది నీకు ధర్మమా!" అని ప్రార్థించాను.

హైదరాబాదు స్టేషన్‌లో దిగితే నీకొండ దగ్గరికి తొందరగా చేరుతామనే ధ్యాసతోనే తెలియక, కదిలే మీనార్ ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కాం. లేకపోతే హాయిగా సికింద్రాబాద్ స్టేషన్ నుండి సిటీబస్సు ఎక్కి నీ దగ్గరకు వచ్చి నీ పవిత్రమైన దర్శనం చేసుకొనేవారం కదా. ఎందుకయ్యా, మా

మీద కోపం. మాకు ఏదిక్కూ తోచటం లేదు. మహాప్రభో! రక్షించు. ఆపదమొక్కులవాడా! ఓ శ్రీనివాసా!, వేంకటేశ్వరా! తండ్రీ అంటూ, మనసులో నేరుగా తిరుమలలో వుండే ఆనందనిలయుని ధ్యానించుకుంటున్నాను.

అంతే రైలు టక్కున ఆగింది. ఇద్దరం త్వర త్వరగా కంపార్ట్‌మెంటు నుండి క్రిందకు దిగినాము. దిగిన వెంటనే పెద్దగా కూత కూస్తూ రైలు కదిలింది. ఎందుకు ఆగిందో మా కర్థం కాలేదు. ప్రక్కన అవుటర్ సిగ్నల్ కనిపిస్తుంది. అది బండి పోవుటకు సిగ్నల్ చూపిస్తూనే వుంది. మాకోసమే ఆగినట్లయింది. మేము దిగిన తరువాత కదిలింది బండి. అంతా ఆపదమొక్కులవాని దయ. మేము తప్ప మరెవ్వరూ దిగలేదు. సరే అక్కడినుంచి నడిచివెళ్లి బిర్లామందిరంలోని శ్రీ స్వామివారిని కనులవిందుగా దర్శించుకున్నాం. అప్పుడనుకున్నాం. ఎంతటి ఆపదలో అయినాసరే మొరపెట్టుకుంటే తప్పక విని ఆదరించేస్వామి ఆ ఏడుకొండలవాడు. ఆ శ్రీనివాసుడు!.

## కవిత్వమిచ్చిన దేవుడు

-- *శ్రీదుద్దేల పుల్లయ్య, నదీకైరవాడి గ్రా. కర్నూలుజిల్లా.*

నా జీవితములో జరిగిన సంఘటన తెలియజేయుటకు పూర్వము, నాజీవన విధానము తెలియజేసినచో, స్వామివారి మాహాత్మ్యమును తెలిసికొన గలుగుటకు చాల ఉపకరించునని ఈ కొద్ది వాక్యములు వ్రాయుచున్నాను. 1957లో నేను సాధారణ విద్యను అనగా ఇంటర్మీడియట్ పూర్తిజేసినాను. తదుపరి 1965 వరకు వ్యాపార రంగములో (అనగా విద్యాభివృద్ధికి అవకాశములేని) గడపితిని. 1965-67సం॥లో ఉపాధ్యాయ వృత్తి శిక్షణను పొంది, ఉద్యోగంలో చేరక, మరల 1977 జనవరి వరకు వ్యాపారములోనే గడిపితిని,

విధిలేని పరిస్థితులలో 1977 జవరిలో ఉపాధ్యాయునిగా చేరితిని. నేను పని చేయుచుండిన కర్నూలు జిల్లా, కోవెలకుంట్ల మండలంలోని

బిజినవేముల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను 1979 లో ప్రాథమికోన్నత పాఠశాలగా స్థాయిని పెంచారు.

ఆరోజులలో అనగా 1980 మార్చి ఒకటవ తేది రాత్రి. ఆ గ్రామ రామాలయమందు భజన చేసి వచ్చి నిదురించబోవగా, ఎంతకూ నిదుర రాలేదు. కొద్దిసేపు వెంకటేశ్వర స్వామిని ప్రార్థించినాను. స్వామివారిపై పద్యరచన చేయవలెనని ఎందుకో ఆలోచన కలిగినది. నాకు ఛందస్సులోను, వ్యాకరణంలోను బొత్తిగా పరిచయం లేదు. అప్పటి కప్పుడు కలమును కాగితముపై నుంచితినో లేదో మూడు ఉత్పలమాల పద్యములు తయారయినవి. ప్రతి పద్యము చివర అప్రయత్నముగా వేంకటేశ్వరా! అను మకుటము వాడుట జరిగినది. అప్పుడు నాకు ఒక విధమయిన భయము, ఏదయిన గ్రహావేశమా అని ఆశ్చర్యము, ఆనందము కలిగినవి. ఆరోజే రాత్రి కొంత ప్రొద్దు పోవుసరికే 27 పద్యములు వ్రాసి నిదురించితిని. మరునాడుదయము ఏపని చేయుచుండినను స్వామివారి నామస్మరణే. ఆయన లీలలే స్మరించుచుండగా అవియే పద్యములుగా మారుచుండెను. ఇట్లు కవిత్వమందు ఏమాత్రము పూర్వపరిచయము లేనట్టి నేను వారము రోజులలో 116 ఉత్పలమాల పద్యములు వ్రాసితిని. ఈ వారము రోజులలో సరియైన నిద్రాహారములు లేక భయము వేసినను, స్వామి వారి లీలలుగా తలంచి కొనసాగించితిని. మరల తదుపరి 3 1/2 రోజులలోనే 108 చంపకమాలలుకూడ రచించితిని. అప్పటి నాపరిస్థితి చంపకోత్పలమాలలు వ్రాయుటకు తప్ప అతి సులభమయిన ఉపజాతి పద్యములు కంద గీత ఆటవెలది, సీస పద్యములు వ్రాయుటకు చేతగానిది. తర్వాత స్వామివారి అనుగ్రహమునకు ఆనందపడిన మేము సకుటుంబముగా స్వామివారిని దర్శించి వచ్చితిమి. ఈ విషయము మా సహోపాధ్యాయులెల్లరు ఎరింగినదే.

స్వామివారిని దర్శించి వచ్చిన తదుపరి ద్విగుణీకృతోత్సాహముతో అప్పకవీయము, బాలవ్యాకరణాది గ్రంథములు చదివి ఛందో జ్ఞానమభివృద్ధి గావించుకొనియిపుడు అన్ని విధములయిన ఛందస్సులలో పద్యములు వ్రాయుగలుగు చున్నాను.

నా పద్యరచన చూచెడు వారికి, నాకు తెలుగు భాషలోగల చొరవ తక్కువైనను పద్యముల రచించుట యందలి నేర్పు ఆశ్చర్యము కలిగిచుచుండును. ఇది కేవలము శ్రీ వేంకటేశ్వర స్వామివారి అవ్యాజకరుణా కటాక్షమేగాని నాయది కాదు.

భాషాపరిచయము తక్కువ కలిగి ఏ మాత్రము ఛందోజ్ఞానములేని వాడిని. ఒకేరాత్రి అన్నిపద్యములు వ్రాయగలుగుట స్వామివారి లీలకదా! ఇది అనుపమాన అద్భుత సంఘటన కదా! ఇది అంతయు మా ఇలువేలుపు అనుగ్రహము.

## నామ లిఖిత ఫలం

*-- శ్రీ వాకా శ్రీనివాసులు, గోసాని పల్లెగ్రామం, కర్నూలు జిల్లా.*

శ్రీ వేంకటేశ్వరుని సేవ పలు విధాలు. కొందరు శనివారం చేస్తారు. కొందరు తిరుమలయాత్ర చేస్తారు. మరికొందరు శ్రీ వేంకటేశ్వర మంత్రాన్ని జపిస్తారు, వ్రాస్తారు, తలనీలాలిస్తారు. నిలువుదోపిళ్లిస్తారు.. ఇలా ఎన్నోవిధాలు. అలా శ్రీ వేంకటేశ్వర మంత్రాన్ని వ్రాసిన ఫలితం ఇది.

పశ్చిమ గోదావరి జిల్లా కొవ్వూరుకు చెందిన శ్రీ వేంకటేశ్వర భక్తి ప్రచార పీఠం వారు అనేకమంది భక్తులచేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యనామమును, రామకోటి మాదిరిగా జపపుస్తకములు సరఫరా చేస్తూ నియమ నిబంధనల ప్రకారం లిఖిత జపం వ్రాయిస్తున్నారనీ- శ్రీస్వామివారి జపం వ్రాయుటవల్ల అనేక మందికి చక్కని ఫలితములు కలుగుతున్నాయనీ. నేను విన్నాను.

ఏడు సంవత్సరాల క్రిందట నాకుమారుడు ఇల్లు వదిలి వెళ్లిపోయినాడు. తిరిగి రాలేదు. నాకుమారుని కోసం సంవత్సరాల తరబడి వెతికించినాము. ఎంత వెతికినా ప్రయోజనం కలుగలేదు. అతని కన్నతల్లి! కొడుకును జ్ఞప్తికి దెచ్చుకొని రాత్రనక, పగలనక ఏడుస్తూ క్రుంగి కృశించి మంచం పట్టింది. అసలు నాకుమారుడు బ్రతికి వున్నాడో లేడో అనికూడ మేము అనుమానించాము. నాకుమారుడు వెళ్లిపోయినప్పటినుంచీ మా ఇల్లంతా దుఃఖ సముద్రంలో మునిగిపోయింది.

అట్టి తరుణంలో శ్రీ వేంకటేశ్వర లిఖితజపం గురించి నాకు తెలిసింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారు కలియుగ ప్రత్యక్ష దైవం కనుక, శ్రీవారి జపం వ్రాస్తే ఏమైనా ప్రయోజనం కలుగవచ్చునేమో అను ఆశతో శ్రీ వేంకటేశ్వర భక్తి ప్రచార పీఠం, కొవ్వూరు వారికి వ్రాసి, పుస్తకమును తెప్పించుకొని ఆషాఢ శుద్ధ ఏకాదశి (1988) నాడు వారు చెప్పిన నియమ నిబంధనల ప్రకారం లిఖిత జపం వ్రాయటం ప్రారంభించినాను.

శ్రీ వేంకటేశ్వర లిఖిత జపం వ్రాయుటవల్ల ప్రత్యక్ష దైవమయిన శ్రీ వేంకటేశ్వరుడు ఎంత త్వరగా మమ్ములను అనుగ్రహించినాడో వ్రాయడానికి మాటలు చాలడం లేదు. జపం వ్రాయడం మొదలు పెట్టిన మూడవ రోజునే ఏడుసంవత్సరాల క్రిందట ఇల్లు వదలిపోయిన నాకుమారుడు తనంతట తానుగా తిరిగి ఇంటికి వచ్చినాడు. వాడిని చూడగానే కన్నతల్లికి, నాకు మా ఇంటిలోనివారందరికీ అమితమైన ఆనందము, ఆశ్చర్యమూ కలిగాయి. లిఖితజపం వ్రాయడంవల్ల ఏడుఏండ్ల తర్వాత మళ్లీ మాకుమారునిప్రసాదించిన శ్రీ వేంకట ప్రభువు యొక్క దివ్యకృపను ప్రస్తుతించడానికి ఈ జన్మ సరిపోదు. శ్రీవారి కరుణ అపారం! అత్యద్భుతం!!

## కల్యాణ చక్రవర్తి

-- *శ్రీమతి రేఖ, హైదరాబాదు.*

అవి అప్పుడే కాలేజి చదువు పూర్తిచేసుకొన్న రోజులు. నాకు ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారు. మాకు అన్ని విధాల నచ్చిన సంబంధాలు దొరకటంలేదు. అప్పుడు మా పెద్దవాళ్ళ సలహాలతో రుక్మిణీ కల్యాణమును 40 రోజులు పఠించి శ్రీ వేంకటేశ్వర స్వామిపై భారం వుంచాం. నలుబది ఒకటవ రోజున మాకు అన్ని విధాల నచ్చిన ఒక సంబంధం, అసలు కట్నమేమీ లేకుండా వివాహము కుదిరింది. మాకు చాలా ఆశ్చర్యం వేసింది. అంతా ఆ స్వామిదయ అనుకున్నాం. ఆ తరువాత కొన్ని రోజులకు ఎందుకో కారణం తెలియకుండా సంబంధం అక్కరలేదని

మగపెళ్లివారి మధ్యవర్తి వచ్చి మాకు చెప్పారు మాకు చాలా అవమానమూ, బాధకూడ కలిగింది. ఏమైనా సరే మగపెళ్లివాళ్లను, నాలుగూ దులిపేసి రావాలి అనుకున్నాం. కారణం తెలియదుకనుక ఇది ఆ స్వామివారిమీదే భారం వేయాలి అనుకొని, ఆ రాత్రి స్వామిని "ఏవైనా పొరబాట్లువుంటే మన్నించమని ఈ అవమానం నుండి రక్షించమని" మొక్కుకొని, స్వామి తప్పక మమ్మల్ని ఈ సమయంలో ఆదుకుంటాడు అన్న నమ్మకంతో పడుకున్నాం. మీరు నమ్మండి నమ్మకపోండి మరుసటిరోజు ఆ అబ్బాయి స్నేహితుడు నాకు ఫోనుచేసి "మావాడు మీతో మాట్లాడాలనీ అంటున్నాడు. దయచేసి ఈరోజు ఫలానా చోటుకి రండి. నేనూ వస్తాను"అని చెప్పాడు. ఆనాడు నేను వెళ్ళి కలిసిన పిమ్మట మొట్ట మొదటిమాట "క్షమించండి' ' అని, ఆతర్వాత తనకు వచ్చిన అనుమానాలు చెప్పారు. వాటికి నాకు తెలిసిన జవాబులు చెప్పాను. పిదప ఆ కల్యాణచక్రవర్తియైన స్వామివారి అనుగ్రహం వల్ల కట్నం లేకుండా, లాంఛనాలు లేకుండా అతనితో నా వివాహం సాఫీగా జరిగిపోయింది. ఇదంతా ఆస్వామి మహిమ.

మాకు బాబు పుట్టితే, తిరుమలలో స్వామి వారికి కల్యాణం చేయిస్తామని మొక్కుకున్నాం. మాకు బాబుపుట్టాడు. సంవత్సరంలోపల తిరుమలకు వెళ్ళి స్వామివారికి కల్యాణం చేయించి తిరిగి వచ్చాము. ఇహ అంతే. ఆతరువాత ఏడుసంవత్సరాలైనా తిరుపతికి వెళ్ళలేకపోయాం. ఎంతగా వెళ్ళాలని ప్రయత్నించినా లాభంలేకపోయింది. వేసవి సెలవులలోఅందరూ తిరుపతి వెళ్లి వచ్చి ప్రసాదం తెచ్చిస్తుంటే మాకు ఆ అదృష్టం లేనందుకు చాలా బాధ వేసేది. డబ్బువుంటే సెలవు వుండదు. సెలవు వుంటే సమయానికి డబ్బు వుండదు. ఎక్కడికైనా, ఎప్పుడైనా తలచుకుంటూ డబ్బువుంటే వెళ్ళి పోగలం. కానీ ఒక్క తిరుపతి విషయంలో మాత్రం అది నిజంకాదు. స్వామివారి దయలేనిదే, ఆయన ఆజ్ఞలేనిదే చీమకూడా ఆ దరిదాపులకు కూడ వెళ్ళలేదు. మాకు స్వామివారి అనుగ్రహం ఎప్పుడు కలుగుతుందా అనుకుంటూ తన కొండకు తనే రప్పించుకుంటాడు. అనుకొని, మొక్కుకునేవాళ్ళం. ఏడవసంవత్సరం కూడా అయిపోవచ్చింది. వేసవి సెలవులు ఇచ్చారు. ఈ సారి మాపిల్లలు ఎక్కడికైనా వెళ్ళాలన్నారు. ఎక్కడికో ఎందుకు? తిరుపతి వెళ్ళాలని

అన్నాను నేను. మావారు వెంటనే "ఈ సారి పైకం లేదు. ఎక్కడికీ పోయేదీలేదు. ఒక్క వెయ్యిరూపాయలు కూడా చేతిలో లేవు. ప్లాన్లు వేస్తున్నారు. ముందు ఒక్క వెయ్యిరూపాయలు తీసికొనిరా. ఆ తరువాత మిగతా పైకం గురించి ఆలోచిద్దాం" అని అన్నారు. పరిస్థితి తెలుసుకనుక మాట్లాడకుండా వూరుకున్నాం. ఆరోజు శనివారం, పూజ చేసుకొని మాకు తెలిసిన వాళ్ళింటికి వెళ్ళాం. వారింటి ప్రక్కన మాకు ఒక సందర్భంలో కొంత పైకం బాకీ వున్న వ్యక్తి వున్నాడు. మావారికి ఆ విషయం గుర్తు చేస్తే "ఇక ఆ డబ్బు సంగతి మర్చిపో. ఆయన ఇవ్వడు, ఆయన ఓ జిడ్డుమనిషి. ఊరంతా అప్పులేనట! మనకు ఇవ్వకపోతే పోయింది. మళ్ళీ అడుగకపోతే అదే పదివేలు. మళ్లీ అడిగినా మనకు అవమానం" అన్నారు. నేను మావారి మాట వినిపించుకోకుండా వారి ఇంటికి వెళ్లాను. మనసులో "స్వామీ! ఈ డబ్బుమాకు రావల్సిన డబ్బు. ఈ డబ్బు వస్తే ఆ డబ్బుతో తిరుపతికి వస్తాం" అని మొక్కుకున్నాను. అదేమి విచిత్రమో నన్ను చూస్తూనే అతను కుశల ప్రశ్నలు వేసి, కొంచం వుండండి - "అంటూ లోనికి వెళ్లి ఒక పావుగంట తర్వాత వెయ్యిరూపాయలు తీసుకొచ్చి - మరోలా అనుకోకండి కొంచం ఆలస్యం అయింది. ఇదిగో మీడబ్బు" అంటూ తీసుకొచ్చి చేతిలో పెట్టాడు. నాకు ఎంతో ఆశ్చర్యం కలిగింది. ఊరికే అడిగిపోదామని వచ్చాను. ఏ కోశానా డబ్బు ఇస్తాడన్న నమ్మకం లేదు. పదిసార్లు తనచుట్టూ తిప్పుకునే మనిషి. స్వామివారి లీల కళ్లెదుట కనిపించినట్టయింది. రాదు అనుకున్న డబ్బు నా ద్వారా, పొద్దున తిరుపతికి వెళ్లాలనుకుంటే మధ్యాహ్నం లోపల పైకం చేతికందింది. మావారికి, నాకు ఎంత ఆశ్చర్యమేసిందో అంత సంతోషమయింది. ఆయన ఆజ్ఞ అయింది. ఇహ అన్నీ ఆయనే చూసుకుంటాడు అనుకున్నాను. అనుకున్నట్లుగానే తిరుమల వెళ్లాం. మంచి కాటేజి, అన్ని వసతులూ దొరికి ఎంతోసంతోషంగా స్వామివారి దర్శనం చేసికొని వచ్చాం. అక్కడ ఏవిధమైన ఇబ్బందీ కలుగలేదు. ఎతో హాయిగా జరిగింది మా యాత్ర.

ఇలాగ నాకు పెళ్లి చేయించి, నా జీవిత మంతా అనుగ్రహిస్తున్న కల్యాణ చక్రవర్తి ఆ స్వామి!.

## వైద్య చక్రవర్తి

-- *శ్రీ పి. భద్రాచలం, మునగాల, నల్గొండ(జి)*

అది 1982వ సంవత్సరంలో నాకు ఎడమకాలు నొప్పి విపరీతంగా వచ్చింది. భయంతో కోదాడలోని ప్రముఖ డాక్టరుకు చూపించాను. మందులు ఇచ్చి పూర్తి విశ్రాంతితో నేలపైగాని, బల్లపైగాని 6నెలలు పడుకోమని చెప్పారు. అలాగే బెంచి చేయించి పడుకున్నాను. కాని నివారణ కాలేదు. ఖమ్మం హాస్పిటల్‌కు అమెరికన్ లేడీ డాక్టరు వస్తుంది. ఆమె ఇటువంటి జబ్బులను వెంటనే నయం చేస్తుందని మా బావగారు చెప్పగా వెళ్లి చూపించాను. ఆమె పరీక్షచేసి ఏమీ భయపడవలసిన పనిలేదని నన్ను పడుకోబెట్టి ఎడమకాలు మడిమ భాగమునుండి ప్రతి అంగుళానికి ఒక ఇంజక్షన్ చొప్పున దాదాపు కాలంతా 50 ఇంజక్షన్లు ఇచ్చింది. తర్వాత మందులను ఇచ్చి మొలకెత్తిన పెసలను మూడు నెలలు ఉదయంపూట తినమని చెప్పింది. ఆవిధంగా 3 నెలలు తిన్నాను. అయినా ప్రయోజనం లేకపోగా మడిమదగ్గర మరొక నొప్పి ప్రారంభమైంది. నా సన్నిహిత మిత్రుని సలహాపై ఉస్మానియా న్యూరోసర్జన్‌గారి వద్దకు వెళ్ళాను ఎక్స్‌రేల అనంతరం వీపు భాగం వెన్నుపూస వెంట ఆపరేషన్ చేస్తేనే గాని ఆ నొప్పి తగ్గదని చెప్పారు. లేదా కాలు తీసి వేయాల్సి వస్తుందని అన్నారు. దాంతోనాకు వున్నమతి కాస్తా పోయింది. ఇంటికి తిరిగి వచ్చి ఇదేమిటి తండ్రీయని దేవదేవుడు మా ఇలవేల్పు ఐన ఆ అలమేలు మంగపతి, ఆపద్బాంధవుడు అనాథరక్షకుడు, ఆపద మొక్కులవాడు, శరణాగతరక్షకుడు ఏడు కొండలవాడు అయిన ఆ శ్రీనివాసుని ముందు మోకరిల్లి ప్రభూ! నీవుదక్క నాకు వేరొకరు లేరు. నన్ను కాపాడుమని భోరున ఏడ్చాను. ఇక ఈ జన్మను ముగించుమని ప్రార్థించాను. విచిత్రం ఆరాత్రే కలలో లీలగా శ్రీ వేంకటేశ్వరుడు కనిపించి "పిచ్చివాడా ఎందుకు ఏడుస్తున్నావు. నీకు ఏం భయంలేదు. తగ్గిపోతుంది. ఈ మధ్య నాకొండకు రావడం మానేశావు" అని అదృశ్యమయ్యాడు.

వెంటనే నా భార్యను లేపి విషయాన్నంతా వివరంగా చెప్పాను. కాలు నొప్పి తగ్గితే వెండికాలు చేయించి, నీ కొండకు వస్తామని చెప్పి ముడుపు కట్టింది నాభార్య. కాలక్రమేణా నాకాలు నొప్పి తగ్గింది. పిదప కుటుంబసమేతంగా దేవదేవుని పాదపద్మాలను చేరి, తలనీలాలు అర్పించి మనసారా, నీలమేఘశ్యాముని, శంఖ చక్రగదాధారిని, వరదహస్తుని సేవించి ముడుపులను చెల్లించి తిరిగివచ్చాము. నాటి నుండి ప్రతిసంవత్సరము స్వామివారిని తప్పక దర్శిస్తూనే వున్నాము.

ఆనాటినుండి ఎంతో భయంకరంగా వున్న కాలునొప్పి మటుమాయమై పోయింది. ఆరోగ్యంగా, ఆనందంగా వున్నాను. ఏడుకొండలవానిని తలంచుకొంటేచాలు. కొండంత అండ నేనున్నానని అభయహస్త మందించి ఆదరిస్తాడు. తిరుమల శ్రీనివాసుడు వింత వింత రోగాలను విచిత్రంగా నయంచేసే అద్భుత వైద్య చక్రవర్తి!

## ఆపన్నివారకుడు

*-- శ్రీ బత్తుల గోపాలరెడ్డి, ఆసిఫాబాదు.*

గడచిన ఏప్రిల్ 10వ తారీఖున నేను కడుపునొప్పితో ఎంతో బాధ పడినాను. డాక్టరు గారికి చూపించగా "ఇది కడుపునొప్పి కాదు. మూత్రపిండములలో రాళ్లు వున్నవి, నీవు పెద్దడాక్టరుకు చూపించుకొంటే మంచిది" అన్నారు. వెంటనే నేను తెనాలికి వెళ్లి మూత్ర పిండముల వైద్యనిపుణుడికి చూపించుకొన్నాను. ఆసుపత్రికి వెళ్లేముందు తెనాలికి 2.కి.మీ. దూరంలో వున్న వైకుంఠపురంలోని శ్రీ వేంకటేశ్వర స్వామిని మనసారా తలచుకొని "ఏ ఆపరేషన్ లేకుండా నా జబ్బు తగ్గిపోతే నీ సన్నిధికి మాపిల్లలతో అందరం వచ్చి తలనీలాలు ఇచ్చి పాలుపొంగించి దివ్యమంగళకరమైన మీ పాదపద్మములను దర్శనం చేసుకుంటా"మని మొక్కుకొని వెళ్లినాను.

డాక్టరుగారు ఎక్సరే తీయించుకొని రమ్మన్నారు. ఎక్సరే తీయించుకొని రాగా కిడ్నీలో రాళ్లు కనపడ్డాయి. ఆరాళ్లు బయటికి రావడానికి సెలైన్

ఎక్కించాలన్నారు. 14 సీసాలు సెలైన్ ఎక్కించినారు. కాని రాళ్లు మూత్రనాళం ద్వారా బయటపడలేదు. నొప్పి కొంచం కూడా తగ్గలేదు. కిడ్నీలోని రాళ్ల యొక్క స్థానమేమైనా మార్పు వచ్చిందేమోనని మరల ఎక్సరే తీయించుకొనిరమ్మన్నారు. ఎక్సరే తీయించుకొని వచ్చినాను. కాని రాళ్లస్థానంలో ఎలాంటి మార్పు రాలేదు. అప్పుడు డాక్టరుగారు ఆపరేషన్ చేసి కిడ్నీలోని రాళ్లను తియ్యాలి. రేపు ఉదయం 6గం॥లకు ఆపరేషన్ చేద్దాము రెడీగా ఉండమని చెప్పారు.

మాబంధువులు వంట సామగ్రి, మంచం, మొదలగునవి తీసుకొని రావటానికి ఇంటికి వెళ్ళారు. అప్పటికి గడ్డం చేసుకొని 5రోజులు అయింది. ఆపరేషన్ చేయించుకొంటే సుమారు నెలరోజులవరకు బెడ్‌మీద వుండాలి కదా! అనుకొని గడ్డం చేసుకోడానికి బజారుకు వెళ్లాను. అది ఏమి విచిత్రమో ఆరోజు అంతపెద్ద పట్టణంలో అప్పటికి ఒకషాపుకూడా తెరవలేదు. మళ్లీ మొక్కుకున్నాను. "స్వామీ ఎట్లాగయినా ఈ బాధను పోగొట్టమని, ఇలాగే జట్టుపెంచి మొక్కు ఇస్తాను" అని స్వామిని ప్రార్థిస్తూ ఆసుపత్రికి వచ్చాను. వెంటనే నాలో నాకు ఏదో మార్పు అన్పించింది. అప్పటి వరకు కొబ్బరి నీళ్లు కూడా తాగటానికి ఇష్టపడని నేను మంచినీళ్ళు అదేపనిగా త్రాగడం మొదలు పెట్టినాను. అరగంట తరువాత నేను మూత్ర విసర్జనకు వెళ్లగా మూత్రం ద్వారా కిడ్నీలోని రాయి పడిపోయింది. నొప్పి పూర్తిగా తగ్గిపోయింది. రాయిపడినప్పుడు నాకు ఏమాత్రం నొప్పి లేకుండా పోయింది. వెంటనే ఆరాయిని తీసుకొని వెళ్ళి డాక్టరుగారికి చూపించాను. ఆయన "నీవు చాల అదృష్టవంతుడవు ఆపరేషన్ బాధ తొలగిపోయింది" అన్నారు అప్పటి నా సంతోషానికి అవధులు లేవు.

నన్ను ఆ రీతిగా కాపాడిన ఆ దేవదేవుణ్ణి ఏమని పిలవాలి. ఆపద్బాంధవుడనా! కరుణామయుడనా! భక్తుల పాలిటి కల్పతరువా! ఏమని పిలిచి ఆ భగవంతుని సమగ్రతత్వాన్ని కొనియాడగలం?

వెంటనే నేను మాకుటుంబ సభ్యులందరం అనుకొన్న ప్రకారం వైకుంఠపురం వెళ్లి తలనీలాలు సమర్పించి ఆపదమొక్కులు తీర్చుకొని

శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకొన్నాను.

ఇదేకాదు నాజీవితంలో ఇలాంటివి ఎన్నో సంఘటనలు జరిగినవి. అన్నింట ఆ ఆపద్బాంధవుడే నన్ను కాపాడినాడు. అందుకే ఆస్వామి నిజంగా ఆపన్నివారకుడే! అందులో సందేహం అణుమాత్రమయినా లేదు.

## సంకట హరణుడు

---- *కుమారి వేంకట లక్ష్మిసునీత, పంజగుట్ట, హైదరాబాద్*

నా రెండవ ఏట ఎడమచేయి పోలియోవ్యాధికి గురిఅయినది. నేను నా చేయి ఎత్తలేక పోతిని. అప్పుడు మా తల్లిదండ్రులు శ్రీ భగవాన్ సత్యసాయిబాబా వారి వద్దకు నన్ను పిలుచుకవెళ్లిరి. వారు నా ఎడమచేయి ఎత్తి "నీవు ఏమీ బాధపడకు నీ బిడ్డ పెరిగి పెద్దదై దైవాను గ్రహంతో మంచి గృహిణిగా పేరు తెచ్చుకుంటుంది". అని ఆశీర్వదించారు. అప్పటి వరకు బాధపడ్డ మా తల్లిదండ్రులకు కొంచెం మనశ్శాంతి కలిగింది. నా ఏళ్ళు పైబడ్డ కొద్దీ నా అంగవైకల్యము గూర్చి తెలుసుకొను చుంటిని. బడిలో నా స్నేహితురాండ్రు నన్ను వెక్కిరించు చుండిరి. నేను నాలుగవ తరగతిలో వున్నప్పుడు నాకు నూటికి నూరు మార్కులు వచ్చి ఆనందించు చుండగా, నా స్నేహితురాలు "నీ చదువు నీ చేయివలె నున్న" దని పలికి విపరీతముగా నన్ను ఏడిపించినది. ఆనాడు నేను దేవుణ్ణి విపరీతంగా తిట్టాను. నన్ను కుంటిచేయిదానిగా చేసినందుకు.

నా చిన్నతనమున నన్ను నా మేనమామకు ఇచ్చి వివాహము చేయ సంకల్పించారు. కాని ఒకనాడు మా నాన్న మా తాతగారితో ఈ విషయము ప్రస్తావించగా ఆయన "ఈ కుంటి పిల్లను వాడు చేసుకొనుటకు అంగీకరించునో లేదో?" అని పలికారు. 'కుంటిపిల్ల' అను పదము నన్ను విపరీతముగా బాధించినది. అప్పటి నుండి ఎవరైనా నా చేతిని గూర్చి మాట్లాడితే ఆరాత్రి నేను కన్నీటితో నన్ను తనలో చేర్చుకొనమని ఏడుకొండలవానిని ప్రార్థించు చుంటిని. ఈ మధ్య కాలములో మా

నాన్నగారు చేయించని వైద్యం లేదు. నా 14వ సంవత్సరమున ఒక డాక్టరుగారి వద్దకు తీసుకపోగా ఆయన నా చేయి రాదని, ఆపరేషన్ చేయుటవలన ఫలితము వుండదని చెప్పారు. అది వినిన నా తల్లిదండ్రులు ఏమి చెయ్యాల్నో దిక్కుతోచక నాచేయి వచ్చినయెడల నా వివాహము తిరుమల కొండపై శ్రీ స్వామివారి సన్నిధిలో చేసెదమని మొక్కుకొన్నారు. ఇలా మొక్కుకొన్న కొద్దికాలమునకే ఒక ఎముకల వైద్యనిపుణులు నాచేయి పరీక్షించి, చేతిలోపల ఎముకలకు కీలు బిగించి కండబట్టిన అనంతరము వాటిని తీసివేయవచ్చనీ, కండ పట్టాక చేతిని మామూలుగా అందరివలె చేయి ఎత్తవచ్చునని చెప్పారు. అది విన్న నాకు ఒక్క క్షణము భయము వేసినది. ఆపరేషన్ తరువాత నా చెయ్యి చిన్నదిగా అవుతుందేమోనని భయము పట్టుకొన్నది. కాని డాక్టరు అటువంటిదేమీ వుండదనీ, భయము లేదని చెప్పారు.

1988 జూలై 12, తేదీన నాకు ఆపరేషన్ జరిగనది. కొంత బాధపడినా, నా చెయ్యిని నేను ఏ సహాయము లేకుండానే ఎత్తగలిగాను. నా బుద్ధి ఎదిగాక నా చేయి ఎత్తి ఆడుకొనుట, స్కూల్లో డ్రిల్లు చేయుట, డ్యాన్సు చేయుట ఎరుగని నేను రెండు చేతులతో అభినయము చేస్తూ వేసే అడుగులు, చేసే భంగిమలూ చూచి మా అమ్మ ఆనందపడినారు. పూర్తిగా కాకపోయినా అప్పుడప్పుడూ వీణకూడ మీటడం ఆరంభించాను.

నన్ను కుంటి అన్న మా తాతగారి నోటివెంట నా వివాహ ప్రసక్తి విని చకితురాలనైతిని. ఇప్పుడు నాకు 17వ సంవత్సరం నడుస్తున్నది. వచ్చే సంవత్సరం నా వివాహము తిరుమల కొండపై చేయుటకు పెద్దలు నిశ్చయించారు.

ఇన్ని సంవత్సరాలు నేను అనుభవించిన మానసికవ్యధను ప్రతిరాత్రీ ఏడుకొండలస్వామికి విన్నవించుకొనేదానను. నేను కళ్లుమూసి ధ్యానించిన వెంటనే ఆ స్వామి రూపము గోచరించి, భయములేదని చెప్పినట్లుగా ఊరటకలిగించిన స్వామి ఆ శ్రీనివాస ప్రభువు!. ఇలా ఎంతమందికో ఎన్నోవిధాల సహాయముచేస్తూ, తనను నమ్మేవారికి ఎప్పుడూ అండగా

వుంటానని, కటిహస్త వరద హస్తాలతో అనుగ్రహిస్తున్న స్వామివారికి నా సహస్రకోటి నమస్కారములు.

## స్వప్న చికిత్సకుడు

-- *శ్రీమతి ఎం. వరలక్ష్మి, హైద్రాబాదు.*

ఇది నా అనుభవంలో జరిగిన అద్భుత సంఘటన.

1975 సం॥లో నా ఆఖరి కాన్పులో పాప, బాబు కవలలు జన్మించారు. పాప బాగా బొద్దుగా వుండేది. బాబు చాలా సన్నగా పుట్టాడు. అదీగాక బాబు బొడ్డు బాగా పెద్దదిగా వుండేది. దానివల్ల బాబుకి అప్పుడప్పుడు పొట్టవాచిపోయి పాలు తాగేవాడుకాదు. ఆగకుండా గుక్కపెట్టి ఏడ్చేవాడు. చాలా భయం వేసేది. డాక్టరు గారికి కూడ చూపించాం. డాక్టరుగారు రెండుమూడు సార్లు బొడ్డుకు కట్లు కట్టినారు. అయినా వాపు తగ్గలేదు. తర్వాత ఆపరేషన్ చేయాల్సివస్తుంది అని, ఆయన బాబుకు ఇప్పుడు రెండవనెలే కాబట్టి కొన్ని నెలల తర్వాత బలం వచ్చాక బాబుకు ఆపరేషన్ చేస్తానని చెప్పారు. బొడ్డు ఆపరేషన్ అనగానే చాల భయం కలిగింది.

హాస్పిటలు నుంచి ఇంటికి వచ్చిన తర్వాత మామూలుగా మా పిన్నిగారు "మీకు వేంకటేశ్వరస్వామి మీఇంటి దేవుడు కదా! ఆయనకు మనసారా దణ్ణం పెట్టుకొని మొక్కుకోండి. ఈబొడ్డు బాధ తగ్గి పోతుంది' ' అని అన్నారు. వెంటనే నేను పిల్లవానికి బాగా అయితే తిరుమలకు వెళ్లి పిల్లవాణ్ణి స్వామి వారి ధ్వజస్తంభమునకు కట్టి వేస్తానని మొక్కుకున్నాను. అప్పట్లో మేము రాజమండ్రిలో ఉద్యోగరీత్యా వుండేవాళ్లము. 1976వ సం.ము మే నెలలో మేము అన్నవరం చూసివద్దాము అని ఆరాత్రి ప్రయాణమయ్యాము అక్కడే అన్నప్రాశనము కూడ చేయించుదాం అని అనుకొన్నాం. కాని బాబుకు బొడ్డు విపరీతముగా వాచిపోయింది. దానితోపాటు జ్వరం కూడా వచ్చింది. సరే అనుకొని అన్నవరం ప్రయాణం మానుకున్నాము. ఆ రాత్రి నాకు ఒక కల వచ్చింది.

మేము తిరుమలలో పుష్కరిణి దగ్గర వున్నట్లు, స్వామివారు కలలో నా దగ్గరికి వచ్చి ఇంకా బొడ్డు తగ్గలేదా? అని బొటనవ్రేలితో బొడ్డుమీద నొక్కారు. నొక్కిన వెంటనే స్వామివారు పుష్కరిణి మెట్లు ఎక్కి వెళ్తున్నట్లు మనస్సులో అనిపించింది. అంతే నాకు మెలకువ అయ్యింది. కన్నులు తెరచి దిక్కులు చూచాను. ఏమీలేదు. అంతా ఆ స్వామివారి మహిమే అనుకొని బాబు బొడ్డుచూశాను. ఆశ్చర్యం, ఎవరో బొడ్డును నొక్కినట్లుగా రక్తం కారుతూ వుంది. ఆ తర్వాత రెండు రోజుల్లోనే బొడ్డువాపు పూర్తిగా తగ్గిపోయింది.

ఒకవారం తర్వాత అన్నవరం వెళ్లి బాబుకు అన్నప్రాశన చేయించాము. ఆ తర్వాత అనుకొన్నవిధంగా తిరుమల కొండకు వెళ్లి మొక్కు తీర్చుకొని వచ్చాము. ఇలా స్వామివారి మహిమలు ఎంత చెప్పుకున్నా తనివితీరదు. ఇది నిజంగా జరిగిన అద్భుత సంఘటన!.

## తప్పును దిద్దిన దేవుడు

*--- కనుపర్తి పద్మజ, శివరాజనగర్, దర్శి.*

1966 లో మా అమ్మగారు అబ్బాయి పుడితే, తిరుమల స్వామివారికి తలనీలాలు నమర్పించు కుంటామని మొక్కుకున్నదట. ఆ సంవత్సరంలోనే మా అమ్మకు అబ్బాయి పుట్టాడు. మేమంతా మొక్కు తీర్చుకొనుటకు తిరుపతికి వెళ్లాం.

నేను, మా నాన్నగారు, తమ్ముడు తలనీలాలు ఇచ్చాం. మా అమ్మగారు తలనీలాలు ఇవ్వడానికి ససేమిరా ఒప్పుకోలేదు. అప్పుడు మా నాన్నగారు మొక్కు తీర్చకపోతే వెంకన్నకు కోపం వస్తుందని తర్వాత బాధపడవలసి వస్తుందని చాలసేపు చెప్పిచూచాడు. కాని మా అమ్మగారు ససేమిరా తల నీలాలు ఇవ్వలేదు. సరే అని మేమందరము శ్రీనివాసుని దర్శనము చేసుకొని తిరుగు ప్రయాణం అయినాము.

మేము ఒంగోలు చేరినప్పటి నుండి మా అమ్మగారికి వాంతులు జ్వరము పట్టుకున్నాయి. ఒంగోలులో డాక్టరుకు చూపించి మా

నివాసగ్రామమైన పాదిలి చేరుకున్నాము. మా అమ్మగారికి జ్వరము వాంతులు తగ్గలేదు. తగ్గకపోగా మరింత పెరిగాయి. మా నాన్నగారు చాల కంగారు పడిపోతున్నారు. అప్పుడు చుట్టుపక్కల వాళ్లందరూ మా ఇంటిచుట్టూ చేరారు. వాళ్లలో ఒక పెద్దాయన, ఒకాయన వచ్చి మానాన్నగారితో "మీరు స్వామివారికి ఏదో అపచారం చేశారు. అందువల్లే మీకీవిధంగా జరిగివుంటుంది" అన్నాడు.

వెంటనే మా నాన్నగారికి గుర్తువచ్చి, మా అమ్మగారు తలనీలాలు ఇస్తానని మొక్కుకొని, ఇవ్వలేదని చెప్పినారు. అంతలో ఆ పెద్దాయన "మా అమ్మను వెంటనే స్నానం చేసి స్వామికి పూజచేసి, అపరాధంతో కానుకనువేసి "నాకు బాగైతే వెంటనే తిరుమలకు వచ్చి తలనీలాలు ఇస్తానని మొక్కుకునేట్లు" చేశాడు. ఆయనచెప్పినట్లుగా మా నాన్నగారు మా అమ్మచేత మొక్కించారు. అప్పుడు ఆశ్చర్యంగా, మా అమ్మగారికి జ్వరమూ, వాంతులు తగ్గాయి.

అందరూ, ఆ శ్రీనివాసుడు మాట తప్పితే ఒప్పుకోడు. అసలు వడ్డీతో కూడా వసూలు చేస్తాడని అన్నారు.

మళ్లీ 10రోజులు తిరగక మునుపే తిరుపతికి వెళ్లి మా అమ్మగారు తలనీలాలు ఇచ్చారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరము ఏడుకొండలవాని దర్శనమునకు తప్పక వెళ్తున్నాము. అప్పటినుండి ఎటువంటి ఇబ్బందులు లేక హాయిగా వుంటున్నాము.

## ప్రాణ రక్షకుడు

*--- శ్రీమతి టి. ప్రభామోహన్, ఖర్గపూర్.*

కలియుగదైవం శ్రీవేంకటేశ్వరుని లీలలు అనంతకోటి. ఇది నా అనుభవం.

మా పెద్ద కుమారుడు చిరంజీవి వెంకట విజయకుమార్ మూడురోజుల పసికందు. కలకత్తాలోని గార్డనరీస్ ఆసుపత్రిలో కాన్పు జరిగింది. ఆ పసికందుకి విరేచనాలు ఎక్కువగా వుండి రక్తం పోతుండేది.

ఆ బాధను చూడలేక శ్రీ వేంకటేశ్వరా! స్వామీ! నీదే భారము అని మొక్కుకున్నాము. పెద్ద పెద్ద డాక్టర్లు వచ్చి పరీక్షించారు. మందులిచ్చారు. కాని జబ్బు నయం కాలేదు. పైనుంచి ఇంకా పి.జి. హాస్పిటల్ నుండి వైద్య నిపుణులు వచ్చి పిల్లవాణ్ణి పరీక్ష చేశారు. వాళ్లకి ఆ పసికందు జబ్బు అంతు పట్టలేదు. చివరకు ఆ డాక్టర్లంతా పెదవి విరచి ఇక బ్రతకడు, లాభము లేదు, ధైర్యంగా వుండండి. మీ భగవంతుణ్ణి ప్రార్థించుకోండి- అని చెప్పేశారు.

ఇక మాకు ఏదిక్కు తోచలేదు. ఆ సంకట పరిస్థితిలో తెలుగువారి ఇలవేలుపు శ్రీ వేంకటేశ్వరస్వామివారిని శరణువేడాము. "స్వామీ! వేంకటేశ్వరా ఆపద్బాంధవా, ఆపదలో వున్న గజేంద్రుని రక్షించావు. ఆపదలో వుండే ప్రహ్లాదుని కూడా నీవే రక్షించావు. ఆపదలోవుండే మాకు, మా కుమారునకు ప్రాణరక్షకుడవై అభయమివ్వు! స్వామీ శ్రీనివాసా!" అని స్వామివారిని శరణు వేడినాము. మా చిన్నారి బాబు ఈ ఆపత్తు నుండి తేరుకున్నట్లయితే తొమ్మిది ఇండ్లు జోగి అడిగి నీ కొండకు నడచి వస్తామని మొక్కుకున్నాము. ముడుపు కట్టుకున్నాము. ఆ స్వామికి మామీద దయ కలిగింది. వెంటనే 15 దినములు అనుభవించిన బాధ నుండి తేరుకున్నాడు. డాక్టర్లకు చూచిన వారందరికి ఆశ్చర్యం కలిగింది. మాకు స్వామివారి లీల అనుభవమై, ఆనందం కలిగింది.

ఒక ఏడాదిలోపునే కాలినడకతో తిరుమలకు వెళ్లి మా బాబు తలనీలాలు సమర్పించి మొక్కు చెల్లించు కున్నాము. ఆపదలో వుండే బాబుకు ప్రాణం పోసిన దేవుడు ఆ వేంకటేశ్వరుడు. మృత్యువుతో పోరాడి, ఆనంద నిలయుని ఆశీస్సులతో విజయం సాధించిన మా బాబుపేరు "వేంకట విజయకుమార్". ఇప్పుడు స్వామివారి తిరుమల దర్శిస్తుంటాము.

ఇలాగ బ్రతకడని ఆశవదలిన డాక్టర్లకు తల్లిదండ్రుల మయిన మాకు ఆశ్చర్యంగా, చివరి ఘడియలో ప్రాణం నిలిపిన దేవుడు ఆ వేంకటేశ్వరస్వామివారు!.

# గృహ రక్షకుడు

--- *శ్రీ ఎ. గోవిందరావు, బళ్లారి.*

నేను, నాభార్య, నా కూతురు కలిసి తిరుపతికి 27-6-90వ తేదీన ప్రయాణం అయినాము. ఆ దేవదేవునికి ముడుపులు చెల్లించుటకు, సేవలు చేయుటకు బయలు దేరినాము. ఇంటికి వాకిండ్లు వేసేటప్పుడు ఈ సేవలు మాకు త్వరగా చేసుకొనుటకు అవకాశం చిక్కితే బాగుంటుంది. లేనియెడల ఇంటికి రావడానికి ఆలస్యంకావచ్చును. కనీసం, 3 లేదా 4 రోజులు అయినా పట్టవచ్చును. బీగాలు వేసి ఇంటిని ఒకటిరెండురోజులు ధైర్యంగా వదలలేని రోజులు ఇవి. పైగా ఇంటివద్ద ఎవరూ చూచుకొనేవాళ్లు ఎవరూలేరు. అందువల్ల మా ఇలువేల్పు అయిన శ్రీ వేంకటేశ్వరస్వామిని తలంచి "దేవా! మా ఇంటికి నీవే రక్ష" అని ఆస్వామిని కావలియుండుమని ధ్యానించి ఇంటికి తాళాలు వేసి, రాత్రి 8 గంటలకు బళ్లారి-తిరుపతి బస్సు ఎక్కినాము. తిరుపతికి 28-6-90. ఉదయం 8గం॥కు చేరుకున్నాము. కొత్తసత్రములో దిగి, స్నానం చేసి శ్రీ గోవిందరాజ స్వామివారి దర్శనం చేసుకున్నాము. మధ్యాహ్నం 2-30 గంటలకు తిరుమల చేరుకున్నాము. తక్షణమే విజయబ్యాంకు కౌంటర్‌కు పోయి శుక్రవారం నాడు చేసే సేవలు ఏవున్నవి అనిఅడిగాను.

ఆ బ్యాంకు గుమస్తా, 1. సుప్రభాతం, 2. తోమాలసేవ, 3. అర్చన వున్నవి అన్నాడు. ఏకాంతసేవ, కల్యాణోత్సవం ఏవీ లేవన్నాడు. అయ్యో కల్యాణోత్సవం కూడ చేసే అవకాశం వుండి వుంటే బాగుండేది కదా అని చింతించి. సుప్రభాతం తోమాలసేవ, అర్చన రసీదులు కొన్నాను శుక్రవారం నాడు పై సేవల్లో పాల్గొన్నాను. కల్యాణోత్సవానికి మరల శుక్రవారంనాడు కౌంటరులో విచారించి, మరునాడు శనివారానికి కల్యాణోత్సవం రసీదు కొన్నాను. ఆదేవుని దయవలన శుక్ర,శనివారాల్లో అన్నీ సక్రమంగా జరిగినాయి.

మేము ఆదివారం నాడు (1-7-90) బళ్లారికి చేరినాము. ఇంటి

బీగాలు తీయడానికి, వాకిలిని చూడగా నాగుండె గుభేలు మంది వాకిలి అరదండా వంగినది. వాకిలి బీగమును బాగుగా కొట్టినారు. దొంగలు వేరే తాళాలతో తీయడానికి ప్రయత్నించి బీగము యొక్క లీవర్‌ను విరగకొట్టినారు. కాని దేవుని దయవలన బీగము మాత్రము ఊడలేదు.

నేను బీగము తీయడానికి పోతే బీగము రాలేదు. "దేవా! ఏమిటి ఈ కష్టం? బీగం రావటం లేదని ఆస్వామివారిని తలంచి మెల్లగా తాళాలు పెట్టి తిప్పినాను. విచిత్రము బీగాలు తెరువబడి, వాకిలి తీసినాను.

నేను ఇంటిలో ప్రవేశించి, వెంటనే దేవుని గదికి పోయి శ్రీ వేంకటేశ్వరుని ప్రార్థించినాను" స్వామి మా ఇంటిని దొంగలబారినుండి రక్షించినావా!" అని హుండీలో రూ.1-25 ముడుపు వేశాను.

మా ఇంటి ప్రక్కవారిని విచారించగా "శుక్రవారం నాడు రాత్రి 3-30 గంటలకు ఇద్దరు దొంగలు వచ్చి వాకిలిని గట్టిగా కొట్టినారు. ఆశబ్దం విని మేము లైట్లు వేయగా, వారిపని నిష్ప్రయోజనమని వెళ్లిపోయారు" అని చెప్పారు.

"యోగక్షేమం వహామ్యహం" అన్నాడు కదా భగవానుడు తమ భక్తుల కష్ట సుఖాలను తాను చూస్తానని చెప్పాడు కదా!.

చూశారా, ఆదేవుడు తమ భక్తులు కొండమీద సేవలు చేస్తూ వుంటే, ఇక్కడ మా ఇంటిని ఎలారక్షించాడో!! ఆదేవదేవునికి శతకోటి దండప్రణామాలు. ఆయన నిజంగా మా గృహ రక్షకుడే!

## అ ఆలు దిద్దించిన దేవుడు

*-- శ్రీ పైనేని రామస్వామిచౌదరి గుడివాడ, కృష్ణాజిల్లా.*

ఆరోజు 9-11-89 ఏకాదశి, గురువారం దివ్యమైన దినం. ఉదయం 9-30 గం॥కు అక్షరాభ్యాసం కొరకు చి॥ అధిరాం అను బాలుని వెంటబెట్టుకొని ఆపిల్లవాని తల్లిదండ్రులు బంధుమిత్ర సమేతముగా మా కాన్వెంటుకు వచ్చినారు. శాస్త్రోక్తముగ అక్షరాభ్యాసం చేయించడానికి ప్రారంభించాం. కాని అంతవరకు ఎంతో ఉత్సహముగా వున్న ఆ బాలుడు

కండ్లు మూసి, తలవంచి గట్టిగా ఏడ్చినాడు. తల్లిదండ్రులు ఎంతగానో బాలుణ్ణి బుజ్జగించినారు. కాని ఫలితము మాత్రం శూన్యం. అట్టి పరిస్థితిని మేము ఎన్నడును ఎదుర్కొనలేదు. బంధుమిత్రులు, మేము ఉపాధ్యాయులము ఎంత ప్రయత్నించినా లాభము లేకపోగా పిల్లవాని మంకు మరింత పెరుగుతూ అందరికీ వింతగా, భయముగా వుండింది.

మేము అనేక విధాలుగా ఆలోచించి, చివరకు మా ఇలువేల్పు అయిన శ్రీ వేంకటేశ్వర స్వామిని ఏకాంతముగా ధ్యానింప దలచి, వచ్చిన వారి నందరిని ఆఫీసునుండి వెలుపలికి పంపి, స్థిరచిత్తముగా రెండునిమిషములు స్వామివారిని స్మరించినాము. మాకు దివ్యమైన కాంతితో అభయహస్తముతో, ఏదో బాకీ వున్నట్లు పాదసూపినట్లు గోచరించినది.

వెంటనే తలుపులు తెరచి, తల్లిదండ్రులను లోనికి పిలిచి, శ్రీ వేంకటేశ్వరస్వామివారికి ఏవైనా మొక్కులు వున్నాయా? అని అడిగాము. వారు వెంటనే "అవునండీ తిరుపతికి వెళ్లి స్వామివారికి పిల్లవానితలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్న తర్వాత అక్షరాభ్యాసం చేయిద్దాం అని అనుకున్నామండీ, కానీ సమయము కుదరలేదు. బాలునికి 5 వ సంవత్సరం ప్రవేశించి ఐదురోజులైనది. శుభదినముకదా. మళ్లీ మంచిరోజులు లేవుకదా! అని అక్షరాభ్యాసం చేయించుటకు వచ్చాం" అని చెప్పారు.

'శ్రీ వేంకటేశ్వరుని మొక్కు మరచుటవల్లనే మీకీ ఇక్కట్లు సంభవించాయి, కనుక చేసిన తప్పును క్షమించమని ప్రార్థించండి' అని చెప్పాను. వెంటనే వారు మా ఆఫీసులోని స్వామివారికి పూజలు చేసి 17-11-89న తిరుమలకు వచ్చి మొక్కులు తీర్చి కొంటామని ప్రార్థించగానే విచిత్రాతివిచిత్రంగా ఆబాలుడు పలకాబలపం పట్టుకొని అక్షరాభ్యాసం కొరకు మావద్దకు వచ్చి నిలిచినాడు.

చూచితిరా ఆభగవంతుని లీలలు.. ఆదృశ్యం చూచిన తల్లిదండ్రులకు బంధుమిత్రులకు కలిగిన ఆనందమునకు మేరలేదు.

తర్వాత మేము యథావిధిగ అక్షరాభ్యాసం చేసినాము. మేము చెప్పిన గణపతి, సరస్వతి, గురుప్రార్థనలను చక్కగా పలికినాడనుటలో అతిశయోక్తి లేదు. ఇది శ్రీ వేంకటేశ్వరస్వామివారి అద్భుతలీల !

## సంకట హరణుడు

*--శ్రీ ఆర్. ఎస్.రఘునాథ్, ప్రొద్దుటూరు.*

మా స్వగ్రామము ప్రొద్దుటూరు. నాపేరు రఘు. నేను ప్రైవేటు ఫ్యాక్టరీలో గుమస్తాగా పని చేస్తున్నాను. నాభార్య గర్భవతిగా వున్నప్పుడు నేను కళ్యాణ వేంకటేశ్వరస్వామికి మొక్కుకున్నాను. మాకు మగబిడ్డ కలిగితే, వానికి "కల్యాణవెంకటేష్" అని పేరుపెట్టుకుంటాననీ, మొక్కులు చెల్లిస్తానని ప్రార్థించాను. కాని నాభార్యకు ఎనిమిదవ నెలలోనే పురిటి నొప్పులు వచ్చాయి. మా బంధువులందరూ అలా ముందుగా నొప్పులు రావటం మంచిదికాదన్నారు. ఇక నాకు భయాందోళనలు కలిగాయి. అయినా ధైర్యంతో శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై భారంవేసి, డాక్టరమ్మకు చూపించాము. ఆమె వెంటనే పరీక్షచేసి "రెండురోజుల్లో కాన్పు కావచ్చు. మీరు ఇష్టపడితే అడ్మిట్ చేసుకుంటా" నన్నారు. అందుకు నా మనస్సు అంగీకరించలేదు. సరే పెద్దవాళ్లతో మాట్లాడి సాయంత్రం చేర్పిస్తానని చెప్పి వచ్చేశాను.

అప్పుడు నేను వేంకటేశ్వరస్వామివారికి దండంపెట్టుకొన్నాను. "స్వామీ! నిన్నే నమ్ముకున్నాను. నీవు నాకు అన్యాయం చేయకు. ఈ సంకటాన్ని పొగొట్టు భారమంతానీదే" ! అని స్మరించినాను. స్వామివారు మా మొరవిన్నాడు. కనికరించాడు. అప్పట్లో వచ్చిన నొప్పులు విచిత్రంగా ఎలాంటి మందులు మాకులు లేకుండా తగ్గిపోయాయి.

ఆ తర్వాత మామూలుగా. 9వ నెల వచ్చిన తర్వాత అంటే 24-11-89 తేదీన నాభార్య మగపిల్లవాడిని సుఖప్రసవమైంది. తల్లీ బిడ్డ ఇద్దరూ క్షేమంగా వున్నారు. ఆ పిల్లవానికి "శ్రీకల్యాణ లక్ష్మీ వేంకటేష్" అని నామకరణం చేశాము. .

ఇంతలో 90 జనవరి 9వతేదీన మామామగారి వద్దనుండి చి॥వెంకటేష్ ఆసుపత్రిలో చేర్చబడ్డాడు. వెంటనే రావాలి" అన్నతంతి వచ్చింది. వెంటనే మామామ గారున్న నెల్లూరుకు వెళ్లాను. అప్పుడు నాకుమారుని అక్కడ జయభారతి ఆసుపత్రిలో చేర్పించారు. ఏమి జబ్బు అని అడిగితే సెప్టిమియా అని చెప్పినారు. ఆసుపత్రిలో మూడురోజులున్న తర్వాత ఇంటికి పంపించారు. కాని పిల్లవాడు మాత్రం బలం పుంజుకోలేదు. పెద్దవాళ్లు చెప్పిన ప్రకారం నెల్లూరునుండి నాభార్యాపిల్లలను ఇంటికి తీసుకవచ్చాను. వచ్చిన రోజు సాయంత్రమే చిన్నపిల్లల వైద్యనిపుణునికి చూపించి చికిత్సకై ఆసుపత్రిలో చేర్పించాను. ఒక వారం తర్వాత డాక్టర్ పరవాలేదని చెప్పి ఇంటికి పంపించాడు. కానీ రెండురోజుల తర్వాత వాని ఆరోగ్యం మళ్లీ క్షీణించింది. డాక్టరుకు చూపిస్తే లాభంలేదు. కర్నూలుకు తీసుకొని పొమ్మన్నారు. సరే కర్నూలుకే పోదామని నిర్ణయించుకొని, ఇంతలో నాకు తెలిసిన మరొక పిల్లల వైద్యునికి చూపించాను. అతడు కూడ పిల్లవాడు బ్రతుకుతాడని నమ్మకం ఇవ్వలేదు. అయినప్పటికీ వైద్యం మొదలుపెట్టినాడు. నేనూ నాభార్య ధైర్యంగా శ్రీ వేంకటేశ్వర స్వామివారిమీద భారం వేసినాము. మాకుమారుడు ఆరోగ్యవంతుడై దిన దినాభివృద్ధి చెందితే సంవత్సరం లోపు ఎంత బరువుంటాడో, అంత ధనం తులాభారం ఇస్తామని స్వామివారికి మొక్కుకున్నాము. అంతే బతకడని ఆశ వదలిన మా పిల్లవాడు పదిరోజుల్లోనే బాగైనాడు.

13-2-90 తేదీనాటికి మా పిల్లవాని బరువు 3.25 కిలోలు. వయస్సు నాలుగునెలలు. కాని 25-7-90 నాటికి వాని బరువు 10 కిలోలకు పెరిగింది. నేనూ, మా కుటుంబం చాలా ఆనందించాము.

ఆతర్వాత 90 ఆగష్టు 4వతేదీన మా అమ్మ, నేను, భార్యా పిల్లలతో తిరుమలకు వెళ్లి ఆదేవదేవునికి ముడుపు చెల్లించినాము. మా పిల్లవాణ్ణి ధనముతో తులాభారం తూచి స్వామివారికి సమర్పించాం. పొర్లు దండములు పెట్టుటకు వీలులేక, మరల వచ్చినపుడు పెడ్తామని మొక్కుకున్నాము. అపరాధకానుక వేసి కొన్నాము.

'నమ్మినవారికి నాశము లేదన్న' ఆర్యోక్తి నాపట్ల యథార్థమైనందుకు మేము ఆవేంకటేశ్వరస్వామిని జీవితాంతం స్మరిస్తూ కృతజ్ఞతాంజలి ఘటిస్తూనేవున్నాం. ఆయన ముమ్మాటికీ సంకటహరణుడే. అందుకే "కలౌ వేంకటనాయకః అని అన్నారు. అది ముమ్మాటికీ సత్యమైనమాట!.

"కల్యాణాద్భుత గాత్రాయ
కామితార్థ ప్రదాయినే,
శ్రీమద్వేంకట నాథాయ
శ్రీనివాసాయ మంగళమ్."

ధర్మం ఆచరించండి - ధర్మమే మిమ్మల్ని కాపాడుతుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు

ఆ పరతత్త్వం సచేతనం అచేతనం (10-12-9); సత్పదార్థం అసత్పదార్థం కూడా (10-5-7). అతడే భూమండలాన్ని తూర్పునుంచి పశ్చిమం వఱకు ఆక్రమించిన యజ్ఞపురుషుడు (10-90-5). భగవంతుడు మానవశరీరంలో నివసించడంవలన పురుషుడనబడుతున్నాడు[1]. ఒక పక్షిలాగా ఆయన పురాలన్నిటిలో పౌరుడుగా ఉన్నాడు (**సర్వాసు పూర్షు పురిశయః**). అందువల్లనే ఆతడు సార్థకమైన పురుషశబ్దంతో పిలవబడుతున్నాడు (బృ.ఉ. 2-5-18). అదేవిధంగా భగవత్సామ్రాజ్యాన్ని లోపల ఇముడ్చుకొని ఉన్నమానవుడు కూడా పురుషుడని వ్యవహరింపబడుతున్నాడు.

ఆ పరమపురుషుని ప్రభావాన్ని లోకానికి తెలియజేయడానికే ఋగ్వేదసంస్కృతి యజ్ఞవ్యవస్థను ప్రవేశపెట్టింది. విశ్వమానవ కల్యాణంకోసం ఆత్మసమర్పణం చేసుకోవడమే యజ్ఞభావనలోని ప్రధానతాత్పర్యం. అహివృత్రుడు ఇంద్రునిచేత చంపబడటం అనే సాంకేతికసంఘటన ఒక జీవిపై ఇంకోజీవి ఆధిక్యతను తెలియజేస్తున్నది. అగ్నిహోత్రయాగం చేసినవాడు తనలోని లోభం, దురాశ మొ॥ దుర్గుణాలను అణచి, మోహాన్ని కోపాన్ని తగ్గించుకుంటాడు. యాగశాలలో చేరిన ప్రజలందరు పరస్పర సహకారభావాన్ని పెంచుకోవాలని ఉపదేశించడమే ఈ యజ్ఞప్రక్రియ ప్రధానోద్దేశ్యం. తమలో అంతర్యామిగా ఉన్న భగవంతుని తెలుసుకోవడంద్వారా అందఱు తప్పక ఒకటౌతారనే సత్యాన్ని ప్రతివారు ఈ యజ్ఞంవల్ల తెలుసుకోగలుగుతారు.

ఋగ్వేదంలోని ధార్మిక - సాంఘిక - తాత్త్విక సూక్తాలలోని సూక్ష్మాంశాధ్యయనం నిర్వివాదంగా ఒక ఆదర్శసిద్ధాంతాన్ని మనకు తెలియజేస్తుంది. ఒక్కటే అయిన పరబ్రహ్మకు ఎందఱో అయిన

---

1. అదే హృదయాంతర్గుహ. దానినే బ్రహ్మపురమంటారు.

జీవులకు మధ్యలో ఉన్న సంబంధరూపమే వైదికభావనామయమైన ఆ సిద్ధాంతం. **`విశ్వం ఏకమ్'** (3-54-8) **`విశ్వం సత్యమ్'** (2-24-12) `కృణ్వన్తో విశ్వమార్యమ్' (9-63-5) మొ॥ ఋగ్వేదవాక్యాలలో ఈ స్వభావాన్ని మనం పరిశీలించవచ్చు. నిజంలాగా కనబడుతున్న భిన్నత్వంలోని ఏకత్వాన్ని ఈ ఆదర్శసిద్ధాంతం తెలియజేస్తున్నది. జాతినిర్మాతలు లోకంలోని ప్రతిపౌరుణ్ణి చక్కని వ్యక్తిత్వం గలవాణ్ణిగా తయారుచేయడానికి కృషిచేయాలి. ఈ విశ్వసత్యాన్నిబోధించే గ్రంథాలలో ఋగ్వేదం ప్రపంచంలోనే మొట్టమొదటిదనడం అతిశయోక్తి కాదు.

విశ్వమానవకల్యాణం కోసం ఋగ్వేదద్రష్టలు ఈనాటి హిందూసాంఘిక-ధార్మిక - అధ్యాత్మికభావనా స్వరూపంగల ముఖ్య సిద్ధాంతమైన భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించి, ఆచరించి, బోధించారు. ఇది కేవలం వారికి ఋతతత్త్వం[1] పైన ఉన్న విశ్వాసం వల్లనే జరిగింది. ఈ **`ఋతం'** అవెస్తాలోని **అశ'** తో పోల్చబడింది. ఋతశబ్దాన్ని ఇలా మూడువిధాలుగా వ్యాఖ్యానించారు. 1.యజ్ఞప్రకియ (సత్యం, జలం, రాశిచక్రం) 2. విశ్వక్రమం, 3. ప్రపంచంయొక్క సమమైన సత్యమైన నడకకు సంబంధించిన నైతికక్రమం. ఇందులో మూడవదానివల్ల నైతికాదర్శాలకు ఆచరణకు ఒక చక్కని సమన్వయం కుదురుతుంది. ఋతం కలిగి, ఋతాన్ని నిలబెట్టి, ఋతాన్ని కలిగించే దేవతలు తేజస్సును, సత్యాన్ని వ్యాపింపచేయడానికి, అంధకారాన్ని, దౌర్జన్యాన్ని పారద్రోలడానికి సమస్థితిద్వారా విశ్వక్రమాన్ని కాపాడడానికి వెడుతున్నారని ఋగ్వేదంలో మనం తరచుగ చదువుతుంటాం. ఈ దేవతలు మానవుల అంతరంగాలలో ఉండే

---

1. వైదిక 'ఋతం' అవెస్తాలో 'అశ' నుగురించిన వివరాలకు చూ. **Anna Radicchi, Confronti Gathico - Rigvedichi Asa-Rta(Fixenze 1961-2).**